www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 12-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 127 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం, తిథి: విదియ రా.1:47 తదుపరి తదియ, నక్షత్రం: ఉత్తరాషాఢ ఉ.6:36 తదుపరి శ్రవణం, వర్జ్యం: ఉ.10:38-12:15, దుర్ముహూర్తం: ఉ.5:51-7:35, అమృతఘడియలు: రా.8:21-9:58, రాహుకాలం: ఉ. 9:00-10:30, సూర్యోదయం: 5:51, సూర్యాస్తమయం: 6:49 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఏపీకి కొత్త జాతీయ రహదారి

ఉత్తరాంధ్రలో గ్రీన్‌ఫీల్డ్ కోస్టల్ హైవేకు కేంద్రం ఓకే

శ్రీకాకుళం జిల్లా మూలపేట పోర్టు నుంచి భీమిలి వరకు

200 కిలోమీటర్ల రహదారితో మూడు జిల్లాలకు మహర్దశ

2



వాహనంపై అతికించని ఫాస్టాగ్‌లు ఇకపై బ్లాక్‌లిస్ట్‌లోకి

ఎన్‌హెచ్ఏఐ కీలక నిర్ణయం

న్యూఢిల్లీ, జూలై 11: టోల్‌గేట్ల వద్ద జాప్యానికి, ఇతర సమస్యలకు కారణమవుతున్న 'లూజ్ ఫాస్టాగ్'లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) నిర్ణయించింది. పలువురు ఫాస్టాగ్‌ను వాహనం ముందు అద్దం (విండ్‌షీల్డ్)పై అతికించడం లేదు. టోల్‌గేట్ వద్దకు వచ్చాక ఫాస్టాగ్‌ను తీసి చూపిస్తున్నారు. దీని వల్ల జాప్యం జరుగుతోంది. ఇతర వాహనదారులకు అసౌకర్యం కలుగుతోంది. అంతేకాకుండా.. కొందరు లూజ్

మిగతా 2వ పేజీలో...



మంత్రి ఇంట్లో నోట్ల కట్టలు!

కరెన్సీ నోట్లతో నిండి ఉన్న బ్యాగ్

సోషల్ మీడియాలో వీడియో

మహారాష్ట్రలో కలకలం

మంత్రి శిందే శివసేన నేత

2



75 ఏళ్లు పూర్తయితే దిగిపోవాల్సిందే

ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్ స్పష్టీకరణ

ఈ ఏడాది సెప్టెంబరు 17తో మోదీకి 75 ఏళ్లు

అదే నెల 11న భాగవత్‌కూ 75 ఏళ్లు

ఇద్దరూ బ్యాగులు సర్దుకోండి.. కాంగ్రెస్ వ్యాఖ్య

అనుకున్నదొకటి..





భలే మందు చూపు!

లిక్కర్ స్కామ్‌లో 32.85 కోట్లు జప్తు

సిట్‌కు విజయవాడ ఏసీబీ కోర్టు అనుమతి

కసిరెడ్డి గుప్పిట్లో ఉండే ఆదాన్ ఖాతాలోనే 30 కోట్లు

ఇప్పటిదాకా జప్తుచేసిన మొత్తం 62.85 కోట్లు

ఆర్థిక భద్రతపై రాజ్ కసిరెడ్డి దూరదృష్టి

మద్యం ముడుపులతో ఈవీ పరిశ్రమకు సై!

డీఆర్ఈ మోటార్స్ పేరుతో కంపెనీ

కీలక స్థానంలో 'ఐప్యాక్ సత్య' సతీమణి

డిజైన్, బ్యాటరీకి కేంద్ర అనుమతులూ!

ఇక... ఉత్పత్తి ప్రారంభించడమే తరువాయి

అంతలోనే... జగన్‌ను గద్దెదించిన జనం

కూటమి సర్కారు చర్యలతో తలకిందులు

అమలు చేశా.. అంతే

ఎక్సైజ్ పాలసీ నేను రూపొందించలేదు

సిట్ విచారణలో రజత్ భార్గవ

ఉల్లంఘనలపై రిటైర్డ్ ఐఏఎస్ మౌనం

పలు ప్రశ్నలకు సమాధానాలు దాటవేత

రాజ్ కసిరెడ్డి వ్యవహారంలో నిస్సహాయత

కొన్ని పొరపాట్లు జరగడం వాస్తవమేనని, ఒత్తిళ్లకు లొంగాల్సి వచ్చిందని వెల్లడి

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'ఒకసారి అధికారంలోకి వచ్చాం... మళ్లీ మళ్లీ వస్తాం! ఏం చేసినా అడిగేవారే ఉండరు' అని అనుకున్నారు! మహా మద్యం స్కామ్‌కు తెరలేపారు. వేలకోట్ల ముడుపులు మూటగట్టారు. వచ్చిన సొమ్ముల్లో కొంత ఎన్నికల ఖర్చులకు వాడారు. కొంత దేశాలు దాటించారు. చివరికి... అవే మద్యం డబ్బులతో ఎలక్ట్రిక్ వాహనాల పరిశ్రమ పెట్టేందుకూ సర్వం సిద్ధం చేశారు. కానీ... అనుకున్నది ఒకటి! అయ్యిందొకటి! జగన్ అడిగినట్లుగా జనం ఆయనకు 'ఒక్క చాన్స్' మాత్రమే ఇచ్చారు. కూటమి అధికారంలోకి రాగానే... జగన్ హయాంలో జరిగిన మద్యం మాఫియాపై



కూపీ లాగడంతో అనేక అక్రమాలు వెలుగు చూశాయి. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భారీ మద్యం కుంభకోణం సూత్రధారి రాజ్ కసిరెడ్డి ముందు చూపు బయటపడింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం... అక్రమార్జనను సక్రమం చేయాలన్న అతి తెలివో.. జగన్ మరోసారి అధికారంలోకి వచ్చినా, రాకున్నా తన ఆర్థిక భవిష్యత్తు భద్రంగా ఉండాలన్న జాగ్రత్తో... మరేదైనా కారణముందేమో తెలియదుకానీ, ఏ-1 రాజ్ కసిరెడ్డి ఎలక్ట్రిక్ కమర్షియల్ వాహన పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. రాజ్ కసిరెడ్డిని అప్పట్లో

మిగతా 14వ పేజీలో...

జనమే బలం



రాష్ట్రంలో జనాభా వృద్ధికి మంచి పాలసీ తెస్తాం

దేశమంటే మనుషులోయ్ అన్న గురజాడ స్ఫూర్తి

జనాభా ఇకముందు దేశానికి భారం కాదు.. ఆస్తి

ఆనాడు కుటుంబ నియంత్రణను ప్రోత్సహించా..

జనాభాను వృద్ధిచేయాలని నేడు నేనే చెబుతున్నా

అధిక జనాభా ఉన్న దేశాలవైపు ప్రపంచం చూపు

ఆఫీసుల్లో చైల్డ్‌కేర్ సెంటర్లు ఏర్పాటు చేస్తాం

ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు ఊతమిస్తాం

జనాభా దినోత్సవ సదస్సులో చంద్రబాబు వెల్లడి

13

మాతృభాష అమ్మ.. హిందీ పెద్దమ్మ!



ఆంగ్ల భాషను సొంతం చేసుకొన్న మనమే.. హిందీని మనభాషగా ఎందుకు అనుకోవడం లేదు?

చిల్లర రాజకీయాల కోసమే ఆ భాషను వ్యతిరేకిస్తున్నారు

హిందీ నేర్వడమంటే మన ఉనికిని సుదృఢం చేసుకోవడమే

రాజభాషా స్వర్ణోత్సవ వేడుకల్లో డిప్యూటీ సీఎం పవన్

హాజరైన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్

11

హవ్వ.. ఇంత మాయా?

బంగారుపాళ్యం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జగన్ పర్యటనలో తన మామిడికాయలను వైసీపీ వారు రోడ్డుమీద పారబోశారంటున్న దూర్వాసులు అనే రైతు ఆవేదనను గురువారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించింది. 'అబ్బే కాదుకాదు... జగన్ పర్యటనలో నేనే స్వచ్ఛందంగా మామిడి కాయలు పారబోశాను' అని దూర్వాసులు చెప్పినట్టు శుక్రవారం రోతపత్రిక వెల్లడించింది. అసలు విషయం ఏంటంటే... కాయలు కోల్పోయి బాధను వ్యక్తం చేసిన దూర్వాసులుది బంగారుపాళ్యం మండలం ఈచనేరిపల్లె! రోతపత్రిక మాత్రం... అదే పేరున్న తుంబపాళ్యం గ్రామానికి చెందిన వైసీపీ నేతతో మాట్లాడించి, 'ఆ కాయలు నావే. నేనే పారబోశా' అని చెప్పించింది. రెండు ట్రాక్టర్ల కాయలను కోల్పోయిన రైతు దూర్వాసులు ఆవేదన వీడియో ఇప్పటికీ వైరల్ అవుతోంది. ఆయనను శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' పలకరించగా తన కాయల్ని వైసీపీ వాళ్లే పడేశారని, తాను ఇప్పటికీ అదే మాట మీద ఉన్నానని స్పష్టం చేశారు.



దూర్వాసులు, బాధిత రైతు, ఈచనేరిపల్లె



దూర్వాసులు, వైసీపీ నేత, తుంబపాళ్యం

అవే రోత రాతలు!

రైతుల పేరుతో జగన్ పత్రిక విన్యాసాలు

అవమానించారంటూ 'ఆంధ్రజ్యోతి'పై అక్కసు

'వైసీపీ రైతుల' అభిప్రాయాలతో మాయలు

అందరూ జగన్ పార్టీ నేతలు, కార్యకర్తలే

వారిలో కొందరికి మామిడి తోటలే లేవు

కొందరు 'సాక్షి'తో మాట్లాడిందే లేదు

వైసీపీ దండయాత్రపైనే 'దండుపాళ్యం' శీర్షిక

(చిత్తూరు/తిరుపతి - ఆంధ్రజ్యోతి)

చేసింది... అరాచక యాత్ర! దానికి అడ్డగోలు సమర్థన! పైగా... రైతులను అవమానిస్తారా?' అంటూ రోత పత్రికలో రాతలు! బుధవారం చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో 'మామిడి రైతులకు పరామర్శ' పేరిట వైఎస్ జగన్ చేసిన 'దండయాత్ర'... ఈ సందర్భంగా వైసీపీ శ్రేణుల వీరంగంపై 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన వార్తలను ఖండించేందుకు వైసీపీ నానా తంటాలు పడింది. వైసీపీ నేతలే వ్యూహాత్మకంగా తమ తోటల్లోని తోతాపురిని రోడ్లపై పారబోయడం, ఏ సంబంధమూలేని రైతుల మామిడినీ ఎత్తుకొచ్చేయడం, 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడి చేయడం, పోలీసులను రప్పా రప్పా అని బెదిరించడం, అనుమతించిన దారిని కాదని

మిగతా 12వ పేజీలో...

రైతులతోనూ రాజకీయమే

'మామిడి రైతుల కష్టాలపై ఒక్క కథనమైనా ప్రచురించారా?' అని రోత పత్రిక వాపోయింది. తోతాపురి రైతుల కష్టాలు, తగ్గిన ధరలు, ఈ పరిస్థితికి కారణమేమిటి, పల్ప్ ఫ్యాక్టరీల యజమానుల వైఖరి, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు... ఇలా అన్ని కోణాల్లో 'ఆంధ్రజ్యోతి' పలు ప్రత్యేక కథనాలు ప్రచురించింది. అవన్నీ అక్షర సత్యాలే! రోత పత్రిక మాత్రం కేవలం రాజకీయ దురుద్దేశంతో, ప్రభుత్వంపై బురదజల్లే లక్ష్యంతో అసత్యాలు, అర్ధసత్యాలతో తప్పుడు కథనాలు ప్రచురించింది. ఇక... బుధవారం జగన్ పర్యటనలోనూ అవే అబద్ధాలు చెప్పారు. శుక్రవారం కూడా రోతపత్రికలో ఇవే అబద్ధాలు దర్శనమిచ్చాయి.



చెప్పి కాదు.. చెప్పకుండా నరికెయ్యాలి!

మన ప్రభుత్వం వచ్చాక వేసేయండి

రెండో కంటికి చెప్పాల్సిన అవసరం లేదు

ఎన్నిసార్లు రప్పా రప్పా అంటార్రా?

మొరిగే కుక్క కరవదని తెలుసుకోండి

చీకట్లో కన్ను కొడితే పని అయిపోవాలి

వైసీపీ కార్యకర్తల సమావేశాల్లో మాజీ మంత్రి పేర్ని నాని రెచ్చగొట్టే వ్యాఖ్యలు

12

డిస్కంలకు రూ.2,555 కోట్ల టారిఫ్ సబ్సిడీ విడుదల

డిస్కంల అప్పులు రూ.7,225 కోట్లు

విద్యుదుత్పత్తి సంస్థలకు మరో 5 వేల కోట్లు

12

రహదారుల మరమ్మతులకు మరో 200 కోట్లు

12

ఒక్క సెకనులో నెట్‌ఫ్లిక్స్ వీడియోలన్నీ డౌన్‌లోడ్!

10 వేల సార్లు ఇంగ్లిష్ వికీపీడియా కూడా..

ఇంటర్నెట్ వేగంలో సరికొత్త రికార్డు.. సెకనుకు 1.02 పెటాబిట్స్.. జపాన్ శాస్త్రవేత్తల ఆవిష్కరణ

2



ధవళేశ్వరం వద్ద కాటన్ బ్యారేజ్ నుంచి సముద్రంలోకి ప్రవహిస్తున్న వరద నీరు

11

ఉధృతంగా వరద గోదారి

కుక్కునూరు, వేలేరుపాడుల్లో కాజ్‌వేల మునక.. 14 గ్రామాలకు రాకపోకలు బంద్

నిర్వాసితుల కాలనీలకు తరలివెళుతున్న జనం.. ధవళేశ్వరం బ్యారేజీ గేట్లన్నీ ఎత్తివేత

3,54,341 క్యూసెక్కులు సముద్రంలోకి.. అప్రమత్తంగా ఉండాలి: విపత్తుల నిర్వహణ సంస్థ

తిరుపతి తొక్కిసలాటపై 200 పేజీల నివేదిక

ప్రభుత్వానికి సమర్పించిన ఏకసభ్య కమిషన్

నివేదిక ఆధారంగానే తదుపరి చర్యలు!

2

తిరుమల భద్రతకు 40 ఏళ్ల ప్రణాళికలు

ఎల్‌అండ్‌టీ ప్రతినిధులతో ఈవో భేటీ

3

స్థిరమైన జీవనోపాధి కోసం 'సీబీఎన్ విజన్' గ్రూపులు

గ్రామీణ నిరుద్యోగ యువతకు కెపాసిటీ బిల్డింగ్ నెట్‌వర్క్ ప్రోగ్రాం

'ఒక కుటుంబం.. ఒక పారిశ్రామికవేత్త' లక్ష్య సాధన దిశగా శిక్షణ

ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉపాధి అవకాశాల సృష్టికి కార్యాచరణ

సీబీఎన్ విజన్ అమలు కోసం మార్గదర్శకాలతో ఉత్తర్వులు

12

ఫ్రీహోల్డ్ భూములపై మరో 2 నెలలు నిషేధం

పొడిగిస్తూ ప్రత్యేక సీఎస్ ఆదేశాలు.. ఏడాదిగా విచారణ పేరిట రిజిస్ట్రేషన్లు నిలిపివేత

ఇప్పుడు మళ్లీ పొడిగింపుతో రైతుల్లో ఆందోళన.. సెప్టెంబరునాటికి సమస్య కొలిక్కి!

దసరా నుంచి రిజిస్ట్రేషన్లకు అవకాశం.. రెవెన్యూ అధికారుల వివరణ

13

ఒక్క సెకనులో నెట్‌ఫ్లిక్స్ వీడియోలన్నీ డౌన్‌లోడ్!



ఇంటర్నెట్ వేగంలో సరికొత్త రికార్డు


- జపాన్ శాస్త్రవేత్తల ఆవిష్కరణ
- 6జీ నెట్‌వర్క్, కొత్త తరం

న్యూఢిల్లీ, జూలై 11: నెట్‌ఫ్లిక్స్‌లో ఉన్న మొత్తం వీడియోలన్నింటినీ ఒక్కటంటే ఒక్క సెకనులో డౌన్‌లోడ్ చేసుకునే ఇంటర్నెట్ వేగాన్ని జపాన్ సాధించింది. సెకనుకు 1.02 పెటాబిట్లతో (10,20,000 గిగాబైట్లు) నడిచే ఈ ఇంటర్నెట్.. ప్రపంచంలోనే అత్యంత వేగంతమైన నెట్‌గా రికార్డు నెలకొల్పింది. మన దేశంలో ఉన్న సగటు ఇంటర్నెట్ స్పీడ్ 63.55 ఎంబీపీఎస్‌తో పోల్చితే ఇది 1.6 కోట్ల రెట్లు వేగవంతమైనది. అమెరికాలోని సగటు నెట్‌తో పోల్చినా.. 35 లక్షల రెట్లు వేగవంతమైనది. జపాన్‌లోని 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్స్ టెక్నాలజీ' (ఎన్ఐసీటీ) ఈ వివరాలను వెల్లడించింది. ఎన్ఐసీటీలోని ఫొటానిక్ నెట్‌వర్క్ ల్యాబొరేటరీ, సుమితొమో అనే మరో సంస్థతో కలిసి.. కనీవినీ ఎరుగని ఈ ఇంటర్నెట్ వేగాన్ని సాధించింది. టెక్నాలజీ రంగంలో దీనిని గొప్ప ముందంజగా భావిస్తున్నారు.

దూరం పెరుగుతున్నకొద్దీ సిగ్నల్స్ బలహీనం

ఆప్టికల్ ఫైబర్ల గుండా వెళ్లే డేటా స్పీడ్‌ను పెంచటంపై నిరంతరం పరిశోధనలు నడుస్తూనే ఉన్నాయి. ఒక సెకనుకు పెటాబిట్ల వేగంతో డేటాను ఇంతకుముందు కూడా పంపించగలిగారు గానీ.. అది వెయ్యి కిలోమీటర్ల దూరాన్ని ఎన్నడూ మించలేదు. దీనివల్ల అవి నిత్యజీవనంలో ఉపయోగానికి రాకుండా పోయే పరిశోధనలుగానే మిగిలిపోయాయి. సిగ్నల్స్ ప్రయాణిస్తున్న దూరం పెరుగుతున్నకొద్దీ అవి బలహీనపడుతుంటాయి. ఫైబర్ కోర్ల వద్ద వాటి వేగాన్ని తిరిగి పెంచటం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చు. అయితే, ఇది సాంకేతికంగా ఒక పెద్ద సవాల్. దీనిని జపాన్ శాస్త్రవేత్తలు అధిగమించగలిగారు. వారు 19 కోర్లతో కూడిన ప్రత్యేకమైన ఆప్టికల్ ఫైబర్‌ను రూపొందించి ఈ ప్రయోగం జరిపారు. ఈ ఫైబర్ మందం 0.125 మిల్లీమీటర్లు. ప్రస్తుతం ప్రపంచమంతటా వినియోగిస్తున్న ఆప్టికల్ ఫైబర్ కూడా 0.125 మిల్లీమీటర్ల మందంతోనే ఉంటోంది. ఇక ఈ 19 కోర్లూ వేటికవే డేటాను తీసుకెళ్లేలా డిజైన్ చేశారు. తద్వారా ఒకే ఆప్టికల్ ఫైబర్‌లో 19 మార్గాల్లో డేటా వెళ్తుంది. ఈ విధంగా ఏకంగా 1808 కి.మీ.ల దూరానికి సెకనుకు 1.02 పెటాబిట్ల వేగంతో డేటాను పంపగలిగారు. ఈ వేగంతో ఇంగ్లిష్ వికీపీడియాలో ఉన్న యావత్ సమాచారాన్ని ఒక సెకనులో పది వేల సార్లు డౌన్‌లోడ్ చేయవచ్చు. పది వేల 4కే సినిమాలను, 1,27,500 సంవత్సరాలపాటు నడిచే సంగీతాన్ని ఒక సెకనులో డౌన్‌లోడ్ చేయవచ్చు. ఇంటర్నెట్ వేగంలో ఈ సరికొత్త రికార్డు.. భవిష్యత్తు సాంకేతికతను గణనీయంగా మార్చనుంది. క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ, డ్రైవర్ రహిత వాహనాలు, రియల్‌టైమ్ ట్రాన్స్‌లేషన్ టూల్స్ వంటి రంగాల్లో భారీ ఎత్తున డేటా ట్రాన్స్‌ఫర్ అవసరమవుతోంది. ఆయా రంగాలు అభివృద్ధి చెందినాకొద్దీ ఈ డిమాండ్ మరింత పెరుగుతుంది. అయితే.. ఈ ఆవిష్కరణ ఇప్పటికిప్పుడు సాధారణ ప్రజల వినియోగంలోకి వచ్చే అవకాశాలు తక్కువే. కానీ ప్రభుత్వాలు, డేటా సెంటర్ ఆపరేటర్లు, టెలికాం కంపెనీలకు ఇది పనికొచ్చే చాన్స్ ఉంది. 6జీ నెట్‌వర్క్‌లకు, నేషనల్ బ్రాడ్‌బ్యాండ్‌లకు, కొత్తతరం అండర్ వాటర్ కేబుల్స్‌కు ఇది మార్గం వేయవచ్చు.

లోకం తీరు



మహారాష్ట్ర మంత్రి ఇంట్లో నోట్ల కట్టలు!

- సోషల్ మీడియాలో వీడియో వైరల్

ముంబై, జూలై 11: శివసేన(యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ ఎక్స్‌లో శుక్రవారం పోస్టు చేసిన ఓ వీడియో మహారాష్ట్రలో రాజకీయ దుమారం రేపింది. మహారాష్ట్ర సామాజిక న్యాయ శాఖ మంత్రి, శిందే వర్గం శివసేన నేత సంజయ్ శిర్సాట్ ఇంట్లోని ఓ బ్యాగులో కరెన్సీ నోట్ల కట్టలు ఉండడం, ఆ బ్యాగుకు కాస్త దూరంలో శిర్సాట్ కూడా ఉండడమే ఇందుకు కారణం. సంజయ్ రౌత్ పోస్టు చేసిన వీడియోలో ఏముందంటే.. మంత్రి సంజయ్ శిర్సాట్ ఓ గదిలో మంచంపై కూర్చొని సిగిరెట్ కాలుస్తుండగా.. ఆ మంచానికి కాస్త దూరంలో నోట్ల కట్టలతో నిండి ఉన్న ఓ బ్యాగు తెరిచి ఉన్నట్టు కనిపిస్తోంది. శిర్సాట్‌తోపాటు ఆయన పెంపుడు శునకం కూడా గదిలో ఉంది. వీడియోలో ఉన్నది తానేనని, తన ఇంటి పడక గదిలో కూర్చొని ఉన్నానని, పక్కన ఉంది తన పెంపుడు శునకమేనని శిర్సాట్ తెలిపారు. నిజంగా తన దగ్గర అంత డబ్బు ఉంటే వాటిని దాచుకునేందుకు తన ఇంట్లో బీరువాలు ఉన్నాయన్నారు. ఎవరో కావాలనే ఈ వీడియో తీసి తనపై కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. కాగా, 2019-24 మధ్యలో ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారంటూ శిర్సాట్‌కు ఐటీ శాఖ గురువారమే నోటీసులు ఇవ్వడం గమనార్హం.

ప్రధాని చేతులమీదుగా..
నేడు ఒకేసారి 51వేల మందికి నియామక పత్రాలు

న్యూఢిల్లీ, జూలై 11(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వంలోని వివిధ విభాగాలు, సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికైన 51 వేల మందికి శనివారం ప్రధాని నరేంద్ర మోదీ నియామక పత్రాలను అందజేయనున్నారు. 'రోజ్‌గార్ మేళా'లో భాగంగా ఉదయం 11 గంటలకు వర్చువల్‌గా జరిగే కార్యక్రమంలో వీటిని అందిస్తారు. కేంద్రం ఇప్పటివరకు 15 'రోజ్‌గార్ మేళా'లను నిర్వహించి 10లక్షలకు పైగా నియామకపత్రాలను అందజేసింది. తాజాగా 16వ 'రోజ్‌గార్ మేళా'ను దేశవ్యాప్తంగా 47 చోట్ల నిర్వహించనుంది. రైల్వే, హోం, తపాలా, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, ఆర్థిక సేవల విభాగం, కార్మిక, ఇతర మంత్రిత్వ శాఖల్లో ఉద్యోగాలు కల్పించనుంది.

అమెరికా విదేశాంగ శాఖలో 1,353 మందిపై వేటు

వాషింగ్టన్, జూలై 11: అమెరికాలో విభాగాల పునర్వ్యవస్థీకరణపై ట్రంప్ సర్కారు తన ప్రయత్నాలను కొనసాగిస్తోంది. అందులో భాగంగా విదేశాం గ శాఖలో 1,353 మంది ఉద్యోగులను తొలగించాలని శుక్రవారం నిర్ణయించింది. వీరిలో అమెరికాలో పనిచేసే 1,107 మంది సివిల్ సర్వెంట్లు, 246 మంది ఫారెన్ సర్వీసు అధికారులు ఉన్నారు. తొలగింపునకు గురయ్యే ఉద్యోగులకుఈ-మెయిల్ ద్వారా నోటీసులు పంపించారు.

ఎమిరేట్స్ విమానంలో తెలుగులోనూ మెనూ



శంషాబాద్ రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ విమానాశ్రయం నుంచి దుబాయ్ వెళ్తున్న ఎమిరేట్స్ విమానంలో ప్రయాణికుల సౌకర్యార్థం మెనూను తెలుగులోనూ ముద్రించారు. ఇంగ్లిషు, అరబిక్‌తో పాటు తెలుగు భాషలో ఉన్న ఆ మెనూను ఓ ప్రయాణికుడు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఓ విదేశీ విమానయాన సంస్థ తెలుగులోనూ మెనూ ముద్రించడం విశేషమని ఆయన పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సముదాయాల్లో తెలుగులోనూ బోర్డులు పెడితే బాగుటుందని అభిప్రాయపడ్డారు. కాగా శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రాకపోకలు సాగించే అంతర్జాతీయ విమాన సర్వీసులన్నింటిలోనూ మెనూను తెలుగులో కూడా ముద్రిస్తున్నారని తెలిసింది.

తిరుపతి తొక్కిసలాటపై 200 పేజీల నివేదిక

- ప్రభుత్వానికి సమర్పించిన ఏకసభ్య కమిషన్

అమరావతి, జూలై 11(ఆంధ్రజ్యోతి): తిరుపతి తొక్కిసలాట ఘటనపై ఏకసభ్య కమిషన్ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఈ ఏడాది జనవరి 8న తిరుపతిలోని వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల పంపిణీ కేంద్రాల వద్ద జరిగిన తొక్కిసలాటలో ఐదుగురు మరణించగా అనేకమంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సత్యనారాయణమూర్తి నేతృత్వంలో విచారణ కమిషన్‌ను ప్రభుత్వం నియమించింది. ఆయన అన్ని కోణాల్లో విచారణ చేశారు. టీటీడీ అధికారులు, జిల్లా అధికారులు, సిబ్బందితో పాటు భక్తులను కూడా విచారించారు. మూడు వాల్యూమ్స్‌గా నివేదికను సిద్ధం చేశారు. శుక్రవారం సచివాలయంలో సీఎస్‌కు 200 పేజీల నివేదికను అందజేశారు. ఈ నివేదిక ఆధారంగా ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకోనుంది.

ఏపీకి కొత్త జాతీయ రహదారి


- శ్రీకాకుళం జిల్లా మూలపేట పోర్టు నుంచి భీమిలి వరకు
- 200 కిలోమీటర్ల రహదారితో మూడు జిల్లాలకు మహర్దశ

శ్రీకాకుళం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో కీలకమైన గ్రీన్‌ఫీల్డ్ కోస్టల్ నేషనల్ హైవేకు లైన్ క్లియర్ అయింది. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టు నుంచి భీమిలి వరకు కోస్టల్ హైవే కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన అభ్యర్థనకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఓకే చెప్పారు. ఈ హైవే మూలపేట పోర్టుకు అనుసంధానంగా ఉంటుందని చెబుతున్నారు. విశాఖ నుంచి భీమిలి వరకు జాతీయ రహదారి ఉంది. భోగాపురం వద్ద ఎయిర్‌పోర్టు నిర్మాణం జరుగుతోంది. అటు శ్రీకాకుళం జిల్లా మూలపేట పోర్టుకు ఆరు లేన్ల రహదారి అవసరం ఉందని గుర్తించారు. అందుకే భోగాపురం ఎయిర్‌పోర్టుకు, మూలపేట పోర్టుకు కనెక్టివిటీని పెంచే ప్రయత్నాల్లో ఉన్నారు. కొత్త హైవే అందుబాటులోకి వస్తే శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాలకు మహర్దశ పట్టనుంది. కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు దీనిపై దృష్టి పెట్టారు. 200 కిమీ ఈ హైవేకు సంబంధించి ఆదేశాలొస్తే డీపీఆర్ సిద్ధం చేయనున్నారు.

రిటైర్మెంట్ @ 75పై రచ్చ

మోహన్ భాగవత్ తాజా వ్యాఖ్యలతో ప్రధాని మోదీ 'వయస్సు'పై మరోసారి చర్చ

- 75ఏళ్లు పూర్తయితే దిగిపోవాల్సిందే
- పుస్తకావిష్కరణ సభలో ఆర్ఎస్ఎస్ అధినేత భాగవత్ స్పష్టీకరణ
- సెప్టెంబరు 17తో మోదీకి 75 ఏళ్లు
- ఇప్పటికే 'వయసు'పై విపక్షాల విసుర్లు



న్యూఢిల్లీ, జూలై 11: నాయకులు 75 ఏళ్ల వయసు రాగానే పక్కకు తప్పుకోవాలంటూ ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ చేసిన వ్యాఖ్యలు మరోసారి రిటైర్మెంట్ రచ్చను రాజేశాయి. భాగవత్ ఈ వ్యాఖ్యలు ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి చేశారా? లేక వచ్చే సెప్టెంబరు నాటికి 75 ఏళ్లు పూర్తిచేసుకుంటున్న తన గురించి తానే భాగవత్ ఈ ప్రకటన చేశారా? అంటూ విపక్షాలు ఆశ్చర్యపోతున్నాయి. మరోవైపు బీజేపీ, ఆర్ఎస్ఎస్ మధ్య 2024 ఎన్నికల ముందు మొదలైన ఆధిపత్య పోరు మరింత పాకాన పడిందా అనే అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. ఏమైనా జాతీయ రాజకీయ వర్గాలు, ఆర్ఎస్ఎస్ వ్యవహారాల పరిశీలకులు తాజా పరిమాణాలను ఆసక్తిగా గమనిస్తున్నారు. ఇంత చర్చకు కారణమైన ఘటన.. ఆర్ఎస్ఎస్ సిద్ధాంత కర్త మోరోపంత్ పింగ్లేకు అంకితం చేస్తూ గత బుధవారం జరిగిన పుస్తక ఆవిష్కరణ సభలో చోటుచేసుకుంది. సభలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ మాట్లాడుతూ.. "75 ఏళ్లు ఒంటిమీదకు వచ్చి శాలువా కప్పించుకున్నామంటేనే, వయసు మీరిందని, బాధ్యతల నుంచి తప్పుకొని, మరొకరికి అవకాశం ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైందని అర్థం చేసుకోవాలి' అని పింగ్లే అనేవారు" అని తెలిపారు. భాగవత్ ఈ వ్యాఖ్యలు చేసిన సమయం అనేక సందేహాలకు తావిచ్చింది. వచ్చే సెప్టెంబరు 17వ తేదీతో మోదీ, సెప్టెంబరు 11వ తేదీతో భాగవత్ 75 ఏళ్లు పూర్తి చేసుకోనున్నారు. వీరిద్దరూ 1950 సెప్టెంబరులో ఆరు రోజుల తేడాతో జన్మించారు. దీంతో ప్రధానిగా దిగిపోవాల్సిన సమయం వచ్చేసిందని మోదీకి భాగవత్ పరోక్ష సంకేతం అందించారని విపక్షాలు వ్యాఖ్యానిస్తున్నాయి. "75 ఏళ్లు పూర్తిచేసుకున్న ఆడ్వాణీ, మురళీమనోహర్ జోషి, జస్వంత్ సింగ్‌లను బాధ్యతల నుంచి తప్పించేదాకా నరేంద్రమోదీ నిద్రపోలేదు. అదే సూత్రాన్ని ఆయన తనకు వర్తింపజేసుకుంటారా?" అని శివసేన (ఉద్ధవ్ ఠాక్రే) నేత సంజయ్ రౌత్ ప్రశ్నించారు. ప్రధానిగా తన పదేళ్లలో మోదీ నాగ్‌పూర్‌లోని ఆర్ఎస్ఎస్ కార్యాలయాన్ని తొలిసారి ఈ ఏడాది మార్చిలో సందర్శించినప్పుడు కూడా రౌత్ ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. అప్పట్లో బీజేపీ వాటిని ఖండించింది. బీజేపీ ప్రణాళికలో పదవీ విరమణకు సంబంధించిన నిబంధన లేదని, 2029 వరకు మోదీయే ప్రధానిగా ఉంటారని హోంమంత్రి అమిత్‌షా కూడా స్పష్టం చేశారు.

అయ్యో.. ప్రధాని: కాంగ్రెస్ ఎద్దేవా

"విదేశీ పర్యటనలు చేసి, అవార్డులు అందుకుని స్వదేశానికి తిరిగివస్తున్న ప్రధానమంత్రికి ఆర్ఎస్ఎస్ అందించిన స్వాగతం చూడండి" అని కాంగ్రెస్ నేత జైరామ్ రమేశ్ శుక్రవారం 'ఎక్స్'లో వ్యాఖ్యానించారు. 'అయ్యో.. ప్రధాని' అంటూ వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. తాను చేసే ప్రబోధాలకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ కట్టుబడి ఉండాలని మరో కాంగ్రెస్ నేత అభిషేక్ మనూ సింఘ్వీ సూచించారు. వచ్చే సెప్టెంబరుతో 75 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న మోదీ, భాగవత్ ఇద్దరూ.. బ్యాగులు సర్దుకుని కార్యాలయాలను వదిలిపెట్టాలని ఏఐసీసీ నేత పవన్ ఖేడా కోరారు.

మోదీకి ఆ సూత్రం వర్తించదు: ఆర్ఎస్ఎస్ పరిశీలకులు

ప్రధానమంత్రి నరేంద్రమోదీకి 75 సంవత్సరాలు అనే నిబంధన వర్తించబోదని ఆర్ఎస్ఎస్ మాజీ నేత, సంఘ్ పరిశీలకుడు దిలీప్ దేవధర్ తెలిపారు. నరేంద్రమోదీ ఈ నిబంధనకు మినహాయింపు అని, బీజేపీలోని మార్గదర్శక మండలి సభ్యులకు మాత్రమే 75 ఏళ్ల అనే నిబంధన వర్తిస్తుందని ఐదేళ్ల క్రితమే మోహన్ భాగవత్ వివరణ ఇచ్చారని దిలీప్ గుర్తుచేశారు. అలాగే, వయసు ప్రమాణంగా ఆర్ఎస్ఎస్ అధినేత వైదొలగడం అనేది ఆ సంస్థ చరిత్రలోనే లేదని సంఘ్ పరిశీలకులు చెబుతున్నారు. ఆర్ఎస్ఎస్ చీఫ్‌లుగా గతంలో పనిచేసిన రజ్జు భయ్యా, కేఎస్ సుదర్శన్ అనారోగ్యకారణాలతో 78వ యేట బాధ్యతల నుంచి తప్పుకున్నారని, బాలాసాహెచ్ దియోరస్ 79 ఏళ్లవరకు ఆపదవిలో ఉన్నారని గుర్తుచేశారు.

ఈసీకి అపరిమిత అధికారాలు ఇవ్వొద్దు

- జేపీసీ సమావేశంలో ఇద్దరు మాజీ సీజేఐల సూచనలు

న్యూఢిల్లీ, జూలై 11: 'ఒకే దేశం ఒకే ఎన్నిక' విధానం అమలులో భారత ఎన్నికల సంఘానికి అపరిమిత అధికారాలు ఇవ్వకూడదని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. బీజేపీ ఎంపీ పీపీ చౌధరి చైర్‌పర్సన్‌గా ఉన్న సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) శుక్రవారం నిర్వహించిన సమావేశానికి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేఎస్ ఖేహర్ హాజరయ్యారు. జమిలి ఎన్నికలపై వీరు కమిటీకి ప్రజెంటేషన్ ఇచ్చారని సంబంధిత వర్గాలు తెలిపాయి. రాజ్యాంగ సవరణ బిల్లులో ప్రతిపాదించిన విధంగా ఈసీఐకి అపరిమిత అధికారాలు ఇవ్వకూడదని, 'చెక్స్ అండ్ బ్యాలెన్సెస్' వ్యవస్థ ఉండాలని జడ్జిలు సూచించారు. ఎన్నికల నిర్వహణపై పర్యవేక్షణ యంత్రాంగం ఉండాలన్నారు. ప్రభుత్వం సుపరిపాలన అందించడానికి ఐదేళ్ల పదవీకాలం ఎంతో ముఖ్యమని, దీన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ తగ్గించకూడదని స్పష్టం చేశారు. జమిలి ఎన్నికల ఆలోచనను అన్ని రాష్ట్రాల్లోని ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు సమర్థిస్తున్నారని చౌధరి చెప్పారు. గతంలో ఈ కమిటీ ముందు మాజీ సీజేఐలు జస్టిస్ యూయూ లలిత్, జస్టిస్ రంజన్ గొగోయ్ హాజరయ్యారు. ఈసీఐకి అధికారాలు ఇవ్వాలనుకోవడాన్ని జస్టిస్ గొగోయ్ కూడా ప్రశ్నించారు. కాగా, లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు జరపడం రాజ్యాంగ మౌలిక నిర్మాణాన్ని ఉల్లంఘించడమేనంటూ ప్రతిపాదిత బిల్లును పలువురు ప్రతిపక్ష నేతలు విమర్శించారు. అయితే కమిటీముందు హాజరైన న్యాయ నిపుణులు ఈ విమర్శలను తోసిపుచ్చారు. జాతీయ, రాష్ట్రాల ఎన్నికలు విడివిడిగా నిర్వహించాలని రాజ్యాంగం ఎప్పుడూ ఆదేశించలేదని స్పష్టం చేశారు.

సిద్దు కుర్చీ సేఫ్?!

- 'ఐదేళ్లూ నేనే సీఎం' వ్యాఖ్యల వెనుక అధిష్ఠానం!
- రాహుల్ భరోసాతో సిద్దూలో ధీమా

బెంగళూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో 2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి, ముఖ్యమంత్రిగా సిద్దరామయ్య బాధ్యతలు చేపట్టింది మొదలు.. రాష్ట్రంలో సీఎం మార్పు అంశంపై చర్చ లేని రోజు లేదంటే అతిశయోక్తి లేదు! ఇటీవల జరుగుతున్న పరిణామాలు రాష్ట్రంలో సీఎం మార్పు ఉండబోదని, ఆ దిశగా అధిష్ఠానం సంకేతాలు ఇచ్చిందనే చర్చకు దారితీశాయి. సీఎం సిద్దరామయ్య గురువారం ఢిల్లీలో మాట్లాడుతూ 'ఐదేళ్లు నేనే సీఎంగా ఉంటాను. కుర్చీ ఖాళీగా లేదు. నా సారథ్యంలోనే 2028లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి' అని చెప్పడం వెనుక రాహుల్‌గాంధీ సందేశం ఉందా? అనే చర్చ జరుగుతోంది. రాహుల్ దిశానిర్దేశమే సిద్దరామయ్య ధీమాకు కారణమనే అభిప్రాయాలు వ్యక్తమౌతున్నాయి. ఢిల్లీలో మూడు రోజులు మకాం వేసిన సిద్దూ.. నాయకత్వ మార్పు అంశంపై హైకమాండ్ వద్ద చర్చ లేదని పేర్కొన్నారు.

మౌనంగా ఉండమని ఖర్గే చెప్పారు: డీకే

మరోవైపు కర్ణాటక రాజకీయాల్లో ట్రబుల్ షూటర్‌గా, మొండి నాయకుడిగా ముద్రపడిన డీకే శివకుమార్.. రెండు రోజులుగా మౌనం పాటిస్తున్నారు. బెంగళూరులో శుక్రవారం ఆయన మాట్లాడుతూ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మౌనంగా ఉండాలని సూచించారని, అదే పాటిస్తున్నానని చెప్పడం చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి స్పష్టత ఇచ్చాక నాయకత్వ మార్పు గురించి మాట్లాడడం సరికాదని మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. డీకే శివకుమార్ సన్నిహిత నేతలు ఆయన త్వరలో సీఎం అవుతారంటూ గతంలో వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. కాగా, ఢిల్లీలో సీఎం, డిప్యూటీ సీఎంలు మూడు రోజులు మకాం వేసినా, రాహుల్‌గాంధీ ఇద్దరికీ అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం గమనార్హం.

బిహార్లోనూ ఎన్నికల హైజాక్!

- ఈసీ బీజేపీ కోసమే పనిచేస్తోంది: రాహుల్
- రాజ్యాంగం నుంచి సెక్యులరిజం, సోషలిజాన్ని తొలగించే కుట్ర: ఖర్గే



సమావేశంలో అభివాదం చేస్తున్న రాహుల్ గాంధీ, ఖర్గే

భువనేశ్వర్, జూలై 11: మహారాష్ట్రలో మాదిరిగా బిహార్లోనూ ఎన్నికల హైజాక్‌కు బీజేపీ ప్రయత్నాలు చేస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మరోసారి ఆరోపించారు. ఎన్నికల కమిషన్ (ఈసీ) తన విధులు తాను నిర్వర్తించకుండా.. అధికార పార్టీ కోసమే పనిచేస్తోందన్నారు. శుక్రవారం ఒడిసా రాజధాని భువనేశ్వర్‌లో కాంగ్రెస్ నిర్వహించిన 'సంవిధాన్ బచావో సమావేశ్'లో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది చివరిలో జరిగే బిహార్ ఎన్నికలను హైజాక్ చేయకుండా బీజేపీని అడ్డుకోవాలని ఇండియా కూటమి పార్టీలు నిర్ణయించాయని తెలిపారు. ఆ పార్టీ దేశవ్యాప్తంగా రాజ్యాంగంపై దాడిచేస్తోందన్నారు. 'బీజేపీ తన ప్రభుత్వాన్ని ఐదారుగురు పారిశ్రామికవేత్తల కోసమే నడుపుతోంది. సాధారణ ప్రజల కోసం అది పనిచేయదు. నీరు, అడవులు, భూములు గిరిజనులకు చెందినవి. ఒడిసాలోని బీజేపీ ప్రభుత్వం షెడ్యూల్ ఏరియాలను విస్తరించే పంచాయతీల చట్టాన్ని అమలు చేయడం లేదు. అటవీ హక్కుల పట్టాలను గిరిజనులకు అందజేయడం లేదు. మేమొస్తే పెసా, గిరిజనుల చట్టాలను అమలు చేస్తాం. గిరిజనులకు వారి భూములను వారికి అప్పగిస్తాం. గతంలో ఒడిసా రాష్ట్రాన్ని బీజేడీ సర్కారు దోచుకుంది. ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం ఆ పనిచేస్తోంది' అని ఆయన విమర్శించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ కాషాయ పార్టీ.. రాజ్యాంగాన్ని మార్చాలని పనిగా పెట్టుకుందని.. రాజ్యాంగం నుంచి సెక్యులరిజం, సోషలిజాన్ని తొలగించేందుకు ఆ పార్టీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. బీజేపీ ఏలుబడిలో గిరిజనులు, దళితులు, మహిళలు, యువత సురక్షితంగా లేరన్నారు. పేదలను, గిరిజనులకు కాపాడేందుకు కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం 2006లో అటవీ హక్కుల చట్టం తెచ్చిందని, అయితే మోదీ సర్కారు దానిని అమలు చేయడం లేదని ఆక్షేపించారు. పరిశ్రమల పేరిట ప్రతి చోటా అడవులను నాశనం చేస్తోందన్నారు. కాంగ్రెస్ దేశంలో 160 ప్రభుత్వ రంగ సంస్థ(పీఎస్‌యూ)లను ఏర్పాటుచేస్తే.. వాటిలో 23 సంస్థలను బీజేపీ ప్రైవేటీకరించిందన్నారు. కాంగ్రెస్ సృష్టించిన ప్రజాసంపదను తన మిత్రులకు మోదీ అమ్మేస్తున్నారని ఖర్గే ఆరోపించారు.

వాహనంపై అతికించని ఫాస్టాగ్‌లు ఇకపై బ్లాక్‌లిస్ట్‌లోకి

(మొదటి పేజీ తరువాయి)

ఫాస్టాగ్‌లను దుర్వినియోగం చేస్తున్నారు. కొన్నిసార్లు టోల్ రుసుము తిరిగి తప్పుగా సదరు లూజ్ ఫాస్టాగ్ ఖాతాలోకి వెళుతుండడాన్ని (బోగస్ చార్జిబ్యాక్స్) ఎన్‌హెచ్ఏఐ గమనించింది. ఈ నేపథ్యంలో టోల్ సేకరణ ఏజెన్సీలు లూజ్ ఫాస్టాగ్‌ల సమాచారం తెలియజేసేందుకు ప్రత్యేకంగా ఈ-మెయిల్ ఐడీని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఎన్‌హెచ్ఏఐ తెలిపింది. దానికి సమాచారం రాగానే ఆయా లూజ్ ఫాస్టాగ్‌లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టేందుకు చర్యలు చేపడతామని పేర్కొంది.

సీఎం పదవి సరే.. ముందు ఏ పార్టీయో తేల్చుకోండి

- శశి థరూర్‌పై కేరళ కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, జూలై 11: తిరువనంతపురం ఎంపీ శశి థరూర్, కాంగ్రెస్ పార్టీ మధ్య జరుగుతున్న ప్రచ్ఛన్న యుద్ధం క్రమేణా బహిర్గతమవుతోంది. ఆయన ఇటీవల కాలంలో ప్రధాని మోదీని పొగుడుతుండాన్ని తప్పుపడుతున్న కేరళ కాంగ్రెస్ నేతలు ఇప్పుడు బహిరంగంగా విమర్శలు చేస్తున్నారు. వచ్చే ఏడాది జరగనున్న కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరైతే బాగుంటుందనేదానిపై సర్వే జరిపినప్పుడు 28.3% మంది థరూర్ పేరును సూచించారు. ఈ విషయాన్ని బుధవారం ఆయన సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. దీనిపై కాంగ్రెస్ సీనియర్ నేత కె.మురళీధరన్ స్పందిస్తూ సీఎం పదవి మాట ఎలా ఉన్నప్పటికీ తొలుత ఆయన ఏ పార్టీకి చెందిన వారో తేల్చుకోవాల్సి ఉందని వ్యాఖ్యానించారు. సర్వేలో ఎవరు ముందున్నా యూడీఎఫ్ గెలిస్తే ఆ కూటమి అభ్యర్థే ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు.

భారత అమ్ములపొదిలోకి లోరా!



ఇజ్రాయెల్ తయారీ మధ్యశ్రేణి క్షిపణిపై మన వాయుసేన దృష్టి

- బాలిస్టిక్, క్రూయిజ్.. రెండు లక్షణాల కలబోత లోరా
- బెల్‌తో కలిసి భారత్‌లో ఉత్పత్తి కోసం ఒప్పందం

న్యూఢిల్లీ, జూలై 11: తరచూ కయ్యానికి కాలుదువ్వే పాకిస్థాన్ ఓవైపు.. ఎప్పుడు చాన్స్ దొరుకుతుందా అని కాచుక్కూర్చున్న చైనా మరోవైపు.. ఈ రెండింటినీ దీటుగా ఎదుర్కొనేలా రక్షణ సామర్థ్యాన్ని పెంచుకోవడంపై భారత వాయుసేన దృష్టిపెట్టింది. ఈ క్రమంలో ఇజ్రాయెల్‌కు చెందిన లోరా (లాంగ్ రేంజ్ ఆర్టిలరీ) సూపర్ సోనిక్ క్షిపణులను అమ్ములపొదిలో చేర్చుకునేందుకు సిద్ధమవుతోంది. యుద్ధ సమయాల్లో విభిన్నమైన అవసరాలకు వినియోగించుకునేలా, మన వద్ద ఉన్న బ్రహ్మోస్ క్షిపణులకు తోడుగా లోరా క్షిపణులను సమకూర్చుకోవాలని భావిస్తోంది. ఇజ్రాయెల్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ (ఐఏఐ)లోరా క్షిపణులను అభివృద్ధి చేసింది. బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణులకు ఉండే లక్షణాలు దీని సొంతం. గంటకు 6వేల కిలోమీటర్ల (మాక్ 5)కుపైగా వేగంతో దూసుకుపోయి 430 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. ఒకసారి లక్ష్యాన్ని నిర్ధారిస్తే జీపీఎస్, ఐఎన్ఎస్ నావిగేషన్ సాయంతో దూసుకుపోతుంది. క్షిపణి దూసుకెళ్తున్న సమయంలో దాడి చేయాల్సిన లక్ష్యాన్ని మార్చేందుకు వీలుంటుంది. దీనితో శత్రు దేశాలు ఈ క్షిపణులను మధ్యలోనే కూల్చేయడం కష్టతరం అవుతుంది. ఈ క్షిపణుల్లో జామ్ చేయడానికి వీల్లేని సాంకేతికత ఉంది. నిర్ణీత లక్ష్యంపై పది మీటర్లలోపు తేడాతో దాడి చేయగలదు. 5.2 మీటర్ల పొడవు, 1,600 కిలోల బరువు ఉండే 'లోరా' క్షిపణికి 570 కిలోల వార్‌హెడ్‌ను అమర్చవచ్చు. బ్రహ్మోస్ క్షిపణుల బరువు చాలా ఎక్కువ. సరిహద్దులకు కాస్త దగ్గర్లోని భారీ లక్ష్యాలను ఛేదించడానికి అవి అనుకూలం. లోరా క్షిపణులు మరింత లోపలి లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదించేందుకు ఉపయోగపడతాయి. మన వాయుసేన వద్ద ఎక్కువ సంఖ్యలో ఉన్న సుఖోయ్ 30 ఎంకేఐ యుద్ధ విమానాలకు 'లోరా' క్షిపణులను చాలా సులువుగా అనుసంధానం చేయవచ్చు. ఒక్కో సుఖోయ్ ఫైటర్ 4 లోరాలను మోసుకెళ్లగలదు. అంటే ఒక ఫైటర్ వెళ్లి.. ఒకేసారి శత్రువు ఎయిర్‌బేస్‌లోని రన్‌వేను, కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను, రాడార్ వ్యవస్థలను ధ్వంసం చేయవచ్చు. బ్రహ్మోస్ ఒక్కో క్షిపణి ఖరీదు సుమారు రూ.34 కోట్లు కాగా, లోరా క్షిపణుల ఖరీదు సుమారు రూ.21 కోట్లు. బ్రహ్మోస్ అత్యంత తక్కువ ఎత్తులో రాడార్లకు చిక్కకుండా దూసుకెళ్తుంది. సాధారణ ప్రాంతాల్లోని లక్ష్యాలను ఛేదించేందుకు అనుకూలం. లోరా క్షిపణులు ఎత్తయిన, పర్వత ప్రాంతాల్లోని లక్ష్యాలను సమర్థవంతంగా ధ్వంసం చేసేందుకు వీలు కల్పిస్తాయి. లోరా క్షిపణులను మన దేశంలో ఉత్పత్తి చేసేందుకు ఐఏఐ, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ మధ్య 2023లోనే అవగాహన ఒప్పందం కుదిరింది. సాంకేతిక బదిలీ, ఇతర అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. అంతా అనుకున్నట్టుగా జరిగితే 2026-27నాటికి లోరా క్షిపణులు వాయుసేన అమ్ములపొదిలోకి చేరనున్నాయి.



సర్వదర్శనం క్యూలైన్‌లోని షెడ్‌లలో వేచి ఉన్న భక్తులు

శ్రీవారి సర్వ దర్శనానికి 16 గంటలు

తిరుమల, జూలై 11(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ పెరిగింది. రెండవ శనివారం, ఆదివారం వరుస సెలవులు కావడంతో తిరుమల భక్తులతో కిటకిటలాడింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లోని 31 కంపార్టుమెంట్లతో పాటు నారాయణగిరి ఉద్యానవనంలోని తొమ్మిది షెడ్లు సర్వ దర్శనం భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ కృష్ణతేజ విశ్రాంతి భవనం మీదుగా రింగురోడ్డులో శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వీరికి దాదాపు 16 గంటల దర్శన సమయం పడుతోంది. ఇక, టైంస్లాట్ టోకెన్లు, టికెట్లు ఉన్న వారికి కూడా దాదాపు మూడు నుంచి నాలుగు గంటలు సమయం తర్వాత స్వామి దర్శనం లభిస్తోంది.

తిరుమల భద్రతకు 40 ఏళ్ల ప్రణాళికలు

ఎల్అండ్‌టీ ప్రతినిధులతో టీటీడీ ఈవో సమావేశం

తిరుమల, జూలై 11(ఆంధ్రజ్యోతి): తిరుమల భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని మరో 40 ఏళ్లకు సరిపడా ప్రణాళికలు రూపొందించాలని టీటీడీ ఈవో శ్యామలరావు సూచించారు. తిరుమల భద్రతా ప్రణాళికలపై శుక్రవారం ఎల్ అండ్ టీ సంస్థ ప్రతినిధులు తిరుమలలోని అన్నమయ్య భవనంలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఇందులో భాగంగా అలిపిరి తనిఖీ కేంద్రం ఆధునికీకరణ, అధిక సామర్థ్యం కలిగిన స్కానర్లు, పార్కింగ్ ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, కేంద్రీకృత నిఘా వ్యవస్థ వంటి అంశాలను వివరించారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరితో పాటు ఎల్ అండ్ టీ వైస్ ప్రెసిడెంట్ రామకృష్ణ ప్రతినిధుల బృందం, సీవీఎస్వో మురళీకృష్ణ, సీఈ సత్యనారాయణ, ట్రాన్స్‌పోర్టు, ఐటీ జీఎం శేషారెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. శ్రీవారిసేవ స్వచ్ఛంద వ్యవస్థలో తీసుకురానున్న సంస్కరణలపై కూడా ఈవో సమీక్షించారు.

సచివాలయ బదిలీ'లీలలు'!

- అన్ని శాఖల్లో మార్గదర్శకాలు బేఖాతరు
- గందరగోళంగా సాగిన ప్రక్రియ
- ఎమ్మెల్యేల లేఖ ఉంటేనే కోరుకున్న చోటుకు..
- కొన్ని చోట్ల అధికారుల 'చేతి'వాటం
- దరఖాస్తు చేసుకోని వారికీ స్థానచలనం
- ఇష్టారీతిన స్పౌజ్ క్యాటగిరీ బదిలీలు

అమరావతి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో సిబ్బంది బదిలీలు గందరగోళంగా మారాయి. ప్రభుత్వంలో మిగతా శాఖల సిబ్బంది బదిలీల ప్రక్రియ పూర్తయిన తర్వాత సచివాలయాల సిబ్బంది బదిలీలు చేపట్టినప్పటికీ.. ఏ జిల్లాలోనూ ఈ ప్రక్రియ పారదర్శకంగా జరగలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బదిలీల్లో ఎమ్మెల్యేల సిఫారసు లేఖలు, డబ్బు కీలకంగా పనిచేసినట్లు తెలుస్తోంది. జూన్ నెలాఖరు దాకా బదిలీ ప్రక్రియ పూర్తి చేయాలని మొదట పేర్కొన్నప్పటికీ, పెన్షన్ల పంపిణీ ఉండటంతో ఈనెల 5 వరకు నిర్వహించారు. ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసిన వారికి తప్పనిసరి స్థానచలనం, అభ్యర్థన పెట్టుకున్న వారిని, స్పౌజ్, మెడికల్ క్యాటగిరీల కింద బదిలీకి అవకాశమిచ్చారు. అయితే కొన్నిచోట్ల ఐదేళ్ల సర్వీసు పూర్తికాకపోయినా..బలవంతంగా బదిలీ చేయడంపై కలెక్టర్లకు భారీగా ఫిర్యాదులొచ్చాయి. కొన్నిచోట్ల స్పౌజ్ క్యాటగిరీని పట్టించుకోకుండా ఇష్టారీతిగా భార్యాభర్తలను వేర్వేరు మండలాలకు మార్చేశారు. జిల్లాలో ఒక పక్క ఉండే మండలం నుంచి మరో మారుమూల మండలానికి విసిరేసినట్లు సచివాలయ సిబ్బందిని బదిలీ చేయడంపై విమర్శలొస్తున్నాయి. ముఖ్యంగా మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బదిలీలతో పిల్లలకు చదువులు కూడా ఇబ్బందిగా మారాయని పేర్కొంటున్నారు.

జిల్లా కలెక్టర్లకు పలువురు ఫిర్యాదు

గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది బదిలీలకు సంబంధించిన మార్గదర్శకాలను అధికారులు బేఖాతరు చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉన్నప్పటికీ.. అసలు దరఖాస్తు చేసుకోని వారిని సైతం ఇష్టానుసారంగా దూర ప్రాంతాలకు బదిలీ చేశారు. స్పౌజ్ క్యాటగిరీ కింద బదిలీలు కూడా ఇష్టారీతిన చేశారు. దీంతో జిల్లా కలెక్టర్లకు పలువురు సిబ్బంది ఫిర్యాదులు చేశారు. సచివాలయాల సిబ్బందికి సీనియారిటీ ప్రాతిపదికన కౌన్సెలింగ్ నిర్వహించాలి. వీరిలో ఎక్కువ మంది ఒకే రోజు ఉద్యోగాల్లో చేరినందున, వారి నియామక రాతపరీక్షలో ర్యాంకు ఆధారంగా సీనియారిటీని గుర్తించాలి. అయితే ఇవేవీ అమలైనట్లు కనిపించడం లేదు. దివ్యాంగులకు ప్రాధాన్యమివ్వాలని మార్గదర్శకాల్లో స్పష్టంగా చెప్పినప్పటికీ.. ఎక్కడా పాటించలేదు. ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, గ్రామ సర్వేయర్లను గడువు పూర్తయినా ఇంకా బదిలీల ఆదేశాలివ్వలేదు. పైరవీలు ఇంకా కొనసాగిస్తున్నారు. కొన్ని గ్రామ, వార్డు సచివాలయాలకు ఇంజనీరింగ్ అసిస్టెంట్ పోస్టు కేటాయించలేదు. అలాంటి చోట్ల కూడా ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను నియమించారు. పోస్టు కలిగిన చోట ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు బాగా గిరాకీ ఏర్పడింది. వేలకు వేలు డబ్బులిచ్చి అలాంటి చోటుకు బదిలీ చేయించుకుంటున్నారు. దీంతో పాటు గ్రామ సర్వేయర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్, అగ్రికల్చరల్, వెటర్నరీ, ఫిషరీస్ అసిస్టెంట్లకు డిమాండ్ ఏర్పడింది. ఈ బదిలీల్లో భారీగా ముడుపులు చేతులు మారాయి. గ్రేడ్-6 పంచాయతీ కార్యదర్శులకు కొన్ని చోట్ల గ్రేడ్-5గా పదోన్నతి కల్పించారు. వారికి సాధారణ బదిలీలు అయిన తర్వాత పోస్టింగ్‌లు ఇవ్వాలి. అలా కాకుండా గ్రేడ్-5 వారికి, పదోన్నతి పొందిన వారందరికీ ఒకేసారి బదిలీలు నిర్వహించడంతో ఇబ్బందులు పడ్డామని సీనియర్లు వాపోతున్నారు.

ఎమ్మెల్యేల సిఫారసులే ప్రాతిపదిక

బదిలీల్లో ఎమ్మెల్యేల సిఫారసులు లేఖలు కూడా కీలకంగా పనిచేసినట్లు తెలుస్తోంది. కొన్ని జిల్లాల్లో అగ్రికల్చరల్, పశుసంవర్ధక జేడీలు, డీఎంఅండ్‌హెచ్‌ఓ, డీపీఓ కార్యాలయాల్లోని అధికారులకు డబ్బులిస్తేనే ట్రాన్స్‌ఫర్లు చేశారు. ఎమ్మెల్యే సిఫారసులతో పాటు ఎంతో కొంత ముట్టచెప్తేనే బదిలీ చేశారు. కొన్ని జిల్లాల్లో అయితే ఎమ్మెల్యేల సిఫారసులను కూడా పట్టించుకోకుండా అధికారులు 'చేతివాటం' ప్రదర్శించారు. బదిలీల ప్రక్రియ సీనియారిటీతో కాకుండా కేవలం ఆయా శాఖల జిల్లా అధికారుల సొంత నిర్ణయంతోనే జరిగాయి. బదిలీ జాబితాను ఒక్కసారిగా వెల్లడించడంతో దూర మండలాలకు బదిలీ అయిన సిబ్బంది లబోదిబోమంటున్నారు.

ఏపీ పేపరుమిల్లు లాకౌట్

- కొలిక్కిరాని చర్చలు.. కార్మికుల సమ్మె నేపథ్యంలో యాజమాన్యం ప్రకటన



రాజమహేంద్రవరం సిటీ, జూలై 11(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఆంధ్రప్రదేశ్ పేపరుమిల్లు యాజమాన్యం లాకౌట్ ప్రకటించింది. యాజమాన్య మొండి వైఖరిని నిరసిస్తూ కొద్ది రోజులుగా 11 కార్మిక సంఘాలు తొలుత విధులు బహిష్కరించి ఆందోళన చేశాయి. అటుపై వారం రోజులుగా సమ్మె చేపట్టి వేతన ఒప్పందం, పదవీ విరమణ వయో పరిమితి 60 ఏళ్ల అమలు కోసం ఆందోళన చేస్తున్నాయి. ఈ క్రమంలో జాయింట్ లేబర్ కమిషనర్ నేతృత్వంలో రెండు పర్యాయాలు మిల్లు యాజమాన్య ప్రతినిధులతో, కార్మిక సంఘాల నాయకులతో జరిగిన చర్చలు ఫలించలేదు. ఈ నేపథ్యంలో కార్మికులు నిబంధనలకు విరుద్ధంగా సమ్మె చేస్తున్నారని, సమ్మె కొనసాగిస్తే లాకౌట్ ప్రకటిస్తామని గురువారం మిల్లు గేటుకు నోటీస్ పెట్టారు. అయితే కార్మిక సంఘాల నేతలు సమస్యను.. మంత్రి దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, బత్తుల బలరామకృష్ణల దృష్టికి తీసుకువెళ్లారు. శుక్రవారం రాత్రి రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో కార్మిక సంఘాల నేతలు, మిల్లు యాజమాన్య ప్రతినిధులతో మంత్రి దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే బలరామకృష్ణ చర్చించారు. ఒకానొక దశలో మిల్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ముకేష్ జైన్‌పై మంత్రి అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. అయితే కార్మికుల వేతన ఒప్పందం విషయంలో స్పష్టత రాలేదు. దీంతో కలెక్టర్ స్పందించి కార్మికుల సమస్యపై నేరుగా సీఎం కార్యాలయంతో మాట్లాడారు. ఈ నెల 15న మరోసారి సమావేశమై కార్మికుల సమస్యలను పరిష్కరించేలా నిర్ణయం తీసుకున్నారు. కార్మిక సంఘాలు నేతలు ఈ విషయాన్ని తమ 11 సంఘాలతో చర్చించుకుంటామని నగరపాలక సంస్థ నుంచి పేపరుమిల్లుకు చేరుకున్నారు. మరోవైపు.. చర్చలు కొలిక్కిరాకపోవడంతో కార్మికులు సమ్మె కొనసాగిస్తున్న క్రమంలో లాకౌట్ ప్రకటిస్తున్నట్టు మిల్లు యాజమాన్యం నోటీస్ జారీ చేసింది. అలాగే నిబంధనలు ఉల్లంఘించారంటూ కొంత మంది కార్మికులను సస్పెండ్ చేసినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో శనివారం నుంచి కార్మిక సంఘాల ఉద్యమం మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది.

సర్వే అధికారి కోసం దిగొచ్చిన రెవెన్యూశాఖ!

- ఏడు నెలల్లో మూడు జీవోలు.. రెండు పోస్టింగులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సర్వే శాఖలోని ఓ జూనియర్ అధికారి కోసం రెవెన్యూ శాఖ పరితపించిపోయింది. ఏడాదిలో రెండు పోస్టింగులు ఇచ్చింది. అందులోనూ ఆయన కోరుకున్న కేడర్‌లో పోస్టింగ్ ఇస్తున్నట్టు ఉత్తర్వులిచ్చింది. ఇది అందరికీ సాధ్యమయ్యేది కాదని, ఆయనకు మాత్రమే సాధ్యపడిందని ఆ ఉత్తర్వులను పరిశీలిస్తే అర్థమవుతోంది. అంతలా ఆయనకోసం రెవెన్యూ శాఖ దిగొచ్చింది. సర్వే శాఖలో డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వరరావు సెలవుపై వెళ్లారు. ఆయన తిరిగొచ్చిన తర్వాత ఈ ఏడాది జనవరి 28న కాకినాడ డీడీగా పోస్టింగ్ ఇస్తూ రెవెన్యూ శాఖ తొలుత ఉత్తర్వులు జారీ చేసింది. ఆ రోజుకు ఆ పోస్టు ఖాళీగా ఉండటంతో అక్కడే పనిచేయాలని అప్పటి స్పెషల్ సీఎస్ ఆర్.పి.సిసోడియా ఆదేశాలిచ్చారు. గత నెల 9న ఆయన్ను కాకినాడ నుంచి కర్నూలుకు డీడీగా బదిలీ చేస్తూ రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.జయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పుడు సరిగ్గా నెల రోజుల తర్వాత అదే కర్నూలులో, అదే పోస్టులో ఆయన్ను జేడీగా నియమిస్తూ రెవెన్యూశాఖ స్పెషల్ సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇలా ఆయన విషయంలో రెవెన్యూ శాఖ దిగొచ్చి కోరుకున్నట్లుగా పోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. నిజానికి సర్వేలో జిల్లా స్థాయిలో జేడీ పోస్టులు లేవు. రాయలసీమ జిల్లాలన్నింటికి కలిపి పర్యవేక్షణ కోసం ఆర్‌డీడీ పోస్టు ఉంది. అందులో డీడీ లేదా జేడీ స్థాయి అధికారిని నియమిస్తారు.

అమరావతికి రూ.116లు ఇవ్వండి!

- రాజధాని నిర్మాణానికి తోడ్పాటు అందించండి
- అమరావతి బ్రాండ్ అంబాసిడర్ వైష్ణవి పిలుపు



వైష్ణవి

ముదినేపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని నిర్మాణానికి, నూతన రాష్ట్ర సచివాలయ భవనాల నిర్మాణానికి రూ.50 లక్షల విరాళం ఇచ్చిన ఏలూరు జిల్లా ముదినేపల్లికి చెందిన అమరావతి బ్రాండ్ అంబాసిడర్, వైద్య విద్యార్థిని అంబుల వైష్ణవి ప్రజలు కూడా విరాళాలు ఇచ్చేలా చైతన్యం కలిగిస్తున్నారు. ఎకరన్నర పొలం, బంగారం అమ్మి రాజధాని నిర్మాణానికి విరాళాన్ని సీఎం చంద్రబాబు నాయుడుకు వైష్ణవి తన తండ్రి డాక్టర్ మనోజ్‌తో కలసి అందజేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో రాజధాని నిర్మాణంలో ప్రజలు భాగస్వాములయ్యే విధంగా 'అమరావతికి జీవం పోద్దాం-రూ.116లు సాయం అందిద్దాం" అనే నినాదంతో ఆమె విరాళాలు అందజేయాలంటూ పిలుపునిచ్చారు. విరాళాలు ఇచ్చే వారు కమిషనర్ ఏపీసీఆర్‌డీఏ, యూనియన్ బ్యాంక్, విజయవాడ లబ్బీపేట బ్రాంచి, అకౌంట్ నంబర్ 034310100118883కు పంపాలి. వైష్ణవి పిలుపునకు స్పందించిన ఒక దాత శుక్రవారం రూ.5116లు విరాళం అందజేశారు.

బకాయిలపై ప్రభుత్వం స్పందించాలి

- ఈయూ ఆవిర్భావ వేడుకల్లో బొప్పరాజు, పలిశెట్టి

విజయవాడ (బస్‌స్టేషన్), జూలై 11 (ఆంధ్రజ్యోతి): 12వ పీఆర్‌సీ, బకాయిల చెల్లింపులు, మధ్యంతర భృతి ప్రకటనలో జాప్యం జరిగితే ఆందోళన తప్పదని అమరావతి జేఏసీ ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు అన్నారు. విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ డిపో వద్ద ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ 74వ ఆవిర్భావ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జీతాలు, పెన్షన్లు మాత్రం ఒకటో తేదీనే ఇస్తున్నందుకు కృతజ్ఞతలు చెబుతున్నామని, కీలకమైన కొన్ని అంశాల్లో ఉద్యోగుల అసంతృప్తిని ప్రభుత్వ దృష్టికి తీసుకువస్తున్నామన్నారు. దామోదరరావు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు ఇవ్వాలని, విద్యుత్ బస్సులను ఆర్టీసీ యాజమాన్యమే నిర్వహించాలని, ఆర్టీసీని ప్రైవేట్ పరం చేయవద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

శ్రీశైలం పాథమేటిక్ నివేదికకు 'సిందూర్' దెబ్బ!

- సింధు నదిపై ప్రాజెక్టుల వద్ద రీసెర్చ్‌లో సీడబ్ల్యూపీఆర్ఎస్ నిమగ్నం
- శ్రీశైలం అధ్యయన రిపోర్టుకు ఆలస్యమవుతుందన్న సంస్థ

అమరావతి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయం దుస్థితిపై అధ్యయన నివేదికను ఇచ్చేందుకు 'ఆపరేషన్ సిందూర్' అవరోధంగా మారింది. ప్లంజ్‌పూల్, డ్యాం పరిసర ప్రాంతాలు.. పునాదులు ఏ మేరకు దెబ్బతిన్నాయో తేల్చేందుకు పుణే సెంట్రల్ వాటర్-పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ఎస్), అండర్‌వాటర్ వీడియోగ్రఫీ బాధ్యతలు చేపట్టిన విశాఖకు చెందిన సీలైన్స్ సంస్థ అధ్యయనం చేశాయి. సీలైన్స్ వీడియోగ్రఫీ రిపోర్టు ఇచ్చేందుకు సిద్ధంగా ఉంది. కానీ తన అధ్యయన నివేదికను తక్షణమే అందించలేమని సీడబ్ల్యూపీఆర్ఎస్ తాజాగా స్పష్టం చేసింది. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో అమాయక పర్యాటకులను పాకిస్థాన్ ఉగ్రవాదులు పొట్టనపెట్టుకున్న సంగతి తెలిసిందే. భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టి ఉగ్రవాద స్థావరాలను నేలమట్టం చేసింది. పాక్‌తో సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేసింది. నీటి సరఫరాను నియంత్రించింది. సింధు నదిపై నిర్మించిన ఆనకట్టల విస్తరణ అవకాశాలను పరిశీలించే బాధ్యతను కేంద్ర జలశక్తి శాఖ సీడబ్ల్యూపీఆర్ఎస్‌కు అప్పగించింది. ఇది అత్యవసరమైన బాధ్యత కావడంతో దానిని తక్షణమే పూర్తి చేసే పనిలో నిమగ్నమయ్యామని.. శ్రీశైలం డ్యాంపై అధ్యయన నివేదిక సమర్పించడానికి అనివార్యంగా జాప్యం జరుగుతుందని రాష్ట్ర జలవనరుల శాఖకు సమాచారమిచ్చింది.

టీటీడీలో వెయ్యి మంది అన్యమత ఉద్యోగులు!

- వారిని కొనసాగించడం సరికాదు, తక్షణం తొలగించండి
- ఇది రిక్వెస్ట్ కాదు డిమాండ్: కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్



ఆలయం ముందు బండి సంజయ్

తిరుమల, జూలై 11(ఆంధ్రజ్యోతి): టీటీడీలో ఇప్పటికీ వెయ్యి మందికి పైగా అన్యమతస్థులు ఉద్యోగాల్లో ఉన్నారని. వెంటనే వారిని తొలగించాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కోరారు. శుక్రవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డితో కలిసి ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. 'టీటీడీలో ఉన్న అన్యమతస్థులకు స్వామిపై విశ్వాసం లేదు. సనాతన ధర్మానికి అనుగుణంగా వ్యవహరించాలనే ఆలోచన వారికి లేదు. అలాంటి వ్యక్తులకు టీటీడీలో ఉద్యోగాలు ఇవ్వడం, వారిని ఇంకా కొనసాగించడం సరికాదు. జీతాలు ఇస్తూ వారిని ఎలా ప్రోత్సహిస్తారు. గతం నుంచి ఉన్నారు, మేము ఏమీ చేయలేం అంటే అది చేతగానితనం అవుతుంది. టీటీడీ బోర్డుకు నేను సూటిగా చెప్తున్నా. ఇది మంచి పద్ధతి కాదు. వారిని వెంటనే తొలగించాల్సిన బాధ్యత మీపై ఉంది. ఇది రిక్వెస్ట్ కాదు, డిమాండ్' అని సంజయ్ స్పష్టంచేశారు. హిందువుల ఆస్తి టీటీడీ, నామం పెట్టుకుని చర్చికి వెళితే ఉద్యోగమిస్తారా అని ఆయన ప్రశ్నించారు. అన్ని మతాల వారికీ ఉద్యోగాలు ఇవ్వడానికి టీటీడీ సత్రం కాదని చెప్పారు. ఇతర దేశస్థులకు కూడా మన దేశం, తెలుగు రాష్ట్రాలు సత్రాలుగా మారాయని బండి సంజయ్ అన్నారు.

భర్తను చంపిన కేసులో.. భార్య, ప్రియుడికి జీవిత ఖైదు

నరసరావుపేట లీగల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం నేపథ్యంలో 2023లో ప్రియుడితో కలిసి భర్తను హతమార్చిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితురాలు వినుకొండకు చెందిన శ్రీగిరి స్వాతి, పట్టేపురం మారుతిబాబులకు జీవిత ఖైదు పడింది. దీంతో పాటుగా రూ.10 వేల జరిమానా విధిస్తూ స్థానిక 13వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయాధికారి సత్యశ్రీ శుక్రవారం తీర్పు ఇచ్చారు. హత్యకు ఆరు సంవత్సరాల ముందు మృతుడు శ్రీగిరి కుమార్ (38)కు ప్రకాశం జిల్లా కురిచేడు మండలం బయ్యారం గ్రామానికి చెందిన స్వాతితో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. కుమార్ లారీ డ్రైవర్‌గా పనిచేసేవాడు. స్వాతి వినుకొండకు చెందిన మారుతి బాబు అనే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ నేపథ్యంలో దంపతుల మధ్య కలహాలు చోటుచేసుకున్నాయి. 2023 ఫిబ్రవరి 11వ తేదీ రాత్రి కుమార్ ఇంట్లో నిద్రిస్తుండగా స్వాతి తన ప్రియుడిని పిలిచి, ఇద్దరు కలిసి కలిసి అతని గొంతు పిసికి హత్య చేశారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపట్టారు.

విజిలెన్స్ విచారణ కోరినా.. బిల్లులు పాస్ చేయించుకునే ఎత్తుగడ!

- రెండు హాస్టల్స్‌కు రూ.60 లక్షలకు పైగా బిల్లులు పెట్టిన హెచ్ డబ్ల్యూవో
- ఆడిట్, జీఎస్టీ లేని బిల్లులు చెల్లించేందుకు సాంఘిక సంక్షేమ శాఖలో వ్యూహం

గుంటూరు (విద్య) జులై 11 (ఆంధ్రజ్యోతి): ఆ రెండు సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల హాస్టల్స్‌లో ఏనాడు విద్యార్థులకు సక్రమంగా భోజనం అందించిన దాఖలాలు లేవు.... ప్రభుత్వం నిర్దేశించిన మెనూ అమలు చేయకపోవడంతో విద్యార్థులు సమీపంలోని అన్న క్యాంటీన్లో భోజనం చేసి రోజులు గడిపిన సందర్భాలు ఉన్నాయి.. మరి కొంతమంది విద్యార్థులు ఇంటి వద్ద నుంచి రైస్ కుక్కర్లు తీసుకువచ్చి హాస్టల్లోనే భోజనం వండుకొని కర్రీ పాయింట్స్‌లో కూరలు తెచ్చుకొని తింటూ చదువుకున్నారు.... ఇటువంటి హాస్టల్స్‌లో మేస్ చార్జీలు, నిర్వహణ కోసం ఖర్చులంటూ సదరు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు ఇద్దరు 60 లక్షలు రూపాయలకు బిల్లులు పెట్టడంతో ఖంగుతినటం అధికారుల వంతయింది. మరోవైపు సదరు బిల్లులుపై ఇప్పటికే ఓ అధికారి విజిలెన్స్ విచారణ కోరినా పట్టించుకోకుండా బిల్లులు చెల్లింపునకు సాంఘిక సంక్షేమ శాఖలో రంగం సిద్ధం చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గుంటూరు నగరంపాలెంలో రెండు కళాశాల హాస్టల్స్ ఉన్నాయి. ఆయా హాస్టల్స్‌లో ఇంటర్ నుంచి డిగ్రీ పీజీ చదివే విద్యార్థిని విద్యార్థులు వసతి పొందుతూ చదువుకుంటున్నారు. ప్రభుత్వ నిర్దేశించిన మెనూ ప్రకారం ఇక్కడ ప్రతిరోజు విద్యార్థులకు ఉదయం అల్పాహారం రెండు పూటలా భోజనం అందించాలి. అయితే ఇక్కడ పనిచేసే హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు నిర్లక్ష్యం కారణంగా ఏనాడు విద్యార్థులు సక్రమంగా భోజనం చేసిన దాఖలాలు లేవు. దాదాపు 100 మంది వరకు విద్యార్థులు ఉంటే రెండు పెరుగు ప్యాకెట్లు తెప్పించడం అరకొరగా కూరగాయలు తెప్పించి వండి పెట్టేవాళ్ళు. ఈ రెండు హాస్టల్లో నిర్వహణ విషయమై అనేకసార్లు ఆరోపణలు రావడంతో సాక్షాత్తూ ఎఎస్‌డబ్ల్యూఓ అధికారి తనిఖీ చేశారు. ఆ సమయంలో కొంతమంది విద్యార్థులు అన్న క్యాంటీన్‌కి వెళ్లి భోజనం చేసి వస్తుండగా మరి కొంతమంది విద్యార్థులు హాస్టల్లోనే రైస్ కుక్కర్ పెట్టుకొని భోజనం వండుకొని తినడం గమనించారు. దీనిపై పూర్తిస్థాయిలో గతంలో పనిచేసిన సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌కు నివేదిక ఇచ్చిన సదరు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లపై చర్యలు మాత్రం తీసుకోలేదు. ఇదే విషయమై రాష్ట్రస్థాయిలో ఉన్నతాధికారులకు విద్యార్థి సంఘాలు ఫిర్యాదు చేశాయి.

హాస్టల్స్ సక్రమంగా నిర్వహించకుండా భారీగా ఖర్చు చేసినట్లు బిల్లులు పెట్టి వాటిని పాస్ చేయించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఒక్కో హాస్టల్లో రూ 30 లక్షలకు పైగా గత విద్యా సంవత్సరం ఖర్చుపెట్టినట్లు బిల్లులు తయారు చేశారు. సాధారణంగా ఇంత మొత్తం బిల్లులను చెల్లింపు కోసం పెట్టినప్పుడు కొన్ని నిబంధనలు పాటించాలని ఉద్యోగులు సూచిస్తున్నారు. సదురు బిల్లులను ఆడిట్ చేయించడం, కనీసం థర్డ్ పార్టీతో అయినా ఆడిట్ చేయించాలి. అయితే ఇవేమీ లేకుండా బిల్లులు పాస్ చేయించుకునేందుకు సదరు హెచ్‌డబ్ల్యూవోలు తీవ్రస్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు భారీ మొత్తంలో వచ్చిన బిల్లులు విజిలెన్స్ విచారణకు పంపాలని ఇక్కడ పనిచేసిన ఓ ఉన్నతాధికారి నివేదిక ఇచ్చారు. దీనిని కూడా పట్టించుకోకుండా బిల్లులు పాస్ చేయించుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అసలు చేసిన ఖర్చులు ఎంత? దానికి సంబంధించిన వాస్తవ బిల్లులు ఏమిటి? అనే విషయాలు క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా ఇంత మొత్తం బిల్లులు ఎలా పాస్ చేస్తారని విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

గతంలో ఈ రెండు హాస్టల్స్ నిర్వహణపై విద్యార్థి సంఘాలు ఆందోళన చేసి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాయి. అయినా సంబంధిత హెచ్‌డబ్ల్యూవోలపై చర్యలు తీసుకోలేదని సమాచారం. ఇదిలా ఉంటే ఈ హాస్టల్లో పని చేసే ఓ హెచ్‌డబ్ల్యూవోపై అనేక ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే ఆయన ఆరుసార్లు సస్పెండ్ అయ్యారు. మరోవైపు ఇద్దరు అధికారులు అతని ప్రవర్తనపై ఇచ్చిన నివేదికలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో సదరు హెచ్‌డబ్ల్యూవో పెట్టిన బిల్లుల్లో వాస్తవికత ఎంత అనేది పరిశీలించకుండా చెల్లింపులు ఎలా చేస్తారని సాంఘిక సంక్షేమ శాఖ లోని ఉద్యోగులే ప్రశ్నిస్తున్నారు. మరోవైపు ఈ బిల్లులు జీఎస్‌టీ చెల్లించిన బిల్లులు కూడా కాదని ఫిర్యాదులు ఉన్నాయి. ఇన్నీ రకాల ఆరోపణలు ఉన్న బిల్లులకు క్లియరెన్స్ ఎలా ఇస్తారో అధికారులకే తెలియాలి.

ఎరువుల కొరత రానీయొద్దు

- డీలర్లకు వ్యవసాయ శాఖ డైరెక్టర్ సూచన
- అనకాపల్లిలో రైల్వే గూడ్స్ ర్యాక్ పాయింట్ ఏర్పాటు
- డీలర్లకు ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తామన్న కంపెనీలు

అమరావతి, జూలై 11(ఆంధ్రజ్యోతి): రైల్వే గూడ్స్ ర్యాక్ పాయింట్ల నుంచి రిటైల్ వ్యాపారులకు నేరుగా ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తామని ఎరువుల కంపెనీలు ప్రకటించాయని వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీరావు తెలిపారు. దీనివల్ల రిటైల్ వ్యాపారులకు రవాణా ఖర్చు తగ్గుతుందన్నారు. మంగళగిరిలోని వ్యవసాయ శాఖ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఎరువుల తయారీదారులు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు, అధికారుల సమావేశం జరిగింది. రవాణా ఖర్చులు, ఇతర సమస్యలపై వీరి మధ్య చర్చలు జరిగాయి. రైతులకు అవసరమైన ఎరువులు సరఫరా చేస్తామని, డీలర్లకు నేరుగా ఉచిత రవాణా కల్పిస్తామని కంపెనీల ప్రతినిధులు హామీ ఇచ్చారు. డిల్లీరావు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆదేశాలతో అనకాపల్లి, మదనపల్లి, హిందూపురంలో రైల్వే గూడ్స్ ర్యాక్ పాయింట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపగా, అనకాపల్లికి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని,. మిగతా వాటికి త్వరలో అనుమతులు వస్తాయని చెప్పారు. ఎక్కడైనా ఎరువుల కొరత ఉందని డీలర్లు తెలిపితే.. వెంటనే తగిన ఏర్పాట్లు చేస్తామన్నారు. అవసరానికి మించి యూరియా వాడితే భూ సాంద్రత దెబ్బ తింటుందని, దీనిపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో అదనపు డైరెక్టర్లు విజయలక్ష్మి, కృపాదాస్, రాష్ట్ర ఎరువుల రిటైల్ డీలర్ల సంఘ అధ్యక్షుడు నాగిరెడ్డి, హోల్‌సేల్ వ్యాపారుల సంఘ అధ్యక్షుడు నానాజీ, కోరమండల్ కంపెనీ జీఎం సచ్చిదానందరెడ్డి, 14 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

గడువు ముగిసినందుకే కొత్త టెండరు

- మందుల కొనుగోలుపై పశు సంవర్ధక శాఖ

అమరావతి, జూలై 11(ఆంధ్రజ్యోతి): పశువుల మందుల కొనుగోలుకు సంబంధించి పాత టెండరు గడువు ముగిసినందున కొత్త టెండరు ప్రక్రియ చేపట్టినట్లు పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ దామోదర్‌నాయుడు శుక్రవారం తెలిపారు. పారదర్శకత కోసమే ఓపెన్ టెండర్ విధానాన్ని పాటిస్తున్నామని, దీని వల్ల మేలైన కంపెనీలు ప్రక్రియలో పాల్గొంటాయన్నారు. అన్ని తనిఖీలు చేశాకే పశువుల మందులు ఎంపిక చేస్తారని స్పష్టంచేశారు. ఎంఎస్ఎంఈ పాలసీకి అనుగుణంగా పరిశ్రమలను ప్రోత్సహించడానికి టెండరు నిబంధనల్లో మార్పులు చేశామన్నారు.

పీజీ సీట్ల నిధులు 'నాడు-నేడు'కా?

- వైద్య పరికరాలకు రెండుసార్లు బిల్లులా..?
- తక్షణమే నివేదిక ఇవ్వండి
- ఆరోగ్య శాఖ అధికారులకు మంత్రి సత్యకుమార్ ఆదేశం

అమరావతి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో అమలైన 'నాడు-నేడు' పథకం కింద ఇప్పటికీ కొన్ని వైద్య పరికరాలు కొనుగోలు చేయడం, వాటికి పీజీ సీట్ల నిధుల నుంచి బిల్లులు చెల్లించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అసలు ఆరోగ్య శాఖలో ఏం జరుగుతోందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. 'నాడు-నేడు' పనులకు పీజీ సీట్ల నిధులు మళ్లించడం.. అనంతపురం ప్రభుత్వాసుపత్రులో ఒకే రకమైన వైద్య పరికరాలు రెండుసార్లు కొనుగోలు చేసి, వాటికి రెండుసార్లు బిల్లులు చెల్లించాలని అధికారులు సిద్ధం కావడంపై శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 'నేడూ మారని నాడు' శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఈ మొత్తం వ్యవహారంపై ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ స్పందించారు. ఆంధ్రజ్యోతి కథనంపై వాస్తవ నివేదిక ఇవ్వాలని ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. కాగా.. వైద్య పరికరాల కొనగోళ్ల పేరుతో ఆధికారులు భారీగా అవినీతికి పాల్పడుతున్నారని గత నెల 22వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో 'కొనుగోళ్లలో కాసుల వర్షం' శీర్షికన కథనం ప్రచురితమైంది. అప్పుడు కూడా అనంతపురంలో రెండుసార్లు వైద్య పరికరాల కొనుగోలు గురించి తెలియజేసింది. ఆ రోజు కూడా మంత్రి అధికారులను నివేదిక కోరారు. కానీ ఇప్పటివరకూ వారు ఎలాంటి నివేదికా సమర్పించలేదు. ఇప్పడైనా అధికారులు వాస్తవాలతో కూడిన నివేదిక ఇస్తారో.. లేక తప్పించుకునే ప్రయత్నం చేస్తారో చూడాలి.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

తాలిబాన్ పక్షాన..!

అఫ్ఘానిస్థాన్‌లో తాలిబాన్ పాలనను తప్పుబడుతూ, దాని నిరంకుశ విధానాలూ అణచివేతలూ వివక్షలూ వదులుకోవాల్సిందిగా ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభలో ప్రవేశపెట్టిన తీర్మానంమీద ఇటీవల సభ్యదేశాలు ఓటుచేశాయి. 116దేశాలు సమర్థిస్తే, అంటే తాలిబాన్‌కు వ్యతిరేకంగా నిర్ద్వంద్వంగా నిలబడితే, 12దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉంటే, రెండు దేశాలు తీర్మానానికి వ్యతిరేకంగా ఓటేశాయి. అంటే, అఫ్ఘానిస్థాన్‌లో అణచివేతలూ, వివక్షలూ ఉన్నాయని ఇవి ఒప్పుకోలేదని అనుకోవాలి. మహిళల పట్ల అమానవీయంగా వ్యవహరించవద్దని, సర్వవివక్షలనూ పక్కనబెట్టి సమ్మిళితంగా వ్యవహరించాలన్న ఆ తీర్మానం వీటికి నచ్చలేదని అర్థం. ఆ రెండుదేశాలు అమెరికా, ఇజ్రాయెల్. ఇక, ఓటింగ్‌కు దూరంగా ఉండిపోయిన పన్నెండుదేశాల్లో భారత్ కూడా ఒకటి. తాలిబాన్‌కు వ్యతిరేకంగా ఓటుచేసిన దేశాల్లో ప్రధానంగా చెప్పుకోవాల్సింది పాకిస్థాన్.

వ్యూహాత్మక ఎత్తుగడగానో, స్పష్టత వద్దనుకున్నప్పుడో దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉండిపోతాయి. అయితే, ఆ ఎత్తుగడలోనూ, అస్పష్టతలోనూ ఆయాదేశాలు తమ సందేశాన్ని ఇస్తూనే ఉంటాయి. ఓటింగ్‌లో పాల్గొన్న దేశాలన్నింటిలోనూ ఓ పద్నాలుగు మినహా మిగతా నూటపదహారూ తాలిబాన్‌కు వ్యతిరేకంగా ఓటుచేసిన ఈ సందర్భంలో ఎవరెటు అన్నదే కాదు, ఎందుకు అన్నది కూడా మరింత స్పష్టంగా కనిపిస్తుంది. ఈ సర్వప్రతినిధి సభ తీర్మానానికి పెద్ద విలువేమీ లేదనీ, ఎలాగూ అత్యధికదేశాలు తాలిబాన్‌కు వ్యతిరేకంగా ఓటేసి, భారీ మెజారిటీతో దానిని నెగ్గించాయి కదా అనుకున్నా ఏ గట్టున ఎవరున్నారన్నది ముఖ్యమే. సెప్టెంబరు 11 దాడుల తరువాత, అఫ్ఘానిస్థాన్‌లో తాలిబాన్‌లకు వ్యతిరేకంగా అమెరికా అతిపెద్ద, సుదీర్ఘకాల యుద్ధం చేసింది. ఇస్లామిక్ తీవ్రవాదానికి అడ్డాగా మారిన అఫ్ఘానిస్థాన్‌నుంచి తాలిబాన్‌లను తరిమికొట్టి, తానుమెచ్చినవారిని కూచోబెట్టింది. తన బలగాలను అక్కడే ఉంచి, సరిహద్దుల్లో కాచుకుకూచున్న తాలిబాన్‌లతో పోరాడటానికి వీలుగా అక్కడి ప్రభుత్వ సైన్యాలకు శిక్షణ ఇచ్చింది. రెండుదశాబ్దాల అనంతరం అమెరికా తన సైన్యాలను ఉపసంహరించుకొని, తాలిబాన్ పునరాగమానికి మార్గం సుగమం చేసింది. అమెరికా సైన్యాలు పూర్తిగా తరలకముందే తాలిబాన్‌లు దేశాన్ని సునాయాసంగా కైవసం చేసుకున్నారు. అల్లా దయవల్ల తన పొరుగుదేశం తాలిబాన్‌ల చేతిలోకి వచ్చిందంటూ పాక్ మాజీ పాలకుడు ఇమ్రాన్‌ఖాన్ ఎంతో సంతోషించారు కానీ, తాలిబాన్‌ను గుప్పిట్లో పెట్టుకొని భారత్‌ను ఆడించవచ్చునన్న పాక్ పాలకుల కలలు అనతికాలంలోనే కల్లలైనాయి. సరిహద్దు ఉగ్రవాదంతో సహా అఫ్ఘాన్ నుంచి చాలా సమస్యలు ఎదురవుతూండటంతో తాలిబాన్ ఇప్పుడు దానికి శత్రువైంది.

అమెరికా వ్యతిరేక శక్తులకు ఆశ్రయం ఇవ్వబోనన్న హామీకి కట్టుబడివున్నంతకాలం తాలిబాన్‌తో ట్రంప్‌కు సమస్య ఉండదు. అఫ్ఘాన్‌లో వదిలిపోయిన ఆయుధాలను కూడా వెనక్కు ఇమ్మని అమెరికా గట్టిగా అడగడం లేదు. ఇరాన్‌తో ఘర్షణలు పెరుగుతున్న తరుణంలో, రాబోయే రోజుల్లో చైనాతో కయ్యం తప్పనిస్థితిలో అఫ్ఘానిస్థాన్ మరింత అవసరం. కాబూల్‌కు ఉత్తరదిక్కున ఉన్న అతిపెద్ద, అతికీలకమైన బగ్రామ్ ఎయిర్‌బేస్‌ను అమెరికాకు ఇచ్చేందుకు తాలిబాన్ ఒప్పుకున్నట్టుగా వార్తలు వస్తున్నాయి. జో బైడెన్ విధించిన ఆంక్షలను కూడా సడలించి తాలిబాన్‌లతో సయోధ్య పెంచుకుంటున్న ట్రంప్ ఇప్పుడు ఐక్యరాజ్యసమితిలోనే తాలిబాన్లను వెనకేసుకొచ్చారు.

ముప్పయేళ్ళక్రితం అఫ్ఘానిస్థాన్‌లో తాలిబాన్ అడుగుపెట్టింది మొదలు, దానిని అమెరికా తరిమికొట్టేవరకూ భారత్ చాలా సమస్యలూ ఉగ్రదాడులు ఎదుర్కొంది. అఫ్ఘాన్‌లో తాలిబాన్ వ్యతిరేక కూటమివైపు నిలబడింది కూడా. నాలుగేళ్ళక్రితం మలిరాకడలో తాలిబాన్ భారత్ వ్యతిరేక వైఖరిని పూర్తిగా వదులుకుంది. అఫ్ఘానిస్థాన్‌నుంచి భారత్‌మీద ఈగవాల నివ్వబోమని హామీ ఇచ్చింది. భారత్ సాయాన్నీ, పెట్టుబడులనూ కోరింది. అఫ్ఘాన్ పూర్వవిద్యార్థి ఒకరిని దౌత్యవ్యవహర్తగా గుర్తించడంతో మొదలై భారత అధికారులూ, మంత్రుల పర్యటనలతో సంబంధాలు మరింత బలపడ్డాయి. ఒకప్పుడు పాక్‌పక్కన ఉండి, భారతవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన తాలిబాన్ ఇటీవలి పహల్గాం ఉగ్రదాడిని నిర్ద్వంద్వంగా ఖండించడం గతంలో ఏమాత్రం ఊహకు అందనిది. పాకిస్థాన్ శత్రువు మనకు మిత్రుడు కావడంలో ఆశ్చర్యమేమీ లేదు కానీ, మన వ్యూహాత్మక, దౌత్య ప్రయోజనాలకోసం తాలిబాన్ దుశ్చర్యలను గుడ్డిగా సమర్థించాల్సిన అవసరమేమీ లేదు. పరిస్థితులు ఎల్లవేళలా ఒకేరీతిలో, అనుకూలంగానే ఉంటాయన్న నమ్మకమేమీ లేదు.

ప్రైవేట్ సంస్థలకే 'నిర్మాణ' బాధ్యతలు

భారత్‌-ఇంగ్లాండ్ మధ్య క్రికెట్ మ్యాచ్‌లు ఆసక్తితో చూస్తుండగా ప్రముఖ సిమెంట్ కంపెనీ వాణిజ్య ప్రకటన ట్యాగ్‌లైన్ ఒకటి నన్ను విశేషంగా ఆకర్షించింది. అదిలా ఉంది: 'As India Builds, India Grows'. ఇది నూటికి నూరుపాళ్ల సత్యం. అవును, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆర్థిక వ్యవస్థ విస్తరణ మధ్య బలమైన సానుకూల సంబంధముంటుంది. రోడ్లు, వంతెనలు, రైల్వేలు, విమానాశ్రయాలు, పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, కార్యాలయాలు మొదలైన వాటికి భవనాలు నిర్మించాలి. ఈ సామాజిక, సామూహిక సదుపాయాలను సమృద్ధిగా నిర్మించుకున్నప్పుడే ఆర్థిక వ్యవస్థ విస్తరణ సాధ్యమవుతుంది. ఈ మౌలిక సదుపాయాలను మనం సత్వరమే అభివృద్ధిపరచుకోవాలి. అయితే వాటిని ఎలా నిర్మించుకోవాలో మనం తెలుసుకుని తీరాలి.




■ పి. చిదంబరం

'పళని' పలుకు

జవహర్‌లాల్ నెహ్రూ ఒక గొప్ప నిర్మాత. ఆయనను ద్వేషించేవారు చేస్తున్న విమర్శలు నయా పైసా విలువ లేనివి. 1947లో మన దేశ జనాభా 34 కోట్లు. అక్షరాస్యత రేటు కేవలం 12 శాతం. తన 17 ఏళ్ల ప్రధానమంత్రిత్వ కాలంలో నెహ్రూ ఎన్నో పాఠశాలలు, కళాశాలలు నిర్మించారు. ఐఐటీలు, ఐఐఎమ్‌లు, ఉక్కు కర్మాగారాలు, ఐఓసీ, ఓఎన్‌జీసీ, ఎన్ఎల్‌సీ, హెచ్ఏఎల్, బీహెచ్ఈఎల్, ఇస్రో, భాక్రానంగల్, హీరాకుడ్, దామోదర్ వ్యాలీ, ఇంకా ఎన్నో సమున్నత సంస్థలు, బహుళార్థ సాధక ప్రాజెక్టులు, పారిశ్రామిక సంస్థలకు ఆయనే అంకురార్పణ చేశారు, నిర్మించి అభివృద్ధి పరిచారు. ఇదంతా జరిగింది స్వాతంత్ర్య తొలి సంవత్సరాలలోను, అదీనూ విద్యా వ్యాప్తి చాలా తక్కువగా ఉన్న, సాంకేతికతలు అందుబాటులో లేని, మానవ వనరులకు నైపుణ్యాలు కొరవడిన కాలంలో అన్న వాస్తవాన్ని విస్మరించకపోతే నెహ్రూ నిర్మాణ సామర్థ్యం ఎంత మహోన్నతమైనదో అర్థమవుతుంది. నెహ్రూ నిర్మించినవి ఈ నాటికీ ఉన్నాయి, జాతి పురోగతికి అద్వితీయంగా దోహదం చేస్తున్నాయి. నెహ్రూ భారత్‌కు ఆర్థిక వనరులు తక్కువగా ఉండవచ్చునేమో కానీ, చిత్తశుద్ధి, అంకిత స్వభావం, ప్రతిభా పాటవాలు ఉన్న మానవవనరులు సమృద్ధిగా ఉన్నాయి.

క్రీస్తుశకం రెండవ శతాబ్దిలో చోళ చక్రవర్తి కావేరీ నదిపై గొప్ప ఆనకట్ట నిర్మించాడు. ప్రపంచంలో అత్యంత పురాతన ఆనకట్టలలో అదొకటి. నేటికీ ఉపయోగంలో ఉన్నది. వేలాది ఎకరాలకు సాగునీటి సదుపాయాన్ని కల్పిస్తున్నది. అంతకంటే ముఖ్యంగా వరదల నియంత్రణకు ఇతోధికంగా తోడ్పడుతోంది.

భారత్ నేటికీ ప్రతి రోజూ ఈ మహా నిర్మాణ కార్యకలాపాలను కొనసాగిస్తూనే ఉన్నది. అయితే ప్రైవేట్ రంగంలో నిర్మాణాల, ప్రభుత్వ రంగంలో నిర్మాణాల నాణ్యత, మన్నిక మధ్య ఎంత వ్యత్యాసమున్నదో ప్రతి పౌరుడికీ బాగా తెలుసు. ఈ రెండు విధాల నిర్మాణ కార్యకలాపాలలోనూ కాంట్రాక్టర్లు పాల్గొంటున్నారు. అయితే వారు ప్రవర్తిస్తున్న తీరుతెన్నులు వేర్వేరుగా ఉంటున్నాయి. నిర్మాణ ప్రక్రియలూ భిన్నమైనవి.



టెలీకమ్యూనికేషన్స్, విద్యుత్ పంపిణీ, రవాణారంగం, మైనింగ్, చమురు, సహజవాయువు అన్వేషణ తదితర రంగాలలో ప్రైవేటీకరణ పరిస్థితులను మెరుగుపరిచింది. నాణ్యమైన సేవలను అందించేందుకు దోహదం చేసింది. ప్రభుత్వ రంగ నిర్మాణ కార్యకలాపాలలోనూ అదే బాటను అనుసరించడం ఉత్తమం. సామూహిక, సామాజిక సదుపాయాల నిర్మాణంలో ఆరోగ్యకరమైన పోటీతో ప్రైవేట్ సంస్థలకు మరింత పాత్ర కల్పించడమే అన్ని విధాల శ్రేయస్కరం.

ప్రజల ధనంతో ప్రభుత్వ రంగంలో జరుగుతున్న నిర్మాణ కార్యకలాపాల తీరుతెన్నులను పరిశీలిద్దాం. ప్రైవేట్ నిర్మాణ కార్యకలాపాల నాణ్యత ఎంపిక చేసుకున్న ఆర్కిటెక్ట్, నియమించుకున్న కాంట్రాక్టర్, నిధుల లభ్యతపై ఆధారపడి భిన్నంగా ఉంటుంది. ప్రభుత్వ నిర్మాణ కార్యకలాపాలు, మరీ ముఖ్యంగా జాతీయ ప్రాధాన్యమున్న ప్రాజెక్టులకు భూమి, నిధుల పరంగా అవరోధాలు ఉండవు. అయితే మనం చూస్తున్నదేమిటి? హైవేలు, కొత్త రోడ్లు నిర్మాణమయి అవగానే కుంగిపోతున్నాయి. మురుగునీటిని తీసుకువెళ్లే కాలవలు లేదా గొట్టాలు పగిలిపోయి రోడ్లపై మురుగునీరు వెల్లువెత్తుతోంది. దేశ రాజధానిలోని అశోకా రోడ్డులో గత 18 నెలల్లో మురుగునీటి గొట్టాలు పగిలిపోవడం, రోడ్డు కుంగిపోవడం మూడుసార్లు సంభవించింది. రోడ్లు గుంతలమయమైపోతున్నాయి. ఆ బాటల్లో ప్రయాణిస్తున్న వాహనాలు ఆ గుంతల్లో పడిపోతున్నాయి. గ్వాలియర్‌లో రూ. 18 కోట్ల వ్యయంతో నిర్మాణమైన ఒక రోడ్డు 15 రోజులలోనే కుంగిపోయింది. గుజరాత్‌లోని మోర్బిలో మరమ్మతు నిర్వహించి వాహనాల రాకపోకలకు పునఃప్రారంభించిన ఒక వంతెన నాలుగు రోజులలోనే కూలిపోవడంతో 141 మంది మరణించారు. సరైన అర్హతలులేని కంపెనీకి ఆ వంతెన మరమ్మతు, పునరుద్ధరణ పనులను అప్పగించినట్టు విచారణలో వెల్లడయింది. సదరు కాంట్రాక్టర్ నాసిరకం సామగ్రిని ఉపయోగించడం వల్లే వంతెన కూలిపోవడం జరిగింది. బిహార్‌లో వంతెనలు నిర్మాణంలో ఉన్నప్పుడో లేదా నిర్మాణమైన వెంటనే కూలిపోతేనో ఆశ్చర్యపోయేవాళ్లు ఎవరూ ఉండరు సుమా! ఒక వంతెన అయితే నిర్మాణంలో ఉండగానే మూడుసార్లు కూలిపోయింది!

ఎంత సమయం, మరెంత ధనం వృథా! ఇందుకు పలు కారణాలు ఉన్నాయి. మొట్టమొదటి కారణం జవాబుదారీతనం పూర్తిగా లోపించడమే. ఒక వినాశనకర ప్రాజెక్టుకు పలువురు అధికారులు బాధ్యులయితే అంతిమంగా ఆ నష్టానికి ఏ ఒక్కరూ జవాబుదారీ కాదు అన్న రీతిలో పరిస్థితులు ఉన్నాయి. ఈ కారణంగా ప్రతి ఒక్కరూ బాధ్యతారహితంగా వ్యవహరించడం సాధారణమైపోయింది. రాజకీయ అవినీతి గురించి ప్రత్యేకంగా చెప్పేదేముంది? అపరిమిత ఆర్థిక లబ్ధిని సమకూర్చే మంత్రిత్వశాఖల విషయమై మంత్రుల మధ్య తీవ్ర పోటీ ఉంటోంది. చాలా రాష్ట్రాలలో 'రేట్ కార్డ్' ఉన్నది. ప్రాజెక్టులను అధ్వానంగా అమలుపరచడంలో కొన్ని విభాగాలు/ఏజెన్సీలు అప్రతిష్ఠను మూటకట్టుకుంటున్నాయి. ఈ విషయంలో పీడబ్ల్యూడీలు అగ్రగామిగా ఉన్నాయి. తక్కువ వ్యయ గృహ నిర్మాణాలు చేసే (ఇవి నిజానికి కాంక్రీట్ మురికివాడలు) డీడీఏ మొదలైన వాటి తీరుతెన్నులు కూడా ప్రశస్తంగా ఉండడం లేదు. హైవేస్, రైల్వేస్ పని తీరుకూడా ఇదే రీతిలో అధ్వానంగా ఉంటోంది.

ప్రభుత్వ రంగంలో నిర్మాణ కార్యకలాపాలు సమర్థంగా, ప్రజోపయోగకరంగా లేకపోవడమనేది ఒక క్లిష్ట సమస్య. అపరిష్కృతంగా కొనసాగుతున్న ఒక చిక్కుముడి. సాహసోపేతంగా అసాధారణ చర్యలు చేపట్టినప్పుడే అది పరిష్కారమవుతుంది. ఇందుకు సామాజిక, సామూహిక సదుపాయల నిర్మాణంలో ప్రభుత్వ ఏజెన్సీల ప్రమేయాన్ని దశల వారీగా తొలగించాల్సి ఉన్నది. ఇటువంటి 'సంస్కరణల'కు గతంలో ప్రయత్నాలు జరిగాయి, విఫలమయ్యాయి. మరోసారి అటువంటి సంస్కరణలకు ప్రయత్నించినా మళ్లీ విఫలమవడం ఖాయం. మార్గాంతరమేమిటి? టెలీకమ్యూనికేషన్స్, విద్యుత్ పంపిణీ, రవాణారంగం, మైనింగ్, చమురు, సహజవాయువు అన్వేషణ తదితర రంగాలలో ప్రైవేటీకరణ పరిస్థితులను మెరుగుపరిచింది. నాణ్యమైన సేవలను అందించేందుకు దోహదం చేసింది. ప్రభుత్వ రంగంలో నిర్మాణ కార్యకలాపాలలోనూ అదే బాటను అనుసరించడం ఉత్తమం. తొలుత వ్యయాలు పెరగవచ్చు, నిర్మాణ సంస్థలు ఒక కూటమిగా ఏర్పడడమూ జరుగుతుంది, సందేహం లేదు. అయితే లొసుగులు, లోపాలు సరిదిద్దుతూ సామూహిక, సామాజిక సదుపాయాల నిర్మాణంలో ఆరోగ్యకరమైన పోటీతో ప్రైవేట్ సంస్థలకు మరింత పాత్ర కల్పించడమే అన్ని విధాల శ్రేయస్కరం.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

మూర్తీభవించిన మానవతే మెహెరలీ

'ప్రపంచ నగరం'గా పరిగణన పొందేందుకు ఒక నగరానికి ఉండవలసిన ప్రమాణాలు ఏమిటి? అవేమిటో నిర్ణయిస్తూ 2006లో నేను (ఇప్పుడు ఆగిపోయిన) ఒక పత్రికలో వ్యాసం రాశాను. 'ప్రపంచ నగరం' అనే ప్రతిపత్తిని కల్పించే అర్హతలు: నగరం చాలా పెద్దదిగా ఉండాలి; దానికి చారిత్రక గంభీరత ఉండాలి; నిత్యం అభివృద్ధి చెందుతున్న సాంస్కృతిక జీవనం ఉండాలి; భాష, మత, సామాజిక వైవిధ్యం అపారంగా ఉండాలి; జాతి పురోగతికి దోహదం చేసే ఒక ఆర్థిక శక్తి కేంద్రంగా ఉండాలి. ఈ ప్రమాణాల ఆధారంగా చూస్తే ప్రపంచంలో మూడే మూడు ప్రపంచ నగరాలు ఉన్నాయి. అవి: లండన్, న్యూయార్క్, ముంబై.

న్యూయార్క్ మేయర్ పదవికి పోటీపడుతున్న జోహ్రాన్ మమ్దానీ గురించి చదివినప్పుడు నాకు నా పాత వ్యాసం గుర్తుకు వచ్చింది. క్రైస్తవులు అత్యధికంగా ఉన్న లండన్ ఇప్పటికే ఒక ముస్లిం మేయర్‌ను ఎన్నుకున్నది. క్రైస్తవులు, యూదులతో పాటు నాస్తికులు గణనీయంగా ఉన్న న్యూయార్క్ సైతం త్వరలో ఒక అన్యమతస్థుడిని మేయర్‌గా ఎన్నుకోనున్నదా? ఈ ప్రశ్న గురించి తర్కిస్తూ ఉంటే మన మూడో ప్రపంచ నగరం ముంబై దశాబ్దాల క్రితమే ఆరుగురు ముస్లిం మేయర్లను ఎన్నుకున్నదన్న విషయం గుర్తుకు వచ్చింది. ఈ ఆరుగురిలో మొదటివారు 1934లోను, చివరివారు 1963లోను ఎన్నికయ్యారు.

ముంబై మేయర్లుగా ఎన్నికైన ఆ ఆరుగురిలో ఒకరిని జ్ఞాపకం చేసుకోవడమే ఈ కాలమ్ లక్ష్యం. ఆ వ్యక్తి ఆ పదవిలో స్వల్పకాలం మాత్రమే ఉన్నారు. అదే ఆయన ఏకైక ప్రత్యేకత గానీ, ప్రధాన విశిష్టత గానీ ఎంతమాత్రం కాదు. ఆయన పేరు యూసఫ్ మెహెరలీ. 75 సంవత్సరాల క్రితం ఇదే నెలలో ఆయన కీర్తిశేషుడు కావడం కూడా ఈ కాలమ్‌కు ప్రేరణ అయిన కారణాలలో ఒకటి. బాంబేలో 1903లో జన్మించిన మెహెరలీ ఆ నగరంలోనే పాఠశాల, కళాశాల విద్యాభ్యాసం చేశారు. విద్యార్థి దశలోనే మంచి వక్తగా పేరు పొందారు. న్యాయశాస్త్రంలో పట్టా పొందినప్పటికీ రాజకీయ భావాలు, అభిప్రాయాల కారణంగా న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసేందుకు అవసరమైన లైసెన్స్‌ను ఆయనకు నిరాకరించారు. విద్యాభ్యాసం ముగిసిన తరువాత స్వాతంత్ర్య సమరంలో చురుగ్గా పాల్గొన్నారు. 1928లో అందరూ శ్వేతజాతీయులే ఉన్న సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా తీవ్రంగా ఉద్యమించారు. రెండేళ్ల తరువాత ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలుకు వెళ్లారు. 1934లో జాతీయ కాంగ్రెస్‌లో భాగంగా కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ ఏర్పడినప్పుడు సామ్యవాద ఆలోచనా స్పష్టత, పార్టీ సిద్ధాంతాలను ప్రజలలోకి ప్రభావశీలంగా తీసుకువెళ్లగల నాయకుడుగా మెహెరలీ పేరు పొందారు. కార్మిక హక్కులను కాపాడే విషయంలో ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపారు. అలాగే ఆసియా, ఆఫ్రికా దేశాలలో ప్రబలమవుతున్న వలసపాలన వ్యతిరేక ఉద్యమాలలో కూడా విశేష శ్రద్ధ చూపారు.

1930వ దశకంలో మెహెరలీ అవిరామంగా ఆసేతు హిమాచలం పర్యటిస్తూ సమాజంలోని అట్టడుగు వర్గాల వారిలో కూడా సోషలిస్టు సిద్ధాంతాలను ప్రభావదాయకంగా ప్రచారం చేశారు. అదే కాలంలో ఆయన ఐరోపా, అమెరికాలలో విస్తృతంగా పర్యటించి ఆయా దేశాలలోని డెమొక్రాటిక్ సోషలిస్టు పార్టీలు, నాయకులతో విస్తృత సంబంధాలు నెలకొల్పుకున్నారు.



లండన్ ప్రజలు ఇప్పటికే ఒక ముస్లిం మతస్థుడిని మేయర్‌గా ఎన్నుకున్నారు. న్యూయార్క్ ఓటర్లూ వచ్చే నవంబర్‌లో జరగనున్న ఎన్నికలలో జోహ్రాన్ మమ్దానీ వైపే మొగ్గుచూపవచ్చు. మన ముంబై దశాబ్దాల క్రితమే ఆరుగురు ముస్లిం మేయర్లను వరుసగా ఎన్నుకున్నది. స్వాతంత్ర్య సమరయోధుడు, సోషలిస్టు నేత, సైమన్ గో బ్యాక్ నినాద స్రష్ట యూసఫ్ మెహెరలీ వారిలో ఒకరు. తన నగర ఘనతను, దేశ ప్రతిష్ఠను నిజంగా సమున్నతం చేసిన ఆ దేశ భక్తుడి వంటి ఒక మేయర్‌ను ముంబై మళ్లీ ఎప్పుడు ఎన్నుకుంటుంది?

ఏప్రిల్ 1942లో బాంబే మేయర్‌గా యూసఫ్ మెహెరలీ ఎన్నికయ్యారు. అదే ఏడాది ఆగస్టులో క్విట్ ఇండియా ఉద్యమాన్ని గాంధీ ప్రారంభించారు. బాంబేలో జరగనున్న ఏఐసీసీ సమావేశంలో పాల్గొనేందుకు గాంధీ రైలులో నగరానికి వచ్చినప్పుడు ఆయనకు మేయర్‌గా మెహెరలీ స్వాగతం పలికారు. ఆ ఏఐసీసీ సమావేశంలోనే చరిత్రాత్మక క్విట్ ఇండియా తీర్మానాన్ని ఆమోదించారు. క్విట్ ఇండియా నినాదాన్ని సృష్టించింది మెహెరలీయేనన్న ఐతిహ్యం ఒకటి ఉన్నది. అయితే ఇది ఆయనకు తప్పుగా ఆపాదించింది కావచ్చేమో?! ఒకటి మాత్రం స్పష్టం: 1928లో 'గో బ్యాక్ సైమన్' అన్న నినాదాన్ని ఇచ్చింది మెహెరలీయే. ఆ స్ఫూర్తిదాయక నినాదం ఆనాడే కాదు ఇప్పుడు కూడా భారతీయుల హృదయాలలో ప్రతిధ్వనిస్తూనే ఉన్నది. క్విట్ ఇండియా నినాదాన్ని ఇచ్చింది మెహెరలీయేనని మధు దండావతే తాను రాసిన 'మెహెరలీ జీవిత చరిత్ర'లో ప్రస్తావించలేదు. మహాత్మా గాంధీ ఆశీస్సులతో 1942 ఆగస్టు విప్లవం సందర్భంగా మెహెరలీ ఆధ్వర్యంలోని పద్మా పబ్లికేషన్స్ అనే సంస్థ 'క్విట్ ఇండియా' అనే శీర్షికతో ఒక చిన్న పుస్తకాన్ని తీసుకు వచ్చిందని మాత్రమే మధు దండావతే పేర్కొన్నారు.



■ రామచంద్ర గుహ

గతానుగతం

యూసఫ్ మెహెరలీ గురించి నేను తొలుత 1980ల తొలినాళ్లలో ఒక స్నేహితుడి ద్వారా విన్నాను. కొన్ని సంవత్సరాల అనంతరం న్యూయార్క్‌లోని ఒక బుక్ షాప్‌లో అమెరికన్ జర్నలిస్ట్, చరిత్రకారుడు బెర్ట్రామ్ డి. ఉల్ఫె వ్యాస సంపుటి 'Strange Communists I Have Known' కొన్నాను. ఆ పుస్తకంలో మెహెరలీపై ఒక వ్యాసం ఉన్నది. ఆ వ్యాస శీర్షిక 'గాంధీ వెర్సెస్ లెనిన్'. చమత్కారంగా ఉన్న ఆ శీర్షిక వెన్వెంటనే చదివేలా ఆసక్తి రేకెత్తించింది.

మెహెరలీ 1930ల నడిమి సంవత్సరాలలో మొదటిసారి అమెరికా వెళ్లినప్పుడు ఆయనకు ఉల్ఫె పరిచయమయ్యాడు. ఆ పరిచయం స్నేహంగా వర్ధిల్లింది. మెహెరలీతో పరిచయం లేనప్పుడు ఉల్ఫెకు తెలిసిన వామపక్షవాదులు అమెరికన్ కమ్యూనిస్టులు మాత్రమే. సోవియట్ నియంతలు లెనిన్, స్టాలిన్‌లకు వారు విధేయులు. ఒక మంచి లక్ష్యాన్ని సాధించేందుకు ఎటువంటి అనైతిక మార్గాలనైనా అనుసరించవచ్చని విశ్వసించేవారు. మెహెరలీ సోషలిస్టు విశ్వాసాలలోని దయా స్వభావం, మానవతా దృష్టి ఉల్ఫెను విశేషంగా ఆకట్టుకున్నాయి. 'గాంధీ ప్రభావం వల్లే కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ కమ్యూనిస్టుల అనైతిక పద్ధతులకు మెహెరలీ దూరంగా ఉండగలిగారని ఉల్ఫె అర్థం చేసుకున్నాడు.

మెహెరలీ గురించి ఆనందప్రదమైన కథనొకదాన్ని ఉల్ఫె చెప్పారు. ఆయన తన భారతీయ మిత్రుడిని కేప్‌కాడ్‌కు తీసుకువెళ్లారు. అట్లాంటిక్ మహాసముద్ర జలాలు మసాచుసెట్స్ బే జలాలు సంగమించే ప్రదేశమది. మెహెరలీ కారు దిగి చెప్పులు విడిచి ఆ సంగమ స్థలి జలాల్లోకి నడుచుకు వెళ్లారు. ఆ సంగమ జలాల్లో కొంత సేపు ధ్యానమగ్నుడై ఉండి తిరిగి వెనక్కి వచ్చారు. 'అప్పుడు ఆయన మోములో అనిర్వచనీయమైన ఆనందానుభూతిని గమనించాను. మెహెరలీ అంత సంతోషంగా ఉండడం నేను అంతకు ముందు ఎప్పుడూ చూడలేదు' అని ఉల్ఫె గుర్తు చేసుకున్నారు. 'నదుల సంగమమైనా, సాగరాల కూడలి అయినా, కాలవల కలయిక అయినా... జలాల సంగమ ప్రదేశాన్ని మహాపవిత్రమైన స్థలంగా మా భారతీయులు విశ్వసిస్తారు' మెహెరలీ తన అమెరికన్ స్నేహితుడికి వివరించారు.

మెహెరలీ మొదటిసారి అమెరికాను సందర్శించినప్పుడు బ్రిటిష్ వలసపాలన దుర్మార్గాల పట్ల ధర్మాగ్రహాన్ని వ్యక్తం చేయడాన్ని ఉల్ఫె గమనించారు. అయితే 1946లో రెండవసారి అమెరికాను సందర్శించిన సమయంలో బ్రిటిష్ పాలకుల గురించి ప్రేమాస్పదంగా మాట్లాడడం ఉల్ఫెను విస్మయపరిచింది. మెహెరలీ తన మిత్రుడికి ఇలా చెప్పారు: 'భారతీయ నాగరికత, సంస్కృతికి బ్రిటిష్ వారు చాలా మేలుచేశారు. మరీ ముఖ్యంగా బ్రిటిష్ సంప్రదాయంలో స్వతస్సిద్ధంగా ఉన్న వైయక్తిక, పౌర హక్కులు భారతీయులకు లభించేందుకు దోహదం చేశారు'. ఉల్ఫె దిగ్భ్రాంతి చెందాడు. 'మిమ్ములను సుదీర్ఘకాలం జైళ్లలో బంధించిన బ్రిటిష్ వారి 'న్యాయ వివేకం'ను ఎలా మెచ్చుకుంటున్నారని ప్రశ్నించగా మెహెరలీ మృదువుగా ఇలా సమాధానమిచ్చారు: 'వారు మమ్ములను అణచివేసినప్పటికీ ఆ విషయంలో వారు పూర్తిగా సంతోషదాయకంగా లేరు. ఇబ్బందిపడ్డారు. బ్రిటిష్ జైలులో నేను నిరాహార దీక్ష చేస్తే చదువుకోవడానికి మీ పుస్తకంగానీ, మరేదైనా పుస్తకం గానీ తప్పక అందుబాటులోకి వస్తుంది. అదే హిట్లర్ లేదా స్టాలిన్ జైళ్లలో అయితే నేను నిస్సందేహంగా ఫైరింగ్ స్క్వాడ్ ఎదుట నిలబడవలసివచ్చేది. గాంధీ కనుక సోవియట్ జైలులో ఖైదీగా ఉన్నట్లయితే తన మొదటి నిరసనకే ఆయన గల్లంతయిపోయేవారు. ఇంగ్లీష్ వారయితే ఆయన ధిక్కారం గురించి తమ పై అధికారులకు తప్పక తెలియజేసేవారు. ఎంతగా పరిహసిస్తున్నప్పటికీ మా మహాత్ముడిని తప్పక గౌరవించేవారు. అందుకే ఇంగ్లీష్‌వారు పాల్పడుతున్న దుష్ట పనులను వ్యతిరేకించండి, ఎట్టి పరిస్థితులలోను ఇంగ్లీష్ వారిని అసహ్యించుకోవద్దు అని గాంధీజీ మాకు బోధించారు. ఆయన మాటకు మేము కట్టుబడి ఉన్నాము'.

పరిపూర్ణ నిస్వార్థుడు కాబట్టే సదా ఇతరుల సంక్షేమం గురించి ఆలోచిస్తూ మెహెరలీ తన సొంత ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేశారు. ఈ కారణంగానే ఆయన అకాల మరణానికి గురయ్యారు. చివరి రోజుల్లో ముంబైలోని ఒక సుప్రసిద్ధ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మెహెరలీ జయప్రకాశ్ నారాయణ్‌కు ఇలా చెప్పారు: 'ఆసుపత్రిలో చనిపోవడం ద్వారా నాకు చికిత్స చేసిన డాక్టర్ల మంచి పేరుకు కళంకం తీసుకురావడం నాకు ఇష్టం లేదు. నన్ను ఇంటికి తీసుకువెళ్లండి. నా గృహంలోనే నేను చనిపోదలుచుకున్నాను'. ఇలా అంతిమ క్షణాలలో కూడా మెహెరలీ ఇతరుల బాగోగుల గురించే ఆలోచించారని దండావతే వ్యాఖ్యానించారు.


ముస్లింగా పుట్టిన వ్యక్తిని మేయర్‌గా ఎన్నుకోవడమనేది ఒకానొకప్పుడు ముంబైకు ఒక మామూలు విషయంగా ఉండేది. అదే ఆ మహానగర విశిష్ట లక్షణంగా కూడా ఉండేది. లండన్, న్యూయార్క్ నగరాలు ఇటీవలి దశాబ్దాలలో సామాజిక, మత పరమైన వైవిధ్యాన్ని స్వాగతించేవిగా పరిణమించగా ముంబై సంకుచిత దురభిమానాలకు, దురహంకారాలకు ప్రాధాన్యమిస్తున్న నగరంగా మారిపోయింది. ఎంత విషాదం! తన నగర ఘనతను, దేశ ప్రతిష్ఠను నిజంగా సమున్నతం చేసిన యూసఫ్ మెహెరలీ వంటి ఒక మేయర్‌ను ముంబై ఎప్పటికైనా మళ్లీ ఎన్నుకుంటుందా?

(వ్యాసకర్త చరిత్రకారుడు)

తెలుగువారి అపురూప కళాస్రష్ట

తెలుగులో ప్రాచీన చిత్రకళకు వేల సంవత్సరాల చరిత్ర ఉన్నప్పటికి ఆధునిక చిత్రకళకు వందేళ్ల చరిత్ర మాత్రమే ఉంది. రాజమహేంద్రవాసి దామెర్ల రామారావుతో ఆధునిక ఆంధ్ర చిత్రకళ చరిత్ర ప్రారంభమైంది. గత వందేళ్లలో వడ్డాది పాపయ్య, బాపు, కె. రాజయ్య, కె. లక్ష్మా గౌడ్, అంట్యాకుల పైడిరాజు, సి.ఎస్.ఎన్. పట్నాయక్, బి.వి. నరసింహారావు, బి.ఎ. రెడ్డి, దేవగుప్తాపు శ్రీనాథ వుడయార్, జి. నరసింహారావు, గౌస్ బేగ్, పద్మశ్రీ ఎన్. కృష్ణారెడ్డి, పద్మశ్రీ ఎస్వీ. రామారావు, తోట నరసింహం తదితరులు మన చిత్రకళకు గుర్తింపు, గౌరవం తెచ్చారు.

వీరిలో కృష్ణారెడ్డి, ఎస్వీ రామారావులు చిత్రకళా సాధనతో పాటు బోధకులుగా కూడా పేరు పొందారు. కృష్ణారెడ్డి ప్రింట్ మేకింగ్‌లోను, రామారావు ఆధునిక చిత్రకళా రీతుల్లోను ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వీరిద్దరూ అమెరికాలో అత్యున్నత కళాకారులుగా పేరుపొందినా, మన రాష్ట్రంలో ఈ తరం చిత్రకారులకి వీరి గురించి అంతగా తెలియదు. అందుకు కారణం వీరు అమెరికాలో స్థిరపడటమే. చిత్రకళలో అనేక విభాగాలున్నాయి. అందులో ప్రింట్ మేకింగ్ అనేది భారతదేశంలో, ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాలలో అంతగా ప్రాచుర్యం పొందలేకపోయింది. విదేశాలలో ఈ కళాప్రక్రియకు ఎంతో ఆదరణ ఉన్నది. ఈ పద్ధతిలో చిత్రకారుడు అనుకున్న భావాన్ని ఒక జింక్ ప్లేటుపై గీసి, దానిని యాసిడ్‌లో ముంచితే, ఆ ప్లేటుపై చిత్రం గోచరిస్తుంది. దానిపై కావలసిన రంగులను వేసి, పేపరుపై ముద్రించడాన్ని ప్రింట్ మేకింగ్ అంటారు. ప్రింట్ మేకింగ్‌లో అనేక రకాలు, పద్ధతులు ఉన్నాయి. కాగితం, వస్త్రాలు, కలప, లోహం తదితరాలపై కూడా ముద్రించవచ్చు. ఎలక్ట్రానిక్ యుగం రాక ముందు ప్రింట్ మేకింగ్ ద్వారానే ముద్రణలు జరిగాయి.



తెలంగాణకు చెందిన పి. గౌరి శంకర్, దేవరాజ్ డకోజీ, కె. లక్ష్మాగౌడ్, డి.ఎల్.ఎన్.రెడ్డి తదితరులు 1970 దశకంలో హైదరాబాద్ కేంద్రంగా ప్రింట్ మేకింగ్‌లో విశేష కృషి చేశారు. తరువాత దేవరాజ్ న్యూఢిల్లీ వెళ్ళి అక్కడ గర్హి స్టుడియో విభాగాధిపతిగా పనిచేశారు.

ప్రపంచంలో అగ్రశ్రేణి ప్రింట్ మేకరుగా గుర్తింపు పొందిన ఎన్. కృష్ణారెడ్డి చిత్తూరు జిల్లాకు చెందిన నందనూరులో 1925 జూలై 15న జన్మించారు. 1941లో శాంతినికేతన్‌లో ప్రఖ్యాత చిత్రకారుడు నందలాల్ బోస్ వద్ద శిష్యరికం చేసి, 1946లో ఫైన్ ఆర్ట్స్ పట్టా పొందారు. తరువాత 1947–50 వరకు మద్రాసు కళాక్షేత్రంలోని కళా విభాగానికి అధిపతిగా వ్యవహరించారు.

అనంతరం లండన్ విశ్వవిద్యాలయానికి చెందిన స్లేడీ స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందారు. పారిస్‌లో శిల్పకళలో ప్రసిద్ధి పొందిన శిల్పి జడ్కిన్‌తో, మిలాన్‌లో మెరినో మెరినోతో ప్రింట్స్ రూపొందించడంలో కలిసి పనిచేస్తూ చిత్రకళను అధ్యయనం చేశారు. 1965 నుంచి పారిస్‌లోని అటులియర్ 17 స్టూడియోకు అసోసియేట్ డైరెక్టర్‌గా, విస్కాన్సిన్ విశ్వవిద్యాలయంలో ఆర్ట్ విభాగానికి ప్రొఫెసర్‌గా పనిచేశారు. కృష్ణారెడ్డి రూపొందించిన ప్రింట్ మేకింగ్‌లో టెక్నిక్, శిల్పకళలోని ప్రతిభ అతనికి ఎనలేని గుర్తింపు తెచ్చాయి. ఆయన చిత్రాలలోని లావణ్యం, రంగుల సొగసు, భావనలో సౌందర్యం, నూతన రీతులు కళాభిమానులు, విమర్శకుల్ని మెప్పించాయి. వారి చిత్రాలు, శిల్పాలు నైరూప్యంగా ఉంటాయి. అలాగే చిత్రాల్లో వాడిన రంగులు ప్రత్యేకంగా ఉండి ఆలోచింపచేస్తాయి.

కృష్ణారెడ్డి చిత్ర, శిల్పకళా ప్రతిభ గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 1972లో పద్మశ్రీ పురస్కారంతో గౌరవించింది. 1980లో విశ్వభారతి విద్యాలయం గగన్ అబానీ పురస్కారాన్ని నాటి ప్రధాని ఇందిరాగాంధీ చేతుల మీదుగా బహుకరించారు. అదే సంవత్సరం తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆయన్ని గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. 1997లో అఖిలభారత లలిత కళల సంఘం వారిని 'కళారత్న' పురస్కారంతో గౌరవించింది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రసిద్ధ చిత్రశాలల్లోనూ ఆయన చిత్రాలు ఉన్నాయి. ఆ మహాకళాకారుడు న్యూయార్క్‌లో 2018 ఆగస్టు 22న కన్నుమూశారు.

● సుంకర చలపతిరావు
కళారత్న అవార్డు గ్రహీత

(జూలై 15: కృష్ణారెడ్డి శతజయంతి)

యాక్సిడెంట్లకు హెడ్‌లైట్లూ కారణమే!

దేశంలో నిత్యం అనేక రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వీటి ద్వారా ఏటా లక్షలాది మంది చనిపోవడమే కాకుండా ఎంతో మంది గాయపడుతున్నారు. రాత్రి వేళల్లోనే ఈ ప్రమాదాలు అత్యధికంగా జరుగుతున్నాయి. వీటికి కారణం అధిక వేగంతో వెళ్లే విదేశీ వాహనాలు, కళ్లపై అధిక ప్రభావంతో పడే హైబీమ్ లైటింగ్, తాగి వాహనాలు నడపటం... వంటివి. అభివృద్ధి చెందిన దేశాల్లో విశాలమైన రోడ్లు, తక్కువ జనాభా, ట్రాఫిక్ రూల్స్‌ను కచ్చితంగా పాటించడం వల్ల అక్కడ రోడ్డు ప్రమాదాలు తక్కువ. మన దగ్గర అలా కాదు. రోడ్డు భద్రత తక్కువ, ట్రాఫిక్ ఎక్కువ.


ఒకప్పుడు స్వదేశీ అంబాసిడర్, మారుతి తరహా కార్లు, బస్సులు, ద్విచక్ర వాహనాల వంటి మోటారు వాహనాలు పరిమిత వేగంతో ప్రయాణించేవి. వాటి హెడ్‌లైట్లపై సగం నల్లరంగు వేయటమో, నల్ల స్టిక్కర్లు అంటించడమో చేసేవారు. ఫలితంగా కాంతి అన్ని వైపులా ప్రసరించకుండా ఎదుటి వాహనాలు స్పష్టంగా కనిపించేవి. కానీ ప్రస్తుతం అలాంటివేవీ పాటించడం లేదు. దీంతో ప్రస్తుత వాహనాల హైబీమ్ లైట్ల కాంతి నేరుగా ఎదురుగా వచ్చే వాహనదారుల కళ్లపై పడుతోంది. వారికి ఎదుటి వాహనాలు కన్పించకపోవడంతో యాక్సిడెంట్లు జరుగుతున్నాయి. తద్వారా ప్రమాదాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. ఎదుటి వాహనాలకు ఇబ్బంది లేని విధంగా లైటింగ్ ఏర్పాటు చేయాలని వాహన తయారీ కంపెనీలను కేంద్రం ఆదేశించాలి. రోడ్డు రవాణా, పోలీసు అధికారులు తమ బృందాలతో నిత్యం అప్రమత్తంగా ఉంటూ నిబంధనలు పాటించని వాహనదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. అప్పుడే ప్రమాదాలు తగ్గుతాయి.

– తిరుమలశెట్టి సాంబశివరావు

కేఏఎన్‌పీఎస్ రెండవ రాష్ట్ర మహాసభ

కులవ్యవస్థ నిర్మూలన కోసం 'కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి' (KANPS) 1992 నవంబర్ 22న అఖిలభారత స్థాయిలో ఏర్పడింది. అనివార్య కారణాల వల్ల ఆచరణలోకి అడుగుపెట్టలేదు. సంస్థ వ్యవస్థాపకుల్లో ఒకరైన ఉప్పుమావులూరి సాంబశివరావు చొరవతో 2019 సెప్టెంబర్ 17న పెరియార్ 140వ జయంతి, శరద్ పాటిల్ (వ్యవస్థాపకులు–మహారాష్ట్ర) 94వ జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో కార్యాచరణలోకి అడుగు పెట్టింది. విద్య, ఉద్యోగ రంగాలలో అగ్రకుల ఆధిపత్యాన్ని సుస్థిరం చేసుకోవడానికి తీసుకువచ్చిన ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా గళమెత్తింది. కుల అసమానతలు రూపుమాపడానికి జనగణనలో కులగణన చేపట్టాలని నినదించింది. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చట్టబద్ధత కోసం అట్టడుగు ఎస్సీ ఉపకులాల వైపు నిలబడింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, పేదలు, రైతులు, రైతు కూలీలు తమ జీవనోపాధి అయిన వ్యవసాయాన్ని విధ్వంసం చేస్తూ కాలుష్యాన్ని వెదజల్లి, పర్యావరణాన్ని దెబ్బతీసే చిత్తనూరు ఇథనాల్ కంపెనీ వ్యతిరేక ఉద్యమంలో క్రియాశీలక పాత్రను పోషించింది. 2022 నవంబర్ 22న హైదరాబాదులో తన మొదటి రాష్ట్ర మహాసభలను విజయవంతంగా పూర్తిచేసుకున్నది. ప్రస్తుతం ఆరేళ్ల కార్యాచరణతో 2వ రాష్ట్ర మహాసభలను 2025 జూలై 13న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హాల్, తెలంగాణ చౌరస్తా, మహబూబ్‌నగర్ పట్టణంలో జరపనున్నది. ఉదయం పది గంటల నుంచి నాలుగు సెషన్లలో ఈ సభ జరగనున్నది. పలువురు వక్తలు వివిధ అంశాలపై ప్రసంగిస్తారు.

– బండారి లక్ష్మయ్య, కేఏఎన్‌పీఎస్ ఆలిండియా కన్వీనర్





పారిశుధ్యంలో ప్రథమం

- ఐవీఆర్ఎస్ సర్వేలో ప్రజలు సంతృప్తి
- 67 శాతంతో రాష్ట్రస్థాయిలో గుంటూరు ఘనత
- ఉద్యోగులను అభినందించిన మేయర్ కోవెలమూడి

గుంటూరు కార్పొరేషన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యం నిర్వహణలో గుంటూరు ఘనత సాధించింది. విజయవాడ, విశాఖపట్నం నగరాలను వెనక్కి నెట్టేసింది. పారిశుధ్య నిర్వహణలో ఆయా మున్సిపల్ కార్పొరేషన్లు అనుసరిస్తున్న విధానాలపై రాష్ట్ర ప్రభుత్వం ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం (ఐవీఆర్ఎస్) సర్వే ద్వారా ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించింది. ప్రజారోగ్య కార్మికులు ప్రతీ రోజు ఇళ్ల నుంచి చెత్త సేకరిస్తున్నారా.. లేదా, మీ ఇంటి పరిసర ప్రాంతాల్లో చెత్త కుప్పలను 24 గంటల్లోగా తొలగిస్తున్నారా.. లేదా, మీ మున్సిపాలిటీలో డ్రెయిన్లను శుభ్రం చేస్తున్నారా.. లేదా అనే మూడు అంశాలపై ఐవీఆర్ఎస్ బృందం సర్వే చేసింది. ఈ సర్వేలో రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లోని ప్రజల కంటే గుంటూరు వాసులు పారిశుధ్య నిర్వహణలో నగరపాలక సంస్థలో అనుసరిస్తున్న విధానాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో 67 శాతం ర్యాంకింగ్‌తో గుంటూరు నగర పాలక సంస్థ ప్రథమ స్థానంలో నిలిచింది. 66 శాతంతో విజయవాడ, విశాఖపట్నం తర్వాత స్థానాల్లో నిలిచాయి. ఈ సందర్భంగా నగర పాలక సంస్థ అధికారులు, పారిశుధ్య సిబ్బందిని మేయర్ కోవెలమూడి రవీంద్ర ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పారిశుధ్య సర్వేలో రాష్ట్ర స్థాయిలో గుంటూరు ప్రథమ స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. రాష్ట్ర స్థాయిలో గుంటూరు నగరానికి ప్రజారోగ్య కార్మికులు, అధికారులు మంచి పేరు తెచ్చారన్నారు. నగరంలో ప్రజారోగ్య విభాగంలో శానిటేషన్ మెరుగ్గా జరిగేలా విప్లవాత్మక చర్యలు తీసుకున్నామన్నారు. ఇందులో భాగంగా 23గా ఉన్న శానిటేషన్ డివిజన్లను, పర్యవేక్షణ సౌలభ్యం కోసం 57 ఎన్నికల వార్డులను ఒక్కో శానిటేషన్ డివిజన్‌గా మార్చామన్నారు. పారిశుధ్య కార్మికులకు తోడుగా రోజువారీ వేతనంపై అదనపు కార్మికులను ఏర్పాటు చేసుకుని, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపడుతున్నామన్నారు. రానున్న కాలంలో నగరంలో సెంట్రల్ కమాండ్ కంట్రోల్ రూమ్, ప్రతి ఇంటికి ఆర్ఎఫ్ఐడీ ట్యాగ్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. తద్వారా నగర ప్రజలకు మరింతగా మెరుగైన పారిశుధ్యం అందుతుందన్నారు.



6

ఆంధ్రా ప్యారిస్‌లో బోటు షికారు

- నిజాంపట్నం కాల్వలో ఏర్పాటుకు సన్నాహాలు
- సాధ్యాసాధ్యాలను పరిశీలించిన ఏపీ టూరిజం అధికారులు
- మంత్రి మనోహర్ ఆలోచనలకు పదేళ్ల తర్వాత కార్యరూపం
- ఇది సాకారమైతే తెనాలికి కొత్త అందాలు

సర్‌చార్జిలో తేడాలు



- రూ.60 కోట్లకు రూ.37 కోట్లే జమ
- పొంతన లేకుండా రిజిస్ట్రేషన్, జడ్పీ లెక్కలు
- సమాచార లోపంతోనే తేడాలంటోన్న రిజిస్ట్రార్

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌కు స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ నుంచి రావాల్సిన సర్‌చార్జి చెల్లిం పుల్లో భారీ తేడాలు కనిపిస్తున్నాయి. చెల్లింపు లకు సంబంధించి రిజిస్ట్రేషన్, జడ్పీ అధికారుల లెక్కలకు పొంతన ఉండటం లేదు. 2022-2023 నుంచి 2024-2025 వరకు రూ.60 కోట్ల వరకు సర్‌చార్జి రూపేణా జడ్పీకి గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని రిజిస్ట్రేషన్ల శాఖ చెల్లిం చాలి. గత ప్రభుత్వ హయాంలో జడ్పీ అధికారు లు పలుమార్లు రిజిస్ట్రేషన్ శాఖకు లేఖలు రాసి నా పెద్దగా స్పందన లేదు. చాలాకాలంగా పెం డింగ్‌లో ఉన్న సర్‌చార్జి చెల్లింపులపై చర్చించేం దుకు గురువారం జడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా, సీఈవో జ్యోతిబసు మూడు జిల్లాల రిజిస్ట్రార్లతో సమావేశమయ్యారు. ఈ క్రమంలో అధికారుల మధ్య లెక్కల్లో వ్యత్యాసాలను గుర్తిం చారు. సర్‌చార్జి రూపేణా గడచిన నాలుగేళ్లలో జడ్పీకి రూ.60 కోట్లు వరకు రావాల్సి ఉంది. అయితే రూ.37 కోట్లు మాత్రమే జమ అయినట్లు జడ్పీ అధికారులు చెప్తున్నారు. మిగిలిన రూ.23 కోట్లు ఎప్పుడు చెల్లిస్తారన్న అన్న దానిపై రిజిస్ట్రేషన్ అధికారులు స్పష్టత ఇవ్వలేదని జడ్పీ వర్గాలు చెబుతున్నాయి. చెల్లింపుల విషయంలో వ్యత్యాసం కనపడుతున్నందున మరో వారంలో పూర్తి సమాచారంతో వస్తామని రిజిస్ట్రార్లు జడ్పీ అధికారులకు చెప్పినట్లు తెలుస్తుంది.

ఏమయ్యాయి.. ఎటుపోయాయి..

గుంటూరు జిల్లా నుంచి 2022-2023, 2024- 2025 జూన్ వరకు సర్‌చార్జి రూ.23 కోట్ల వరకు రావాల్సి ఉంది. అయితే మొత్తం చెల్లించేశామని రిజిస్ట్రేషన్ అధికారులు చెప్తుండగా రూ.17.28 కోట్లు మాత్రమే జమైనట్లు జడ్పీ అధికారులు తే ల్చారు. అయితే మిగిలిన రూ.5.72 కోట్లు ఏమ య్యాయి.. ఎటుపోయాయో అంతుపట్టడంలేదు. పల్నాడు జిల్లా నుంచి రూ.25 కోట్లకు రూ.13.9 కోట్లు మాత్రమే జమ అయినట్లు చెబుతున్నారు. రూ.15.11 కోట్లు జమ అయినట్లు పల్నాడు జిల్లా రిజిస్ట్రార్ చెబుతున్నారు. లెక్కల్లో ఇంత పెద్ద మొత్తంలో తేడాలు గమనించిన అధికారులు సర్ చార్జి సొమ్ము ఎక్కడకి పోయిందో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు.

బాపట్లలో ఇచ్చింది ఎక్కువ..

గుంటూరు, పల్నాడు జిల్లా అధికారులు తక్కువ ఇచ్చి ఎక్కువ ఇచ్చినట్లు చెబుతుంటే బాపట్ల జిల్లాలో మాత్రం ఎక్కువ ఇచ్చి తక్కువ ఇచ్చినట్లు చెబుతున్నారు. బాపట్ల నుంచి జిల్లా పరిషత్‌కు రూ.12 కోట్లు రావాల్సి ఉండగా, రూ.7.74 కోట్లు జమ చేశారు. కానీ బాపట్ల రిజిస్ట్రార్ రూ.5.86 కోట్లు మాత్రమే ఇచ్చినట్లు చెబుతున్నారు. జడ్పీకి సర్‌చార్జి చెల్లింపుల్లో నెలకొన్న గందరగోళం అంతా సమాచార లోపం వల్లేనని గుంటూరు రిజిస్ట్రార్ శైలజ తెలిపారు.

నల్లమడకు..నిధులు

- నిధుల మంజూరుకు క్యాబినెట్ ఆమోదం
- మూడు జిల్లాల్లో 1.80 లక్షల ఎకరాల ఆయకట్టుకు మేలు

ఆధునికీకరణకు రూ.180.60 కోట్లు



(తెనాలి, ఆంధ్రజ్యోతి)

నల్లమడవాగు ఆధునికీకరణకు పట్టిన గ్రహణం ఎట్టకేలకు వీడింది. తొలిదశ పనులకు భాగంగా రూ.180.60 కోట్లు విడుదలకు తాజాగా జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఆమోదముద్ర పడింది. దీంతో ఏళ్లగా రైతులు ఎదురు చూస్తున్న నల్లమడ ఆధునికీకరణ పనులకు మోక్షం లభించనట్లైంది. 2017లోనే అప్పటి టీడీపీ ప్రభుత్వం నల్లమడవాగు ఆధునికీకరణ పనులపై దృష్టి పెట్టింది. రూ.180 కోట్లు నిధుల విడుదలకు అప్పట్లో భూసేకరణపై అధికారులు డీపీఆర్ రూపొందించారు. ఇక పనులు పట్టాలెక్కడమే తరువాయి అనుకునే దశలో ప్రభుత్వం మారి వైసీపీ గద్దెనెక్కింది. దీంతో పనులకు గ్రహణం పట్టింది. అప్పటి నుంచి రైతులు నల్లమడ వాగు ఆధునికీకరణపై ఆందోళన చేస్తున్నారు. కానీ గత ప్రభుత్వం ఐదేళ్ల దీని గురించి పట్టించుకోలేదు. ఈ పరిస్థితుల్లో కూటమి గద్దెనెక్కగానే పనులపై కదలిక వచ్చింది. జనవరిలో మళ్లీ కసరత్తు చేశారు. భూసేకరణపై నీటిపారుదలశాఖ అధికారులు రెండు నెలల క్రితం సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు. ఈ క్రమంలో తాజాగా దం తెలపడంతో పనులపై అధికారులు దృష్టి సారించారు. గత ప్రభుత్వం వహించిన నిర్లక్ష్యం కారణంగా వ్యయం దాదాపు రూ.325 కోట్లకు చేరిందని అధికారులు చెబుతున్నారు. ఇప్పుడు ప్రభుత్వం విడుదల చేసిన రూ.180.60 కోట్లు భూసేకరణకే సరిపోతాయని, పనులకు అదనంగా మరో రూ.145 కోట్లు ఖర్చు తప్పదనేది ఇరిగేషన్ అధికారుల అభిప్రాయంగా ఉంది. నల్లమడ ఆధునికీకరణతో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని దాదాపు 1.80 లక్షల ఎకరాల ఆయకట్టుకు మేలు జరుగనున్నది. దాదాపు 173 కిమీటర్ల మేర ప్రవహించి బాపట్ల మండలం సూర్యలంక సమీపంలో పోగారు వద్ద సముద్రంలో కలుస్తోంది. ఈ వాగు ప్రస్తుతం గరిష్ఠంగా 23 వేల క్యూసెక్కుల వరకు ప్రవాహ సామర్థ్యాన్ని తట్టుకుంటోంది. అదే ఆధునికీకరణ పనులు పూర్తయితే సామర్థ్యం దాదాపు 45 వేల క్యూసెక్కుల వరకు పెరుగుతుందని అధికారులు లెక్కలు వేస్తున్నారు.

భూసేకరణే కీలకం..

నల్లమడ వాగు ఆధునికీకరణలో భూసేకరణే కీలకం. ప్రస్తుతం విడుదల చేసే నిధుల్లో 70 శాతం దీనికే ఖర్చయ్యే అవకాశం ఉంది. గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని నాలుగు మండలాల పరిధిలో భూ సేకరణ చేపట్టాలని ప్రభుత్వానికి నివేదికలు అందాయి. బాపట్ల జిల్లాలో బాపట్ల, కర్లపాలెం మండలాలు, గుంటూరు జిల్లాలో పెదనందిపాడు, కాకుమాను మండలాల పరిధిలో పనులు సాగనున్నాయి. ఈ క్రమంలో నష్టపరిహారం మదింపులో రెవెన్యూ యంత్రాంగం అంచనాలు రూపొందిస్తోంది. వరద పోటెత్తిన సమయాల్లో మూడు జిల్లాల పరిధిలోని రైతుల్ని నల్లమడ వాగు వణికిస్తూనే ఉంది. కరకట్టలు బలహీనంగా ఉండడం, వాగులు పొంగి గండ్లు పడి పంటలను ముంచెత్తిన సమయాల్లో ఆధునికీకరణ డిమాండ్ తెరమీదకు వస్తూనే ఉంది. ఈ పరిస్థితుల్లో ఎట్టకేలకు రైతుల కడగండ్లు తీర్చడానికి ప్రభుత్వం నిధులు మంజూరుతో తొలి అడుగు పడింది. ప్రభుత్వం నిధుల విడుదలతో నల్లమడ వాగు ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి ఒక్కరికీ పోషణ అందేలా..

- ఐసీడీఎస్‌లో లబ్ధిదారుల ముఖ ఆధారిత హాజరు
- సరుకులు పక్కదారి పట్టకుండా చర్యలు
- పోషణ్ ట్రాక్ యాప్‌లో వివరాల నమోదు

6

మార్గదర్శకులను గుర్తించాలి

- పీ-4 సమీక్షలో కలెక్టర్ నాగలక్ష్మి
- 81,264 బంగారు కుటుంబాల ఎంపిక



కలెక్టరేట్‌లో సీపీవోతో సమావేశమైన కలెక్టర్

గుంటూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యం(పీ-4) కార్యక్రమం కింద జిల్లాలోని బంగారు కుటుంబాలను దత్తత తీసుకునే మార్గదర్శకులను ఎంపిక చేయాలని వివిధ శాఖల అధికారులను కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. శుక్రవారం ఆమె కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డివిజన్, మండల స్థాయి అధికారులతో మాట్లాడారు. జిల్లాలో మొత్తం 81,264 బంగారు కుటుంబాలను వివిధ నియోజకవర్గాల్లో గుర్తించడం జరిగిందన్నారు. వీరిని దత్తత తీసుకునే మార్గదర్శకులను మండల, నియోజకవర్గం, మున్సిపాలిటీ వారీగా గుర్తించాలన్నారు. బంగారు కుటుంబాలు అవసరాలను గుర్తించి వారికి కావాల్సిన సాయం అందించేందుకు విజ్ఞప్తి చేయాలన్నారు. బంగారు కుటుంబాలకు మార్గదర్శకులుగా [illegible] ఎన్ఆర్ఐలు, పారిశ్రామికవేత్తలు, డాక్టర్లు, విద్యా సంస్థల యజమానులు, రిటైర్డు ఉద్యోగులు, బిల్డర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులను గుర్తించాలన్నారు. అలానే బ్యాంకర్లు, బీమా కంపెనీలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, గోల్డ్ మర్చంట్స్, కోల్డ్‌స్టోరేజ్ యజమానులు, ప్రార్థనా మందిరాలు, రాజకీయ ప్రముఖులను సంప్రదించి పీ-4 గురించి తెలియజేసి మార్గదర్శకులుగా ముందుకొచ్చేందుకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో సీపీవో శేషశ్రీ పాల్గొన్నారు.

ఆ పదిమందితోనే.. పరేషన్

- చౌక బియ్యం పక్కదారి పట్టించడంలో ఆరితేరారు
- కలెక్టర్‌కు సమగ్ర నివేదిక అందించిన జేసీ భార్గవతేజ
- ఒక్కొక్కరిపై ఎన్నెన్నో కేసులు.. తీరుమార్చుకోని నిందితులు
- పీవోబీఎం అండ్ ఎవోఈసీ యాక్టు కింద చర్యలకు సిఫార్సు
- ఎలాంటి చర్యలకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేస్తారోనని ఉత్కంఠ

గుంటూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పేదల కడుపు నింపాల్సిన చౌక బియ్యం పెద్దల బొక్కసాలను నింపుతోంది. నెలనెలా పేదలకు అందాల్సిన బియ్యాన్ని పక్కదారి పట్టిస్తూ జేబులు నింపుకుంటున్న అక్రమార్కులు జిల్లాలో పది మంది ఉన్నారు. వారిపై కేసులు నమోదు చేసినా తీరుమార్చుకోకుండా రేషన్ బియ్యాన్ని యథేచ్ఛగా తరలిస్తున్నారు. జిల్లాలో చౌక బియ్యం పక్కదారి పట్టించడంలో ఆ పది మంది ఆరితేరారు. గతంలో రేషన్ దుకాణాలున్నప్పుడు, ఆ తర్వాత ఎండీయూ వ్యవస్థ వచ్చినప్పుడు, ఇప్పుడు డిపోల పునరుద్ధరణ జరిగినా పీడీఎస్(పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్) బియ్యం పక్కదారి మళ్లించడం ఆగలేదు.. అంటూ

ఒక విధంగా వీళ్లు హ్యాబిచ్యువల్ అఫెండర్లు(నేరాలకు అలవాటుపడిన వాళ్ల)లా మారిపోయారు. వీళ్లపై ఏడాది వ్యవధిలోనే దాదాపుగా 50 కేసులు నమోదు కావడం పౌరసరఫరాల వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అయినప్పటికీ వీళ్లు పెద్దగా జైలు జీవితం గడపడం అనేది ఉండదు. చాలావరకు స్టేషన్ బెయిల్‌తోనే బయటపడిపోతున్నారు. క్రమక్రమంగా చౌకబియ్యం తరలిస్తూ పట్టుబడినా పెద్దగా ఇబ్బంది ఉండదన్న భావనకు వచ్చేసి ఎలాంటి భయం లేకుండా నేరాలకు పదేపదే పాల్పడుతున్నారు.. అంటూ జాయింట్ కలెక్టర్ అమిలినేని భార్గవతేజ పది మంది నేరస్థుల జాబితాను కలెక్టర్ నాగలక్ష్మికి కేసుల వివరాల సహా నివేదించారు. పీడీఎస్ బియ్యాన్ని దారి మళ్లిస్తూ తరచుగా నేరాలకు పాల్పడుతున్నారని ఆధారాలు సహా అందజేశారు. ప్రజల వద్ద కేజీ రూ.13కు కొనుగోలు చేసి రూ.18కి అమ్ముకొంటూ సొమ్ము చేసుకుంటూ రేషన్ అక్రమార్కులు ప్రతీ నెలా రూ.కోట్లలో పోగేసుకుంటున్నారు. కొంతమంది నేతలు, అధికారులకు నెలవారీగా మామూళ్లు టంచన్‌గా చేరిపోతుండటంతో రేషన్ అక్రమాలకు అంతులేకుండాపోతోంది. తరచుగా నేరాలకు పాల్పడే వారి పీచమణచడానికి 1980లో ప్రివెన్షన్ ఆఫ్ బ్లాక్ మార్కెటింగ్ అండ్ మెయిన్‌టెనెన్స్ ఆఫ్ ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్టుని ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ చట్టం కింద చర్యలు చేపట్టాలని జేసీ భార్గవ తేజ కలెక్టర్‌కు నివేదించారు. ఈ నేపథ్యంలో జేసీ నివేదికపై కలెక్టర్ ఎలాంటి చర్యలకు ఆదేశాలు జారీ చేస్తారోనన్న ఉత్కంఠ నెలకొన్నది. ఇటీవల శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న కొందరిపై పీడీ యాక్టు అమలు చేశారు. కాగా ఈ పది మందే కాకుండా మరికొంతమంది కూడా నేరాలకు పాల్పడుతున్నా కేసుల నుంచి తప్పించుకుంటున్నారు.

వీరిపై పలు కేసులు

- నెహ్రూనగర్‌కు చెందిన కొల్లిపర వెంకట సుబ్బారావు అనే వ్యక్తిపై ఈసీ యాక్టు కింద గత ఏడాది మార్చి నుంచి ఇప్పటివరకు ఏడు కేసులు నమోదు చేశారు. వట్టిచెరుకూరు, లాలాపేట, చేబ్రోలు, కొత్తపేట పోలీసుస్టేషన్లలో ఈ కేసులు నమోదయ్యాయి.
- వట్టిచెరుకూరు మండలం చమళ్లమూడికి చెందిన కొల్లిపర సువర్చలరావు(పద్మజ రైసుమిల్లు యజమాని)పై ఆరు కేసులను పెదనందిపాడు, వట్టిచెరుకూరు, పొన్నూరుటౌన్, చేబ్రోలు, కొత్తపేట పోలీసుస్టేషన్లలో నమోదు చేశారు.
- బాలాజీనగర్‌కు చెందిన కొమ్మాలపాటి శ్రీనివాసరావుపై ఐదు కేసులు నమోదు చేశారు. వట్టిచెరుకూరు, పెదనందిపాడు, పొన్నూరు రూరల్, నగరంపాలెం, నల్లపాడు పోలీసుస్టేషన్లలో నమోదయ్యాయి.
- పాతగుంటూరు బాలాజీనగర్‌కు చెందిన పసుమర్తి వెంకట శివనాగప్రసాదుపై ఐదు కేసులున్నాయి. మేడికొండూరు, పట్టాభిపురం, పొన్నూరు రూరల్, ఫిరంగిపురం పోలీసుస్టేషన్లలో నమోదు చేశారు.
- రెడ్డిపాలెం గ్రామానికి చెందిన కుంటిగొర్ల ఏడుకొండలుపై ఐదు కేసులు నమోదు చేశారు. ఇవి పట్టాభిపురం, పెదకాకాని, పాతగుంటూరు, నల్లపాడు పోలీసుస్టేషన్లలో నమోదై ఉన్నాయి.
- పేరేచర్లకు చెందిన పాలపాటి సుధాకర్‌పై నాలుగు కేసులను మేడికొండూరు, తుళ్లూరు, తెనాలి రూరల్, ఫిరంగిపురం పోలీసు స్టేషన్లలో నమోదు చేశారు.
- వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడుకు చెందిన శ్రీ వల్లి రైసుమిల్లు యజమాని దివ్వెల హరీష్‌పై నాలుగు కేసులను నల్లపాడు, వట్టిచెరుకూరు పోలీసుస్టేషన్లలో నమోదు చేశారు.
- ఏటీ అగ్రహారానికి చెందిన పసుపులేటి రామకృష్ణపై నల్లపాడు, నగరంపాలెం, పట్టాభిపురం పోలీసుస్టేషన్లలో కేసులు పెట్టారు.
- తుళ్లూరులోని అబ్బరాజుపాలెం గ్రామానికి చెందిన పులివెలుగు రాజుపై తుళ్లూరు పోలీసుస్టేషన్‌లో మూడు కేసులు ఉన్నాయి.
- పేరేచర్లకు చెందిన శ్రీవెంకటేశ్వర ట్రేడర్స్ రైసుమిల్లు యజమాని కల్లం జయరామిరెడ్డిపై మేడికొండూరు పోలీసుస్టేషన్‌లో రెండు కేసులు ఈసీ యాక్టు కింద నమోదు చేశారు.

అచ్చంపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 14.65 టీఎంసీల నిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు రాజు తెలిపారు. మొత్తం నాలుగు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నామని చెప్పారు.

గంజాయి కేసులో వైసీపీ నాయకుడి అరెస్ట్

ఆరేళ్లుగా గంజాయి విక్రయాలు



నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ యశోదరదేవి, ఎస్ఐలు

గుంటూరు కార్పొరేషన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): అతను ఓ వైసీపీ నాయకుడు. ఆ పార్టీలో పెద్ద నాయకుడిగా గ్రామంలో చలామణి అవుతూ.. అధికారంలో ఉన్నప్పుడు గ్రామాన్ని శాసించాడు. అక్రమంగా గంజాయి వ్యాపారం చేస్తూ ఎక్సైజ్ శాఖ అధికారులకు దొరికిపోయాడు. పక్కా సమాచారంతో ఎక్సైజ్ శాఖ అధికారులు వలపన్ని నిందితుడిని అదుపులో తీసుకున్నారు. విచారణ నిమిత్తం అతని సొంత ఇంటికి తీసుకెళ్లగా ఇంటిలో మాజీ సీఎం జగన్, వైసీపీ నాయకులతో దిగిన ఫొటోలు కనిపించాయి. గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు దేవరకొండ నాగేశ్వరరావుతో పాటు అతని బంధువుని ఎక్సైజ్ శాఖ అధికారులు శుక్రవారం అరెస్ట్ చేశారు. నాగేశ్వరరావు గడచిన ఆరేళ్లుగా వైసీపీలో పెద్ద నాయకుడిగా తిరుగుతున్నాడు. పార్టీని అడ్డుపెట్టుకొని పెద్ద ఎత్తున గంజాయి విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో గుంటూరు నుంచి వెంగళయపాలెం వెళ్లే రహదారిలో వల్లభ పాల డెయిరీ వద్ద ఎక్సైజ్ శాఖ టూ టౌన్ సీఐ యశోదర దేవి ఆధ్వర్యంలో ఎస్ఐలు తనిఖీలు చేపట్టారు. నిందితుడు దేవరకొండ నాగేశ్వరరావు, అతని బంధువైన కొండపల్లి ఓంకార్ గోపీ వద్ద 1.55 కేజీల గంజాయి దొరికింది. దీంతో వారిని అదుపులో తీసుకొని విచారించారు. కొన్ని సంవత్సరాలుగా వారు గంజాయి అక్రమ వ్యాపారం చేస్తున్నట్లు బహిర్గతమైంది. నిందితులు ఇద్దరినీ చేసి, వారి నుంచి మూడు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనపరచుకున్నట్లు సీఐ తెలిపారు. ఎస్సైలు మూర్తి, మాధవి, సత్యనారాయణ, హనుమంతరావు సిబ్బంది పాల్గొన్నారు.

విదేశాలకు వెళ్లిన..

ఆరోగ్య శాఖ ఉద్యోగులపై ఫిర్యాదు

గుంటూరు సిటీ, జూలై 11(ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల అనుమతి లేకుండానే విదేశీ యాత్రలకు వెళ్లిన గుంటూరు జిల్లాకు చెందిన ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని జి.వెంకటేశ్వరరావు.. హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టరుకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం గుంటూరులో ఆయన మాట్లాడుతూ గుంటూరు జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సూపర్ వైజర్ క్యాడర్‌లో పనిచేస్తున్న కొందరు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి అనుమతి లేకుండానే విదేశీ పర్యటనకు వెళ్లినట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు విదేశాలకు వెళ్లేప్పుడు ఉన్నతాధికారుల అనుమతి తప్పనిసరని పేర్కొన్నారు. ఆర్జిత సెలవును వినియోగించుకొని విదేశాలకు వెళ్లిన వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అధికారులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఇదే జిల్లాకు చెందిన హెల్త్ సూపర్ వైజర్లు కొందరు ఓ ప్రైవేట్ కంపెనీకి చెందిన మందులు వాడితే గర్భం వస్తుందని విక్రయిస్తున్న వైనంపై కూడా ఫిర్యాదు చేశామని వెంకటేశ్వరరావు తెలిపారు. ఇందుకు ఆశా కార్యకర్తలను కూడా ఉపయోగించు కుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.

తహసీల్దార్ వైవీ కుటుంబరావు సస్పెన్షన్



తహసీల్దార్ వైవీ కుటుంబరావు

దాచేపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూముల వ్యవహారంలో అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణల నేపథ్యంలో గతంలో దాచేపల్లిలో పనిచేసిన ప్రస్తుతం గురజాల తహసీల్దార్ వైవీ కుటుంబరావును సస్పెండ్ చేస్తూ పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. దాచేపల్లి మండలంలోని కేసానుపల్లి, గామాలపాడు, మాదినపాడు, పెదగార్లపాడు, భట్రుపాలెం గ్రామాల్లో ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తుల పేర్లపై అక్రమాలకు పాల్పడ్డారని తహసీల్దారు ప్రధానంగా రోపణలున్నాయి. సర్వే నంబర్లు 85/1, 348/15/7, 108/18/272, 595/1ఏ, 595/2ఏ, 334/4/1 భూముల్లో అక్రమాలు జరిగినట్టుగా అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. మరో ఆరు నెలల్లో పదవీ విరమణ చేయనున్న తహసీల్దార్ కుటుంబరావును సస్పెండ్ కావడంపై రెవెన్యూ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గతంలో కూడా దాచేపల్లి మండలంలో తంగెడ, పెదగార్లపాడు, కేసానుపల్లి, పందుగుల తదితర గ్రామాల్లో సుమారుగా రెండు వేల ఎకరాల్లో అవకతవకలు జరిగాయని, భూములు అన్యాక్రాంతమయ్యాని గతంలో ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ఆరోపణలపై పూర్తి స్థాయిలో చర్యలు తీసుకొనేందుకు అధికారులు దృష్టి సారించారు. ఈ అక్రమాల్లో మరి కొంత మంది వ్యక్తుల పేర్లు కూడా బయటకు వచ్చే అవకాశం ఉందని రెవెన్యూ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

తప్పించుకొనేందుకు చెరువులోకి..

శవమై తేలి

- పోలీసులు చంపారని కుటుంబ సభ్యుల ఆరోపణ
- తప్పించుకునే క్రమంలో చనిపోయాడని పోలీసుల వాదన



మాతంగి భరత్(ఫైల్)

తెనాలి, మారీసుపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): అరెస్ట్ చేసేందుకు పోలీసులు వచ్చినప్పుడల్లా చెరువు దూకడం గంటల కొద్ది అదే చెరువులో ఒకచోట అదృశ్యమై మరోచోట ప్రత్యక్షమవడం.. అపై పోలీసులకు చిక్కకుండా పారిపోవడం ఆ రౌడీషటర్ వ్యూహం. చివరకు ఆదే చెరువులో శవమై కన్పించడం వివాదాస్పదమైంది. అతని కుటుంబ సభ్యులు మాత్రం పోలీసులే చంపి చెరువులో పడేశారని ఆరోపిస్తున్నారు. అరెస్ట్ వారెంట్‌తో అదుపులోకి తీసుకునేందుకు అతని ఇంటికి వెళ్తే పరారైందుకు చెరువులోకి దూకి.. పట్టపగలే ముప్పతిప్పలు పెట్టాడని, రాత్రి వేళ దొరకడని వదలివేసి వచ్చామని మరో పక్క పోలీసులు చెబుతున్నారు. పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న రౌడీషీటర్ మాతంగి భరత్ (30) శుక్రవారం తెల్లవురుజామున ఐతానగర్ చెరువులో శవమై కన్పించాడు. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ఐతానగర్‌కు చెందిన రౌడీషీటర్ మాతంగి భరత్ ఇటీవల కండిషనల్ బెయిల్ మీద ఇంటికి వచ్చాడు. గత సంవత్సరం నవంబరు 18న స్థానిక త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు అతనిపై నమోదైంది. అదే నెల 24న కోర్టులో హాజరు పరచగా.. అప్పటి నుంచి అతను విచారణకు కోర్టుకు వెళ్లకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. దీంతో కోర్టు అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. ఈ అరెస్ట్ వారెంట్ తీసుకొని పోలీసులు భరత్ ఇంటికి వెళ్లారు. పోలీసులను చూసిన రౌడీషీటర్ చెరువులోకి దూకి తప్పించుకునే ప్రయత్నం చేశాడు. అనంతరం అతని మృతదేహం చెరువులో తేలింది. మృతదేహన్ని చెరువు నుంచి బయటకు తీసి పోస్ట్‌మార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు ఆవేదనకు లోనయ్యారు. తన బిడ్డను కావాలని చంపేశారంటూ ఆరోపించారు. కాగా భరత్‌పై వివిధ పోలీస్ స్టేషన్లలో 13 కేసులు నమోదయ్యాయి. ఆరు చోరీ, మూడు పోక్సో, రెండు దారి దోపిడీ తదితర కేసులున్నాయి. పోలీసుల విచారణలో మృతుడి మరణానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ప్రభుత్వ ఐటీఐల్లో..

ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు విద్య జూలై 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రవేశానికి రెండో విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సహాయ సంచాలకులు సాయి వరప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పదో తరగతి మార్కుల జాబితా, టీసీ, కుల ధ్రువీకరణ పత్రం, విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్ జిరాక్స్, ఫొటో, మెయిల్ ఐడీ, ఫోన్ నంబరు తదితర వివరాలతో ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సంప్రదించాలని తెలిపారు.

ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో స్వయం ఉపాధి శిక్షణ

నిరుద్యోగ యువతకు గుంటూరులోని కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో టూ వీలర్, ఎలక్ట్రీషన్ కోర్సులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంయుక్త సంచాలకులు సాయి వరప్రసాద్ తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్, ఫోన్ నంబరు, ఫొటో ఫోటో తదితర వివరాలతో ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 18లోగా సంప్రదించాలని సూచించారు ఇతర వివరాలకు 9951 677 559, 97039 27766 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

నేడు, రేపు పనిచేయనున్న ఆర్ఎస్‌కేలు

గుంటూరు సిటీ, జూలై 11(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ ఫిర్యాదులు పరిష్కరించేందుకు ఈ నెల 13న ఆదివారం చివరి రోజు కావడంతో రైతు సేవాకేంద్రాలు సెలవు రోజుల్లో కూడా పనిచేస్తాయని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం, ఆదివారం సెలవు రోజులు అయినప్పటికీ రైతుల సౌలభ్యం కోసం రైతు సేవా కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. రైతులు ఆధార్ కార్డులు తీసుకొని వెళ్లి పేర్లు జాబితాలో ఉన్నాయో.. లేదో పరిశీలించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి విజ్ఞప్తి చేశారు.

బావ మరిది చేతిలో బావ హతం



కృష్ణ బాబు (ఫైల్)

పొన్నూరుటౌన్, చేబ్రోలు, జులై11(ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు బానిసై ప్రతి రోజు సోదరిని ఇబ్బంది పెడుతున్న బావను బావ మరిది హత్య చేసిన ఘటన శుక్రవారం చేబ్రోలు మండలం, గుండవరం గ్రామంలో చోటు చేసుకుంది. చేబ్రోలు పోలీసుల కథనం ప్రకారం.. గుండవరం గ్రామానికి చెందిన నన్నపనేని కృష్ణబాబు (35)కి అదే గ్రామానికి చెందిన మక్కే భువనేశ్వరితో 12 ఏళ్ల క్రితం వివాహం అయింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వ్యవసాయం చేసే కృష్ణబాబు కొంత కాలంగా మద్యానికి బానిసగా మారాడు. ఈ నేపథ్యంలో భార్యాభర్తలు ఇద్దరి మధ్య తరచూ ఘర్షణ నడుస్తోంది. శుక్రవారం కూడా భార్యాభర్తల మధ్య గొడవ జరగగా భువనేశ్వరి తన సోదరుడు గోపికి ఫోన్ చేసి విషయం చెప్పింది. అక్కడికి చేరుకున్న గోపీ.. సోదరితో గొడవ పడుతున్న బావను క్షణికావేశంలో కర్రతో తలపై బలంగా కొట్టాడు. స్థానికులు అతనిని వడ్లమూడిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తల్లి వీరకుమారి ఫిర్యాదు మేరకు చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రజలు, విద్యార్థుల పక్షాన ఏబీవీపీ పోరాడుతుంది

పెదకాకాని, జూలై 11(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలు, విద్యార్థుల పక్షాన ఏబీవీపీ పోరాడుతుందని రాష్ట్ర కార్యదర్శి వెంకట గోపి తెలిపారు. శుక్రవారం అఖిలభారతి విద్యార్థి పరిషత్ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ శాఖ ఆధ్వర్యంలో ఎమర్జెన్సీ గురించి సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట్ గోపి మాట్లాడుతూ 1975 జూన్ 25 నుంచి 1977 మార్చి 21 వరకు అప్పటి ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ ఆధ్వర్యంలో విధించిన ఎమర్జెన్సీ కాలంలో ప్రజలు ఎదుర్కొన్న కష్టాలను, స్వేచ్ఛా హక్కుల ఉల్లంఘనలను, పత్రికా స్వాతంత్ర్యం అణచివేతను ఈ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఏబీవీపీ చేసిన పోరాటాన్ని ఈ సెమినార్ లో వివరించారు. ఏబీవీపీ జాతీయ కార్యదర్శి శ్రవణ్రా బి.రాజ్ మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో పోరాటం చేశారన్నారు. నేషనల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ వేదశ్రీ, స్టేట్ శోద్ కన్వీనర్ రమాకాంత్, స్టేట్ టెక్నికల్ సెల్ కన్వీనర్ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటా

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటానని తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని మారుతినగర్లో ఆయన పర్యటించారు. స్థానికులను పలకరించి తమ పాలనపై అభిప్రాయాలను సేకరించారు. వారి బాగోగులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుపరిపాలన సువర్ణ అధ్యాయమని, నియోజకవర్గ ప్రజలకు ఏ సమస్య వచ్చినా తాను ఉన్నానని గుర్తుంచుకోవాలని ఆయన చెప్పారు. మీ బిడ్డల భవిష్యత్తుకు విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ బంగారు బాటలు వేస్తారని తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో విద్య, వైద్య రంగాల్లో ఉన్నతమైన ప్రగతి సాధిస్తున్నామని వెల్లడించారు. విద్యారంగంలో అన్ని పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక కృషి చేస్తున్నామని, వైద్య రంగంలో దాతలు, ప్రభుత్వ సహకారంతో మెరుగైన సేవలు అందిస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జీజీహెచ్ రూపురేఖలు మార్చేస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా వైద్యానికి ఇక్కడికే వస్తున్నారని చెప్పారు. ప్రతి గడపలోనూ సంతోషం కనిపిస్తోందని అన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నియోజకవర్గంలో తన కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే నసీర్ 30 మందికి రూ.32,45,601 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తూ సీఎం రిలీఫ్ ఫండ్ కాపాడుతుందని తెలిపారు. జూలై నెలలో ఎల్ఓసీల ద్వారా పేద ప్రజల ఆరోగ్యానికి రూ.70,84,174 మంజూరు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎల్లావుల అశోక్, జాగర్లమూడి శ్రీనివాసరావు, నరసింహారావు, కిరణ్, జమీర్, మొహమ్మద్, వాణి, ఐలా శ్రీనివాసరావు, పిచ్చిరెడ్డి, మధు, మౌళిక, హబీబ్, నాగేశ్వరరావు, బాబు తదితరులు పాల్గొన్నారు.



స్థానికులతో కలిసి సుపరిపాలన కరపత్రాలను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే నసీర్

ఆశించిన స్థాయిలో జరగని పనులు

● జాప్యం చేస్తున్న కాంట్రాక్టర్లు, అధికారులపై చర్యలు
● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): నగరంలో టెండర్ ఆమోదం పొందిన అభివృద్ధి పనులు క్షేత్ర స్థాయిలో ఆశించిన స్థాయిలో జరగడం లేదని, పనుల్లో జాప్యం చేస్తున్న కాంట్రాక్టర్లు, పర్యవేక్షణ అధికారులపై చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. కమిషనర్ చాంబర్లో శుక్రవారం ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ అభివృద్ధి పనులు సంబంధించి తమ నుంచి ఆమోదం పొందిన టెండర్లకు వర్క్ ఆర్డర్లు ఇచ్చి, క్షేత్ర స్థాయిలో చేయించడంలో ఇంజనీరింగ్ అధికారులు నిర్లక్ష్యంగా ఉంటున్నారన్నారు. ఇక నుంచి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎమినిటి కార్యదర్శులకు జాబ్ చార్ట్, క్షేత్ర స్థాయి పనుల పరిశీలనపై శిక్షణ ఇవ్వాలని ఎస్ఈని ఆదేశించారు. అభివృద్ధి పనుల పురోగతిపై ప్రతి వారం సమీక్ష చేస్తామన్నారు. నగరంలోని మేజర్, మీడియం డ్రెయిన్లలో సూయిజ్ ఆగకుండా పూడిక పనులు జరగాలని, పనులను తమ రోజువారీ క్షేత్ర స్థాయి విజిట్లో పరిశీలిస్తామన్నారు. సమావేశంలో ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్, ఈఈ కోటేశ్వరరావు, ఏడీహెచ్ శాంతి, మేనేజర్ బాలాజీ, బాషా, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.



ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

సెలవు రోజుల్లో కూడా పనిచేయనున్న రైతు సేవాకేంద్రాలు

గుంటూరు సిటీ, జూలై 11(ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ ఫిర్యాదులు పరిష్కరించేందుకు ఈనెల 13వ తేదీ వరకు గడువు కావటంతో రైతు సేవాకేంద్రాలు సెలవు రోజుల్లో కూడా పని చేస్తాయని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు తెలిపారు. శనివారం, ఆదివారం వాస్తవానికి సెలవు రోజులు అయినప్పటికీ రైతుల సౌలభ్యం కోసం రైతు సేవా కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉంటారని చెప్పారు. రైతులు ఆధార్ కార్డులు తీసుకొని వెళ్లి పేర్లు అర్హుల జాబితాలో ఉన్నాయో.. లేదో పరిశీలించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి విజ్ఞప్తి చేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి

గుంటూరు(తూర్పు), జూలై 11(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ మస్తాన్ షరీఫ్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట శుక్రవారం చేపట్టిన నిరసనలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే బకాయిలను చెల్లిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. దాదాపు 6,500 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని ఎప్పుడు విడుదల చేస్తారని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించకపోవడంతో కళాశాల యాజమాన్యాలు విద్యార్థులపై ఫీజుల కోసం ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. బాలికల కన్వీనర్ బాల నవ్యశ్రీ, జిల్లా కార్యదర్శి యశ్వంత్ రవిపురి మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఉన్నత చదువులను దూరం చేసే జీవో నెంబర్ 77 రద్దు చేయాలన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలు ముగిసి మూడు నెలలు గడుస్తున్నా నేటికి డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించకపోవడం బాధాకరమన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే త్వరలోనే చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం డీఆర్వో ఖాజావలికి వారు వినతి పత్రం అందజేశారు. నిరసనలో శివ, అమర్నాథ్, ఆజాద్, రాహుల్, ఆనంద్, డేవిడ్, సాగర్, తేజ, కిరణ్, పవన్, ప్రణీత్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సనాతన ధర్మమే.. జీవనమార్గం

గుంటూరు(తూర్పు), జూలై 11 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మమే.. జీవనమార్గమని శుక్రవారం సనాతన ధార్మిక సంస్థల ఉపప్రధ్య లక్ష్మణ సూరి అన్నారు. బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం, పద్మావతి కళ్యాణవేదికపై శుక్రవారం సనాతన ధర్మం-జీవన మార్గంపై ఆధ్యాత్మిక ప్రసంగం జరిగింది. ఆయన ఉపన్యసిస్తూ సనాతన ధర్మం మతం కాదని, జీవన విధానమని, ప్రకృతిని ఆరాధించే సంస్కృతి మన సంప్రదాయమన్నారు. విశ్వమే మన భూమి అంతా విస్తరించినదే ది సనాతన ధర్మమన్నారు. మనలో ఉన్న పరమాత్మను చేరడానికి భక్తి, కర్మ, జ్ఞాన మార్గాల ద్వారా మన సనాతన ధర్మం ఎన్నో సంప్రదాయాలను తరతరాలుగా అందించిందన్నారు. తొలుత ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఓబులూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

శంకర్‌విలాస్ ఆర్‌వోబీ పనుల్లో వేగం పెంచాలి

● ఆర్‌యూబీల వద్ద నీరు నిలబడకుండా చూడండి
● కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలు



శంకర్‌విలాస్ ఆర్‌వోబీ పనులపై సమీక్షిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, పక్కన కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : శంకర్‌విలాస్ రోడ్డు ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. కలెక్టర్ తన ఛాంబర్‌లో శుక్రవారం నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి శంకర్ విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులపై ఆర్ అండ్ బీ, నగరపాలకసంస్థ, పోలీస్, విద్యుత్తు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న ఓవర్ బ్రిడ్జి కూల్చివేత పనులు త్వరలో ప్రారంభించనున్నందున అప్పుడు బ్రిడ్జిపై వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ప్రత్యామ్నాయంగా గుర్తించిన రహదారుల్లోకి వాహనాల మళ్లింపుపై ట్రయల్ రన్‌ను నిర్వహించాలని ట్రాఫిక్ పోలీసులకు సూచించారు. ట్రాఫిక్ మళ్లింపుపై రూట్ మ్యాప్‌లతో సహా నగర ప్రజలకు, వాహనదారులకు పూర్తిస్థాయిలో అవగాహన కలిగేలా ప్రచార మాధ్యమాలు, మీడియా, స్థానిక ఎలక్ట్రానిక్ ఛానెల్స్, ఫ్లెక్సీల ప్రదర్శన ద్వారా విస్తృత స్థాయిలో ప్రచారం కల్పించాలన్నారు. రానున్న వర్షాకాలం నేపథ్యంలో మూడు వంతెన వద్ద, కంకరగుంట ఆర్‌యూబీ వద్ద వర్షం నీరు నిల్వ ఉండకుండా ఉండేందుకు అవసరమైన మోటర్లు, జనరేటర్లను సిద్ధం చేసుకోవాలన్నారు. 24 గంటలు విధుల్లో ఉండేలా ప్రత్యేకంగా సిబ్బందిని నియమించుకోవాలని నగరపాలక సంస్థ అధికారులకు సూచించారు. ట్రాఫిక్ మళ్లించే ప్రత్యామ్నాయ మార్గాల్లో రహదారుల అభివృద్ధి, మరమ్మతు పనులు, ఆక్రమణలు తొలగింపు పూర్తిస్థాయిలో చేపట్టాలన్నారు. విద్యాసంస్థల బస్సులన్నీ కంకరగుంట ఓవర్ బ్రిడ్జి మీద నుంచే ప్రయాణించాల్సి ఉన్నందున విద్యాసంస్థల నిర్వాహకులతో రవాణా శాఖ, విద్యాశాఖ అధికారులు సమావేశం నిర్వహించి విద్యాసంస్థలు ప్రారంభం, ముగిసే వేళల్లో అవకాశం ఉన్నంతవరకు అందరూ ఒకే సమయంలో కాకుండా గంట, అరగంట వ్యత్యాసంతో తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌ఓబీ విస్తరణకు సంబంధించిన ప్రాంతాల్లోని భవనాల తొలగింపు పనులు వేగవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్రీనివాసమూర్తి, నగరపాలక సంస్థ ఎస్ఈ శివ నాగమల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ట్రాఫిక్ సిఐ సింగయ్య, విద్యుత్ శాఖ అధికారులు, బ్రిడ్జి నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐటీసీ సంస్థ సేవలు అభినందనీయం

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు కార్పొరేషన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఐటీసీ బంగారు భవిష్యత్ నగరపాలక సంస్థతో కలిసి సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, కమ్యూనిటీ టాయిలెట్స్ నిర్మాణం, స్కూల్స్‌లో డైనింగ్ హాల్స్ నిర్మాణం చేయడం అభినందనీయమని పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. ఐటీసీ బంగారు భవిష్యత్ సంస్థ నిర్మాణం చేసిన స్థానిక ఎన్జీఓ కాలనీ మునిసిపల్ స్కూల్లో విద్యార్థినుల కోసం డైనింగ్ హాల్, తుఫాన్ నగర్‌లో కమ్యూనిటీ టాయిలెట్స్‌ను శుక్రవారం కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పశ్చిమ ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ తుఫాన్‌నగర్‌లో కమ్యూనిటి టాయిలెట్స్ నిర్మాణం ద్వారా సుమారు 35 పేద కుటుంబాలు నివశించే ప్రాంతంలో బహిరంగ మల, మూత్ర విసర్జన లేకుండా చేశారన్నారు. అలాగే ఎన్జీఓ కాలనీ మున్సిపల్ స్కూల్లో ప్రత్యేకంగా విద్యార్థినుల కోసం సుమారు 200 మంది సామర్థ్యంతో డైనింగ్ హాల్ నిర్మాణం చేయడం అభినందనీయమన్నారు. సదరు స్కూల్లో తడి వ్యర్థాలను 45 రోజుల పాటు శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించి, ఎరువు తయారు చేసి, మొక్కలకు వినియోగిస్తున్నారన్నారు. కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ పర్యావరణంపై ప్రజల్లో అవగాహన కలిగించడానికి, పిల్లలు ఆరుబయట ఆహారం తీసుకోకుండా డైనింగ్ హాల్ నిర్మాణం చేసిన ఐటీసీ సంస్థ ప్రతినిధులను అభినందిస్తున్నామన్నారు. ఐటీసీ ఏబీడీ వైస్ ప్రెసిడెంట్ వీరాస్వామి మాట్లాడుతూ తుఫాన్‌నగర్ లో రూ.12 లక్షలతో కమ్యూనిటి టాయిలెట్స్, ఎన్జీఓ కాలనీ మున్సిపల్ స్కూల్లో రూ.8 లక్షలతో డైనింగ్ హాల్ నిర్మాణం చేసి అందించామని తెలిపారు. ఇప్పటికే నగరంలో ఐటీసీ బంగారు భవిష్యత్ ద్వారా పలు కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఐటీసీ బంగారు భవిష్యత్ పిఎం గౌరీ నాయుడు, ఫినిష్ సొసైటీ మేనేజర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.



కమ్యూనిటీ టాయిలెట్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవి, కమిషనర్ తదితరులు

పూర్తి స్థాయిలో పొగాకు కొనుగోళ్లు జరగాలి

గుంటూరు(తూర్పు), జూలై 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతుల వద్ద ఉన్న మొత్తం పొగాకును గిట్టుబాటు ధరకే కొనుగోలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాశం రామారావు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక చుట్టుగుంట వద్ద ఏర్పాటు చేసిన పొగాకు కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం నాయకులు సందర్శించారు. వారు మాట్లాడుతూ నాణ్యత లేదని, నాసిరకం అని చెప్పి కొనుగోళ్లు నిలుపుదల చేయడం సరైనది కాదన్నారు. అధిక వడ్డీలకు అప్పుచేసి పంట పండిస్తే కేంద్రాలలో తక్కువ ధర ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది 30 వేల టన్నులు ఉత్పత్తి రాగా, కేవలం 4 వేల టన్నులు మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేసిందని గుర్తు చేసుకున్నారు. దీంతో ప్రైవేటు కంపెనీలు గ్రామాలలోనే తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గిట్టుబాటు ధరకే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పెదనందిపాడులో కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వై.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక శాఖ స్థలాన్ని పరిశీలించిన అధికారులు

గుంటూరు(తూర్పు), జూలై 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక వల్లూరివారి తోట, 6వ లైన్‌లోని కార్మిక శాఖకు సంబంధించిన స్థలాన్ని కార్మిక శాఖ అధికారులు, సర్వే అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థలంలో పెద్ద ఎత్తున ఆక్రమణలను గుర్తించి, కార్మిక శాఖ అధికారుల సమక్షంలో సర్వే నిర్వహించారు. 13.50 ఎకరాలు ఉన్న స్థలంలో దాదాపు 1.50 ఎకరాలు ఆక్రమణలకు గురైనట్టు అధికారులు గుర్తించారు. అనంతరం ఉప కార్మిక కమిషనర్ గాయత్రిదేవి మాట్లాడుతూ ఆక్రమణల తొలగింపు కార్యక్రమం వెంటనే చేపడుతున్నట్టు స్పష్టం చేశారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర కార్మిక శాఖ కమిషనర్ దండమూడి లక్ష్మి, కోటేశ్వరరావు, సర్వే ఏడీ పవన్‌కుమార్, తూర్పు నియోజకవర్గ సర్వేయర్ రామాంజనేయులు పాల్గొన్నారు.

విజయపురికాలనీలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

● అర్ధరాత్రి వరకు అల్లాడిన కాలనీ వాసులు

గుంటూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రింగ్ రోడ్డులోని విజయపురి కాలనీలో తరచూ అంతరాయాలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. గురువారం రాత్రి పది గంటల నుంచి అర్ధరాత్రి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం రావటంతో అంధకారంలో మగ్గిపోయారు. వికాస్‌నగర్, కొరిటపాడు ప్రాంతాల్లో కూడా తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు కలుగుతున్నాయని స్థానికుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతోన్నాయి. అధికారులు స్పందించి విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు...

గుంటూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా రెండో శనివారం పురస్కరించుకొని నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు గుంటూరు టౌన్-1 ఆపరేషన్ ఈఈ తిరుమలశెట్టి శ్రీనివాసబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

పాతగుంటూరులో చోరీ

గుటూరు కార్పొరేషన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : పాత గుం టూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీనగర్ మొదటి లైనులో చోరీ జరిగినట్టు పాతగుంటూరు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం లక్ష్మీనగర్ మొదటి లైనుకు చెందిన ఉప్పలపాటి అంకమ్మరావు శుక్రవారం సాయిబాబా గుడి దగ్గరకు వెళ్లి వచ్చే సమయానికి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో తలుపులు పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.8 లక్షల నగదు, రెండున్నర సవర్ల బంగారం చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

నల్లమల జోన్ ఫుట్‌బాల్ విజేతగా బాపట్ల

గుంటూరు (తూర్పు), జూలై 11(ఆంధ్రజ్యోతి): గుంటూరులోని పేరేచర్ల మైదానంలో జిల్లా ఫుట్ బాల్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో సబ్ జూనియర్ బాలుర విభాగంలో రెండు రోజులుగా జరుగుతున్న నల్లమల జోన్ ఫుట్‌బాల్ పోటీలు శనివారంతో ముగి సాయి. గుంటూరు, పల్నా డు, బాపట్ల, ప్రకాశం జిల్లాల జట్లు తలపడ్డాయి. ఫైనల్‌లో గుంటూరు జిల్లా జట్టుపై 3-2 తేడాతో బాపట్ల జట్టు విజయం సాధించింది. అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుమ్మర క్రాంతికుమార్, దుర్గా మోహన్ మాట్లాడుతూ విజేతగా నిలిచిన జట్టు ఈ నెల 12 నుంచి రాజమండ్రిలో జరిగే స్టేట్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొంటుందని తెలిపారు. అనంతరం విజేతలకు ట్రోఫీలు, సర్టిఫికెట్స్ అందజేశారు.

శాకాంబరి అలంకరణలో శ్రీ కనకదుర్గమ్మ



సంగడిగుంటలో శాకాంబరి అలంకారం

గుంటూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): సంగడిగుంట వద్ద ఉన్న శ్రీ కనక దుర్గమ్మ అమ్మవారు శుక్రవారం శాకాంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రకాల కూరగాయల అలంకరణలో అమ్మవారు భక్తులను కనువిందు చేశారు. ఆషాఢ మాసం పురస్కరించుకొని భక్తులు తీసుకొచ్చిన కూరగాయలతో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, అన్న సంతర్పణ కార్యక్రమం చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మారెడ్డి శ్రీనివాసరెడ్డి, మూరబోయిన నరసింహారావు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మద్దిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, అరవ ఆంజనేయులు, కల్లి శ్రీనివాసరెడ్డి, మస్తాన్‌రావు, సాంబశివరావు, పత్రి అప్పారావు, బీసాబత్తిని వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

శారదాకాలనీలో...



శాకాంబరి అలంకరణలో మహాలక్ష్మమ్మ అమ్మవారు

గుంటూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): శారదాకాలనీ 27వ లైనులోని దేవాలయంలో ఆషాఢ మాసం పురస్కరించుకొని అమ్మవారు శుక్రవారం శాకాంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మహిళా భక్తులతో కుంకుమపూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం అమ్మవారికి ఆషాఢ సారె సమర్పణ కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు రావి వెంకటరత్తయ్య, దుగ్గినేని మహాలక్ష్మయ్య, గొడుగులూరి సుబ్బారావు, వెంకట నారాయణ తెలిపారు. సదాశివశర్మ నేతృత్వంలో క్రతువుని నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో బాల త్రిపుర సుందరి హోమం

గుంటూరు(తూర్పు), జూలై 11(ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడీపేట, 2వ లైన్‌లో కొలువైన శ్రీ గౌరీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయ శతాబ్ధి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం బాల త్రిపుర సందరి షడక్షరీ హోమంను బుత్వికులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం చండీ హోమం, అమ్మవారికి లక్ష కుంకుమార్చన జరిపారు. ఉత్సవంలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు గావించారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆంజనేయ స్వామి వారికి లక్ష నాగవల్లి దళార్చన నిర్వహిస్తున్నట్టు నిర్వహకులు తెలిపారు.

అమ్మవారికి ఆషాఢ సారె సమర్పణ



అమ్మవారికి సారెను సమర్పిస్తున్న మహిళలు

గుంటూరు(తూర్పు), జూలై 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక గోరంట్ల, శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అన్నపూర్ణ అమ్మవారికి, పద్మావతి అమ్మవారికి, అండాళ్ అమ్మవారికి శుక్రవారం 108 రకాల సారెను మహిళలు సమర్పించారు. భక్త బృందం నగర వీధులలో కోలాహలంగా ఊరేగింపుగా, కోలాట ప్రదర్శన చేస్తూ ఆలయానికి చేరుకొని అమ్మవారికి సారె సమర్పించారు. అనంతరం భక్తి ప్రపత్తులతో లక్ష్మీ సహస్రనామ పారాయణం గావించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొంది, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

గుంటూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ఊరు, పేరు తెలియని సుమారు 50 నుంచి 55 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి రాజాగారితోట 5వ లైనులో మృతి చెందాడు. చుట్టు పక్కల ఏరియాలో బిక్షాటన చేస్తూ తిరుగుతున్నట్లు స్థానికులు తెలిపారు. అయితే శుక్రవారం ఉదయం 10.30 గంటలకు రాజగారితోట 5వ లైను వద్ద గల కృష్ణ మహల్ వెనుక అపస్మారక స్థితిలో పడివున్నట్లు 112 ద్వారా స్థానికులు సమాచారం ఇచ్చారు. దీంతో కొత్తపేట పోలీసులు మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని శవాగారంలో భద్రపరిచారు. మృతదేహాన్ని గుర్తించిన వారు కొత్తపేట పోలీస్ స్టేషన్ సీఐని 8688831320లో సంప్రదించాలని పోలీసులు కోరారు.



ఎమ్మెల్యే మాధవికి తమ సమస్యలు చెప్పుకుంటున్న వృద్ధ మహిళ

ఆర్థిక లోటు ఉన్నా 80 శాతం హామీలు అమలు

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్థిక లోటు ఉన్నప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 80 శాతం హామీలను మొదటి ఏడాదిలోనే అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. నియోజకవర్గంలోని 34, 38వ డివిజన్‌లలో శుక్రవారం ఆమె సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. డివిజన్లలో పర్యటించి ప్రభుత్వం అమలు చేసిన హామీలను వివరిస్తూ రూపొందించిన కరపత్రాన్ని ప్రజలకు అందజేశారు. వారి నుంచి అభిప్రాయాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ గుజ్జన గుండ్ల, పాతిమాపురంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించామని, తల్లికి వందనం పొందిన అనేకమంది తల్లులు ఆనందం వ్యక్తం చేశారని తెలిపారు. మరో వైపు యువత 'రాష్ట్రానికి పరిశ్రమలు రావడంపై హర్షం వ్యక్తం చేస్తూ, అమరావతి నిర్మాణం పూర్తి చేసి తమ భవిష్యత్తుకి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భరోసా కల్పిస్తారన్న నమ్మకం తమకు ఉందన్నారు. స్థానిక పేదలు తమ ఇళ్లకు బీ-ఫారం పట్టాలు కావాలని అడుగుతున్నారని, చర్చి కూడా అడుగుతున్నారని వీటన్నిటిని పరిశీలించి ప్రజలందరికీ న్యాయం చేసేలా చేస్తామని ఎమ్మెల్యే గళ్లా మాధవి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి కనకాచారి, మల్లె ఈశ్వరరావు, తాళ్ళ వెంకటేశ్ యాదవ్, షేక్ అన్వర్, పఠాన్ అస్మా, మన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో రూ.3,500 కోట్ల మద్యం కుంభకోణం

● ఏపీఐడీసీ చైర్మన్ దేగల ప్రభాకర్



దేగల ప్రభాకర్

గుంటూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : జగన్‌రెడ్డి పాలనలో జరిగిన మద్యం కుంభకోణం విషయంలో పుట్టలోనుంచి పాములు బయటకు వచ్చినట్లు రోజుకో కొత్త అంశం బయటపడుతోందని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్ అన్నారు. టీడీపీ నగర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మద్యం కుంభకోణంలో జరిగిన సంఘటనలను చూసి ప్రజలు నివ్వెరపోతున్నారన్నారు. మద్యంలో జరిగిన అవినీతికి సంబంధించి నాడు టీడీపీ చేసిన వ్యాఖ్యలకు సాక్ష్యాలు నేడు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయన్నారు. అవినీతి చేసి తప్పించుకోవడం, కేసులను తప్పుదారి పట్టించడం వంటి వ్యవహారాల్లో ఏళ్ల కిందటే తలపండిపోయిన వైసీపీ ముఠా, మద్యంలో అంతర్జాతీయ కుంభకోణానికి పాల్పడ్డారన్నారు. దశలవారీగా మద్యపాన నిషేధమంటూ 2019లో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి దశలవారీగా అవినీతికి పాల్పడ్డారన్నారు. జగన్ నాసిరకం మద్యం ద్వారా రాష్ట్రంలో లక్షల మందిని అనారోగ్యం పాలు చేశారని, వేల మంది ప్రాణాలను తీసి మహిళల మాంగళ్యాలను తెంచారని మండిపడ్డారు. మనీ లాండరింగ్ చేయడంలో వైసీపీ దొంగల ముఠా మాస్టర్స్ చేశారన్నారు. మద్యం సరఫరా, తయారు కంపెనీల నుంచి రూ.3,500 కోట్లను ముడుపుల రూపంలో వైసీపీ దొంగల ముఠా దోచుకున్నారని ఆరోపించారు.



సామినేని కోటేశ్వరరావుకు చెక్కును అందజేస్తున్న గోగినేని వెంకటేశ్వర్లు

నూతన భవన సముదాయానికి విరాళం

గుంటూరు(తూర్పు), జూలై 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ రోడ్డులో కమ్మ జన సేవ సమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న భవన సముదాయంలో ఒక గదికి అయ్యే ఖర్చు రూ.6 లక్షల విరాళాన్ని గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెం గ్రామానికి చెందిన గోగినేని వెంకటేశ్వర్లు ప్రకటించారు. స్థానిక కుందుల రోడ్డులోని కమ్మ బాలికల వసతి గృహంలో సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావుకు ఈ చెక్కును అందజేశారు. దాతలు మాట్లాడుతూ గ్రామీణ బాలికల విద్యను ప్రోత్సహిస్తున్న కమ్మ జన సేవా సమితి సేవలు అభినందనీయమన్నారు. సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ ఆడపిల్లల భవితకు దాతలు అందజేస్తున్న విరాళాన్ని పారదర్శకంగా ఖర్చు పెడుతున్నా మని తెలిపారు. నూతన భవన సముదాయాన్ని త్వరలోనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు వడ్లమూడి నాగేంద్రం, కోశాధికారి గోరంట్ల పున్నయ్య చౌదరి, పాలకవర్గ సభ్యుడు పెద్ది సాంబశివరావు, దాతలు గోగినేని గురుదీపక్, ఉదయకృష్ణ పాల్గొన్నారు.

యువతి అనుమానాస్పద మృతి

గుంటూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ప్రేమించుకుని పెద్దలను ఎదిరించి పెళ్లి చేసుకున్న ఓ యువతి ఎనిమిది నెలలకే అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సంజీవయ్యనగర్‌లో గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ప్రత్తిపాటి ప్రవళ్ళిక (23) అనే యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పల్నాడు జిల్లా మండల కేంద్రమైన ముప్పాళ్ళకు చెందిన ప్రత్తిపాటి ప్రవళ్ళిక (23) గతంలో నగరంలోని రియల్ ఎస్టేట్ కంపెనీలో మార్కెటింగ్‌లో పని చేసింది. ఆ సమయంలో అదే కంపెనీలో పొన్నూరు మండలం ములుకుదురు గ్రామానికి చెందిన కంతేటి పవన్ కుమార్ కూడా పని చేశాడు. అక్కడ వారిద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. అనంతరం ప్రేమగా మారి ఇరువురు పెళ్లి చేసుకోవాలనుకున్నారు. వారిరువురు ఒకే కులమైనప్పటికీ ఉప కులాలు వేరు కావడంతో పాటు ఈ పెళ్లి ప్రవల్లిక తల్లిదండ్రులకు ఇష్టం లేదు. అందుకు వారు ఒప్పుకోలేదు. దీంతో ప్రవల్లిక తల్లిదండ్రులను ఎదిరించి ఇంటి నుంచి వచ్చేసి ఎనిమిది నెలల క్రితం పవన్ కుమార్‌ను పెళ్లి చేసుకుంది. గడిచిన ఐదు నెలలుగా పవన్ కుమార్, ఆయన తల్లిదండ్రులు, ప్రవల్లిక కలసి సంజీవయ్యనగర్‌లో ఇల్లు అద్దెకు తీసుకొని నివాసం ఉంటున్నారు. అయితే పెళ్లయినప్పటి నుంచి భార్యాభర్తల మధ్య స్వల్ప వివాదాలు నెలకొన్నాయి.

ఈ క్రమంలో రెండు రోజుల క్రితం జరిగిన గొడవలో పవన్ కుమార్ భార్య సెల్‌ఫోన్ పగలగొట్టాడు. అంతేగాక కొద్దిరోజులుగా ప్రవళ్ళిక తన తల్లిదండ్రులతో మాట్లాడాలంటూ బంధువులకు ఫోన్ చేసి అడుగుతోంది. ఈ విషయాన్ని తన భర్తకు కూడా చెప్పింది. అందుకు భర్త కూడా అంగీకరించాడు. ఇంతలో ఏం జరిగిందో కానీ గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు రెండు గంటల సమయంలో ప్రవల్లిక అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. అయితే ప్రవళ్ళిక నైలాన్ తాడుతో ఇంటిలో ఉరి వేసుకుందని, తాము వెంటనే గమనించి కిందకి దించి ఆసుపత్రికి తీసుకు వెళ్ళామని, అప్పటికే ఆమె మృతి చెందినట్లు భర్త పవన్ కుమార్ అంటున్నాడు. అయితే భర్త, అత్తమామలే తమ కుమార్తెను చంపి ఉంటారని మృతురాలి తల్లిదండ్రులు అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మృతురాలు అనుమానాస్పద స్థితిలో చనిపోయినట్లు మృతురాలి తల్లి అయిన ప్రత్తిపాటి ఆశీర్వాదం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అరండల్ పేట పోలీసులు తెలిపారు.

ఆంధ్రాప్యారిస్‌లో బోటు షికారు

- నిజాంపట్నం కాల్వలో ఏర్పాటుకు సన్నాహాలు
- సాధ్యాసాధ్యాలను పరిశీలించిన ఏపీ టూరిజం అధికారులు
- మంత్రి మనోహర్ ఆలోచనలకు పదేళ్ల తర్వాత కార్యరూపం
- ఇది సాకారమైతే తెనాలికి కొత్త అందాలు

తెనాలి, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రాప్యారిస్ అన్న పేరుకు మరింత సార్ధకత చేకూర్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. అందుకు తగ్గట్లుగా తెనాలిని బోటు షికారు, గ్లాస్ బ్రిడ్జిపై నడకతో పాటు.. చిన్నారుల కోసం పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు ఎట్టకేలకు ఒక అడుగు ముందుకు పడింది. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఉమ్మడి రాష్ట్రంలో స్పీకర్‌గా ఉన్న సమయంలోనే తెనాలిలో మూడు కాల్వ కట్టలను సుందరీకరించి, బోటు షికారు ఏర్పాటు చేయాలని ఆలోచించారు. అయితే అప్పట్లో అది ఆచరణకు నోచుకోలేదు. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మనోహర్ దీనిపై దృష్టి పెట్టారు. ఇటీవల టూరిజం, రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులతో దీనిపై చర్చ జరిపారు. ఆయన ఆలోచనలో భాగంగానే శుక్రవారం పర్యాటక శాఖ ప్రత్యేక బృందం తెనాలి, దుగ్గిరాలలో కాల్వలను పరిశీలించింది. తెనాలి పట్టణం నడిబొడ్డు నుంచి ప్యారిస్ తరహాలో మూడు కాల్వలు ప్రవహిస్తుండటంతో ఆంధ్రా ప్యారిస్‌గా పేరు వచ్చిన సంగతి తెలిసిందే. ఎల్లప్పుడూ నీటి ప్రవాహంతో కళకళలాడే కాల్వలతో పాటు పచ్చందాలను తీర్చిదిద్దగల అవకాశాలు ఉన్నా. ఇప్పటి వరకు వీటిని ఆచరణలో పెట్టే నాథుడు కరువయ్యాడు. కళా రంగానికే కాక ఎన్నో ప్రాముఖ్యతలకు నిలయమైన తెనాలిలో పర్యాటక శోభ మాత్రం అంతంత మాత్రంగానే ఉంది. అయితే ఆ ఆలోచన చెరిపి వేస్తూ ఒక అందమైన పర్యాటక హబ్‌గా తెనాలిని తీర్చిదిద్దేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు.



కాల్వల మ్యాప్‌ను పరిశీలిస్తున్న టూరిజం జీఎం నాగేశ్వరరావు, సబ్ కలెక్టర్ సంజన సింహా తదితరులు

ఆక్రమణలు, ఆటంకాలు తొలగిస్తే..

వైకుంఠపురం గుడి దగ్గర నుంచి వీఎస్ఆర్ కళాశాల వరకు నిజాంపట్నం కాల్వ ఒకటిన్నర కి.మీ పొడవు ఉంటే దీనిలో కొంత మేర స్పీడ్ బోట్లు, మరికొంత ప్రదేశంలో నెమ్మదిగా వెళ్లే పెడల్ బోట్లను ఏర్పాటు చేయాలనేది పర్యాటక శాఖ ఆలోచన. ఇది జరగాలంటే కాల్వపై ఆక్రమణలు తొలగించాల్సిన అవసరం ఉంది. ఈ కాల్వకు ఇరువైపులా ఉండాల్సిన వెడల్పు లేకుండా కొన్నిచోట్ల శాశ్వత ప్రతిపాదికన గోడలు కట్టి కొన్ని వ్యాపారాల నిర్వహణ కోసం ఆక్రమణలకు పాల్పడ్డారు. స్పీడు బోటు షికారు సాధ్యం కావాలంటే వీటిని తొలగించి కాల్వను వెడల్పు చేయాల్సిందే. ముఖ్యంగా కొత్త వంతెన, మార్కెట్ వంతెన, రైల్వేస్టేషన్ వంతెన, వీఎస్ఆర్ కళాశాల ఎదురు ఉన్న వంతెనల దగ్గర చిన్న, పెద్ద వ్యాపారులు కాల్వల్లోకి ఆక్రమించేసి మరీ నిర్మాణాలు చేసేశారు. అప్పట్లో వీటిని అడ్డుకోవాల్సిన ఇరిగేషన్ శాఖ రాజకీయ, ఇతర కారణాలతో వదిలి వేసింది. ఇదిలా ఉంటే వార్ఫ్ కట్టపై టింబర్ డిపోలు దశాబ్దాలు తరబడి ఉంటూ వచ్చాయి. గతంలో ఆటోనగర్ ఏర్పాటు అయ్యాక వీరందరిని అక్కడికి తరలి పోవాలని ఆదేశించినా రాజకీయ ప్రమేయంతో చాలా వరకు కట్టపైనే ఉండిపోయారు. వారి లీజు అనుమతులు కొన్ని ఇప్పటికే పూర్తి అయిపోతే మరికొందరు పొడిగించుకుంటూ వస్తున్నారు. అయితే వీటి విషయంలో నీటి పారుదల శాఖ ఏం నిర్ణయం తీసుకుంటుంది అనే దానిపై పర్యాటక కల నెరవేరే విషయం ఆధారపడి ఉంది.

ఏపీ టూరిజం శాఖ జీఎం నాగేశ్వరరావు, జిల్లా టూరిజం శాఖ అధికారి శ్రీరమ్య, మరికొందరు పర్యాటక శాఖకు చెందిన సభ్యులు, సబ్ కలెక్టర్ సంజన సింహాతో కలసి కాల్వలను పరిశీలించారు. పట్టణం మధ్య నుంచి తూర్పు, పశ్చిమ, నిజాంపట్నం కాల్వలు ప్రవహిస్తుంటే వీటిలో నిజాంపట్నం కాల్వ బోటు షికారుకు అనుకూలంగా ఉంటుందని నిర్ణయించారు. ఈ చానల్ కింద కేవలం 22,124 ఎకరాలు మాత్రమే సాగు అవుతుండటంతో నీటి విడుదలకు సంబంధించి సమస్యలు కూడా తక్కువగానే ఉంటాయి. సాగుకు అవసరమైన నీటిని వదులుతూనే బోటు షికారు కోసం అవసరమైన నీటిమట్టం నిర్వహించేందుకు అవకాశం కూడా ఉంది. దీనికి తోడు పర్యాటకానికి అవసరమైన అన్ని హంగులను తీర్చిదిద్దేందుకు వార్ఫ్ కట్ట అనుకూలంగా ఉండటంతో ఈ కాల్వపై బోటు షికారు ఆసక్తికరంగా ఉంటుందని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు వైకుంఠపురం వంతెన దగ్గర నుంచి వీఎస్ఆర్ కళాశాల ఎదురు ఉన్న వంతెన వరకు ఒకటిన్నర కిలోమీటర్ల పొడవు నిజాంపట్నం కాల్వను అధికారుల బృందం పరిశీలించింది. బోట్లు ఆపి ఎక్కేందుకు ఎక్కడ అనుకూలంగా ఉంది. ఫుడ్ కోర్టు, గార్డెనింగ్ చేసేందుకు ఏ ప్రాంతాన్ని ఎంపిక చేయాలి, మరింత ఆకర్షణీయతను పెంచేలా గ్లాస్ బ్రిడ్జ్ వంటి వాటిని ఎక్కడ నిర్మిస్తే బాగుంటుంది అనే అంశాలకు సంబంధించి ప్రాంతాల వారీ పరిశీలన చేశారు. నిజాంపట్నం కాల్వకు నీటి విడుదలకు సంబంధించి దుగ్గిరాలలో ఉన్న లాకులను ఈ బృందం సందర్శించింది. నీటి విడుదల తీరు, ఎంతవరకు నీటి మట్టాన్ని నిర్వహించవచ్చనే అంశాలను కూడా పరిశీలించారు. ఆదివారం ట్రయల్ రన్ కింద ఒక పర్యాటక బోటును విజయవాడ నుంచి తీసుకువచ్చి నిజాంపట్నం కాల్వలో పర్యటించడం ద్వారా పూర్తి అంచనాకు రావాలని పర్యాటక బృందం నిర్ణయించింది.

విద్యుత్ సరఫరాలో..

అంతరాయాలపై దృష్టిసారించాలి



మాట్లాడుతున్న సీఎండీ పుల్లారెడ్డి, డైరెక్టర్లు మురళీకృష్ణయాదవ్, వెంకటేశ్వర్లు

- సెక్షన్ స్థాయిలో సూర్యఘర్ కనెక్షన్లు పెంచాలి
- సమస్యలుంటే నేరుగా కలవొచ్చు
- ఏపీ సీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి

గుంటూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో లోవోల్టేజ్ సమస్యలు ఎక్కడా ఉండకూడదని.. వినియోగదారుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకూడదని ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ (సీఎండీ) పి.పుల్లారెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. గుంటూరు సంగడిగుంటలోనున్న విద్యుత్ భవన్‌లో గుంటూరు సర్కిల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ పుల్లారెడ్డి, టెక్నికల్ డైరక్టర్ ఆవుల మురళీకృష్ణ యాదవ్ సర్కిల్ పరిధిలోని డివిజన్‌లు, సబ్ డివిజన్‌ల వారీగా వివిధ అంశాలపై సమీక్షించారు. ప్రధానంగా పీఎం సూర్య ఘర్ పథకంపై ప్రజల్లో మరింత విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం దరఖాస్తుల దశలో ఉంటున్నారని, సెక్షన్ స్థాయిలో కనీసం పది మంది అయినా సోలార్ పలకలు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇది భవిష్యత్తు అవసరమని, దీనిలో వెనుకబడుతున్నామని, మరింతగా ప్రచారం కల్పించి సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకొనేలా చొరవ చూపాలని స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలపై దృష్టి సారించాలన్నారు. అవసరాలకు అనుగుణంగా స్టోర్‌లో పరికరాలున్నాయని, ఎటువంటి సమస్యలున్నా నేరుగా తమను కలవవొచ్చని సీఎండీ తెలిపారు. వ్యవసాయ కనెక్షన్‌ల మంజూరులో నిర్లక్ష్యం వద్దని, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్స్‌ను తగ్గించాలని, నిర్వహణ పక్కాగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఫైనాన్స్ డైరెక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, సీజీఎం రామ్‌దాస్, గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ చల్లా రమేష్, గుంటూరు టౌన్-1, తెనాలి డివిజన్‌ల ఆపరేషన్ ఈఈలు టి.శ్రీనివాసబాబు, చిరంజీవి, పలువురు ఏడీఈలు, ఏఈలు, జేఏవోలున్నారు. అనంతరం గుంటూరు శివారులోని అడవి తక్కెళ్ళపాడు టిడ్కో సముదాయం వద్దనున్న 33/11 కేవీ సబ్ స్టేషన్‌ను సీఎండీ పుల్లారెడ్డి, డైరక్టర్ మురళీకృష్ణయాదవ్ పరిశీలించారు. నగరంలో నిరంతర విద్యుత్ సరఫరాకు అధికారులు మరింత కృషి చేయాలని సూచించారు.

మాజీ ఎమ్మెల్యే మద్దాళి గిరి బకాయి రాబట్టాలి

మాజీ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ తన స్పిన్నింగ్ మిల్లులకు సంబంధించి విద్యుత్ శాఖకు బకాయిపడిన రూ. 42 కోట్లు వెంటనే రాబట్టాలని ఏపీ సీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డికి ముస్లిం సేన రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సుభాని విజ్ఞప్తి చేశారు. సంగడిగుంటలోని విద్యుత్ భవన్‌కు విచ్చేసిన సీఎండీని కలిసిన సుభాని ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. మద్దాళి గిరి నుంచి విద్యుత్ బకాయిలను అధికారులు చట్టప్రకారం రాబట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సామాన్యులకు ఒక న్యాయం, అధికారం ముసుగులో బకాయిలు చేసిన వారికి ఒక న్యాయం ఉండకూడదని కోరారు.



సీఎండీకి వినతిపత్రం అందజేస్తున్న సుభాని

స్టీమ్ రైస్‌తో ‘రీ సైక్లింగ్’కు చెక్!

- రేషన్‌లో స్టీమ్ రైస్ పంపిణీ చేయాలి
- అప్పుడే దారి మళ్లింపు తగ్గే అవకాశం
- సన్న రకాల సాగు, దిగుబడి పెంచాలి
- ఎరువు విచ్చలవిడి వినియోగంతో.. వరిలో నాణ్యత నానాటికీ తగ్గుతోంది
- ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధనా సంచాలకులు సత్యనారాయణ



డాక్టర్ పీవీ సత్యనారాయణ

గుంటూరు సిటీ, జూలై 11(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం రీసైక్లింగ్ జరగకుండా ఉండాలంటే.. కార్డు దారులకు స్టీమ్ రైస్ పంపిచేయడం మంచిదని.. ఇలా చేస్తే బియ్యం రీ సైకిలింగ్‌కు అవకాశం ఉండదని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వావిద్యాలయం పరిశోధనా సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ తెలిపారు. మధ్యస్థ సన్న రకాలకు చెందిన వరి ధాన్యాన్ని స్టీమ్ రైస్‌గా మార్చటం వల్ల బియ్యం నాణ్యత కూడా పెరుగుతుందని, తినేందుకు కూడా బాగుంటుందని చెప్పారు. బుధవారం ఆయన ‘ఆంధ్రజ్యోతి’తో ప్రత్యేకంగా మాట్లాడారు. తినేందుకు యోగ్యమైన స్టీమ్ రైస్‌ను పంపిణీ చేయటం ద్వారా బియ్యం దారి మళ్లింపు సమస్యకు కూడా పరిష్కారం అవుతుందని తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో ప్రస్తుతం ఇస్తున్న బియ్యం నిల్వ ఉంచిన ధాన్యం నుంచి కాకుండా, కోత కోసిన వెంటనే నూర్పి మిల్లు ఆడించి అందిస్తున్నారని చెప్పారు. దీంతో బియ్యం సరిగ్గా మగ్గక అన్నం వండినప్పుడు ముద్ద కావటం, రుచిగా లేకపోవడం, వెంటనే మెత్త పడటం జరుగుతుందన్నారు. గత 20 ఏళ్ల కాలాన్ని కొలమానంగా తీసుకుంటే సన్న రకం బియ్యం వాడే సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 55 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా, కేవలం 15 లక్షల ఎకరాల్లో మాత్రమే సన్న రకాలు పండిస్తున్నారని చెప్పారు. దీనిలో కేవలం 25 లక్షల టన్నుల బియ్యం మాత్రమే ఉత్పత్తి అవుతోందని తెలిపారు. మిగిలిన 40 లక్షల ఎకరాల్లో మధ్యస్థ, సన్న రకాలు, సన్నని పొడవు రకాలు, దొడ్డు రకాలు సాగు చేస్తున్నారని చెప్పారు. ఇలా 60 లక్షల టన్నుల బియ్యం ఉత్పత్తి అవుతోందని తెలిపారు. ఆ 60 లక్షల టన్నులలోని ఎంటీయు-1121, ఎంటీయు-7029, ఆర్‌జీఎల్-2537, ఎంటీయు-1318, ఎంటీయు-1061, ఎంటీయు-1064 రకాలకు చెందిన సుమారు 30 లక్షల టన్నుల బియ్యం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందిస్తున్నారని డాక్టర్ సత్యనారాయణ తెలిపారు. మిగిలిన 30 లక్షల టన్నులు ఉప్పుడు బియ్యం, ఇడ్లీ రవ్వగా మార్చడం ద్వారా ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఎగుమతి చేస్తున్నారని చెప్పారు.

మధ్యస్థ సన్న రకాలే అనుకూలం...

రాష్ట్రంలో విస్తృతంగా సాగవుతున్న ఎంటీయు-1124(శ్రీ ధృతి), ఎంటీయు-1318, ఎంటీయు-7029(స్వర్ణ), ఎంటీయు-1061(ఇంద్ర), పీఎల్ఏ-1100(బడవ మసూరి), ఆర్‌జీఎల్-2537(శ్రీకాకుళం సన్నాలు), ఎంటీయు-1064(అమర), ఎంటీయు-2761, బీపీటీ-3291 మధ్యస్థ రకాలు తినేందుకు చాలా అనుకూలమని డాక్టర్ సత్యనారాయణ చెప్పారు. నిజానికి ఈ రకాలు తక్కువ పురుగు మందులు వాడి సాగు చేస్తారని తెలిపారు. కాకపోతే ధాన్యం మూడు నుంచి నాలుగు నెలలు నిల్వ ఉంచి బియ్యం ఆడించి వాడుకోవాలని సూచించారు.

ఎరువుల వాడకం ప్రమాదకరంగా మారింది

ఎక్కువ దిగుబడుల కోసం రైతులు విచక్షణా రహితంగా ఎరువులు వాడటంపై డాక్టర్ సత్యనారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. ఎక్కువగా నత్రజని, తక్కువగా పోటాష్ వాడటం వల్ల వరి గింజ నాణ్యత తగ్గుతుందన్నారు. వరిలో సమగ్ర ఎరువుల యాజమాన్యంతో పాటు పచ్చిరొట్ట సాగు, చిరు పొట్ట దశలో పొటాష్ ఎరువును ఎకరానికి 15 నుంచి 20 కిలోలు విధిగా వాడటం వల్ల బియ్యం నాణ్యత పెరుగుతుందని సత్యనారాయణ పేర్కొన్నారు.

సన్న రకాలకు దోమ కాటు పోటు

ప్రజలు ఎక్కువగా ఇష్టపడుతున్న బీపీటీ-5204(సాంబ మసూరి/కర్నూలు సోనా) అన్ని ప్రాంతాల్లో ఎక్కువ మొత్తంలో సాగు కాక పోవటానికి దోమ కాటు కూడా ఒక కారణమని సత్యనారాయణ వెల్లడించారు. దీంతో, ఈ రకాలు కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యాయని తెలిపారు. వాటిని ఎక్కువ ప్రాంతాల్లో సాగు చేసేందుకు వీలుగా యూనివర్సిటీ ద్వారా ప్రయత్నాలు చేస్తున్నామని వివరించారు.

విస్తారంగా సాగుచేసినారు.!

- లాభదాయకంగా వరినారు పెంపకం
- గురువుమెరక భూములు ప్రసిద్ధి



కర్లపాలెం మండలంలోని గరువు మెరక భూముల్లో నారుమడి సాగు

బాపట్ల, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : వరినారు పెంపకానికి గరువు మెరక భూములు ఎంతో ప్రసిద్ధి. దశాబ్దాలుగా గుంటూరు, పల్నాడు జిల్లాలకు సంబంధించిన రైతులు ఈ ప్రాంతంలో పెంచిన వరినారు కొనుగోలు చేసి.. తీసుకెళ్లి నాట్లు వేయడం జరుగుతుంది. ఈ ప్రాంతంలోని రైతులు నారు పెంచి సెంట్లు లెక్కన విక్రయిస్తారు. లేకుంటే ఆయా ప్రాంతాలు నుంచి వచ్చే రైతులు బాండు రాసుకొని ఇక్కడ రైతుల ద్వారా నారు పెంచుతారు. గతంలో బుంగపోత కార్మికులు నారు ఎక్కువగా పెంచేవారు. దొరువులు ఉపయోగించి బుంగపోత పోసి నారు పెంచే సన్న, చిన్నకారు రైతులు నేడు విద్యుత్ మోటార్ల ద్వారా ఎకరాలలో నారు పెంచుతున్నారు. బాండు రాసుకొని కావాల్సిన విత్తనాలు ఇక్కడ రైతులకు.. ఇస్తే 30 నుంచి 40 రోజులు నారు పెంచి.. మోపులు కట్టి వాహనంపై వేస్తారు. ఈ విధంగా చేస్తే సెంటు నారుమడికి రూ.1,200 నుంచి రూ.1,300 చొప్పున తీసుకుంటున్నారు. ఈ ఏడాది కూడా నియోజకవర్గంలోని బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలతోపాటు చెరుకుపల్లి మండలంలో విస్తారంగా నారుమడులు వేశారు. ధరివాదకొత్తపాలెం, కొండుభొట్లపాలెం, నందిరాజుతోట, నల్లమోతువారిపాలెం, పాతనందాయపాలెం, కొత్తనందాయపాలెం, ఎం.వి.రాజుపాలెం, ఏట్రవారిపాలెం, యాజలి, దిండువారిపాలెం, రెడ్డిపాలెం, చందోలు, రాంభొట్లపాలెం, చెరుకుపల్లి తదితర ప్రాంతాలలో ఇప్పటికే నారు పోశారు. ఎక్కువ మంది బీపీటీ రకాల నారు పోయగా కొంతమంది రైతులు ఎంటీయూ 1262, 1224, 1282 రకాల నారు కూడా పెంచుతున్నారు. కాల్వలకు నీరు వచ్చిన వెంటనే ఆయా ప్రాంతాల రైతులు వచ్చి ఇక్కడ నారు కొనుగోలు చేయడం లేదా బాండు ద్వారా పెంచుతున్న రైతులు తీసుకెళ్లడం జరుగుతుంది.

సహాయకులకు జీజీహెచ్ గేట్ పాస్ తప్పనిసరి



మాట్లాడుతున్న డాక్టర్ రమణ యశస్వి

గుంటూరు మెడికల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సమగ్రాస్పత్రి(జీజీహెచ్)లో ఏర్పాటు చేసిన నూతన సెక్యూరిటీ పాలసీ ప్రకారం రోగుల పక్కన ఉండే సహాయకులకు తప్పనిసరిగా గేట్ పాస్ ఉండాలని సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. శుక్రవారం రోగులు, వారి సహాయకులతో నిర్వహించిన ‘మీ కోసం ’ కార్యక్రమంలో ఆసుపత్రిలో నియమనిబంధనలను ఆయన వివరించారు. ఆసుపత్రి పరిసరాల్లో దొంగతనాల నివారణకు, అపరిచితుల సంచారం కట్టడి చేసేందుకు రోగుల సహాయకులకు గేట్ పాస్ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ పాస్ ఉంటేనే వారిని వార్డులోకి అనుమతిస్తామని స్పష్టం చేశారు. సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ బీవీ రావు మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో ఎక్కువ మంది గడ్డి మందు, పాము కాటుతో చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రికి వస్తున్నట్లు తెలిపారు. ఈ విషయంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జాగృతి సేవ సంస్థ ప్రతినిధి నాగరాజకుమారి పేద రోగులకు ఉచిత బియ్యం పంపిణీ చేశారు.

స్మార్ట్‌మీటర్లపై రేపు అవగాహన సదస్సు

తాడేపల్లి టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న ఆదివారం విజయవాడలోని దాసరి భవన్‌లో స్మార్ట్ మీటర్లు వద్దు.. ట్రూ అప్ చార్జీల రద్దు పేరుతో ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల రాష్ట్ర సదస్సు జరుగుతుందని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి తెలిపారు. తాడేపల్లి అమరారెడ్డి భవన్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాల్యాద్రి మాట్లాడుతూ రాష్ట్రంలో అదాని కంపెనీ విద్యుత్ స్మార్ట్ మీటర్ల పేరుతో విద్యుత్ చార్జీల బాదుడు మొదలెట్టిందన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలకు జరిగే నష్టాల గురించి వారిని చైతన్య వంతులు చేయాలన్నారు. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో కాలనీ వాసులు, రైతులు స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకిస్తున్నారన్నారు. స్మార్ట్ మీటర్ల చార్జీలు వినియోగదారుడు భరించలేరన్నారు. ఇప్పటికే విద్యుత్ ట్రూ అప్ చార్జీలతో వినియోగదారుడు అల్లాడుతున్నాడని పేర్కొన్నారు. ఈ సదస్సులో స్మార్ట్‌మీటర్లపై కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని తెలిపారు. వామపక్ష ప్రజా సంఘ నేతలు పాల్గొంటున్నారని చెప్పారు. వెంకటేశ్వర్లు, నవీన్, బర్నబాస్, విజయభాస్కరరెడ్డి, దుర్గారావు, బాబూరావు పాల్గొన్నారు.

డిగ్రీ అడ్మిషన్లను వెంటనే ప్రారంభించాలి



ఉన్నత విద్యామండలి చైర్మన్ మధుమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నేతలు

మంగళగిరి సిటీ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కె.భాస్కర్ కోరారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శుక్రవారం మంగళగిరిలో ఉన్నత విద్యా మండలి చైర్మన్ మధుమూర్తిని కలిసి విద్యా రంగ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. భాస్కర్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా డిగ్రీ అడ్మిషన్లపై ఎలాంటి ప్రకటన చేయకపోవడం సరైన విధానం కాదన్నారు. దీన్ని అవకాశంగా తీసుకుని ప్రైవేటు కళాశాలలు ముందస్తుగా విద్యార్థులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాయని, తద్వారా ఎక్కువ శాతం మంది విద్యార్థులు ప్రైవేటు కళాశాలల్లో చేరే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అడ్మిషన్లలో జాప్యం చోటుచేసుకోవడంతో ఫలితాలు ఆలస్యంగా రావడం, ఏపీపీజీ సెట్, ఐసెట్ వంటి ఉమ్మడి పరీక్షలు వాయిదా పడడం, రాష్ట్రీయ, కేంద్రీయ విద్యాలయాల్లో చదవాలనుకునే విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గత ప్రభుత్వం సింగిల్ మేజర్ విధానాన్ని తీసుకువస్తే కూటమి ప్రభుత్వం డబుల్ మేజర్ విధానాన్ని తీసుకువస్తున్నట్లు ప్రకటించిందని, దీనిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిగ్రీ అడ్మిషన్లకు తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని, ఆన్‌లైన్ అడ్మిషన్ల విధానాన్ని రద్దు చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న డిగ్రీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఐ.రాజేష్, ఉపాధ్యక్షుడు ఎన్.మహర్షి, నేతలు రమణ, శంకర్, ప్రసాద్, అస్లాం, తేజ తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో అస్తవ్యస్తంగా తయారైన అంగన్‌వాడీ కేంద్రాలను గాడిలో పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందిస్తున్నారు. కేంద్రాలకు రాలేని వారి ఇళ్లకు వెళ్లి ఇస్తున్నారు. ఈ క్రమంలో సరుకులు పక్కదారి పడుతున్నాయని, లబ్ధిదారులకు సరిగా అందడం లేదనే విమర్శలు ఉన్నాయి. వీటికి అడ్డుకట్ట వేసేందుకు కూటమి ప్రభుత్వం నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ముఖ ఆధారిత హాజరు విధానం తీసుకొచ్చింది. సరుకులు అందించే సమ యంలో ఫోన్ ద్వారా ముఖ హాజరు, ఓటీపీ నమోదు చేసే విధానం అమలు చేస్తోంది.

సవాళ్లను అధిగమిస్తేనే

వైసీపీ ప్రభుత్వం 2019లో అంగన్‌వాడీలకు ఫోన్‌లు అందించింది. అవి ఎక్కువ శాతం సక్రమంగా పని చేయడం లేదు. నెలకు సమకూరుస్తున్న 2 జీబీ డేటా సరిపోవడం లేదు. కొన్ని ప్రాంతాల్లో నెట్ సరిగా అందక.. సరుకులు అందించడం సవాల్‌గా మారింది. కేంద్రాలకు వచ్చే లబ్ధిదారుల ఫోన్‌లలో బ్యాలెన్స్ లేకపోవడంతో ఓటీపీ సమస్యలు తలెత్తుతున్నాయి. గంటల తరబడి సమయం వృథా కావడంతో.. పిల్లలకు పాఠాలు చెప్పే సమయం ఉండటం లేదు. సమస్యలు అధిగమించేలా అధికారులు చొరవ చూపాలని అంగన్ వాడీ కార్యకర్తలు కోరుతున్నారు.



ప్రతి ఒక్కరికీ పోషణ అందేలా..

- ఐసీడీఎస్‌లో లబ్ధిదారుల ముఖ ఆధారిత హాజరు
- సరుకులు పక్కదారి పట్టకుండా చర్యలు
- పోషణ్ ట్రాక్ యాప్‌లో వివరాల నమోదు

పోషణ ట్రాకింగ్..

అంగన్ వాడీ కేంద్రాల్లో ముఖ ఆధారిత హాజరు విధానం పక్కాగా అమలు చేస్తున్నారు. ఈ మేరకు కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. కేంద్రాల్లో మూడు నుంచి ఆరు సంవత్సరాల చిన్నారులు ఎంత మంది ఆహారం తీసుకుంటున్నారో తప్పనిసరిగా నమోదు చేయాలి. వీరి కోసం పోషణ్ ట్రాక్ యాప్ అందుబాటులోకి తీసుకు వచ్చారు.

అంగన్‌వాడీ మెనూ ఇలా..

గర్భిణులకు, బాలింతలకు అంగన్‌వాడీల్లో నెలకు బియ్యం మూడు కేజీలు, కంది పప్పు కేజీ, అర కిలో నూనె, 25 కోడి గుడ్లు, ఐదు లీటర్ల పాలుతో పాటు కిట్ ఇస్తారు. ఈ కిట్‌లో రెండు కేజీల రాగి పిండి, కేజీ అటుకులు, 250 గ్రాముల చిక్కీలు, కర్జూరం, బెల్లం ఇస్తున్నారు. ఆరు నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులకు రెండున్నర కేజీల బాలామృతం ప్యాకెట్, రెండున్నర లీటర్ల పాలు, 20 కోడిగుడ్లు అందిస్తారు. మూడేళ్ల నుంచి ఆరు సంవత్సరాల లోపు చిన్నారులకు రోజూ ఒక గుడ్డు, వంద మిల్లీలీటర్ల పాలు అందిస్తున్నారు.

తెనాలి అర్బన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : పల్నాడును పాలించిన అనుగు రాజు విగ్రహాన్ని తెనాలి శిల్పులు రూపొందించారు. ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి సూచనల మేరకు అనుగురాజు విగ్రహాన్ని 700 కిలోల కాంస్యంతో సూర్య శిల్ప శాలలో తయారు చేశారు.



అనుగురాజు విగ్రహంతో శిల్పులు

పల్నాటి పౌరుషం ఉట్టిపడేలా..

అనుగురాజు విగ్రహం రూపకల్పన

పిడుగురాళ్లలో ఈ విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు విగ్రహ కమిటీ సభ్యులు తెలిపారు. శిల్పశాల నుంచి విగ్రహాన్ని పిడుగురాళ్లకు తరలించారు. శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర, కమిటీ సభ్యులు జనార్ధనరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భోజన కుతూహలం

నరాల జబ్బులకు దివ్యౌషధం

ప్రకృతిలో ఉన్న ప్రతి మొక్కకు ఏదో ఒక ప్రయోజనం ఉంటుంది. కొన్ని మొక్కలు పిచ్చిగా కనిపిస్తాయి. కానీ వాటి వల్ల కూడా అనేక ప్రయోజనాలుంటాయి. అలాంటి వాటిలో ఒకటి 'ఎలుక చెవి ఆకు' మొక్క. ఈ మొక్క ఆకులు ఎలుక చెవి ఆకారంలో ఉంటాయి. అందువల్ల ఈ మొక్కను సంస్కృతంలో ఖుకర్ణి, మూషిక కర్ణి అని కూడా పిలుస్తూ ఉంటారు. భోజనకుతూహలం గ్రంథం ప్రకారం దీని ఆకులు కారం తీపి రుచులు కలిసి ఉంటాయి. ఇవి కఫాన్ని, పైత్యాన్ని తగ్గిస్తాయి. ఈ ఆకుల వల్ల కలిగే ఇతర ప్రయోజనాలను కూడా ఈ గ్రంథంలో పేర్కొన్నారు.

ఈ ఆకులు ఆకుకూరల కన్నా ఎక్కువ శక్తిమంతమైనవి. అందువల్ల వీటిని ఎక్కువగా తినకూడదు. ఆకుకూరలతో కానీ.. కూరగాయాలతో కానీ కలిపి వండుకోవాలి. ప్రతి రోజూ వంటలో కొద్దిగా ఈ ఆకులను ఉపయోగిస్తే అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలు చేకూరతాయి.

- ఈ ఆకులు శరీరంలోపల ఉండే వాపులను తగ్గిస్తాయి. తలనెప్పి నుంచి ఉపశమనాన్ని ఇస్తాయి. కడుపులో నులిపురుగులకు ఇది మంచి విరుగుడు. నులిపురుగులు పోతే జీర్ణశక్తి బాగుపడుతుంది.
- కొన్ని అటవీ ప్రాంతాల్లో ఈ ఆకులను పాము విషానికి విరుగుడుగా కూడా వాడతారు. పేగుల్లో పెరిగే ఎలికపాములకు విరుగుడుగా ఈ ఆకులను వినియోగిస్తారు.
- ఫిట్స్ వంటి నరాల జబ్బులకు ఈ ఆకులు మంచి మందు. రకరకాల మానసిక వ్యాధులకు విరుగుడుగా వీటిని వాడతారు.
- మధుమేహ నియంత్రణకు ఈ ఆకుల కషాయం మంచి మందు. ప్రతి రోజు ఈ ఆకుల కషాయం తాగితే మధుమేహం అదుపులో ఉంటుంది.
- చెవి సమస్యల పరిష్కారానికి ఈ ఆకులు బాగా పనిచేస్తాయి. ఈ ఆకులను దంచి.. దాని నుంచి రసం తీసి.. ఆ రసంతో సరిసమానంగా నువ్వుల నూనె కలిపి.. కొద్దిగా వేడి చేసి చెవిలో వేసుకుంటే.. చెవిలో వచ్చే రకరకాల ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి.
- ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌లు తరచుగా వచ్చేవారికి ఈ ఆకులు బాగా పనిచేస్తాయి. ఉబ్బసం, ఆయాసం వంటి వాటికి ఈ ఆకుల కషాయం విరుగుడుగా పనిచేస్తుంది.



● గంగరాజు అరుణాదేవి

మేకప్

పుట్టుమచ్చలను దాచి...

ముఖం మీది పుట్టుమచ్చలు పెద్దవిగా, వికారంగా ఉంటే, వాటిని మేకప్‌తో దాచేసుకోవచ్చు. అందుకోసం ఎలాంటి మేకప్ మెలకువలు పాటించాలో తెలుసుకుందాం!

పుట్టుమచ్చలను మేకప్‌తో దాచేయడం కోసం ఫౌండేషన్, కన్‌సీలర్ వాడుకుంటే సరిపోదు. అందుకోసం ప్రత్యేకమైన మెలకువలు పాటించాలి. అవేంటంటే....

చర్మాన్ని సిద్ధం చేయాలి: ముఖాన్ని శుభ్రంగా కడుక్కుని, మాయిశ్చరైజర్ రాసుకోవాలి. తర్వాత ప్రైమర్ సహాయంతో ముఖాన్ని తదుపరి మేకప్‌కు సిద్ధం చేయాలి

కలర్ కరెక్ట్: ముదురు రంగు పుట్టుమచ్చలు చర్మంలో కలిసిపోయేలా చేయడం కోసం గోధుమ రంగు టోన్‌ను ఎంచుకోవాలి. ఎరుపు రంగు పుట్టుమచ్చల కోసం ఆకుపచ్చ టోన్ ఎంచుకోవాలి



చిన్న బ్రష్: చదునుగా ఉండే చిన్న బ్రష్‌ను కరెక్టర్‌లో ముంచి, పుట్టుమచ్చ మీద నేరుగా అద్దుకోవాలి

కన్‌సీలర్: చర్మపు రంగుకు దగ్గరగా ఉండే కన్‌సీలర్ ఎంచుకోవాలి. కరెక్టర్ అద్దిన ప్రదేశంలోనే కన్‌సీలర్ అప్లై చేయాలి. తర్వాత బ్రష్‌తో లేదా వేలితో మృదువుగా అడుగున ఉన్న కలర్ కరెక్టర్ చెదిరిపోకుండా కన్‌సీలర్ అంచులను చర్మంలో కలిసిపోయేలా అద్దుకోవాలి

ట్రాన్స్‌క్యులెంట్ పౌడర్: కన్‌సీలర్ అద్దుకున్న ప్రదేశం మీద ట్రాన్స్‌క్యులెంట్ పౌడర్‌ను అద్దుకోవాలి. ఇలా చేయడం వల్ల ఆ ప్రదేశంలో ముడతలు ఏర్పడకుండా ఉంటాయి

ఫౌండేషన్: కన్‌సీలర్ సెట్ అయిన తర్వాత, యధాతథంగా ఫౌండేషన్ అప్లై చేసి, చర్మం మీద సమంగా పరుచుకునేలా అద్దుకోవాలి

చిన్న మొత్తాల్లో: ఒకేసారి ఎక్కువ మోతాదు కన్‌సీలర్ లేదా ఫౌండేషన్ అప్లై చేయకుండా చిన్న మొత్తాల్లో తీసుకుని అద్దుకుంటూ సహజసిద్ధంగా చర్మంలో కలిసిపోయేలా నేర్పరితనంతో వ్యవహరించాలి

సెట్టింగ్ స్ప్రే: మేకప్ రోజంతా చెక్కుచెదరకుండా ఉండడం కోసం సెట్టింగ్ స్ప్రే వాడుకోవాలి.

వంటిల్లు

కాకరకాయతో భలే రుచిగా..!



చేదుగా ఉన్నప్పటికీ కాకరకాయను ఇష్టంగా తింటూ ఉంటాం. కాకరకాయతో తయారుచేసే పులుసు, వేపుడు, పకోడీ లాంటివి వేటికవే ప్రత్యేకమైన రుచితో నోరూరిస్తూ ఉంటాయి. కాకరకాయ ముక్కలను జతచేసి మాంసాహార వంటకాలు వండితే 'ఆహా...! ఏమి రుచి' అనకుండా ఉండరు. అలాంటి కాకరకాయను విభిన్నంగా ఆస్వాదించాలనుకునేవారి కోసం ఈ రుచులు...



గుత్తి కాకరకాయ

కావాల్సిన పదార్థాలు

● లేత కాకరకాయలు- పావు కేజీ, పసుపు- అర చెంచా, ఉప్పు- రెండు చెంచాలు, మెంతులు- పావు చెంచా, జీలకర్ర- అర చెంచా, ధనియాలు- ఒక చెంచా, నువ్వులు- రెండు చెంచాలు, నూనె- ఆరు చెంచాలు, ఉల్లిపాయ ముక్కలు- అర కప్పు, చింతపండు- అయిదు రెమ్మలు, వెల్లుల్లి రెబ్బలు- ఎనిమిది, కారం- మూడు చెంచాలు, కరివేపాకు- రెండు రెమ్మలు

తయారీ విధానం

- కాకరకాయలకు తొడిమలు తీసి మధ్యలో చాకుతో సన్నని గాటు పెట్టాలి. చెంచా సహాయంతో లోపల ఉన్న గింజలను తీసివేయాలి. ఒక గిన్నెలో ఒక చెంచా ఉప్పు, పావు చెంచా పసుపు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని కాకరకాయలకు పట్టించి అరగంటసేపు అలాగే ఉంచాలి. తరవాత కాకరకాయలను ఒక్కోదాన్ని చేత్తో గట్టిగా పిండి రసాన్ని తీసివేయాలి.
- స్టవ్ మీద గిన్నెపెట్టి కాకరకాయలు వేసి అవి మునిగేవరకూ నీళ్లు పోసి ఉడికించాలి. అవి సగానికి పైగా ఉడికిన తరవాత పళ్లెంలోకి తీయాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి మెంతులు, జీలకర్ర, ధనియాలు, నువ్వులు వేసి ఎర్రగా వేపాలి. వాటిని పళ్లెంలోకి తీసి చల్లార్చాలి. అదే గిన్నెలో మూడు చెంచాల నూనె వేసి వేడి చేయాలి. ఇందులో ఉల్లిపాయ ముక్కలు వేసి దోరగా వేపాలి. చింతపండు కూడా వేసి రెండు నిమిషాలు మగ్గించాలి. తరవాత స్టవ్ మీద నుంచి దించాలి. మిక్సీలో మెంతులు, నువ్వులు తదితరాలు వేసి మెత్తని పొడి చేయాలి. తరవాత ఉల్లిపాయలు, చింతపండు, వెల్లుల్లి రెబ్బలు, పావు చెంచా పసుపు, కారం, ఒక చెంచా ఉప్పు, కరివేపాకు వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ పేస్టుని గిన్నెలోకి తీసి బాగా కలపాలి. ఉప్పు సరిచూడాలి. దీన్ని చేత్తో కొద్ది కొద్దిగా తీసుకుంటూ ఉడికించిన కాకరకాయల లోపల నిండుగా నింపాలి.
- స్టవ్ మీద వెడల్పాటి గిన్నె పెట్టి మూడు చెంచాల నూనె వేసి వేడి చేయాలి. ఇందులో కాకరకాయలను పేర్చి మూత పెట్టి బాగా వేగనివ్వాలి. అయిదు నిమిషాల తరవాత కాకరకాయలను జాగ్రత్తగా తిప్పుతూ అన్నివైపులా ఎర్రగా వేపాలి. తరవాత పళ్లెంలోకి తీయాలి. ఇలా తయారు చేసుకున్న గుత్తి కాకరకాయ వేడి అన్నంలోకి బాగుంటుంది.

కాకరకాయను ఆహారంలో చేర్చుకోవడం వల్ల రక్తపోటు తగ్గుతుంది. రోగనిరోధక శక్తి, జీర్ణ శక్తి, ఆకలి పెరుగుతాయి. కడుపులోని నులిపురుగులు నశిస్తాయి. చర్మ వ్యాధులు తగ్గుతాయి. ఆస్తమా, జలుబు, దగ్గు లాంటి సమస్యలు దూరమవుతాయి.

జాగ్రత్తలు

- కాకరకాయలను నేరుగా నీటిలో కాకుండా ఆవిరి మీద ఉడికిస్తే వాటిలో పోషకాలు నిలుస్తాయి.
- నువ్వులకు బదులు పల్లీలు వేసుకోవచ్చు.
- కాకరకాయలను చిన్న మంటమీద ఎర్రగా వేపాలి. లేకపోతే చేదుగా అనిపిస్తాయి. దోరగా వేగితేనే వాటికి కమ్మదనం వస్తుంది.

కాకరకాయ చికెన్

కావాల్సిన పదార్థాలు

● చికెన్- పావు కేజీ, కాకరకాయలు- మూడు, ధనియాల పొడి- ఒక చెంచా, టమాటా ముక్కలు- ఒక కప్పు, కరివేపాకు- రెండు రెమ్మలు, కొత్తిమీర తరుగు- తగినంత, నూనె- అయిదు చెంచాలు, కారం- రెండు చెంచాలు, పసుపు- పావు చెంచా, ఉప్పు- ఒకటిన్నర చెంచా, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒక చెంచా, ఉల్లిపాయ ముక్కలు- అర కప్పు, పచ్చిమిర్చి- రెండు

తయారీ విధానం

● కాకరకాయలను సన్నని పొడవైన ముక్కల్లా కోయాలి. స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి నూనె వేసి వేడి చేయాలి. ఇందులో కాకరకాయ ముక్కలు వేసి ఎర్రగా వేపి పళ్లెంలోకి తీయాలి. ఇదే గిన్నెలో కరివేపాకు, ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి చీలికలు, అల్లం వెల్లుల్లి పేస్టు వేసి దోరగా వేపాలి. తరవాత చికెన్ ముక్కలు, పసుపు, ఉప్పు వేసి కలిపి మూతపెట్టి మగ్గించాలి. పది నిమిషాల తరవాత కారం, టమాటా ముక్కలు వేసి కలపాలి. టమాటా ముక్కలు మెత్తబడిన తరవాత ఒక గ్లాసు నీళ్లు పోసి మరిగించాలి. తరవాత వేయించిన కాకరకాయ ముక్కలు, ధనియాల పొడి వేసి నెమ్మదిగా కలపాలి. రెండు నిమిషాల తరవాత కొత్తిమీర తరుగు చల్లి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ కాకరకాయ చికెన్ కూర... వేడి అన్నం, చపాతీల్లోకి బాగుంటుంది.



తరచూ కాకరకాయతో తయారుచేసిన పదార్థాలు తినడం వల్ల రక్తంలో చక్కెర శాతం తగ్గుతుంది. నోటిపూత, సుఖవ్యాధులు, కాలేయ సంబంధిత సమస్యల నుంచి ఉపశమనం కలుగుతుంది. శరీర బరువు నియంత్రణలో ఉంటుంది.

జాగ్రత్తలు

- కాకరకాయ ముక్కలను చక్రాల్లా కూడా కోసుకోవచ్చు.
- ఉల్లిపాయ ముక్కలు ఎక్కువగా వేసుకుంటే కూర కమ్మగా ఉంటుంది.
- చికెన్ ముక్కలను మరీ మెత్తగా మగ్గించకూడదు.
- పసుపు, ఎరుపు రంగులు కలగలిసిన టమాటాలను తీసుకుంటే కాకరకాయ ముక్కల చేదు తగ్గుతుంది.

కాకరకాయ నిల్వ పచ్చడి

కావాల్సిన పదార్థాలు

● కాకరకాయలు- అర కేజీ, చింతపండు- 80 గ్రాములు, బెల్లం- చిన్న ముక్క, మెంతులు- ముప్పావు చెంచా, ఆవాలు- రెండు చెంచాలు, జీలకర్ర- రెండు చెంచాలు, నువ్వుల నూనె- రెండు కప్పులు, వెల్లుల్లి రెబ్బలు- పది, ఇంగువ- పావు చెంచా, ఎండు మిర్చి- రెండు, కరివేపాకు- రెండు రెమ్మలు, ఉప్పు- ముప్పావు కప్పు, కారం- ఒక కప్పు, పసుపు- ఒక చెంచా

తయారీ విధానం

- కాకరకాయలను మంచినీళ్లతో కడిగి అరగంటసేపు ఆరబెట్టాలి. తరవాత మరీ సన్నగా కాకుండా కొద్దిగా లావుపాటి చక్రాలుగా తరిగి పలుచని గుడ్డ మీద పరచి తేమ లేకుండా ఆరనివ్వాలి. వెల్లుల్లి రెబ్బలను కచ్చాపచ్చాగా దంచి ఉంచుకోవాలి. ఒక గిన్నెలో చింతపండు వేసి శుభ్రంగా కడగాలి. అది మునిగేవరకూ నీళ్లు పోసి బెల్లం వేసి కలపాలి. ఈ గిన్నెను స్టవ్ మీద పెట్టి చింతపండు మెత్తబడే వరకూ అంటే కనీసం అయిదు నిమిషాలపాటు ఉడికించాలి. తరవాత స్టవ్ మీద నుంచి దించి చల్లార్చాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి మెంతులు, ఒక చెంచా ఆవాలు, ఒక చెంచా జీలకర్రలను విడివిడిగా వేయించి ఒక పళ్లెంలోకి తీయాలి. వీటిని చల్లార్చాలి. తరవాత మిక్సీలో వేసి మెత్తగా గ్రైండ్ చేసి చిన్న గిన్నెలోకి తీయాలి. ఈ మిక్సీ గిన్నెలోనే చింతపండు మిశ్రమం వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని జల్లి గంటెలో వేసి చెంచాతో అదుముతూ మెత్తని గుజ్జును గిన్నెలోకి వడబోయాలి.
- స్టవ్ మీద వెడల్పాటి గిన్నె పెట్టి నువ్వుల నూనె పోసి వేడి చేయాలి. ఇందులో కాకరకాయ ముక్కలు వేసి పెద్ద మంట మీద దోరగా వేపాలి. కొద్దిగా రంగు మారడం మొదలవగానే కాకరకాయ ముక్కలను పళ్లెంలోకి తీయాలి. తరవాత ఈ నూనెలోనే కచ్చాపచ్చాగా దంచిన వెల్లుల్లి రెబ్బలు, ఒక చెంచా ఆవాలు, ఒక చెంచా జీలకర్ర, ఇంగువ, ఎండుమిర్చి ముక్కలు, కరివేపాకు వేసి దోరగా వేపాలి. తరవాత ఇందులో చింతపండు గుజ్జు వేసి కలిపి తడి పోయేవరకూ వేపాలి. తరవాత స్టవ్ మీద నుంచి దించి చల్లార్చాలి.
- మరో పెద్ద గిన్నెను తీసుకుని అందులో మెంతి-ఆవ పిండి, ఉప్పు, కారం, పసుపు వేసి బాగా కలపాలి. తరవాత వేయించిన కాకరకాయ ముక్కలు వేసి కలపాలి. వెంటనే చల్లారిన చింతపండు గుజ్జు మిశ్రమం కూడా వేసి బాగా కలపాలి. ఈ పచ్చడి మీద మూతపెట్టి రెండు రోజులపాటు ఊరనివ్వాలి. తరవాత ఉప్పు సరి చూసుకుని గాజు సీసాలో భద్రపరచుకోవాలి. ఇలా తయారు చేసిన కాకరకాయ పచ్చడి...... వేడి అన్నం, చపాతీ, పుల్కా, బ్రెడ్‌లోకి రుచిగా ఉంటుంది. ఇది రెండు నెలల వరకు నిల్వ ఉంటుంది.



కళ్లద్దాల మచ్చలా..?

ఈరోజుల్లో పెద్దలే కాదు చిన్నపిల్లలూ కళ్లద్దాలు పెట్టుకోవాల్సి వస్తోంది. ఫ్యాషన్ కోసం కూడా కొందరు కళ్లజోడు వాడతారు. అయితే కళ్లజోడు వలన ముక్కు మీద మచ్చలు ఏర్పడుతుంటాయి. వాటిని ఎలా తగ్గించుకోవాలో తెలుసుకుందాం...

- కలబందలో చర్మాన్ని ప్రకాశవంతంగా మార్చే లక్షణాలు ఉన్నాయి. రాత్రి పడుకొనేముందు కలబంద గుజ్జును కళ్లజోడు వలన కలిగిన మచ్చల మీద రాయాలి. తెల్లారి లేవగానే నీళ్లతో కడిగేయాలి.
- బంగాళదుంప రసాన్ని మచ్చల మీద రాసి పావుగంట తరువాత కడిగేయాలి. రోజుకు రెండుసార్లు ఇలా చేస్తే మంచి ఫలితం ఉంటుంది.
- ముఖం మీద మచ్చలను తొలగించడంలో కీరదోశ చక్కగా పని చేస్తుంది. కీరదోసను గుండ్రటి ముక్కలుగా కోసి, ముక్కు మీద మచ్చలున్న చోట పెట్టి కొంచెం సేపు రుద్దాలి. తరువాత చల్లటి నీటితో కడిగేసుకోవాలి.
- తేనె చర్మానికి తేమను అందించడంతో పాటు మచ్చలను తగ్గించేందుకు బాగా సహాయపడుతుంది. ఒక స్పూన్ తేనెలో ఒక స్పూన్ పాలు కలిపి మచ్చల మీద రాసి 15 నిమిషాల తరువాత కడిగేయాలి.
- నారింజ తొక్కను బాగా ఎండబెట్టి మిక్సీలో వేసి పొడి చేసుకోవాలి. ఈ పొడిలో కొంచెం పాలు పోసి పేస్టులా చేసుకుని మచ్చల మీద రాసి పావుగంట తరువాత చన్నీటితో కడిగేయాలి.
- గులాబీ నీళ్లను మచ్చల మీద రాసి రాత్రంతా ఉంచి ఉదయాన్నే కడిగేయాలి. రోజూ ఇలా చేసిన మంచి ఫలితముంటుంది.



ఫిగర్ స్కేటింగ్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించడం కోసం అమెరికా పౌరసత్వాన్ని వదులుకుంది భారత సంతతికి చెందిన తారా ప్రసాద్. జాతీయ పోటీల్లో విజేతగా నిలుస్తూ 2026 వింటర్ ఒలింపిక్స్ మీద గురి పెట్టిన 25 ఏళ్ల తార ప్రస్థానం ఇది.

ఫిగర్ స్కేటింగ్‌లో మెరుస్తున్న 'తార'



ఏడేళ్ల వయసులో మొదటిసారిగా ఐస్ రింక్ మీద అడుగుపెట్టింది తార. ఆ తర్వాత పదేళ్ల వరకూ ఆ క్రీడను ఒక ఆహ్లాదకరమైన కాలక్షేపంగానే పరిగణించింది. కానీ ప్రపంచంలోని అతి పెద్ద క్రీడా వేదిక మీద భారత్‌కు ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఎదుగుతానని ఊహించలేదు. అమెరికా అయోవాలో పుట్టిన తార 2019లో భారత్‌కు తిరిగొచ్చింది. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో విజేతగా నిలిచింది. 'ఇప్పుడు ఈ క్రీడ పట్ల మక్కువ బాగా పెరిగింది. అయితే చిన్నప్పటిలాగే రింక్‌లోకి అడుగు పెట్టి స్కేటింగ్ చేయడంలో ఉండే ఆనందాన్ని ఇప్పటికీ ఆస్వాదిస్తూనే ఉన్నాను. కానీ ఈ క్రీడ ద్వారా రాబోయే ఒలింపిక్స్‌లో స్వదేశానికి ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఎదగాలనే పట్టుదల నాలో పెరిగింది. అందుకోసం తీవ్రంగా కృషి చేస్తున్నాను' అంటూ ఒక సందర్భంలో వివరించింది.

అథ్లెట్ల కుటుంబం

తారది తమిళనాడుకు చెందిన అథ్లెట్ల కుటుంబం. ఆమె తల్లి కవిత రామస్వామి కూడా ఏడేళ్ల వయసులోనే అథ్లెటిక్స్‌లోకి అడుగు పెట్టారు. కవిత తండ్రి, తార తాతయ్య, 87 ఏళ్ల వి.రామస్వామి ఇప్పటికీ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పాల్గొంటున్నారు. కవిత కూడా ఇప్పటికీ పరుగు పందేల్లో పాల్గొంటూ ఉంటారు. 'స్కేటింగ్ అంటే రింక్ దగ్గరకు వెళ్లడమే కాదు. ఆ క్రీడకుపోషకాహారం, శరీర దారుఢ్యం, మర్దన చికిత్సల్లాంటివి అవసరం. స్కేటింగ్ పలు రకాల క్రీడల సమాహారం లాంటిది' అంటున్నారు తార తల్లి కవిత. ఈమె గతంలో 1990 బీజింగ్ ఏసియన్ గేమ్స్ క్యాంప్‌లో పరుగుల రాణి పి.టి.ఉషతో కలిసి శిక్షణ పొందారు. తార గురించి ప్రస్తావిస్తూ, 'తార, ఏదైనా చేయాలని నిర్ణయించుకుంటే ఆ పని అయ్యే దాకా వదిలిపెట్టదు. ఆమె మెదడు చురుగ్గా పని చేస్తుంది. ఆ వేగాన్ని అందుకుని, ఆమె మనసును అర్థం చేసుకోవడం చాలాకష్టం' అంటూ వివరించారు.

విమర్శకుల నోళ్లు మూయించి...

భారత దేశానికి తిరిగొచ్చిన ప్రారంభంలో ఆమెకెలాంటి క్రీడా లక్ష్యాలూ లేవు. అప్పటి వరకూ సరదా కోసమే స్కేటింగ్ చేసేది. కానీ అస్వస్థతతో దీర్ఘకాలం పాటు క్రీడకు దూరమైన తర్వాత, ఫిగర్ స్కేటింగ్ పట్ల ఆమెకు మక్కువ పెరిగింది. అప్పటికే భారత పౌరసత్వం పొందడంతో, రాబోయే ఒలింపిక్స్‌లో స్వదేశానికి ప్రాతినిధ్యం వహించాలని నిర్ణయించుకుంది. కానీ పౌరసత్వం పొంది, క్రీడాపరమైన విజయాలు సాధించడం మొదలుపెట్టిన తర్వాత, సామాజిక మాధ్యమాల్లో ప్రశంసలతో పాటు విమర్శలను కూడా ఎదుర్కోవలసి వచ్చింది. 'ఆసియ గేమ్స్‌తో పాటు నాలుగు ఖండాల పోటీల్లో పాల్గొన్న తర్వాత, ఆన్‌లైన్‌లో నా మీద నిందలు మొదలయ్యాయి. అయితే అవన్నీ వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగిస్తాయని నేను అనుకోవడం లేదు. వింటర్ స్పోర్ట్స్ పట్ల అందరి ఆసక్తినీ పెంచడానికి అవే విమర్శలు సహాయపడతాయని ఆశిస్తున్నాను. ఆన్‌లైన్‌లో నన్నెంతో మంది అవమానిస్తూ ఉంటారు. చంపుతామని బెదిరిస్తూ ఉంటారు. అయినా నేను బెదరను' అంటున్న తార 'సవాళ్లు ఉంటాయని తెలిసీ నేనీ దారిని ఎంచుకున్నాను. కాబట్టి చేతులెత్తేసే ప్రసక్తే లేదు' అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో విమర్శకుల నోళ్లు మూయించింది.

భిన్నాభిరుచులు...

యూనివర్శిటీ ఆఫ్ కొలరాడోలో కంప్యూటర్ సైన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్ విద్యార్థి అయిన తార, తన అభిరుచిని ఫిగర్ స్కేటింగ్‌కే పరిమితం చేయలేదు. ప్రపంచాన్ని చుట్టిరావడం, సొంత వ్యాపారాన్ని కలిగి ఉండడం, డైమండ్ ఫేస్ ఆఫ్ లాంగ్స్ పీక్‌ను అధిరోహించడం, భారత దేశంలో ఫిగర్ స్కేటింగ్ అభివృద్ధికి సహాయపడడాన్ని తన లక్ష్యాలుగా ప్రకటించుకుంటోంది. స్కేటింగ్ తర్వాత తానెక్కువగా ఇష్టపడేది పర్వతారోహణ అనీ, అప్పుడప్పుడూ హైకింగ్‌కు కూడా వెళ్తూ ఉంటాననీ అంటోంది. అలాగే తార స్కేటింగ్ కోసం తన దుస్తులను తానే డిజైన్ చేసుకుని, కుట్టుకుంటూ ఉంటుంది.

అదే లక్ష్యం...

ఫిగర్ స్కేటింగ్‌లో కొరియోగ్రఫీ, కాస్ట్యూమ్స్ కీలకమనీ, అవి రెండూ మ్యూజిక్ థీమ్‌తో సరితూగేలా చూసుకుంటూ ఉంటాననీ అంటున్న తార, గతంలో పద్మావతి సినిమా సౌండ్ ట్రాక్‌తో పాటు, ఎ.ఆర్.రెహమాన్ అధీరా పాటలకు ప్రదర్శనలిచ్చింది. 2022, 2023, 2025 జాతీయ ఛాంపియన్‌షిప్ విజేత అయిన తార, గత ఏడాది స్లొవేనియాలోని అంతర్జాతీయ టోర్నమెంట్స్‌లో రెండు రజత పతకాలు గెలుచుకుంది. వచ్చే ఏడాది వింటర్ ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించడమే లక్ష్యంగా కృషి చేస్తోంది. ఈ పోటీలకు అర్హత సాధించే ఈవెంట్ ఈ సెప్టెంబరులో బీజింగ్‌లో జరగబోతోంది. అయితే అర్హత సాధించినా, సాధించకపోయినా, స్కేటింగ్ మాత్రం కచ్చితంగా కొనసాగిస్తాననీ, వ్యక్తిగత లక్ష్యాలు, అన్వేషించవలసినవి కూడా ఎన్నో ఉన్నాయనీ అంటోంది. ఒకవేళ తార వింటర్ ఒలింపిక్స్‌కు అర్హత పొందితే, ఈ పోటీల్లో పాల్గొనే అర్హత సాధించిన మొట్టమొదటి భారతీయ ఫిగర్ స్కేటర్‌గా గుర్తింపు పొందగలుగుతుంది.

స్క్రీన్ టైమ్ తగ్గించుకుందామిలా..

పిల్లలు, పెద్దలు అందరిలో ఫోన్ వినియోగం పెరిగిపోయింది. గంటల తరబడి ఫోన్‌లు చూస్తూ గడిపేస్తున్నారు. అయితే స్క్రీన్ టైమ్ తగ్గించుకునేందుకు చిట్కాలు..

- యాప్స్‌ను ఎంత సమయం వాడలన్నది టైమర్ సెట్ చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల ఆ సమయం పూర్తవగానే ఫోన్‌కు నోటిఫికేషన్ వస్తుంది. దాంతో ఫోన్ పక్కన పెట్టేయవచ్చు.
- తినేటప్పుడు, పడకగదిలో వంటి చోట్ల ఫోన్ వాడకూడదని నిర్ణయించుకుని పాటించండి. ఆ సమయంలో కుటుంబసభ్యులతో మాట్లాడడం చేయాలి.
- ప్రతిరోజూ కొంత సమయం డిజిటల్ బ్రేక్‌గా పెట్టుకుని అనుసరించండి. ఆ సమయంలో ఫోన్ అసలే ముట్టుకోవద్దు.



- నోటిఫికేషన్‌లు వచ్చినప్పుడల్లా అవసరం లేకపోయిన ఫోన్ చూస్తుంటాం. అందుకే అత్యవసరమైన నోటిఫికేషన్‌లు మినహా మిగతావన్నీ ఆఫ్ చేసుకోవాలి.
- పనివేళలు, నిద్రపోయే సమయంలో డునాట్ డిస్టర్బ్ మోడ్‌ను ఆన్ చేసుకోండి. దీనివల్ల ప్రశాంతంగా పని చేసుకోవచ్చు, పడుకోవచ్చు.
- అలారం కోసం ఫోన్ వాడకూడదు. గడియారాన్నే వాడడం అలవాటు చేసుకోవాలి.
- ఫోన్ వాడడం తగ్గించి ఆ సమయంలో పుస్తకాలు చదవడం, కొత్త విషయాలు నేర్చుకోవడం లేదా కుటుంబంతో గడపడం చేయాలి.



ముంబైలో టెస్లా షోరూమ్ రెడీ

వచ్చే వారమే ప్రారంభం

న్యూఢిల్లీ: ప్రపంచ ఈవీ దిగ్గజం టెస్లా భారత మార్కెట్లోకి లాంఛనప్రాయంగా ప్రవేశించేందుకు సన్నాహాలు పూర్తి చేసింది. వచ్చే వారం ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లో తొలి ఎక్స్‌పీరియెన్స్ సెంటర్ ప్రారంభించనుంది. అమెరికాకు చెందిన కుబేరుడు ఎలాన్ మస్క్ నేతృత్వంలోని ఈ విద్యుత్ కార్ల దిగ్గజం ఈ నెల 15న నిర్వహిస్తున్న ప్రారంభ కార్యక్రమానికి ఎంపిక చేసిన వారికి ఇప్పటికే ఆహ్వానాలు పంపింది. అయితే దీనిపై స్పందించేందుకు కంపెనీ ప్రతినిధులెవరూ అందుబాటులో లేరు.

ఆస్టిన్ ప్రధాన కేంద్రంగా పని చేస్తున్న ఈ కంపెనీ చైనా ప్లాంట్‌లో ఉత్పత్తి చేసిన మోడల్ వై రియర్ వీల్ డ్రైవ్ ఎస్‌యూవీ సహా కొన్ని మోడళ్లను ముంబై చేర్చిందని పరిశ్రమ నిపుణులు చెబుతున్నారు. ఈ షోరూమ్ కోసం టెస్లా ఇప్పటికే 24,565 చదరపు అడుగుల విస్తీర్ణం గల వేర్‌హౌస్‌ను లోధా లాజిస్టిక్స్ పార్క్ నుంచి ఐదేళ్ల కాలానికి లీజుకి తీసుకుంది. 40 వేల డాలర్ల లోపు ధరల శ్రేణిలోని కార్లకు 70 శాతం కస్టమ్స్ సుంకాన్ని, ఆ పైబడిన ధరలోని కార్లకు నూరు శాతం కస్టమ్స్ సుంకాన్ని భర్తీ చేసుకునేందుకు ప్రారంభ టారిఫ్ రాయితీలు కల్పించాలని భారత ప్రభుత్వాన్ని ఆ సంస్థ కోరుతోంది.

దేశీయంగా రేర్ ఎర్త్ మాగ్నెట్ల తయారీకి

రూ.1,345 కోట్లతో ప్రత్యేక నిధి

- ప్రత్యేక ప్రోత్సాహకాలకు ప్రభుత్వం సిద్ధం
- చైనా ఆధిపత్యానికి చెక్ పెట్టేందుకే..
- కేంద్ర మంత్రి కుమార స్వామి



న్యూఢిల్లీ: దేశీయంగా రేర్ ఎర్త్ మాగ్నెట్ల ఉత్పత్తికి ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకోసం ముందుకు వచ్చే కంపెనీలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించేందుకు రూ.1,345 కోట్లతో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయనుంది. కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమార స్వామి ఈ విషయం ప్రకటించారు. రాష్ట్రాలతో చర్చించిన తర్వాత ఈ ప్రతిపాదనను కేంద్ర క్యాబినెట్ ఆమోదానికి పెడతామని ఆయన చెప్పారు.

రెండు కంపెనీలకే అవకాశం

అయితే రేర్ ఎర్త్ మాగ్నెట్ల తయారీకి రెండు కంపెనీలను మాత్రమే ఎంపిక చేయనున్నట్టు కుమార స్వామి తెలిపారు. రేర్ ఎర్త్ ఖనిజాల ఉత్పత్తి, వాటిని శుద్ధి చేయడం, శుద్ధి చేసిన ఖనిజాల నుంచి తుది ఉత్పత్తులైన రేర్ ఎర్త్ మాగ్నెట్ల తయారీ వరకు అన్ని దశల్లోనూ కంపెనీలకు ప్రభుత్వం అండగా ఉంటుందని కేంద్ర మంత్రి చెప్పారు. ఇప్పటికే వినియోగించి పారేసిన రేర్ ఎర్త్ మాగ్నెట్లను కరిగించి ఆ భస్మంతో మాగ్నెట్లను తయారు చేసేలా కంపెనీలను ప్రోత్సహించడం తమ లక్ష్యమని ప్రభుత్వం ప్రకటించింది.

చైనాదే హవా

ఆటోమొబైల్, కంప్యూటర్ చిప్స్, విండ్ టర్బైన్స్‌లో రేర్ ఎర్త్ మాగ్నెట్లు కీలకం. ప్రస్తుతం ఈ మాగ్నెట్ల ఉత్పత్తిలో చైనాదే హవా. ప్రపంచ ఉత్పత్తిలో 90 శాతం చైనాలోనే కేంద్రీకృతమైంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి చైనా మన దేశానికి వీటి ఎగుమతులను నిలిపివేసింది. దీంతో దేశీయ ఆటోమొబైల్ కంపెనీలు ముఖ్యంగా విద్యుత్ వాహనాల కంపెనీలు వీటి సరఫరా కోసం అరిచి గగ్గోలు పెడుతున్నాయి. అయినా చైనా నుంచి ఉలుకూ పలుకు లేదు. ప్రత్యామ్నాయాలు చూద్దామన్నా పెద్దగా ఫలించడం లేదు. దీంతో సొంత కాళ్లపై నిలబడడం తప్ప వేరే మార్గం లేదని ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది. అందులో భాగంగానే దేశీయంగా రేర్ ఎర్త్ మాగ్నెట్ల ఉత్పత్తికి ముందుకు వచ్చే కంపెనీలను ప్రోత్సహించాలని నిర్ణయించింది.

ఎలక్ట్రిక్ ట్రక్కులకు ప్రోత్సాహం

సరుకుల రవాణ రంగంలో విద్యుత్ బ్యాటరీలతో పని చేసే ట్రక్కులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకోసం పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద రూ.500 కోట్లతో ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటించింది. ఈ పథకం కింద ఒక్కో ఎలక్ట్రిక్ ట్రక్కు కొనుగోలుపై రూ.9.6 లక్షల వరకు ప్రత్యేక డిస్కౌంట్ లభిస్తుందని కుమార స్వామి ప్రకటించారు. అయితే ఈ డిస్కౌంట్‌ను ట్రక్కు కొనుగోలుదారునికి కాకుండా వాటిని తయారు చేసే కంపెనీలకు ఇస్తామన్నారు.

ఐటీ షేర్లలో భారీ అమ్మకాలు

సెన్సెక్స్ 690 పాయింట్లు డౌన్

ముంబై: ఐటీ, ఆటో, ఎనర్జీ షేర్లలో భారీ అమ్మకాల ఒత్తిడి శుక్రవారం మార్కెట్‌ను కుంగదీసింది. కార్పొరేట్ ఫలితాల సీజన్‌కు ఐటీ దిగ్గజం టీసీఎస్ నిరుత్సాహపూరితమైన ప్రారంభం అందించడం ఐటీ, ఆటో, ఇంధన కౌంటర్లలో అమ్మకాల ఒత్తిడిని పెంచింది. దీనికి తోడు టారిఫ్ సంబంధిత అస్థిరతలు, ప్రపంచ మార్కెట్ల నుంచి అందిన మిశ్రమ సంకేతాలు మార్కెట్‌పై ప్రభావం చూపాయి. సెన్సెక్స్ 689.91 పాయింట్ల నష్టంతో 82,500.47 వద్ద స్థిరపడగా నిఫ్టీ 205.40 పాయింట్ల నష్టంతో 25,149.85 వద్ద క్లోజైంది.

రిజిస్టర్ కాని ఆన్‌లైన్ బాండ్ వేదికలను నమ్మొద్దు: వివిధ స్థిరాదాయ పెట్టుబడి సాధనాలకు ప్రవేశం కల్పిస్తున్న రిజిస్టర్ కాని ఆన్‌లైన్ బాండ్ ప్లాట్‌ఫామ్స్‌ను విశ్వసించవద్దని బీఎస్ఈ, ఎన్ఎస్ఈ తమ ఇన్వెస్టర్లను హెచ్చరించాయి. ఆన్‌లైన్ బాండ్లలో పెట్టుబడులు పెట్టే సమయంలో కంపెనీలకు సంబంధించిన విశ్వసనీయ అంశాలను పరిశీలించాలని తెలిపాయి. ప్రధానంగా బాండ్ల క్రెడిట్ రేటింగ్, జారీ చేస్తున్న సంస్థ చెల్లింపుల రికార్డు, లిక్విడిటీ, సెటిల్‌మెంట్ కాలపరిమితి, పన్ను భారం వంటివి పరిశీలించాలని సూచించాయి.

హెల్త్‌కేర్‌లోకి అదానీ గ్రూప్

- ముంబై, అహ్మదాబాద్‌ల్లో హాస్పిటల్స్ ఏర్పాటు
- గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ వెల్లడి

ముంబై: అదానీ గ్రూప్.. ఆరోగ్య సంరక్షణ (హెల్త్‌కేర్) రంగంలోకి ప్రవేశిస్తోంది. ఇందులో భాగంగా ముంబై, అహ్మదాబాద్ నగరాల్లో అత్యాధునిక సదుపాయాలతో రెండు ఆస్పత్రులు ఏర్పాటు చేస్తోంది. ముంబైలో జరిగిన ఒక సదస్సులో అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ ఈ విషయం వెల్లడించారు. తాము ఏర్పాటు చేసే ఆస్పత్రుల్లో వ్యాధి నిర్ధారణ, చికిత్సల్లో కృత్రిమ మేధను ఎక్కువగా ఉపయోగించనున్నట్టు తెలిపారు. అనేక వ్యాధులకు ఒకే చోట చికిత్స అందించేలా ఈ ఆస్పత్రులు ఏర్పాటు చేస్తామన్నారు. అత్యవసర పరిస్థితులు, కొవిడ్ వంటి మహమ్మారులు వ్యాపించినప్పుడు ఈ ఆస్పత్రుల సామర్థ్యాన్నీ వెంటనే విస్తరించవచ్చన్నారు. అందుబాటు ధరల్లో అత్యాధునిక వైద్య సేవలను అందరికీ అందుబాటులోకి తేవడమే తమ లక్ష్యమని అదానీ స్పష్టం చేశారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	99,000 ▲	90,750 ▲	1,21,000 ▲
విజయవాడ	1,00,000 ▲	94,000 ▼	1,11,000 ▲
విశాఖపట్నం	1,00,710 ▲	90,750 ▲	1,21,000 ▲
రాజమండ్రి	99,000 ▲	90,750 ▲	1,13,600 ▼
ప్రొద్దుటూరు	97,600 ▲	89,790 ▲	1,11,000 ▲
ముంబై	97,511 ▲	89 ,320 ▲	1,10,290 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



12వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	525
వరంగల్	512	గోదావరి	515
చిత్తూరు	583	విశాఖపట్నం	540
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	93	విజయవాడ	97
వరంగల్	93	గుంటూరు	102
కరీంనగర్	93	ఒంగోలు	105
మహబూబ్‌నగర్	93	చిత్తూరు	98
కర్నూలు	93	నెల్లూరు	103
విశాఖపట్నం	81	అనంతపురం	103
గోదావరి	97		

8 బీమా కంపెనీలకు

ఐఆర్‌డీఏఐ ఝలక్

ఆరోగ్య బీమా లోపాలపై గుస్సా
షోకాజ్ నోటీసులు జారీ

న్యూఢిల్లీ: ఆరోగ్య బీమా పాలసీల సెటిల్‌మెంట్స్ లోపాలపై బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) మరోసారి ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విషయంలో ఎనిమిది బీమా కంపెనీలకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ కంపెనీలన్నీ క్లెయిమ్స్ సెటిల్‌మెంట్‌కు సంబంధించి గత ఏడాది మే నెలలో తాము జారీ చేసిన 'హెల్త్ ఇన్సూరెన్స్ మాస్టర్ సర్క్యులర్' నిబంధనలు తుంగలో తొక్కాయని పేర్కొంది. ప్రైవేట్ రంగంలోని నివా బూపా హెల్త్ ఇన్సూరెన్స్, స్టార్ హెల్త్ అండ్ అల్లైడ్ ఇన్సూరెన్స్, కేర్ హెల్త్ ఇన్సూరెన్స్, మణిపాల్‌సిగ్నా హెల్త్ ఇన్సూరెన్స్, టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్, ఐసీఐసీఐ లొంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్, హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్‌తో పాటు ప్రభుత్వ రంగంలోని న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీకి కూడా ఈ నోటీసులు అందాయి.

వచ్చే వారం చర్చ: ఈ నోటీసులకు ఇప్పటి వరకు ఐసీఐసీఐ లొంబార్డ్, న్యూ ఇండియా అష్యూరెన్స్ మాత్రమే సమాధానం ఇచ్చాయి. మిగతా కంపెనీలు ఇంకా సమాధానం ఇవ్వాల్సి ఉంది. వచ్చే వారం జరిగే ఐఆర్‌డీఏఐ బోర్డు సమావేశంలో ఈ అంశం చర్చకు రానుంది. బీమా కంపెనీలు ఇచ్చిన సమాధానాలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటారు. జరిమానాలు లేదా పాలసీదారులకు వడ్డీతో సహా క్లెయిమ్స్ రిఫండ్ చేయమని ఆదేశించే అవకాశం ఉందని భావిస్తున్నారు

ఐఆర్‌డీఏఐ లేవనెత్తిన అభ్యంతరాలు
- క్లెయిమ్స్ చెల్లింపుల నుంచి అనవసర తగ్గింపులు
- అహేతుక కారణాలతో క్లెయిములను తిరస్కరించడం
- నిర్ణీత కాలానికి మించి సెటిల్‌మెంట్స్ ఆలస్యం చేయడం

పన్ను వసూళ్లు తగ్గాయ్..

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం..జూలై 10 నాటికి ప్రత్యక్ష పన్ను వసూళ్లు నికరంగా 1.34% తగ్గి రూ.5.63 లక్షల కోట్లకు చేరాయి. రిఫండ్లు అధికంగా ఉండడమే ఇందుకు కారణం. ఇదే సమయంలో కార్పొరేట్ పన్ను వసూళ్లు నికరంగా 3.67% తగ్గి రూ.2 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. గత ఏడాది ఇదే కాలంలో వసూలైన కార్పొరేట్ పన్నుల పరిమాణం రూ.2.07 లక్షల కోట్లుంది. ఇక నాన్ కార్పొరేట్ పన్ను (వ్యక్తిగత ఆదాయపు పన్ను, హెచ్‌యూఎఫ్‌లు, సంస్థలు) వసూళ్లు రూ.3.45 లక్షల కోట్ల వద్ద స్థిరంగా ఉన్నాయి. సెక్యూరిటీ లావాదేవీల పన్ను ద్వారా రూ.17,874 కోట్లు వసూలైంది. నికర రిఫండ్ల విలువ 38% పెరిగి రూ.1.02 లక్షల కోట్లకు చేరింది.

జురిక్ కోటక్ నుంచి వాణిజ్య బీమా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జురిక్ కోటక్ జనరల్ ఇన్సూరెన్స్.. వాణిజ్య (కమర్షియల్) ఇన్సూరెన్స్ విభాగంలోకి ప్రవేశించింది. ఎస్ఎంఈల నుంచి బడా కార్పొరేట్ కంపెనీల అవసరాలకు తగ్గట్టుగా ప్రత్యేక బీమా పాలసీలను తీసుకువచ్చినట్లు సంస్థ ఎండీ, సీఈఓ అలోక్ అగర్వాల్ వెల్లడించారు. అంతేకాకుండా ఆస్తులు, లయబిలిటీ, మెరైన్, ఇంజనీరింగ్ రంగాలతో పాటు ఇతరత్రా విభాగాలకు కూడా ప్రత్యేకంగా పాలసీలను రూపొందించినట్లు ఆయన చెప్పారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ మొత్తం ప్రీమియం ఆదాయం రూ.2,036 కోట్లుగా ఉండగా అందులో కమర్షియల్ ఇన్సూరెన్స్ విభాగం వాటా 3 శాతంగా ఉందన్నారు. దేశీయంగా ఆర్థిక కార్యకలాపాలు ఊపందుకుంటుండటంతో ఈ ఏడాది ఈ విభాగంలో 15 నుంచి 20 శాతం వృద్ధిని సాధించవచ్చని భావిస్తున్నట్లు అగర్వాల్ చెప్పారు. ప్రస్తుతం కంపెనీ దేశవ్యాప్తంగా 31 కార్యాలయాలను నిర్వహిస్తోంది. ఈ ఏడాది కొత్తగా ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంతో పాటు మరికొన్ని నగరాలకు విస్తరించనుంది.

- క్విక్ డెలివరీ సంస్థ బిగ్‌బాస్కెట్.. ఆంధ్రప్రదేశ్‌లో తన కార్యకలాపాలు విస్తరించింది. ఇందులో భాగం గా కాకినాడలో తన 10 నిమిషాల డెలివరీ సేవలను ప్రారంభించినట్లు బిగ్ బాస్కెట్ ప్రకటించింది. పర్సనల్ కేర్ ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్స్ సహా దాదాపు 10వేలకు పైగా ఉత్పత్తులను పది నిమిషాల్లోనే వినియోగదారుల చెంతకు చేర్చనుంది.
- అమెజాన్ ఇండియా.. ప్రైమ్ డే 2025ను ప్రారంభించింది. ఈ నెల 12 నుంచి 14 వరకు ఈ ప్రైమ్ డే సేల్ అందుబాటులో ఉండనుంది. సేల్‌లో భాగంగా స్మార్ట్‌ఫోన్స్, ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్, గృహోపకరణాలపై భారీ డిస్కౌంట్స్‌ను అందిస్తోంది. ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ కార్డ్స్ ద్వారా చేసే చెల్లింపులపై 10% ఇన్‌స్టంట్ డిస్కౌంట్‌ను ఆఫర్ చేస్తోంది.



1 x 2



ఫైనల్లో సినర్, అల్కారజ్

వింబుల్డన్

- సెమీస్‌లో జొకోవిచ్‌కు ఝలక్



జొకోవిచ్

లండన్: డబుల్ డిఫెండింగ్ చాంపియన్, ప్రపంచ రెండో ర్యాంకర్ కార్లోస్ అల్కారజ్ వరుసగా మూడో వింబుల్డన్ టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచాడు. స్పెయిన్‌కు చెందిన రెండోసీడ్ అల్కారజ్ ఫైనల్లో అడుగు పెట్టాడు. ఆదివారం జరిగే తుదిపోరులో ప్రపంచ నెంబర్‌వన్ యానిక్ సినర్ (ఇటలీ)తో అమీతుమీ తేల్చుకుంటాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో అల్కారజ్ 6-4, 5-7, 6-3, 7-6 (6)తో ఐదో సీడ్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా)పై గెలుపొందాడు. రెండో సెమీస్‌లో టాప్‌సీడ్ సినర్ 6-3, 6-3, 6-4తో వరుస సెట్లలో ఆరో సీడ్ నొవాక్ జొకోవిచ్‌కు షాకిచ్చాడు. తద్వారా 23 ఏళ్ల సినర్ తొలిసారి వింబుల్డన్ ఫైనల్లో ప్రవేశించాడు. ఏడుసార్లు వింబుల్డన్ విజేత జొకో.. సినర్‌కు ఏ దశలోనూ పోటీ ఇవ్వలేక పోయాడు. గంటా 55 నిమిషాల పోరులో ఒక్క సెట్ కూడా నెగ్గలేకపోయాడు. దీంతో రికార్డుస్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ నెగ్గాలన్న 38 ఏళ్ల జొకోవిచ్ కల మరోసారి కలగానే మిగిలిపోయింది.

ఇక ఈ వింబుల్డన్ ఫైనల్..ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ ఫైట్‌ను పునరావృతం చేయనుంది. ఐదు సెట్లపాటు హోరాహోరీగా సాగిన రొలాండ్ గారోస్ ఫైనల్లో సినర్‌పై 22 ఏళ్ల అల్కారజ్ గెలిచాడు. కాగా..వింబుల్డన్ సెమీస్ గెలుపుతో అల్కారజ్ వరుస విజయాల సంఖ్య 24కి చేరడం విశేషం.

అనిసిమోవా X స్వియటెక్

నేడు మహిళల సింగిల్స్ ఫైనల్



రాత్రి 8.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

మహిళల ఆఖరి టీ20 నేడు
భారత్ X ఇంగ్లండ్
రా. 11.05 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో

ఇటలీకి టీ20 ప్రపంచకప్ బెర్త్

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్‌నకు మొదటిసారి ఇటలీ జట్టు అర్హత సాధించింది. హేగ్ నగరంలో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ఇటలీపై నెదర్లాండ్స్ గెలిచింది. దీంతో నెదర్లాండ్స్ నేరుగా ప్రపంచకప్ బెర్త్ దక్కించుకుంది. అయితే, అంతకుముందు జెర్సీ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో స్కాట్లాండ్ ఓటమి పాలైంది. దీంతో.. గత నాలుగు ఎడిషన్లలో టీ20 కప్‌లో తలపడిన స్కాట్లాండ్, ఈసారి అనూహ్యంగా టోర్నీకి దూరమవడం గమనార్హం. స్కాట్లాండ్ నిష్క్రమణతో.. జెర్సీ, ఇటలీ జట్లు చెరో ఐదు పాయింట్లతో సమంగా నిలిచాయి. కానీ, నెట్ రన్‌రేట్ పరంగా ముందంజలో నిలిచిన ఇటలీ మెగా టోర్నీలో ఆడేందుకు తొలిసారి చోటు దక్కించుకోగా.. జెర్సీ జట్టు రేసు నుంచి వెనుదిరిగింది.

విహార యాత్ర కోసం రాలేదు

గంభీర్

లండన్: భారత క్రికెటర్లు విదేశీ పర్యటనలకు వెళ్లేది విహారం కోసం కాదని, ఎక్కువ సమయం ఆటపైనే దృష్టి పెట్టాల్సి ఉంటుందని కోచ్ గౌతమ్ గంభీర్ స్పష్టం చేశాడు. ఈమేరకు కుటుంబ సభ్యులను తమ వెంట తెచ్చుకోవడంపై బీసీసీఐ విధించిన ఆంక్షలకు పూర్తి మద్దతు ప్రకటించాడు. 'ఎవరికైనా కుటుంబాలు ముఖ్యమే. కానీ ఆటగాళ్లు ఓ విషయం గుర్తుంచుకోవాలి. మీరంతా ఇక్కడికి వచ్చింది హాలీడే కోసం కాదు. ఓ లక్ష్యంతో వచ్చారు. ఎంతో మందిలో కేవలం మీకు మాత్రమే దేశం గర్వపడేలా ఆడే అవకాశం వచ్చింది. అందుకే దృష్టంతా ఆటపైనే ఉండడం అవసరం' అని పుజారకిచ్చిన ఇంటర్వ్యూలో గంభీర్ తేల్చాడు.

మిక్స్‌డ్ కాంస్య పోరుకు సురేఖ జోడీ

- వ్యక్తిగత ఈవెంట్‌లో సెమీస్‌కు తెలుగు ఆర్చర్
- ఆర్చరీ ప్రపంచ కప్ స్టేజ్-4

మాడ్రిడ్: తెలుగు స్టార్ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ ప్రపంచ కప్ స్టేజ్-4 పోటీల్లో మరో రెండు పతకాలకు చేరువైంది. ఇప్పటికే సహచరులతో కలిసి కాంపౌండ్ మహిళల టీమ్ ఈవెంట్‌లో ఫైనల్ చేరిన సురేఖ.. తాజాగా వ్యక్తిగత విభాగంలో సెమీఫైనల్‌కు, మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో కాంస్యం పోరుకు చేరుకుంది. శుక్రవారం జరిగిన మహిళల వ్యక్తిగత ఈవెంట్ క్వార్టర్స్‌లో టాప్‌సీడ్ సురేఖ 147-144తో హజల్ బురున్ (తుర్కియే)ని ఓడించి సెమీస్ చేరింది. ఇదే కేటగిరిలో మరో భారత అమ్మాయి పర్ణీత్ కౌర్ 142-141తో ఓజ్నుర్ (తుర్కియే)పై గెలిచి సెమీస్‌లో ప్రవేశించింది. ఇక కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్ సెమీఫైనల్లో భారత ద్వయం, టాప్‌సీడ్ సురేఖ/రిషభ్ యాదవ్ 152-155తో నెదర్లాండ్స్ జంట చేతిలో ఓటమిపాలైంది. దీంతో శనివారం జరిగే కాంస్య పతక పోరులో ఎల్ సాల్వడార్ జంటతో సురేఖ జోడీ తలపడనుంది. కాగా, రికర్వ్ విభాగం మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో ధీరజ్ బొమ్మదేవర/అంకిత ద్వయం 1-5తో స్విట్జర్లాండ్ జంట చేతిలో ఓడి ఆరంభ రౌండ్లోనే వెనుదిరిగింది.

భళా.. బుమ్రా

లార్డ్స్‌లో తొలిసారి 5 వికెట్లు

- ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్ 387
- రూట్ శతకం • భారత్ తొలి ఇన్నింగ్స్ 145/3
- రాహుల్ అజేయ అర్ధసెంచరీ • రెండో టెస్టు



లండన్: భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య జరుగుతున్న రెండో టెస్టులో శుక్రవారం బౌలర్ల జోరు మధ్య ఆట ఆచితూచి అన్నట్టుగా సాగింది. స్టార్ పేసర్ బుమ్రా (5/74) ప్రతిష్ఠాత్మక లార్డ్స్ మైదానంలో తొలిసారిగా ఐదు వికెట్లతో హానర్స్ లిస్టులో చేరాడు. ఆ తర్వాత బ్యాటింగ్‌లో ఓపెనర్ కేఎల్ రాహుల్ (53 బ్యాటింగ్) అజేయ అర్ధసెంచరీతో భారత్ నిలకడగా ఆడుతోంది. ప్రస్తుతం గిల్ సేన 242 పరుగులు వెనుకబడి ఉండడంతో శనివారం ఏమేరకు నిలుస్తారనేది కీలకం కానుంది. అయితే అంతకుముందు బుమ్రా మిడిలార్డర్‌ను దెబ్బతీసినా.. బ్రైడన్ కార్స్ (56), జేమీ స్మిత్ (51) అర్ధసెంచరీలతో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 112.3 ఓవర్లలో 387 పరుగులు చేసింది. రూట్ (104) శతకం పూర్తి చేయగా, స్టోక్స్ (44) ఫర్వాలేదనిపించాడు. సిరాజ్, నితీశ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. అనంతరం తొలి ఇన్నింగ్స్‌లో టాపార్డర్‌ను కోల్పోయిన భారత్ 43 ఓవర్లలో 3 వికెట్లకు 145 పరుగులు చేసింది. రాహుల్ (53 బ్యాటింగ్) హాఫ్ సెంచరీతో నిలువగా, కరుణ్ నాయర్ (40) సహకరించాడు.

ఆదుకున్న టెయిలెండర్లు: రెండో రోజు 251/4 ఓవర్‌నైట్ స్కోరుతో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ ఆరంభించగా.. ఉదయం సెషన్ ఆసక్తికరంగా సాగింది. తొలి బంతినే ఫోర్‌గా మలిచి రూట్ శతకం పూర్తి చేయగా.. పేసర్ బుమ్రా తన పదునైన బంతులతో ఏకంగా మూడు వికెట్లతో చెలరేగాడు. అయితే జేమీ స్మిత్ వన్డే తరహాలో చెలరేగి ఆదుకున్నాడు. ఆరంభ మూడో ఓవర్‌లోనే కెప్టెన్ స్టోక్స్‌ను బుమ్రా బౌల్డ్ చేశాడు. అయితే ఆ వెంటనే సిరాజ్ ఓవర్‌లో స్మిత్ ఇచ్చిన క్యాచ్‌ను రాహుల్ వదిలేశాడు. అప్పటికి అతడి స్కోరు 5 రన్స్ మాత్రమే. మరోవైపు బుమ్రా మాత్రం తర్వాతి ఓవర్‌లోనే రూట్, వోక్స్ (0)లను వరుస బంతుల్లో పెవిలియన్ చేర్చాడు. దీంతో ఒక్కసారిగా ఇంగ్లండ్ 271/7 స్కోరుతో షాక్‌కు గురైంది. బుమ్రా జోరుకు ఈ సెషన్‌లోపే జట్టు ఆలౌటవుతుందనిపించింది.

బంతి మారింది..లయ తప్పింది: సెషన్ ఆరో ఓవర్‌లో బంతి మార్పు కోసం భారత్ ఫిర్యాదు చేసింది. అప్పటికి కేవలం పది ఓవర్లు మాత్రమే ఆ బంతిని వాడడం గమనార్హం. అయితే అంపైర్లు మార్చిన బంతిపై కెప్టెన్ గిల్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. తను అంపైర్‌తో వాగ్వాదానికి దిగినా ఎలాంటి ఫలితం లేకపోయింది. 'ఇది పది ఓవర్ల బంతేనా?' అంటూ సిరాజ్ ఆశ్చర్యపోవడం మైక్‌లో వినిపించింది. ఇన్నింగ్స్ 91వ ఓవర్ మధ్యలో ఈ మార్పు జరగ్గా.. స్మిత్ అదే ఓవర్‌లో ఫోర్‌తో తన బ్యాట్‌కు పనిచెప్పాడు. బంతి స్వింగ్ కాకపోవడంతో స్మిత్-కార్స్ జోడీ అడపాదడపా ఫోర్లతో పాటు చకచకా సింగిల్స్‌తో స్కోరును 300 దాటించారు. అయితే కేవలం 48 డెలివరీల తర్వాత 99వ ఓవర్‌లో బంతిని మరోసారి మార్చాల్సి వచ్చింది. అయినా బౌలర్లు ప్రభావం చూపలేదు. కార్స్ ఫోర్లతో వేగం పెంచాడు. అటు స్మిత్ 52 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. అయితే విరామం తర్వాత రెండో ఓవర్‌లోనే స్మిత్‌ను సిరాజ్ అవుట్ చేశాడు. దీంతో ఎనిమిదో వికెట్‌కు 84 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. అటు ఆర్చర్ (4)ను బుమ్రా బౌల్డ్ చేసి లార్డ్స్‌లో తొలిసారి ఐదు వికెట్ల ఫీట్‌ను అందుకున్నాడు. ఇక సిరాజ్ ఓవర్‌లో సిక్సర్‌తో కార్స్ ఫిఫ్టీ పూర్తి చేయగా.. అతడి క్యాచ్‌లను ఆకాశ్, జురెల్ వదిలేయడం గమనార్హం. అయితే తర్వాతి ఓవర్‌లోనే సిరాజ్ అతడి వికెట్‌తో ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌ను ముగించాడు. మొత్తంగా చివరి మూడు వికెట్ల మధ్యే 116 రన్స్ రావడం విశేషం.



అంపైర్‌తో గిల్

రాహుల్ హాఫ్ సెంచరీ: రెండో సెషన్‌లో 14 ఓవర్లు ఆడిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో టీ బ్రేక్ సమయానికి 44 పరుగులు చేసి జైస్వాల్ (13) వికెట్‌ను కోల్పోయింది. ఆర్చర్ తన తొలి ఓవర్‌లోనే అతడి వికెట్ తీశాడు. ఆ తర్వాత కూడా ఈ పేసర్ నిలకడగా 145కి.మీ వేగంతో బంతులు విసిరి ఇబ్బంది పెట్టాడు. కరుణ్, రాహుల్ మాత్రం వికెట్ కోల్పోకుండా ఆఖరి సెషన్‌కు వెళ్లారు. అయితే ఓపిగ్గా ఆడుతున్న కరుణ్‌ను చివరి సెషన్‌లో స్టోక్స్ అవుట్ చేశాడు. రెండో వికెట్‌కు వీరి మధ్య 61 పరుగులు జత చేరాయి. ఆ తర్వాత భీకర ఫామ్‌లో ఉన్న గిల్ (16)ను పేసర్ వోక్స్ అవుట్ చేయడంతో భారత్ 107 రన్స్‌కు 3 వికెట్లు కోల్పోయింది. అయితే పట్టుదలగా ఆడిన రాహుల్ మాత్రం అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. అతడికి పంత్ (19 బ్యాటింగ్) సహకరించడంతో రెండో రోజును భారత్ ముగించింది.

స్కోరుబోర్డు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలే (సి) పంత్ (బి) నితీశ్ 18; డకెట్ (సి) పంత్ (బి) నితీశ్ 23; పోప్ (సి సబ్) జురెల్ (బి) జడేజా 44; రూట్ (బి) బుమ్రా 104; బ్రూక్ (బి) బుమ్రా 11; స్టోక్స్ (బి) బుమ్రా 44; స్మిత్ (సి సబ్) జురెల్ (బి) సిరాజ్ 51; వోక్స్ (సి సబ్) జురెల్ (బి) బుమ్రా 0; కార్స్ (బి) సిరాజ్ 56; ఆర్చర్ (బి) బుమ్రా 4; బషీర్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 31; మొత్తం: 112.3 ఓవర్లలో 387 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-43, 2-44, 3-153, 4-172, 5-260, 6-271, 7-271, 8-355, 9-370, 10-387.**బౌలింగ్:** బుమ్రా 27-5-74-5; ఆకాశ్ 23-3-92-0; సిరాజ్ 23.3-6-85-2; నితీశ్ 17-0-62-2; జడేజా 12-1-29-1; సుందర్ 10-1-21-0.

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) బ్రూక్ (బి) ఆర్చర్ 13; రాహుల్ (బ్యాటింగ్) 53; కరుణ్ (సి) రూట్ (బి) స్టోక్స్ 40; గిల్ (సి) స్మిత్ (బి) వోక్స్ 16; పంత్ (బ్యాటింగ్) 19; **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 43 ఓవర్లలో 145/3. వికెట్ల పతనం:** 1-13, 2-74, 3-107.**బౌలింగ్:** వోక్స్ 13-1-56-1; ఆర్చర్ 10-3-22-1; కార్స్ 8-1-27-0; స్టోక్స్ 6-2-16-1; బషీర్ 6-1-22-0.

1 విదేశీ గడ్డపై ఎక్కువ సార్లు (13) ఐదు వికెట్ల ఫీట్‌ను అందుకున్న భారత బౌలర్‌గా బుమ్రా. కపిల్ (12)ను అధిగమించాడు. అయితే తన కెరీర్‌లో ఇది 15వది. అలాగే సేనా జట్లపై అత్యధికంగా 11 సార్లు ఈ ఫీట్‌ను నమోదు చేసిన ఆసియా బౌలర్‌గా అక్రమ్ సరసన నిలిచాడు.



రాహుల్ (53 బ్యాటింగ్)

- టెస్టుల్లో అధిక క్యాచ్ (211)లు తీసుకున్న ఫీల్డర్‌గా జో రూట్. ద్రవిడ్ (210)ను అధిగమించాడు.
- టెస్టుల్లో తక్కువ బంతుల్లోనే (1303) వెయ్యి రన్స్ పూర్తి చేసిన వికెట్ కీపర్‌గా జేమీ స్మిత్.

2 ఇంగ్లండ్‌లో ఎక్కువ వికెట్లు (47) తీసిన రెండో భారత బౌలర్‌గా బుమ్రా. ఇషాంత్ (48) టాప్‌లో ఉన్నాడు.

3 లార్డ్స్‌లో హ్యాట్రిక్ శతకాలు పూర్తి చేసిన మూడో బ్యాటర్‌గా జో రూట్. గతంలో జాక్ హాబ్స్, మైకేల్ వాన్ ఉన్నారు.

ఏపీకి ఏడు పతకాలు

ఇండియా ఓపెన్ పారా అథ్లెటిక్స్

బెంగళూరు: ఇండియన్ ఓపెన్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలుగు అథ్లెట్లు సత్తా చాటారు. శుక్రవారం మొదలైన ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ అథ్లెట్లు ఏడు పతకాలు సాధించారు. ఇందులో ఓ స్వర్ణం, 3 రజతాలు, 3 కాంస్యాలు నెగ్గారు. రవి (ఎఫ్40 షాట్‌పుట్) పసిడి నెగ్గగా.. యాదగిరి (టీ54 షాట్‌పుట్), భవాని (100 మీ.), వెంకటేశ్వర్లు (100 మీ.) రజతాలు.. భవాని (లాంగ్‌జంప్), శ్రీహరి (లాంగ్‌జంప్), లోకేశ్ (హైజంప్) కాంస్యాలు దక్కించుకున్నారు. ఇక, తెలంగాణకు చెందిన దీప్తి జివాంజి (400 మీ.), ఆకీరా నందన్ (400 మీ.) స్వర్ణాలు సాధించారు.

ఇంటి పనులు సబార్డినేట్ విధుల్లో భాగం కాదనలేం

▸ కొందరు న్యాయాధికారుల తీరుతో ఆ విధులు మార్చలేం: హైకోర్టు

అమరావతి, జూలై 11(ఆంధ్రజ్యోతి): కొందరు న్యాయాధికారుల అనుచిత ప్రవర్తనను ఆధారంగా చేసుకుని ఆఫీస్ సబార్డినేట్లకు కేటాయించిన ప్రాథమిక విధులను మార్చలేమని హైకోర్టు స్పష్టం చేసింది. న్యాయాధికారుల నివాసాల్లో ఇంటి పనులు నిర్వహించేందుకు కొంతమంది ఆఫీస్ సబార్డినేట్లను అటాచ్ చేసే విధానం జిల్లా న్యాయవ్యవస్థలో కొనసాగుతోందని గుర్తుచేసింది. ఈ నేపథ్యంలో ఇంటి పనులు ఆఫీస్ సబార్డినేట్ విధుల్లో భాగం కాదన్న పిటిషనర్ వాదనను ఆమోదించలేమని పేర్కొంది. గృహసంబంధ పనుల నిర్వహణలో న్యాయాధికారుల నుంచి ఏమైనా వేధింపులు ఎదురైతే పరిపాలనాపరంగా ఫిర్యాదు చేయవచ్చని, వాటిపై తగిన చర్యలు తీసుకుంటారని తెలిపింది. ఈ మేరకు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ జగడం సుమతితో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది. దిగువ కోర్టుల్లో పనిచేసే నాలుగో తరగతి ఉద్యోగులకు ఆయా న్యాయాధికారుల నివాసాల్లో అనధికారిక, ఇంటి పనులు అప్పగించకుండా సబార్డినేట్ జ్యుడీషియరీ అధికారులను ఆదేశించాలని కోరుతూ ఏపీ జ్యుడీషియల్ ఆఫీస్ సబార్డినేట్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి టి.విజయలక్ష్మి పిటిషన్ దాఖలు చేశారు. ఉమ్మడి హైకోర్టు తీర్పుల నేపథ్యంలో 1992లో జారీ చేసిన సర్క్యులర్‌లో పేర్కొన్న విధులను తుది జాబితాగా పరిగణించలేమని, అవసరమైన సమయంలో సబార్డినేట్లకు ఇతర విధులు కూడా అప్పగించవచ్చని ధర్మాసనం అభిప్రాయపడింది. వ్యాజ్యాన్ని కొట్టివేసింది.

ఏఎస్పీకి దర్యాప్తు అప్పగించడం సరికాదు

▸ సుప్రీం కోర్టు వేసిన సిట్‌తోనే నకిలీ నెయ్యిపై దర్యాప్తు చేయాలి: హైకోర్టు

అమరావతి, జూలై 11(ఆంధ్రజ్యోతి): టీటీడీకి నకిలీ నెయ్యి సరఫరా చేసిన వ్యవహారంలో కేసును దర్యాప్తు చేయాలంటూ అదనపు ఎస్పీ వెంకట్రావును సీబీఐ డైరెక్టర్ ఆదేశించడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. ఏఎస్పీకి దర్యాప్తును అప్పగిస్తూ గతేడాది అక్టోబరు 28న సీబీఐ డైరెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలను అధిగమించడమేనంది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ తీర్పు ఇచ్చారు. సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సిట్‌లో సభ్యుడుకాని ఏఎస్పీ వెంకట్రావు విచారణకు హాజరుకావాలంటూ తనకు నోటీసు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ వైసీపీ నేత వైవీ సుబ్బారెడ్డి అప్పటి పీఏ అప్పన్న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై తీర్పు ప్రతి శుక్రవారం అందుబాటులోకి వచ్చింది. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఐపీఎస్ అధికారులు సర్వశ్రేష్ఠ త్రిపాఠి, గోపినాథ్ జెట్టిలను సిట్‌లో సభ్యులుగా రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేసిందని, వీరికి అదనంగా అడిషనల్ ఎస్పీ వెంకట్రావును దర్యాప్తు అధికారిగా చేర్చడం సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించడమే అవుతుందని న్యాయమూర్తి పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఏర్పాటైన సిట్ దర్యాప్తును సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షించాలని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు. ఇక, టీటీడీకి నకిలీ నెయ్యి సరఫరా చేసిన కేసులో బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఏఆర్ డెయిరీ ఎండీ రాజు రాజశేఖరన్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టులో ఇరువైపుల వాదనలు ముగిశాయి. దీంతో న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. సిట్ తరపున సీబీఐ స్టాండింగ్ కౌన్సిల్ సురేష్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. తనకు అర్హతలేదని తెలిసి కూడా నెయ్యి సరఫరాకు టెండర్ వేశారని, పిటిషనర్‌కు బెయిల్ ఇస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందన్నారు.

విశాఖ, నెల్లూరులో 'వేస్ట్ రీసైక్లింగ్' పార్కులు



విశాఖపట్నం, జూలై 11(ఆంధ్రజ్యోతి): వ్యర్థాల రీసైక్లింగ్‌ను ప్రోత్సహించడానికి రాష్ట్రంలో 'వేస్ట్ రీసైక్లింగ్ ఇండస్ట్రియల్ పార్కులు' ఏర్పాటు చేయనున్నట్లు ఏపీ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ పి.కృష్ణయ్య తెలిపారు. పారిశ్రామిక రాజధానిగా ఉన్న విశాఖలో ఒకటి, శ్రీసిటీకి సమీపాన నెల్లూరు/చిత్తూరు జిల్లాలో మరొకటి ఏర్పాటవుతాయన్నారు. వీటివల్ల కొత్త పరిశ్రమలు, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు. శుక్రవారం విశాఖ వచ్చిన ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. పరిశ్రమల వ్యర్థాలు పూర్తిగా పనికి రానివి కావని, అవి ఉప ఉత్పత్తులని తెలిపారు. ఉదాహరణకు థర్మల్ పవర్ ప్లాంట్ల నుంచి వచ్చే బూడిద (ఫ్లై యాష్)ను ఫాల్జీ బ్రిక్స్ తయారీకి, సిమెంట్ కంపెనీలకు, హైవేల నిర్మాణంలోనూ వినియోగిస్తున్నారని చెప్పారు. అందుకే వ్యర్థాలను రీసైక్లింగ్ చేసే వారి కోసం ప్రభుత్వం ప్రత్యేక పాలసీ తీసుకొస్తోందన్నారు.స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ 'క్లీన్ సిటీ' కార్యక్రమాన్ని ఉద్యమంగా చేపట్టిందన్నారు.

ఉధృతంగా వరద గోదారి

▸ కుక్కునూరు, వేలేరుపాడుల్లో కాజ్‌వేల మునక

▸ 14 గ్రామాలకు రాకపోకలు బంద్

▸ నిర్వాసితుల కాలనీలకు తరలివెళుతున్న జనం

▸ ధవళేశ్వరం బ్యారేజీ గేట్లన్నీ ఎత్తివేత

▸ 3,54,341 క్యూసెక్కులు సముద్రంలోకి



పోలవరం ఎగువ కాఫర్ డ్యామ్‌కు సమీపంలో వరద నీటిలో మునిగిన మాతృశ్రీ గండిపోశమ్మ ఆలయం

పోలవరం, ధవళేశ్వరం, ఏలూరు, అమరావతి, జూలై 11(ఆంధ్రజ్యోతి): వరద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువన ప్రాణహిత నీరు గోదావరిలో కలుస్తుండటంతో భద్రాచలం వద్ద నీటి మట్టం వేగంగా పెరుగుతూ 37.2 అడుగులకు చేరుకుంది. దీంతో తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. శుక్రవారం సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ ధవళేశ్వరం 175గేట్లను ఎత్తి 3,54,341 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదిలేస్తున్నారు. ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 9.70 అడుగులుగా ఉంది. భద్రాచలానికి దిగువన ముంపు మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడుల్లో వరద ముంపు తీవ్రత కనిపిస్తోంది. కుక్కునూరు-దాచారం మార్గంలో గుండేటి వాగు కాజ్‌వేపై వరద చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వేలేరుపాడు మండలం ఎద్దువాగు కాజ్‌వేపై వరద పెరుగుతుండడంతో 14 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. స్థానికులు పునరావాస కాలనీలకు తరలివెళుతున్నారు. వరదలతో ఏలూరు జిల్లా యంత్రాంగం అప్రమత్తమై ఆయా ప్రాంతాలకు ప్రత్యేక అధికారులను పంపింది. శనివారం తెల్లవారుజామున మొదటి ప్రమాద హెచ్చరిక జారీ కాబోతుందని యంత్రాంగమంతా మరింత అప్రమత్తంగా ఉండాలని ఏలూరు కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. మరోవైపు పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం పెరగడంతో... స్పిల్‌వే నుంచి 5,02,478 క్యూసెక్కుల నీటిని దిగువకు విడిచిపెట్టారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: విపత్తుల సంస్థ

గోదావరికి భారీగా వరద వస్తున్నందున నదీ పరివాహక ప్రాంతంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఇన్‌చార్జి ఎండీ ప్రఖర్ జైన్ సూచించారు. నదిలో ప్రయాణించడం, ఈతకు వెళ్లడం, చేపలు పట్టడం, స్నానాలకు దిగడం వంటివి చేయరాదన్నారు. వరద ముంపు బారినపడే అల్లూరి, ఉభయ గోదావరి, కోనసీమ, కాకినాడ, ఏలూరు జిల్లాల అధికారులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. అత్యవసర సహాయం కోసం స్టేట్ కంట్రోల్ రూమ్ నంబర్లు 112,1070, 18004250101ను సంప్రదించాలన్నారు.

రాష్ట్రంలో వేసవి వాతావరణం

విశాఖపట్నం, జూలై 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఎండ తీవ్రంగా ఉంటోంది. పడమర దిశ నుంచి పొడిగాలులు వస్తుండటంతో మధ్యాహ్నం వాతావరణం మరింత వేడిగా మారుతోంది. శుక్రవారం పగటి ఉష్ణోగ్రతలు 4-6 డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. నెల్లూరులో 39.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. వాతావరణ అనిశ్చితి ఏర్పడి కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా ఈదురుగాలులతో వర్షం కురిసింది. వచ్చే 24 గంటల్లో ఎండ కొనసాగుతుందని, అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

సీఆర్‌డీఏకు నాబ్‌ఫిడ్ తోడు

▸ రాజధానిలో మౌలిక వసతుల అభివృద్ధికి ఆర్థిక సేవలు

▸ సీఎం చంద్రబాబు సమక్షంలో ఒప్పందం

అమరావతి, జూలై 11(ఆంధ్రజ్యోతి): అమరావతి నగరాన్ని ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేయాలన్న ఏపీసీఆర్‌డీఏ లక్ష్యంలో భాగస్వామి కావడం తమకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామని నేషనల్ బ్యాంక్ ఫర్ ఫైనాన్సింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ (నాబ్‌ఫిడ్) మేనేజింగ్ డైరెక్టర్ రాజ్‌కిరణ్‌రాయ్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో సీఆర్‌డీఏ ట్రాన్సాక్షన్ సలహా సర్వీసుల (టీఏఎస్) కోసం నాబ్‌ఫిడ్‌తో శుక్రవారం ఓ అవగాహన ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా ఆ సంస్థ ఎండీ మాట్లాడుతూ.. తమ ట్రాన్సాక్షన్ సలహా సేవల ద్వారా కొత్త రకమైన ఫైనాన్స్ మోడళ్లను రూపొందించేందుకు కృషి చేస్తామన్నారు. సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు మాట్లాడుతూ.. అమరావతి రాజధాని నిర్మాణం రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత ప్రాజెక్టు అని చెప్పారు. ఈ గ్రీన్‌ఫీల్డ్ నగరంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి అవసరమైన విత్త మూలాలను సమర్థవంతంగా వినియోగించేందుకు నాబ్‌ఫిడ్‌తో ఒప్పందం ఓ ముందడుగు అవుతుందన్నారు. ఆ సంస్థ నైపుణ్యం ద్వారా సీఆర్‌డీఏ నాణ్యమైన అభివృద్ధి ప్రాజెక్టులను అమలు చేయగలుగుతుందన్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఆర్థిక సహాయం విషయంలో వ్యూహాత్మక సలహాదారుగా పనిచేసే నాబ్‌ఫిడ్.. అమరావతి అభివృద్ధి కోసం విత్త ప్రణాళిక రూపకల్పనలో సీఆర్‌డీఏకి మార్గనిర్దేశం చేస్తుంది. ఈ సహకార ఒప్పందంలో భాగంగా, విభిన్న మోడళ్లలో (పీపీపీ సహా) అమలు చేయదగిన విధానాలను అంచనా వేసి, పలు మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కోసం ఆర్థిక వ్యూహాలను రూపొందించేందుకు సాయం చేస్తుంది. అందుబాటులో ఉన్న భూసంపద మోనిటైజేషన్ అవకాశాలను పరిశీలించడం, ఆదాయ వనరులను గుర్తించడం వంటి అంశాల్లో కూడా సంస్థ సహకారం అందిస్తుంది. ఇంకా వివిధ ప్రాజెక్టులకు అవసరమైన ఫైనాన్షియల్ మోడళ్ల రూపకల్పనలో, సంబంధిత స్టేక్‌హోల్డర్లు, పెట్టుబడిదారులతో నడిచే సమగ్ర సంప్రదింపులకు ఈ సంస్థ సీఆర్‌డీఏకి మార్గదర్శిగా నిలుస్తుంది. అమరావతి నగర అభివృద్ధికి దీర్ఘకాలిక లక్ష్యాలకు అనుగుణంగా సమగ్ర విత్త ప్రణాళిక రూపొందించడమే ఈ భాగస్వామ్యం లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు.

నర్సింగ్ చదివిన ఎస్సీ యువతకు జర్మన్ భాషపై శిక్షణ

▸ జర్మనీలో వారికి ఉపాధి కల్పిస్తాం: రాష్ట్ర మంత్రి డోలా

అమరావతి, జూలై 11(ఆంధ్రజ్యోతి): నర్సింగ్, జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ (జీఎన్ఎం) చదివిన ఎస్సీ నిరుద్యోగ యువతకు జర్మన్ భాష నేర్చుకునేందుకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి తెలిపారు. మొదటి విడతలో 150 మందికి శిక్షణ ఇచ్చి అనంతరం వారికి జర్మనీలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా వారికి జర్మన్ భాష శిక్షణ ఇస్తామన్నారు. ఎస్సీ యువత ఉపాధి కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. ఎస్సీలను ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా మరింత బలోపేతం చేసేందుకు సీఎం పాటుపడుతున్నారని మంత్రి చెప్పారు.

మాతృభాష అమ్మ.. హిందీ పెద్దమ్మ!

▸ హిందీ అంటే ఎందుకంత ద్వేషం?

▸ చిల్లర రాజకీయాల కోసమే కొందరు హిందీని వ్యతిరేకిస్తున్నారు: పవన్ కల్యాణ్

▸ హైదరాబాద్‌లో ఘనంగా రాజభాషా విభాగం స్వర్ణోత్సవ వేడుకలు



హైదరాబాద్ సిటీ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): "మన మాతృభాష అమ్మ అయితే హిందీ పెద్దమ్మ" అని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. హిందీ మనది అని.. ఆ భాషను ప్రేమిద్దాం అని, ముందుకు తీసుకెళ్దామని పిలుపునిచ్చారు. హిందీని రాజభాషగా ఆయన అభివర్ణించారు. నాగరికత ముసుగులో ఆంగ్ల భాషను సొంతం చేసుకున్న మనమే హిందీని మనభాష అని అనుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ, వ్యాపారాల కోసం ఇతర దేశాలకు వెళ్లినప్పుడు అక్కడి భాషలు నేర్చుకుంటున్నామని, మరి.. మన దేశానికే చెందిన హిందీ నేర్చుకునేందుకు ఎందుకు భయపడుతున్నాం? ఆ భాషను ఎందుకు ద్వేషిస్తున్నాం? అని ప్రశ్నించారు. హిందీ నేర్చుకోవాలని ఎవరినీ బలవంతం చేయడం లేదని, అయితే అది ఎవరైనా తేలిగ్గా అర్థం చేసుకోగలిగే భాష అని పేర్కొన్నారు. లాభం ఉందనుకున్నప్పుడు కొందరు హిందీని నిస్సంకోచంగా ఉపయోగిస్తూ అదే హిందీని చిల్లర రాజకీయాల కోసం వ్యతిరేకిస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో శుక్రవారం 'రాజభాష విభాగం స్వర్ణోత్సవ సమ్మేళనం' కార్యక్రమంలో పవన్ కల్యాణ్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, రాజ్యసభ వైస్ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడారు. ఇంట్లో మాట్లాడుకునేందుకు మాతృభాష ఉంటే, బయట మాట్లాడేందుకు హిందీ అవసరమవుతుందని ఆయన చెప్పారు. మనమేమో విడిపోయేందుకు దారులు వెతుకుతుంటే.. హిందీ, దేశం మొత్తాన్ని ఏకం చేసేందుకు దారులు వెతుకుతోందని.. ఆ భాషను తాను స్వాగతిస్తున్నానని చెప్పారు. పర్షియన్, ఉర్దూ భాషలను ఆమోదిస్తూ.. హిందీని మాత్రం బలవంతంగా రుద్దుతున్నారని కొందరు అంటున్నారన్నారని.. అది అవివేకమేనని విమర్శించారు. హిందీ నేర్చుకోవడం అంటే మన ఉనికి కోల్పోవడం కాదని, మన ఉనికికి మరింత సుదృఢం చేసుకోవడం అవుతుందని పవన్ కల్యాణ్ అన్నారు. మరో భాషను అంగీకరించడం అంటే ఓడిపోవడం కాదని, కలిసి ప్రయాణం చేయడం అని పేర్కొన్నారు. హిందీ సినిమా వ్యాపార ఆదాయంలో 31 శాతం మేర హిందీలోకి అనువాదమయ్యే దక్షిణాది భాషలకు చెందిన చిత్రాల ద్వారానే వస్తోందని.. తద్వారా దక్షిణాది చిత్ర పరిశ్రమకి ఆదాయం కూడా వస్తోందని చెప్పారు. వ్యాపార అవసరాలకు హిందీ కావాలి గానీ నేర్చుకోవడానికి మాత్రం వద్దు అనే ధోరణి తగదన్నారు.

చిత్రజ్యోతి


★ SINCE 1965 ★

యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్



గాలి జనార్దన్ రెడ్డి తనయుడు కిరీటిరెడ్డి హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'జూనియర్'. శ్రీలీల కథానాయిక. రాధాకృష్ణ దర్శకత్వంలో రజనీ కొర్రపాటి నిర్మించారు. ఈ నెల 18న విడుదలవుతోంది. దర్శకుడు ఎస్.ఎస్ రాజమౌళి చేతుల మీదుగా శుక్రవారం చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. దర్శకుడు ఈ చిత్రాన్ని యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా తీర్చిదిద్దారని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది. కిరీటిరెడ్డి తన సహజనటనతో అలరించారు. వైవా హర్ష, సత్య కామెడీ టైమింగ్ ప్రత్యేకాకర్షణగా నిలిచింది. రొమాన్స్, ఎమోషన్స్ లాంటి అన్ని రకాల హంగులతో మంచి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని రూపొందించినట్లు యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: దేవి శ్రీ ప్రసాద్. సినిమాటోగ్రఫీ:కేకే సెంథిల్ కుమార్

'ఓజీ' షూటింగ్ పూర్తి



పవన్ కల్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'ఓజీ' సినిమా షూటింగ్ పూర్తయింది. ఈ మేరకు చిత్ర యూనిట్ శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. దసరా పండుగ సందర్భంగా సెప్టెంబరు 25న సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోందంటూ రిలీజ్ డేట్ పోస్టర్‌ని విడుదల చేసింది. వర్షంలో తడుస్తూ కారు దిగి గన్‌తో ఫైర్ చేస్తున్న పవన్ కల్యాణ్ పోస్టర్ అదిరిపోయింది. కాగా, ఈ సినిమాను సుజీత్ దర్శకత్వంలో డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌పై దానయ్య నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో ఇమ్రాన్ హష్మీ, ప్రియాంక అరుల్ మోహన్, ప్రకాశ్ రాజ్, శ్రియ రెడ్డి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్నారు.

అమెరికా చదువుల కథ



విదేశాల్లో చదువుతున్న భారతీయ విద్యార్థుల జీవితాలు, వారి కలలు, కష్టాలు, స్నేహాలను వివరించే కథాంశంతో రూపుదిద్దుకొంటున్న 'విసా.. వింటారా.. సరదాగా' చిత్రం ఫస్ట్ లుక్‌ని శుక్రవారం విడుదల చేశారు. అశోక్ గల్లా, గౌరీ ప్రియ, రాహుల్ విజయ్, శివాత్మిక ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రంతో ఉద్భవ్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మాతలు. పూర్తి వినోదాత్మకంగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం విదేశాల్లో విద్యార్థి జీవితాల్లోని ఎత్తు పల్లాలను ప్రతిబింబిస్తుందని దర్శకనిర్మాతలు తెలిపారు.

మోనికా వచ్చేసింది!



తమిళ చిత్రరంగ సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న 'కూలీ' చిత్రం ఆగస్టు 14న విడుదల కావడానికి సిద్ధమవుతోంది. ఈ చిత్రంలో అక్కినేని నాగార్జున కీలక పాత్ర పోషిస్తున్నారు. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా పూజా హెగ్డే పాల్గొన్న స్పెషల్ సాంగ్ 'మోనికా'ను శుక్రవారం విడుదల చేశారు. సముద్రం నేపథ్యంలో చిత్రీకరించిన ఈ సాంగ్‌లో రెడ్ కలర్ డ్రెస్‌లో ఉన్న పూజ తన డ్యాన్స్ మూమెంట్స్‌తో ఆకట్టుకున్నారు. సౌబిన్ షాహిర్ కూడా ఆమెతో పాటు ఈ పాటలో పాల్గొన్నారు. అమిర్‌ఖాన్, ఉపేంద్ర, సత్యరాజ్ సౌబిన్ షాహిర్, శ్రుతీహసన్, మహేంద్రన్ తదితరులు నటిస్తున్న 'కూలీ' చిత్రాన్ని ఏషియన్ మల్టీప్లెక్స్ సంస్థ ద్వారా సురేశ్‌బాబు, దిల్ రాజు, సునీల్ నారంగ్, భరత్ నారంగ్ తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నారు.

ఆ పాటను అనుమతి లేకుండా ఉపయోగించారు

● హైకోర్టుకెక్కిన ఇళయరాజా



ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా మరోమారు హైకోర్టును ఆశ్రయించారు. ప్రముఖ నటి వనిత విజయకుమార్, కొరియోగ్రాఫర్ రాబర్ట్ మాస్టర్ జంటగా నటించిన 'మిసెస్ అండ్ మిస్టర్' శుక్రవారం విడుదలైంది. ఇందులో తాను సంగీతం సమకూర్చిన 'మైఖేల్ మదన కామరాజన్' చిత్రంలోని ఓ పాటను తన అనుమతి లేకుండా వాడారని, ఇది కాపీరైట్ ఉల్లంఘన కిందకే వస్తుందని, అందువల్ల ఆ పాటను తొలగించాలని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇళయరాజా తరపు న్యాయవాది ఈ పిటిషన్‌ను హైకోర్టులో దాఖలు చేసి, తక్షణ విచారణకు స్వీకరించాలని కోరారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన న్యాయమూర్తి సెంథిల్ కుమార్ సోమవారానికి వాయిదా వేశారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

భారీ హంగులతో ఆకట్టుకుంటుంది

- సంజయ్ దత్



ధృవ సర్జా కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'కేడీ ద డెవిల్'. ప్రేమ్ దర్శకత్వంలో వెంకట్ కే నారాయణ నిర్మించారు. రీష్మా నానయ్య కథానాయిక. సంజయ్‌దత్, శిల్పాశెట్టి, నోరా ఫతేహీ ప్రధాన పాత్రల్లో నటించారు. ఇటీవలే నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం టీజర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా సంజయ్‌దత్ మాట్లాడుతూ 'కేవీఎన్ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్, హై టెక్నికల్ వాల్యూస్‌తో గ్రాండియర్‌గా నిర్మించింది. ఇదొక డిఫరెంట్ యాక్షన్ థ్రిల్లర్. ధృవ నా తమ్ముడు లాంటి వారు. ఆయన చాలా గొప్పస్థాయికి ఎదగాలి. రొమాంచిత పోరాట ఘట్టాలు, భారీ హంగులతో 'కేడీ ద డెవిల్' ఆకట్టుకుంటుంది' అని అన్నారు. ధృవ సర్జా మాట్లాడుతూ 'నేనెంతగానో ఇష్టపడే నటుడు సంజయ్‌దత్. ఆయనతో కలసి పనిచేయడం సంతోషాన్నిచ్చింది. శిల్పాశెట్టిగారి దగ్గర నటనలో మెలకువలు నేర్చుకున్నాను. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం' అని చెప్పారు. 'సాహస వీరుడు సాగర కన్య' చిత్రం చేసినప్పటి నుంచి తెలుగు ప్రేక్షకులు నాపై అదే ప్రేమను చూపిస్తున్నందుకు ధన్యవాదాలు. సంజయ్‌దత్ గారితో నేను చేసిన ప్రతిసినిమా హిట్టయింది. ఈ చిత్రం కూడా తప్పకుండా ఘన విజయం అందుకుంటుంది' అని ఆకాంక్షించారు. 'నేను దర్శకత్వం వహించిన కన్నడ చిత్రం 'జోగి'ని తెలుగులో 'యోగి'గా రీమేక్ చేశారు. ఇప్పుడు 'కేడీ ద డెవిల్' చిత్రంతో తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తున్నందుకు ఆనందంగా ఉంది' అని ప్రేమ్ చెప్పారు.

అలరించే గదాధారి



పురాణగాథ నేపథ్యంలో భారీ బడ్జెట్‌తో తెలుగు, కన్నడ, హిందీ భాషల్లో తెరకెక్కుతోన్న చిత్రం 'గదాధారి హనుమాన్'. రవికిరణ్ కథానాయకుడు. రేణుకాప్రసాద్, బసవరాజ్ హురకడ్డి నిర్మించారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం టీజర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా రవికిరణ్ మాట్లాడుతూ 'హనుమంతుడు ఇచ్చిన శక్తితోనే ఈ సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కించాం. పతాక సన్నివేశాలు సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తాయి. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే అంశాలు సినిమాలో ఉన్నాయి' అని చెప్పారు. రేణుకా ప్రసాద్ మాట్లాడుతూ 'రోహిత్ కొల్లి సినిమాను అద్భుతంగా తెరకెక్కించారు. వినోద భరితంగా నడిపిస్తూనే భావోద్వేగాలను ఆవిష్కరించే ప్రయత్నం చేశారు' అని ప్రశంసించారు. రోహిత్ కొల్లి మాట్లాడుతూ 'మూడేళ్ల కష్టం ఈ సినిమా. రవి జాయిన్ అవడంతో పాన్ ఇండియా స్థాయిలో తీసుకొస్తున్నాం. రేణుకా ప్రసాద్ ఖర్చుకు వెనుకాడకుండా భారీ స్థాయిలో నిర్మించేందుకు సహకరించారు. హనుమంతుని గదా శక్తిని చూపుతూ రూపొందించిన సీక్వెన్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అని చెప్పారు.

హనుమంతుడి పాత్ర 15 నిముషాలేనా?!



రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయిపల్లవి సీతగా నటిస్తున్న 'రామాయణ' సినిమాపై రోజు రోజుకీ అంచనాలు పెరుగుతున్నాయి. ఈ సినిమాకు సంబంధించి ఏదో ఒక కొత్త వార్త బయటకు వచ్చి ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. వారి అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ చిత్రాన్ని రూపొందిస్తున్నారు దర్శకుడు నితీశ్ తివారీ. 'రామాయణ' చిత్రంలో సన్నీ డియోల్ హనుమంతుడిగా నటిస్తున్న సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది దీపావళి సందర్భంగా విడుదలయ్యే సినిమా తొలి భాగంలో హనుమంతుడి పాత్ర కేవలం పదిహేను నిముషాలే ఉంటుందనే వార్త ఇప్పుడు వినిపిస్తోంది. అయితే 2027 దీపావళికి విడుదలయ్యే రెండో భాగంలో మాత్రం ఆయన పాత్ర సమగ్రంగా ఉంటుందని చెబుతున్నారు. ఈ విషయం గురించి చిత్ర యూనిట్ అధికారికంగా వెల్లడించకపోయినప్పటికీ ఈ వార్త మాత్రం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

1.29 కోట్ల మంది!

మెగా పీటీఎంలో పాల్గొన్న వారి సంఖ్య

గిన్నిస్ రికార్డు కోసం ప్రతిపాదనలు

అమరావతి, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన మెగా పేరెంట్- టీచర్స్ సమావేశాల్లో తల్లిదండ్రులు, ఆహ్వానితులు పెద్దఎత్తున పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 1.29 కోట్ల మంది భాగస్వామ్యమయ్యారు. ఇంతమంది ఒకేరోజున పేరెంట్- టీచర్స్ సమావేశాల్లో పాల్గొనడం ఇదే మొదటిసారి. గిన్నిస్ రికార్డులో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సంఖ్యనే ప్రామాణికంగా తీసుకుంటారు. వారి సంఖ్య 50 లక్షలు దాటిపోవడంతో రికార్డు సాధించడం సులభమేనని సమగ్ర శిక్ష పీడీ బి.శ్రీనివాసరావు అభిప్రాయపడ్డారు. కాగా, గురువారం రాష్ట్రవ్యాప్తంగా 60 వేల విద్యాసంస్థల్లో నిర్వహించిన మెగా పీటీఎం 2.0లో పాఠశాలల విభాగంలో 60.07 లక్షల మంది విద్యార్థులు, 43.04 లక్షల మంది తల్లిదండ్రులు, 1.89 లక్షల మంది ఉపాధ్యాయులు, 5.64 లక్షల మంది స్కూల్ కమిటీ సభ్యులు, 66,179 మంది పూర్వ విద్యార్థులు, 58,651 మంది దాతలు, 70,578 మంది ప్రజాప్రతినిధులు, 60,356 మంది ఉద్యోగులు, అధికారులు, 1.29 లక్షల మంది ఇతర ఆహ్వానితులు పాల్గొన్నారు. ఇక జూనియర్ కాలేజీల్లో 8.39 లక్షల మంది విద్యార్థులు, 5.8 లక్షల మంది తల్లిదండ్రులు, 8,608 మంది జూనియర్ లెక్చరర్లు హాజరయ్యారు. మొత్తంగా 1,28,79,081 మంది పాల్గొన్నట్లు వెల్లడైంది. ఇంకా కొన్ని వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ కావాల్సి ఉంది. ఇకనుంచి ప్రతి విద్యా సంవత్సరంలో రెండుసార్లు మెగా పీటీఎం నిర్వహిస్తారు.

2,555 కోట్లు

డిస్కంలకు టారిఫ్ సబ్సిడీ విడుదల

అమరావతి, జూలై 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్ సంస్థలు ప్రస్తుతం రూ.12,225.14 కోట్ల అప్పుల్లో కూరుకుపోయాయి. ఇందులో డిస్కంలు రూ.7,225.14 కోట్లు.. రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థలు రూ.5,000 కోట్లు రుణపడ్డాయి. ఆర్థిక సంస్థల నుంచి తీసుకున్న రుణాల వాయిదాలను చెల్లించాల్సిందేనని ప్రతి నెలా పదో తేదీలోగా కేంద్రం గతంలోనే డిస్కంలకు స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వ కన్సల్టెన్సీ సంస్థ 'ప్రాప్తి' పోర్టల్ అందించిన వివరాల ప్రకారం.. గత నెలలో డిస్కంలు చెల్లించాల్సిన వాయిదా రూ.2,661.77 కోట్లు కాగా.. ఈ నెల వాయిదా రూ.4.563.37 కోట్లు కలిపి మొత్తం రూ.7,225.14 కోట్లుకు వాటి రుణాలు చేరాయి. నెలనెలా వాయిదాల బకాయిలు పెరిగిపోతుండటంతో డిస్కంలు ప్రభుత్వ సాయం కోరుతున్నాయి. అదేవిధంగా రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థలు బొగ్గు పంపిణీ సంస్థలతోపాటు ఆర్థిక సంస్థలకు రూ.5,000 కోట్లు వరకు చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తాన్ని ప్రభుత్వం ఇవ్వకపోతే.. వాటి మనుగడ కష్టమని జెన్కో అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇంకోవైపు.. డిస్కంలకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి టారిఫ్ సబ్సిడీ కింద రూ.2,555 కోట్లను విడుదల చేస్తూ రాష్ట్ర ఇంధన శాఖ బాధ్యతలు కూడా చూస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గృహ, పారిశ్రామిక, వ్యవసాయ, ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారులకు సబ్సిడీ కింద రూ.13,000 కోట్లు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

200 కోట్లు

రహదారుల రిపేర్లకు మంజూరు

అమరావతి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రహదారుల మరమ్మతులకు ప్రభుత్వం మరో 200 కోట్ల రూపాయల అదనపు నిధులు కేటాయించింది. ఈ మేరకు ఆర్థిక శాఖ నుంచి రోడ్లు భవనాల శాఖకు పరిపాలనా అనుమతి వచ్చింది. ఈ నేపథ్యంలో ఈ 200 కోట్ల రూపాయలను రహదారులపై గుంతలు పూడ్చే పనులకు ఉపయోగించుకోవాలని ఆర్‌అండ్‌బీ స్టేట్ హైవేస్, ఆర్‌డీసీ విభాగానికి అనుమతి ఇస్తూ ఆ శాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ నిధులను కొత్తగా గుర్తించిన గుంతలు పూడ్చే పనులకు ఖర్చు చేయనున్నారు. పెండింగ్ బిల్లుల చెల్లింపునకు వీటిని ఉపయోగించే అవకాశం ఉంది.

దొంగ మెయిల్స్‌తో ప్రతిష్ఠకు దెబ్బ

▸▸ వారిపై దేశద్రోహం కేసు.. బుగ్గన ఆర్‌బీఐ కంటే గొప్పోడా?: కేశవ్

రాయదుర్గం, జూలై 11(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా మెయిల్స్ పెట్టిన వారిపై ఖచ్చితంగా కేసులు పెట్టి తీరుతాం' అని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. అనంతపురంలో శుక్రవారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ..'ఉదయ భాస్కర్ 200 మెయిల్స్ దాకా పెట్టినట్లు మా దృష్టికి వచ్చింది. పెట్టుబడిదారులకు వ్యక్తిగతంగా మెయిల్స్ పెట్టారు. అలాగే సెబీ, ప్రధాని, కేంద్ర ఆర్థిక మంత్రి, క్యాబినెట్ కార్యదర్శికి కూడా మెయిల్స్ పెట్టారు. సెబీ.. పెట్టుబడిదారులతో పాటు మా నుంచి కూడా వివరణ తీసుకుంది. దొంగ ఈ-మెయిల్స్ పంపిన వారిమీద కచ్చితంగా దేశద్రోహం కేసు పెడతాం. క్లియరెన్స్ ఇవ్వడానికి ఆర్‌బీఐ ఎవరని బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రశ్నించడం విడ్డూరంగా ఉంది. ఆర్‌బీఐ కంటే రాజేంద్రనాథ్‌రెడ్డి గొప్పోడు కాదు.' అన్నారు.

ఇరిగేషన్ జేఈఈ కిశోర్ నిర్బంధం

▸▸ గేటుకు తాళం వేసి పరారైన కాపలాదారుడు

విజయవాడ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పోలవరం కాలువ గట్టు మట్టి తవ్వకాలను అడ్డుకున్న ఇరిగేషన్ అధికారి ఒకరిని అక్రమార్కులు గురువారం అర్ధరాత్రి నిర్బంధించిన ఘటన ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లిలో చోటు చేసుకుంది. కొద్ది రోజులుగా పోలవరం కాలువ కట్ట వెంబడి కొందరు మట్టి తవ్వకాలను తవ్వుతున్నారు. దీనిపై కొత్తూరు తాడేపల్లి గ్రామస్థులు పోలవరం ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అర్ధరాత్రి 12.14 గంటలకు డీఈ అప్పిరెడ్డి, జేఈఈలు కిశోర్, కౌశిక్.. ఆ ప్రాంతానికి వెళ్లగా అక్రమార్కులు పారిపోయారు. జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. ఈ మట్టిని పక్కనే ఉన్న మామిడితోటలో పోస్తున్నారన్న సమాచారంతో జేఈఈ కిశోర్ ఆ తోటలోకి వెళ్లగా, ఆ తోట కాపలాదారుడు గేటుకు తాళం వేసి పారిపోయాడు. బయటికి వచ్చే మార్గం లేకపోవడంతో ఆయన డీఈకి ఫోన్ చేశారు. డీఈ.. గ్రామస్థులకు కబురుపెట్టగా వారు వచ్చి తోట గేటుకు ఉన్న తాళం పగులగొట్టి కిశోర్‌ను బయటికి తీసుకొచ్చారు. కాగా, విజయవాడ రూరల్ మండలం పరిధిలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పోలవరం కాలువ మట్టి కట్టల వెంబడి లక్షలాది క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వారు. కూటమి అధికారంలోకి వచ్చిన క్రమంలో ఈ తవ్వకాలపై విజిలెన్స్ విచారణ చేపట్టింది. విజిలెన్స్ నివేదిక ఇవ్వాల్సిన తరుణంలో ఈ ఘటన చోటు చేసుకుంది.

చట్టాల మార్పు చేర్పుల్లో ఏపీ ఫస్ట్

▸▸ కేంద్ర కార్యదర్శి మనోజ్‌గోవిల్

అమరావతి, జూలై 11(ఆంధ్రజ్యోతి): దేశంలో డీ రెగ్యులేషన్, కంప్లయన్స్ రిడక్షన్‌కు అనుగుణంగా చట్టాల్లో మార్పులు చేయడంలో ఆంధ్రప్రదేశ్ ముందుందని కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి(కోఆర్డినేషన్) మనోజ్‌గోవిల్ వెల్లడించారు. వివిధ ప్రభుత్వశాఖల చట్టాల సరళీకరణలో భాగంగా సులభతర వాణిజ్యం కింద డీ రెగ్యులేషన్, కంప్లయెన్స్ రిడక్షన్ అంశాలపై శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ నేతృత్వంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. సులభతర వాణిజ్యంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ చట్టాలకు అనుగుణంగా పాత చట్టాల్లో మార్పుచేర్పులు, సరళీకరణ ద్వారా ప్రజలకు ఉపయోగపడేలా మెరుగైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సీఎస్ విజయానంద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ జన్ విశ్వాస్ చట్టానికి అనుగుణంగా రాష్ట్ర చట్టాల్లో మార్పులు చేపట్టి, చట్టాల సరళీకరణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఈ-పీఏసీఎస్‌లుగా సహకార సంఘాలు

అమరావతి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కంప్యూటరీకరణతో ఈ-పీఏసీఎస్‌లుగా రూపాంతరం చెందిన నేపథ్యంలో పీఏసీఎస్‌ల స్థాయిలో మాన్యువల్ రికార్డులను మూసివేసి, పూర్తిగా ఎంటర్‌ప్రైజ్ రిసోర్స్ ప్లానింగ్(ఈఆర్పీ)పై మాత్రమే రోజువారీ లావాదేవీలు నిర్వహించాలని సహకారశాఖను ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పీఏసీఎస్‌ల విభజనకు సాధ్యాసాధ్యాలను అంచనా వేయడానికి రాష్ట్రస్థాయి కమిటీని నియమించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

చెల్లెలి సంభాషణలు వినడం నీచం: ఎమ్మెల్యే రాజు

మడకశిర టౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ అధినేత జగన్ తన చెల్లెలు షర్మిల ఫోన్ ట్యాప్ చేయించి, సంభాషణలు వినడం నీచం. చెల్లిని, తల్లిని అవమానించిన ఆయనకు మహిళల పట్ల గౌరవం లేదు' అని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. మడకశిరలో శుక్రవారం ఆయన మాట్లాడారు. 'ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గురించి నీచంగా మాట్లాడిన మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డిని వెంటనే అరెస్టు చేయాలి. సొంత చెల్లెలు షర్మిలను, రాజశేఖర్ రెడ్డి కూతురు కాదని వైసీపీ నాయకులు విమర్శలు చేస్తున్నా జగన్ నోరు మెదపడం లేదు' అని విమర్శించారు.

అధికారుల తప్పులతో ప్రభుత్వానికి చెడ్డపేరు: భరత్

ఎమ్మిగనూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొందరు అధికారుల తప్పులవల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని మంత్రి టీజీ భరత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పట్టణంలో శుక్రవారం జరిగిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డితో కలసి మంత్రి పాల్గొన్నారు. మంత్రి భరత్ మాట్లాడారు. 'అధికారులు తమ దగ్గరకు వచ్చే చిన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి. రాష్ట్రంలో గత పదేళ్లలో రాని పెట్టుబడులు ఇప్పుడు వస్తున్నాయి.' అని స్పష్టం చేశారు.

బాబు, పవన్ కృషి వల్లే ఉపాధి బకాయిలకు మోక్షం

▸▸ ఆత్మహత్యలు చేసుకున్న వారి ఆత్మలు శాంతిస్తాయి: వీరంకి గురుమూర్తి

అమరావతి, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం బకాయిల విడుదలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో రూ.231 కోట్ల పెండింగ్ బిల్లులకు మోక్షం కలగనుందని గౌడ వెల్ఫేర్ కార్పొరేషన్ ఛైర్మన్, ఉపాధి హామీ మండలి కౌన్సిల్ మాజీ సభ్యుడు వీరంకి గురుమూర్తి అన్నారు. పెండింగ్ బిల్లుల సాధనకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రి పెమ్మసాని చేసిన కృషి ఫలించి వేలమందికి ఉపశమనం కలిగించిందన్నారు. జగన్ కక్షపూరిత ధోరణి కారణంగా గ్రామానికి ఉపయోగపడే పనులు చేసి కూడా చాలా మంది అప్పులు పాలయ్యారని, ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిల విడుదలతో ఆత్మహత్యలు చేసుకున్న వారి ఆత్మలు శాంతిస్తాయని అన్నారు.

ఎమ్మెల్యేలు వసూళ్ల అంగళ్లు తెరిచారు: సీపీఐ

ఆలూరు, అమరావతి, జూలై 11(ఆంధ్రజ్యోతి): 'జగన్ బాటలోనే సీఎం చంద్రబాబు నడుస్తున్నారు. అభివృద్ధి పక్కన పెట్టి యోగా బాట పట్టారు' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. శుక్రవారం కర్నూలులో మీడియాతో మాట్లాడారు. 'డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రేషన్ బియ్యం రవాణాను కాకినాడ పోర్టులో సీజ్ చేశారు. అదే లారీల్లో నిత్యం బియ్యం రవాణా జరుగుతుంటే ఒక్క లారీనైనా సీజ్ చేశారా? రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయింది. పోలీసుశాఖలో అవినీతి మరింతగా పెరిగిపోయింది. కూటమి ఎమ్మెల్యేలు డబ్బుల కోసం అంగళ్లు తెరిచారు.' అని రామకృష్ణ అన్నారు. నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో బలవంతపు భూసేకరణను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

అవే రోత రాతలు!

(మొదటి పేజీ తరువాయి)

బంగారుపాళ్యం గ్రామంలోకి వెళ్లేందుకు ప్రయత్నించిన జగన్‌ను నిలువరించిన ఎస్పీపైనే మండిపడటం... ఈ పరిణామాలన్నీ వివరిస్తూ ప్రశాంతమైన బంగారుపాళ్యంలో 'దండుపాళ్యం తరహాలో' దౌర్జన్యానికి దిగారని 'ఆంధ్రజ్యోతి' వెల్లడించింది. ఇందులో సామాన్య రైతుల ప్రస్తావనే లేదు. రైతులను అవమానించిందీ లేదు. అయినా సరే... రైతులను అవమానిస్తారా?' అంటూ జగన్ రోతపత్రిక వాపోయింది. 'రైతులు' అంటూ కొందరి అభిప్రాయాలను ప్రచురించింది. దీనిపై 'ఆంధ్రజ్యోతి' ఆరా తీయగా రోతపత్రిక రాతలు ఎంత డొల్లగా ఉంటాయో మరోసారి రుజువైంది. 'రైతులు'గా సాక్షి పేర్కొన్న వారిలో కొందరు గ్రామ, మండల స్థాయి వైసీపీ నాయకులు. మరికొందరు... క్రియాశీల కార్యకర్తలు. వీరిలో కొందరికి అసలు భూములే లేవు. మరికొందరికి భూములున్నా మామిడి తోటలు లేవు. కొందరు అసలు తాము 'సాక్షి'తో మాట్లాడిందే లేదని చెప్పారు. కొంత మంది తాము రైతుల సమస్య గురించి మాత్రమే చెప్పామని... 'ఆంధ్రజ్యోతి'పై ఆరోపణలు, విమర్శలు చేయలేదని స్పష్టం చేశారు. అందులో చాలామంది... వైసీపీ స్థానిక నేతలే! కొందరైతే... తమకేమీ తెలియదని, 'సాక్షి'తో తాము మాట్లాడలేదని స్పష్టం చేశారు.

వైసీపీ నేత... రైతులే!

'కూటమి నేతలే అసలైన దండుపాళ్యం బ్యాచ్' అంటూ యాదమరి మండలం పెరుమాళ్లపల్లెకు చెందిన మనోహర్ రెడ్డి పేరుతో రోత పత్రికలో ఒక 'అభిప్రాయం' ప్రచురించారు. ఆయన జడ్పీ వైస్ ఛైర్మన్, వైసీపీ నేత ధనంజయ రెడ్డికి వరుసకు మామ అవుతారు. ఆయన భార్య వైసీపీ ఎంపీటీసీ. ఆ విషయం పక్కనపెడితే... ఆయనకు ఒక్క ఎకరా మామిడి తోట కూడా లేదు.

- 'ఇంత నీచంగా వర్ణిస్తారా..?' అంటూ విజయపురం మండలం నారపరాజుకండ్రిగ గ్రామానికి చెందిన రైతు రామకృష్ణమ రాజు చెప్పినట్లు 'సాక్షి'లో ప్రచురించారు. ఆయన ఆరేళ్ల ఆ మండల వైసీపీ కన్వీనర్‌గా, 4 సంవత్సరాలు నగరి మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఆయన జిల్లా వైసీపీ బూత్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఈయనకు 25 ఎకరాల పొలముండగా, 20 ఎకరాల్లో మామిడి సాగు చేసుకున్నారు.
- 'ఆ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి' అంటూ చౌడేపల్లె మండలానికి చెందిన యువరైతు రంగనాథ్ చెప్పినట్లు ప్రచురించారు. ఈయనకు 12 ఎకరాల పొలమున్నా మామిడి సాగు చేయలేదు. ఇంట్లో తినడానికి ఐదారు టేబుల్ వెరైటీస్ మామిడి చెట్లను మాత్రమే సాగు చేసుకున్నారు. ఆయన వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు గృహసారథిగా కూడా పనిచేశారు.
- 'రైతులకు క్షమాపణ చెప్పాలి' అని పుంగనూరు పట్టణానికి చెందిన నారాయణప్ప చెప్పినట్లు సాక్షిలో ప్రకటించారు. ఈయన పెద్దిరెడ్డి కుటుంబానికి విధేయుడు. ఇంకా... 'రైతులు' అంటూ రోత పత్రికలో ప్రచురించిన అభిప్రాయాలన్నీ వైసీపీ నేతలవే.

సిగ్గు పడాల్సింది ఎవరు?

'పాలకుడిగా చెప్పుకోవడానికి సిగ్గు పడాలి' అని జగన్ ముఖ్యమంత్రి చంద్రబాబును విమర్శించారు. తనకు గిట్టని మీడియా పేర్లను ప్రస్తావిస్తూ... 'దిగజారిపోయాయి' అని నీచ వ్యాఖ్యలు చేశారు. మామిడి రైతులకు పరామర్శ పేరిట వైసీపీ శ్రేణులు వేసిన వీరంగం, రైతుల పేరిట ఆడిన నాటకాలకు సిగ్గు పడాల్సింది ఎవరన్నది అసలు ప్రశ్న! మామిడి రైతులను రాజకీయానికి వాడుకుంటున్నది ఎవరు? వారికి అండగా నిలిచి... ధైర్యాన్ని నింపుతున్నది ఎవరు? డిమాండ్ లేక రెండేళ్ల కిందట తయారైన పల్ప్ కూడా అమ్ముడు కాకపోవడంతో ఈసారి మామిడి కొనుగోలు చేయడానికి ఫ్యాక్టరీల యజమానులు వెనుకాడారు. మరోవైపు బంపర్ క్రాప్‌తో ధరలు పడిపోయాయి. దీన్ని గుర్తించిన సీఎం చంద్రబాబు గతనెల 5వ తేదీనే తోతాపురి మామిడికి కిలోకు రూ.4 వంతున ప్రభుత్వ సబ్సిడీని ప్రకటించారు. పల్ప్ యూనిట్ల యజమానులు లేదా వ్యాపారులు కిలోపై రైతులకు రూ.8వంతున చెల్లించేలా... మొత్తంగా కిలోకు రూ.12 దక్కేలా చర్యలు తీసుకున్నారు. యూనిట్ల నిర్వాహకులు, వ్యాపారులు, రైతు సంఘాల నేతలతో అధికారుల ద్వారా పలుమార్లు సమావేశాలు ఏర్పాటు చేయించి ఆ ధరకు కొనుగోలు చేసేలా ఒప్పించారు. ఆర్థిక సంక్షోభంలో ఉన్న పల్ప్ యూనిట్ల యజమానులకు ఈ సీజనులో పెట్టుబడుల కోసం బ్యాంకు రుణాలిప్పించేందుకు సైతం చొరవ తీసుకున్నారు. ఈ చర్యలే మామిడి రైతుల్లో ధైర్యాన్ని నింపాయి. జగన్ మాత్రం తోతాపురి సీజన్ ముగిశాక... 80 శాతం కొనుగోళ్లు కూడా పూర్తయ్యాక 'పరామర్శ' పేరిట దండయాత్ర చేశారు.

మాకేం తెలియదే..

'రైతులను నేరస్తులతో పోలుస్తారా?' అంటూ చిత్తూరు రూరల్ మండలం దిగువకండ్రిగ గ్రామానికి చెందిన యుగంధర్ నాయుడు చెప్పినట్లు ప్రచురించారు. ఆయన గ్రామ స్థాయి వైసీపీ నాయకుడు. 5 ఎకరాల్లో మామిడి తోట ఉంది. కానీ, సాక్షి పత్రికలో తన ఫొటోతో వార్త వచ్చిందని ఈయనకు తెలియదు. ఆ విషయం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో ఆయనే చెప్పారు. ఇక... వైసీపీ రైతు విభాగ నాయకుడు శంకర్ రెడ్డి సంగతీ అంతే. "సాక్షి రిపోర్టర్ ఫోన్ చేసి నా ఫొటో అడిగారు. స్టేట్‌మెంట్ పంపుతామని చెప్పారు. నా అంతట నేను ఏ అభిప్రాయమూ చెప్పలేదు" అని చెప్పారు.

చెప్పి కాదు... చెప్పకుండా నరికెయ్యాలి!

▸▸ మన ప్రభుత్వం వచ్చాక వేసేయండి

▸▸ రెండో కంటికి చెప్పాల్సిన అవసరం లేదు

▸▸ చీకట్లో కన్ను కొడితే పని అయిపోవాలి

▸▸ కృష్ణా జిల్లా వైసీపీ కార్యకర్తల సమావేశాల్లో మాజీ మంత్రి పేర్ని నాని రెచ్చగొట్టే వ్యాఖ్యలు



కార్యకర్తల సభలో ప్రసంగిస్తున్న పేర్ని నాని

విజయవాడ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): 'రప్పా రప్పా అని నరుకుతామంటూ అరవడం కాదురా.. చీకట్లో కన్ను కొడితే పని అయిపోవాలి. మీకు చేతనైతే రేపు మన ప్రభుత్వం వచ్చాక ఎవడెవడు తప్పులు చేశాడో వాళ్లను నరికెయ్యండి! ఆ తర్వాత ఎలా జరిగిందంటూ మీరంతా వెళ్లి పలకరించాలి' అంటూ వైసీపీ కార్యకర్తలను మాజీ మంత్రి పేర్ని నాని రెచ్చగొట్టారు. కృష్ణాజిల్లా పామర్రు, అవనిగడ్డలలో గురు, శుక్రవారాల్లో నిర్వహించిన కార్యకర్తల సమావేశాల్లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'చెప్పి నరకడం కాదు, చెప్పకుండా నరికెయ్యాలి' అని కార్యకర్తలను మరింత రెచ్చగొడుతూ ప్రసంగించారు. మన ప్రభుత్వం వస్తే మీకే ప్రధాన పోస్టులు వస్తాయని ఊరిస్తూ... 'లోకేశ్ (వాడు అంటూ సంబోధన) ఎర్ర బుక్కు అన్నట్టుగా మీరు రప్పా.. రప్పా అంటున్నారు. అయినా నోరు తెరిచి ఎన్నిసార్లు రప్ప రప్పా అంటార్రా? సిగ్గు, శరం ఉండాలి మనకు... అరె.. చీకట్లో కన్ను కొడితే అయిపోవాలి.. అయినా చీకట్లో చేయాల్సిన పనులు పట్టపగలు చెప్పడమేంటి అసహ్యంగా?' అని వ్యాఖ్యానించారు. 'నిజంగానే మన ప్రభుత్వం వచ్చి వేసేయెండి అంటే ఎవరు వేసేది? నాకు పాతికేళ్ల అనుభవం ఉంది. శత్రువుకు ఎక్కడ చెప్పాలో అక్కడ చెప్పాలి! రోజూ ఇదే పనేనా? మారండి. మొరిగే కుక్క కరవదు.. కరిచే కుక్క మొరగదు.. రేపు 2.0 చూపించాలి' అంటూ కార్యకర్తలకు నిర్దేశించారు.

కొత్త సైకిల్ వచ్చిందోచ్!

▸▸ మెగా పీటీఎంలో మాటిచ్చిన సీఎం చంద్రబాబు

▸▸ నలుగురు చిన్నారులకు కొనిచ్చిన అధికారులు



విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేస్తున్న శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం తహసీల్దారు సురేశ్, చిన్నారులతో తల్లిదండ్రులు మాధవి, నరసింహుడు

కొత్తచెరువు, జూలై 11(ఆంధ్రజ్యోతి): మెగా పీటీఎం 2.0 కార్యక్రమం నలుగురు చిన్నారులకు సంతోషాన్ని మిగిల్చింది. శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు మండల కేంద్రానికి చెందిన మాధవి కుమారుడు, ముగ్గురు కుమార్తెలకు సీఎం చంద్రబాబు హామీతో కొత్త సైకిళ్లు కానుకగా లభించాయి. గురువారం కొత్తచెరువు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పీటీఎం 2.0లో మాధవి, ఆమె పిల్లలతో సీఎం, మంత్రి లోకేశ్ ముఖాముఖిగా మాట్లాడి, వారి కుటుంబ పరిస్థితులను తెలుసుకున్నారు. తన కుమారుడి ఆరోగ్యం బాగా లేదని మాధవి ఆవేదన వ్యక్తం చేశారు. మెరుగైన వైద్యం అందేలా చూస్తామని, నలుగురు బిడ్డలను చదివించే బాధ్యత తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మూడో తరగతి చదువుతున్న ఆమె చిన్న కుమార్తె సనను సీఎం పలకరించారు. 'నీకేం కావాలి?' అని అడిగారు. తనకు సైకిల్ కావాలని సన కోరడంతో నలుగురికీ సైకిళ్లు కొనివ్వాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు. దీంతో ధర్మవరం తహసీల్దారు సురేశ్ సమక్షంలో శుక్రవారం నలుగురికీ కొత్త సైకిళ్లను అందజేశారు. మాధవి, ఆమె భర్త నరసింహుడు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

స్థిరమైన జీవనోపాధికి బాటలు

▸▸ గ్రామీణ నిరుద్యోగ యువతకు కెపాసిటీ బిల్డింగ్ నెట్‌వర్క్ ప్రోగ్రాం

▸▸ సీబీఎన్ విజన్ అమలు కోసం మార్గదర్శకాలతో ఉత్తర్వులు

అమరావతి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లలో 20 లక్షల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు సృష్టించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. 'స్వర్ణాంధ్ర విజన్-2047'కు అనుగుణంగా 'ఒక కుటుంబం.. ఒక వ్యవస్థాపకుడు' లక్ష్యసాధన దిశగా కార్యాచరణ సిద్ధం చేసింది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ నిరుద్యోగ యువత కోసం సామర్థ్య నిర్మాణ కార్యక్రమాన్ని (కెపాసిటీ బిల్డింగ్ నెట్‌వర్క్) ప్రారంభించాలని నిర్ణయించింది. "కెపాసిటీ బిల్డింగ్ నెట్‌వర్క్ ఫర్ విలేజ్ ఇండస్ట్రీస్ స్కీమ్స్ అండ్ ఇంటిగ్రేటెడ్ ఆపర్చునిటీస్ నెట్‌వర్క్" (సీబీఎన్ విజన్) కాన్సెప్ట్ కింద డ్వాక్రా గ్రూపుల తరహాలోనే గ్రామీణ యువతతో 'సీబీఎన్ విజన్' గ్రూపులను ఏర్పాటు చేయనుంది. ఆంధ్రప్రదేశ్ ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు ద్వారా 'సీబీఎన్ విజన్' గ్రూపుల పథకం అమలు కోసం మార్గదర్శకాలతో ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది.

- ప్రతి గ్రామంలో 18-45 ఏళ్ల వయసు వారితో సీబీఎన్ గ్రూపులు ఏర్పాటు. ప్రతి గ్రూపులో కనీసం 15 మందికి చోటు.
- ఈ గ్రూపులను గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డులో నమోదు చేస్తారు.
- ఈ గ్రూపులు ఖాదీ, గ్రామీణ, కుటీర పరిశ్రమలను స్థాపించడంతో పాటు సంప్రదాయ కళాకారులను ప్రోత్సహిస్తాయి.
- చేనేత కళాకారులు తయారుచేసే ఉత్పత్తులకు మద్దతు ఇస్తూ రాష్ట్రవ్యాప్తంగా దుకాణాల ఏర్పాటును సులభతరం చేస్తాయి.
- గ్రామాల్లో అందుబాటులో ఉండే మానవ, సహజ వనరులను ఉపయోగించుకోవడం ద్వారా శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థను సృష్టించడం, స్థానికంగా స్థిరమైన జీవనోపాధిని ప్రోత్సహించడం, పట్టణాలకు వలస వెళ్లకుండా నియంత్రించడం ద్వారా సీబీఎన్ విజన్ గ్రూపులకు ఉజ్వల భవిష్యత్తును అందించడమే ఈ పథకం లక్ష్యం.

తొలిదశలో 2 లక్షల మందికి శిక్షణ

స్థానికంగా లభించే వనరులను ఉపయోగించుకుని స్వగ్రామాల్లోనే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) యూనిట్లు స్థాపించడం, నైపుణ్యాలను పెంపొందించడం... గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు, దీర్ఘకాలిక సంక్షేమానికి బాటలు వేస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. గ్రామాల్లో ఎంఎస్ఎంఈల స్థాపన ద్వారా 'ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త' లక్ష్యాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీనికోసం ఖాదీ గ్రామోద్యోగ మహావిద్యాలయ భాగస్వాములతో కలిసి అవగాహన కార్యక్రమాలు, వ్యవస్థాపక అభివృద్ధి కార్యక్రమాలు (ఈడీపీ), వ్యవస్థాపక, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు (ఈఎస్‌డీపీ), నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనుంది. కేవీఐసీ సహాయంతో పాటు సీఎస్ఆర్ నిధులు, ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) కింద కేజీఎంవీ సొంత శిక్షణ కేంద్రాలతోపాటు రాష్ట్రవ్యాప్తంగా.. ఎన్జీవోలు, కళాశాలలు, రిజిస్టర్డ్ కంపెనీలు, స్థానిక పరిశ్రమల్లో కూడా ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. తొలిదశలో రాష్ట్రవ్యాప్తంగా 13,325 గ్రామాల్లోని 2 లక్షల మంది నిరుద్యోగ యువతకు శిక్షణ ఇవ్వనున్నారు.

అమెరికన్ సెయిలర్లను కాపాడిన ఇండియన్ కోస్ట్‌గార్డ్



విశాఖపట్నం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): అమెరికా నుంచి యాచ్‌లో సెయిలింగ్ చేసుకుంటూ వచ్చిన ఇద్దరు వ్యక్తులు.. అండమాన్ నికోబార్ దీవుల సమీపాన ప్రమాదంలో చిక్కుకోగా ఇండియన్ కోస్ట్‌గార్డ్ వెళ్లి రక్షించింది. ఇద్దరు అమెరికన్లు 'సీ ఏంజిల్' సెయిలింగ్ చేస్తూ వస్తుండగా అండమాన్‌కు ఆగ్నేయంగా 52 నాటికల్ మైళ్ల దూరంలో.. వాతావరణంలో మార్పుల వల్ల వారి యాచ్ పనిచేయడం ఆగిపోయింది. తమను రక్షించాలని వారు సమాచారం పంపడంతో కోస్టుగార్డుకు చెందిన ఐసీజీ రాజ్‌వీర్ నౌక వెళ్లి వారిని భారీ గాలుల మధ్య రక్షించింది. శుక్రవారం ఉదయం యాచ్‌తో సహా క్యాంప్‌బెల్ హార్బర్‌కు చేర్చినట్టు కోస్ట్ గార్డ్ వర్గాలు తెలిపాయి.

కాకినాడ ఘటనపై సీఎం సీరియస్

▸▸ జీజీహెచ్‌లో విద్యార్థినులపై సిబ్బంది లైంగిక వేధింపులు

▸▸ చర్యలకు కలెక్టర్, ఎస్పీలకు చంద్రబాబు ఆదేశాలు

▸▸ నలుగురు నిందితుల సస్పెన్షన్, అరెస్ట్



ప్రధాన నిందితుడు కల్యాణ్ చక్రవర్తి(ఫైల్)

జీజీహెచ్(కాకినాడ) జూలై 11(ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో లైంగిక వేధింపుల వ్యవహారంపై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. దీంతో కాకినాడ జిల్లా యంత్రాంగం వేగంగా కదలడంతో నిందితులపై వెంటనే చర్యలు తీసుకున్నారు. కాకినాడ రంగరాయ వైద్యకళాశాలకు అనుబంధంగా ఉన్న జీజీహెచ్‌లోని బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, పాథాలజీ ల్యాబ్‌ల్లో పనిచేస్తున్న ల్యాబ్ అటెండెంట్ కళ్యాణ్ చక్రవర్తి, మైక్రోబయాలజీ టెక్నీషియన్ జిమ్మీరాజు, బయోకెమిస్ట్రీ ఎల్‌టీ గోపాలకృష్ణ, పాథాలజీ ఎల్‌టీ ప్రసాద్ కలిసి ఒకేషనల్, బీఎస్సీ ఎంఎల్‌టీ చదువుతున్న పారా మెడికల్ విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారు. శరీర భాగాలను తాకడం, ఫొటోలు తీసి వాట్సాప్‌లో పంపి, రూమ్‌కు రమ్మనడం.. ఇలా పలు రకాలుగా వేధిస్తున్నారు. వారి వేధింపులను తట్టుకోలేక 50మంది విద్యార్థినులు మెయిల్ ద్వారా ఈనెల 9న కళాశాల ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన వెంటనే అంతర్గత ఫిర్యాదుల కమిటీ విచారణకు ఆదేశించారు. ఈ ఘటనలపై శుక్రవారం 'ఆంధ్రజ్యోతి', 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'లోనూ కథనాలు వచ్చాయి. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి కాకినాడ జిల్లా యంత్రాంగానికి వెంటనే చర్యలు చేపట్టాలని, క్రిమినల్ కేసులు పెట్టాలని ఆదేశించారు. దీంతో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ జి.బిందుమాధవ్ నిందితులపై వెనువెంటనే చర్యలకు దిగారు. నిందితులు నలుగురినీ శుక్రవారం సస్పెండ్ చేయడమే కాకుండా పోలీసులు అరెస్ట్ చేశారు.

అప్పు తీసుకొని రాజధాని నిర్మాణమా..!

▸▸ అమరావతి నిర్మాణ బాధ్యత కేంద్రానిదే

▸▸ 2వ విడత పూలింగ్‌కు కాంగ్రెస్ వ్యతిరేకం: షర్మిల

▸▸ రాజధాని అమరావతిలో పర్యటన



రాజధాని అమరావతి శంకుస్థాపన ప్రదేశంలో పర్యటిస్తున్న షర్మిల

తుళ్లూరు, అమరావతి, జూలై 11(ఆంధ్రజ్యోతి) చంద్రబాబుతోనే కేంద్రంలో మోదీ ప్రభుత్వం నిలబడి ఉంది అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. శుక్రవారం రాజధాని గ్రామం ఉద్దండ్రాయునిపాలెంలో ప్రధాని మోదీ రాజధాని అమరావతికి శంకుస్థాపన చేసిన ప్రదేశాన్ని ఆమె సందర్శించారు. 16 వేల గ్రామాల నుంచి తెచ్చిన నీరు, మట్టిని పరిశీలించారు. శిలాఫలకం వద్ద కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. రాజధాని అమరావతికి 2015లో శంకుస్థాపన చేసిన మోదీ అభివృద్ధికి సహకరించలేదని మండిపడ్డారు. శంకుస్థాన ప్రదేశంలో మీడియాతో షర్మిల మాట్లాడారు. 'ఢిల్లీని తలదన్నే రాజధాని నిర్మాణం జరుగుతుందని ఉత్తుత్తి కబుర్లు చెప్పి మోదీ... మట్టి, నీరు ఇచ్చి వెళ్లారు. మొన్న రాజధాని పునఃప్రారంభ పనులు కూడా ఇదే బాపతు. ప్రపంచ బ్యాంకు, ఏడీబీ బ్యాంకు నుంచి అప్పులు తీసుకొని రాజధాని కట్టటమేంటి?రాజధాని అమరావతిని అభివృద్ధి చేయాలని కేంద్రాన్ని కాలర్ పట్టుకొని అడగకుండా... చంద్రబాబు ఎందుకు అప్పులు తీసుకుంటున్నాడు? అమరావతి నిర్మాణం చేపట్టాల్సిన బాధ్యత కేంద్రానిదే. రెండవ విడత పూలింగ్‌కు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం. రైతుల తరపున పోరాటం చేస్తాం. రియల్ ఎస్టేట్ కోసమే రెండవ విడత భూ సమీకరణ. అంతర్జాతీయ విమానాశ్రయానికి 5 వేల ఎకరాలు కావాలని చంద్రబాబు చెప్పటం విడ్డూరంగా ఉంది. రాజధాని శంకుస్థాపన జరిగిన ప్రదేశంలోనే వెలుగు లేదు (కరెంట్). మరి అభివృద్ధి ఎలా చేస్తారు? అమ్ముకొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తారా? జగన్‌రెడ్డి మూడు రాజధానుల పాట పాడి ఒకటికి కూడా తికానా లేకుండా చేశాడు. అమరావతిలో భూ మాఫియా నడుస్తోంది' అని షర్మిల ప్రశ్నించారు.

154 సీట్లిస్తే జగన్ ప్యాలెస్ దాటలేదు

▸▸ 11 ఇస్తే... పరామర్శలంటూ గ్రామాల్లోకి వచ్చాడు: గొట్టిపాటి



త్రిపురాంతకం, జూలై 11(ఆంధ్రజ్యోతి): 'జగన్‌కు 154 సీట్లిస్తే తాడేపల్లి ప్యాలెస్‌కే పరిమితమైపోయి ప్రజల్లోకి రాకుండా ఐదేళ్లు పరదాల చాటు సీఎంగా ఉండిపోయాడు. ఇప్పుడు ప్రజలు 11 సీట్లు ఇవ్వగానే జగన్ రోడ్లపైకి వచ్చి పరామర్శల పేరుతో రోజుకో గ్రామం తిరుగుతున్నాడు. అందుకే 2029 ఎన్నికల్లో ఆ సీట్ల సంఖ్య జీరో చేస్తే నిత్యం ప్రజల మధ్యే తిరుగుతాడు' అని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలంలోని ఐటీవరంలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం సభలో మంత్రి మాట్లాడారు. కార్యక్రమంలో కనిగిరి, గిద్దలూరు ఎమ్మెల్యేలు ఉగ్రనరసింహారెడ్డి, అశోక్‌రెడ్డి, యర్రగొండపాలెం, దర్శి టీడీపీ ఇన్‌చార్జులు ఎరిక్షన్‌బాబు, గొట్టిపాటి లక్ష్మి పాల్గొన్నారు.

గంజాయి సాగు మానండి.. ఉద్యాన మొక్కలు పెంచండి



గిరిజనులకు పండ్ల మొక్కలు పంపిణీ చేస్తున్న మంత్రులు అనిత, సంధ్యారాణి. చిత్రంలో కలెక్టర్ దినేశ్‌కుమార్, ఈగల్ ఐజీ రవికృష్ణ, ఎస్పీ అమిత్‌బర్దార్, జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్ తదితరులు

▸▸ గంజాయి రహిత రాష్ట్రమే ప్రభుత్వ లక్ష్యం

▸▸ గిరిజనులకు పండ్ల మొక్కలు పంపిణీ చేసిన మంత్రులు సంధ్యారాణి, అనిత

పాడేరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): గంజాయి రహిత రాష్ట్రమే ప్రభుత్వ లక్ష్యమని హోంమంత్రి వంగలపూడి అనిత చెప్పారు. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో 'చైతన్యం-2025, గంజాయి సాగు రహితమే లక్ష్యం' అనే అంశంపై శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గంజాయి సాగు, రవాణా చేస్తూ పట్టుబడితే 10 నుంచి 20 ఏళ్ల జైలు శిక్ష పడుతుందన్నారు. గంజాయి స్మగ్లర్లకు చెందిన రూ.3 కోట్లకుపైగా విలువైన ఆస్తులను ప్రభుత్వం జప్తు చేసిందని చెప్పారు. గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ గంజాయి సాగు వీడిన రైతులకు సిల్వర్‌ఓక్, సపోటా, మామిడి, జామ, నేరేడు, నిమ్మ, పనస, సీతాఫలం, జాఫ్రా మొక్కలను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. పోలీస్, వ్యవసాయ, ఉద్యాన, వైద్య, విద్యా శాఖల సమన్వయంతో గంజాయి సాగును పూర్తిగా నిర్మూలించామని కలెక్టర్ దినేశ్‌కుమార్ చెప్పారు. ఎస్పీ అమిత్‌బర్దార్ మాట్లాడుతూ గంజాయి నిర్మూలనపై ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నామన్నారు. 'ఈగల్' ఐజీ ఆకే రవికృష్ణ మాట్లాడుతూ ఎక్కడైనా గంజాయి సాగు, రవాణా జరిగితే 1972 టోల్‌ఫ్రీ నంబరుకు సమాచారం అందించాలని కోరారు. అనంతరం పలువురు గిరిజన రైతులకు పండ్ల మొక్కలు, రాగుల విత్తనాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మిరియాల శిరిషాదేవి, జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్, విజయనగరం రీజియన్ ఆర్టీసీ చైర్మన్ సియ్యారి దొన్నుదొర తదితరులు పాల్గొన్నారు.

జనమే బలం





అమరావతిలో నిర్వహించిన ప్రపంచ జనాభా దినోత్సవం కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, ప్రధాని ఆర్థిక మండలి చైర్మన్ మహేంద్రదేవ్ తదితరులు, హాజరైన ప్రతినిధులు

▸▸ రాష్ట్రంలో జనాభా వృద్ధికి మంచి పాలసీ తెస్తాం

▸▸ దేశమంటే మనుషులోయ్ అన్న గురజాడే స్ఫూర్తి

▸▸ జనాభా దినోత్సవ సదస్సులో చంద్రబాబు వెల్లడి

అమరావతి, జూలై 11(ఆంధ్రజ్యోతి): జనమే బలమని, జనాభా పెరుగుదలకు త్వరలో మంచి పాలసీ తీసుకొస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం వెలగపూడి సచివాలయంలో నిర్వహించిన మొదటి అమరావతి సమ్మిట్‌కు ఆయన హాజరయ్యారు. 'జనాభా నిర్వహణ విధానం- ప్రతి కుటుంబం ముఖ్యం - మీ అభిప్రాయం మార్గదర్శనం' అనే భావనతో రూపొందించిన సర్వేను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడారు. దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్ అని చెప్పిన గురజాడ అప్పారావు స్ఫూర్తితో ముందుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. 'ఒకప్పుడు నేను కుటుంబ నియంత్రణను ప్రోత్సహించాను. ఇప్పుడు జనాభా వృద్ధి కావాలని కోరుతున్నాను. దేశానికి బలమైన ఆర్థిక వనరు జనాభాయే. జనాభా నియంత్రణపై కాదు.. నిర్వహణపై దృష్టి సారించాలి. జనాభాను భారంగా కాకుండా ఆస్తిగా భావించే కాలం వచ్చింది." అని చంద్రబాబు తెలిపారు. వికసిత భారత్ -2047, స్వర్ణాంధ్ర లక్ష్య సాధనకు జనాభా పెరుగుదల ఎంతో కీలకమన్నారు. రాబోయే 20 ఏళ్లలో వచ్చే పెనుమార్పులకు అంతా సిద్ధంగా ఉండాన్నారు. అభివృద్ధి ఉన్న చోటుకు ప్రజలు ఎలా వలస వస్తారనడానికి హైదరాబాద్ ఒక ఉదాహరణగా పేర్కొన్నారు. ఇంకా ఏమన్నారంటే...

చైనానూ వెనక్కునెట్టాం

"జనాభా ఎప్పటికీ భారం కాదు. అదే మనకు తిరుగులేని ఆస్తి. 140 కోట్ల జనాభాతో మన దేశం చైనాను వెనక్కునెట్టింది. అయితే, ప్రపంచవ్యాప్తంగా జనాభాతోపాటు జననాల రేటు కూడా తగ్గిపోతోంది. యువశక్తి తగ్గిపోయి వృద్ధులు పెరుగుతున్నారు. ఏ దేశంలో వయోజన సమస్య వస్తుందో అక్కడ వృద్ధిరేటు నిలిచిపోతుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని, పిల్లలను కనేవారికి కొన్ని దేశాలు ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. జపాన్‌లో పిల్లలు స్కూల్‌కు వెళ్లేవరకు చైల్డ్ కేర్ సేవలను అందించడంతోపాటు చదువుకు ఆర్థిక సాయం లేదా ఉచిత విద్య అందిస్తున్నారు. ఎక్కువ మంది పిల్లలుంటే ఇల్లు కట్టుకునేందుకు ఆర్థిక సాయంతోపాటు తక్కువకు ఇల్లు అద్దెకు ఇస్తున్నారు. దక్షిణ కొరియాలో నెలవారీగా ప్రత్యక్ష నగదు బహుమతులు అందించడంతోపాటు వివాహం, కాన్పులకు సాయం చేస్తున్నారు. సింగపూర్‌లో బేబీ బోనస్ స్కీమ్ కింద పుట్టిన ప్రతి శిశువుకు కొంత నగదు అందిస్తున్నారు. మ్యాచ్ సేవింగ్స్ కింద ప్రభుత్వ సొమ్మును జోడించి పిల్లల ఖాతాల్లో వేస్తున్నారు. రష్యాలో రెండో బిడ్డను కంటే ఫ్రీ హెల్త్‌కేర్ కింద గర్భిణీలకు ఉచిత వైద్యం అందిస్తున్నారు. హంగేరీలో నలుగురి కంటే ఎక్కువ పిల్లలు ఉన్న వారికి జీవితాంతం ఆదాయ పన్ను నుంచి మినహాయింపు ఇస్తున్నారు. చైనాలో ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలుంటే రూ.12 లక్షలు సాయం చేస్తున్నారు. మన వద్ద ఖర్చులు పెరుగుతున్నాయని పిల్లల్ని కనడానికి ఎక్కువమంది ఇష్టపడటం లేదు. ఈ పరిస్థితి మారాలి. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. కుటుంబ వ్యవస్థ మనకు వారసత్వంగా వచ్చింది. గత కొన్నేళ్ల వరకు ఇంట్లో ప్రతి ఒక్కరికీ 5 కేజీలు చొప్పున బియ్యం ఇచ్చేవాళ్లం. ఐదుగురు ఉంటే 25 కేజీలు ఇచ్చేవాళ్లం. అంతకంటే ఎక్కువ మంది ఉంటే బియ్యం ఇచ్చేవాళ్లం కాదు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. ఒక కుటుంబంలో పది మంది ఉన్నా 50 కేజీల కంటే ఎక్కువ ఇచ్చే దానిపై ఆలోచిస్తున్నాం. నేను మహిళా పక్షపాతిని. ఇంటికే పరిమితమైన మహిళల కోసం నేను డ్వాక్రా, మెప్మా సంఘాలు పెట్టి ఆర్థిక చేయూత అందించాను. నా తల్లి కట్టెల పొయ్యిపై వంట చేసేటప్పుడు పడిన కష్టం చూసి ఏ ఆడబిడ్డకు అలాంటి కష్టం రాకూడదని దేశంలోనే మొదటిసారిగా దీపం పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇచ్చాం.

కుప్పంలో తొలి జనాభా నిర్వహణ సంస్థ..

కుప్పంలో మైనా మహిళా ఫౌండేషన్ అనే సంస్థ జనాభా నిర్వహణ కోసం పనిచేస్తోందని సీఎం తెలిపారు. ఇలాంటి సంస్థ రాష్ట్రంలోనే మొదటిదని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి చైర్మన్ మహేంద్రదేవ్, ఉన్నతాధికారులు పీయూశ్ కుమార్, ఎంటీ కృష్ణబాబు, సూర్యకుమారి, ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్ కుమార్, రామాంజనేయులు, మైనా మహిళా ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుహానీ జలోటా, పబ్లిక్ హెల్త్ స్పెషలిస్ట్ ఎమ్.ప్రకాశమ్మ, సంజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో ఇద్దరు పిల్లలకే అత్యధికుల ఓటు

శుక్రవారం సచివాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో 'జనాభా నిర్వహణ విధానం... ప్రతి కుటుంబం ముఖ్యం... మీ అభిప్రాయం మార్గదర్శనం' అనే కాన్సెప్ట్‌తో సర్వేను ప్రారంభించారు. హాజరైన వారికి అక్కడి టేబుళ్లపై ఉంచిన క్యూఆర్ కోడ్‌ను తమ సెల్‌ఫోన్‌లో స్కాన్ చేయాలని సూచించారు. స్కాన్ చేయగానే.. తెలుగు, ఇంగ్లీషు భాషల్లో కనిపించిన 9 ప్రశ్నలకు సమాధానాలు పూర్తి చేయాలన్నారు. అలా సభికుల నుంచి సేకరించిన అభిప్రాయాలను సీఎం సభాముఖంగా వెల్లడించారు. ఈ సర్వే సందర్భంగా ఇద్దరు పిల్లలుండాలని 67.41 % మంది, ఒక్కరే ఉండాలని 12.34%, ముగ్గురు ఉండాలని 19.88 శాతం మంది అభిప్రాయపడ్డారని సీఎం వివరించారు.

జనాభాపై ఏపీ ఆలోచనలు భేష్

▸▸ మహేంద్ర దేవ్

జనాభా నిర్వహణ పాలసీ విషయంలో ఏపీ ఆలోచనలు వినూత్నంగా ఉన్నాయని ప్రధాని ఆర్థిక సలహా మండలి చైర్మన్ మహేంద్రదేవ్ సంతృప్తి చేశారు. ఏపీ పాలసీని పరిశీలించి దేశవ్యాప్తంగా అమలుకు ప్రయత్నిస్తామన్నారు. 'ఏ దేశానికైనా జనాభా పెద్ద పెట్టుబడి. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని స్మార్ట్ పాపులేషన్ స్ట్రాటజీలను అమలు చేయాలి. ఈ విషయంలో చంద్రబాబు చాలా ముందుచూపుతో వ్యవహరిస్తున్నారు. జనాభా పాలసీలో ఏపీని మోడల్‌గా నిలిపారు. దేశానికి మార్గదర్శకంగా నిలిచారు.' అని మహేంద్రదేవ్ ప్రశంసించారు.

ఏఐ, క్వాంటమ్‌ల కంటే మనిషే గొప్ప

▸▸ మానవ వనరును మించిన సంపద లేదు: సీఎం

అమరావతి, జూలై 11(ఆంధ్రజ్యోతి): మనిషి సృజనాత్మకతను భర్తీ చేసే సాంకేతికత ఎప్పటికీ రాలేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తొలి అమరావతి సమ్మిట్‌లో భాగంగా పలువురు సభికులతో ఆయన కాసేపు మాట్లాడారు.

డి. రామకృష్ణ (సోషల్ టీచర్, బాపట్ల జిల్లా): జనాభా పెరిగితే మన దేశ సంపద అందరికీ సరిపోతుందా? పెరుగుతున్న టెక్నాలజీ వల్ల అందరికీ ఉపాధి సాధ్యమా?

సీఎం: మానవ వనరుల గొప్పతనంపై బిల్ గేట్స్ ఓ మంచి విషయం చెప్పారు. 'ఇంకా వంద సంవత్సరాలు అయినా మానవవనరులను రీప్లేస్ చేసే సాంకేతికత రాదు. ఏఐ వస్తుంది. క్వాంటమ్ కంప్యూటింగ్ వస్తుంది. కానీ సృజనాత్మకత అనే సాంకేతికత మాత్రం రాదు' అన్నారు. మానవ వనరులతో ఎంత సంపద అయినా సృష్టించవచ్చు, అసలు జనాభానే లేకుండా నియంత్రించుకుంటూ పోతే కొత్త ఆవిష్కరణలు ఎవరి కోసం చేయాలి?

శేఖర్ (ప్రభుత్వ టీచర్): నా కుమారుడితో పాటు కోడలు కూడా ఉద్యోగం చేసేది. పాప పుట్టిన తర్వాత ఉద్యోగానికి ఆమె రాజీనామా చేసింది. పాపను చూసేవారు లేక ఈ నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి కుటుంబాలు ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు కదా సర్?

సీఎం: సమాజంలో చాలామంది సంపాదించింది ఇతరులతో పంచుకోవాల్సి వస్తోందనే కారణంగా విడిపోతున్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల కోసం కూడా మరికొందరు విడిపోతున్నారు. దీనిపై ఆలోచన చేస్తాం. ఎక్కువ మంది పిల్లల్ని కనే వారికి ప్రోత్సాహకాలు ఇస్తాం.

మంజులవాణి (మహిళా శిశుసంక్షేమ శాఖ ఉద్యోగిని, అనకాపల్లి): గతంలో ఎంత మంది పిల్లలు అని అడిగేవారు తప్ప ఎంత ఆస్తి ఉందని అడిగేవారు కాదు. ఇప్పుడు మళ్లీ ఆ పరిస్థితిని రాష్ట్రంలో చూడగలమా?

సీఎం: మన పెద్దలు పిల్లలను సంపదగా భావించేవారు. ఎన్టీఆర్ తాతమ్మ కల అని ఓ సినిమా తీశారు. ఎంత మంది ఎక్కువ పిల్లలు ఉంటే అంత ఆనందం ఉంటుందని చూపారు.

సుమిత్ర (దివ్యాంగురాలు, అసిస్టెంట్ ప్రొఫెసర్, కంచికచర్ల): నేను ఎస్వీ యూనివర్సిటీ నుంచి ఎంఏ ఇంగ్లిషు చేశాను. నాకు కంటి చూపు సమస్య ఉన్నా చంద్రబాబు స్ఫూర్తితో ఉన్నతస్థానానికి రావాలని తపించి ఇప్పుడు అసిస్టెంట్ ప్రొఫెసర్ స్థాయికి చేరుకున్నాను. ఉమ్మడి కుటుంబం ఉన్నత కుటుంబం, పెద్ద కుటుంబం ప్రేమగల కుటుంబం అనే నినాదాలతో జనాభా నిర్వహణ కార్యక్రమాన్ని ప్రచారం చేయాలి సర్..

సీఎం: అలాగే చేద్దాం.



గవర్నర్‌తో సీఎం భేటీ

▸▸ ఏడాది పాలనలో సంక్షేమం, పెట్టుబడులపై వివరణ

అమరావతి, జూలై 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. శుక్రవారం సాయంత్రం విజయవాడలోని రాజ్‌భవన్‌కు వచ్చిన సీఎం సుమారు గంటసేపు గవర్నర్‌తో చర్చించారు. ఏడాదిలో అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు. శాంతిభద్రతల పరిరక్షణ, గంజాయి నిర్మూలన కోసం చేపట్టిన చర్యలను గవర్నర్ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం రాజ్‌భవన్ నుంచి గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని హైదరాబాద్ బయల్దేరి వెళ్లారు.

జీఎస్టీ వసూళ్లలో దేశానికే ఆదర్శంగా నిలవాలి

▸▸ జీఎస్టీ సమన్వయ సమావేశంలో సీఎం చంద్రబాబు

అమరావతి, జూలై 11(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ వసూళ్లలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శంగా నిలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. పన్ను ఎగవేతలను అరికట్టేందుకు కఠినచర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సీఎం క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జరిగిన కేంద్ర, రాష్ట్ర జీఎస్టీ సమన్వయ సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. పన్ను ఎగవేతలు అరికట్టేందుకు డేటా ఎనలిటిక్స్ వంటి టెక్నాలజీని వాడాలని ఆయన సూచించారు. కేంద్ర, రాష్ట్ర జీఎస్టీ అధికారులు సమన్వయంతో పనిచేస్తే మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. కేంద్ర, రాష్ట్ర జీఎస్టీ అధికారులు సమన్వయంతో పనిచేస్తే మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. జీఎస్టీ వసూళ్లలో అగ్రగామిగా నిలిచేందుకు సరైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకుని దాని ప్రకారం పనిచేయాలన్నారు. పన్ను ఎగవేతలను గుర్తించేందుకు కరెంటు బిల్లు వినియోగాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. పెట్టుబడులను ఆకర్షించడంలో రాష్ట్రం నాలుగో ర్యాంకు సాధించిందని, అన్ని రంగాల్లోనూ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెట్టడమే తన ధ్యేయమని చెప్పారు. కేంద్ర జీఎస్టీ జోనల్ కార్యాలయం, రెసిడెన్షియల్ క్వార్టర్స్ నిర్మించుకోవడం కోసం అమరావతిలో 5 ఎకరాల స్థలం కావాలని కేంద్ర జీఎస్టీ అధికారులు ముఖ్యమంత్రిని కోరారు.

సొంత ఆదాయం పెంచుకోవాలి

▸▸ ప్రజలకు ఇబ్బందిలేని ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలి

▸▸ ఆదాయార్జన శాఖలపై సమీక్షలో సీఎం చంద్రబాబు

అమరావతి, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఆదాయార్జన శాఖల ద్వారా మరింత రెవెన్యూ పెరగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయా శాఖల అధికారులకు సూచించారు. సంస్కరణల అమలు ద్వారా రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను గాడిలో పెట్టామని చెప్పారు. సంక్షేమం అందిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ఆదాయార్జన శాఖలపై సీఎం సమీక్ష నిర్వహించారు. వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, మైనింగ్, స్టాంపులు రిజిస్ట్రేషన్లు, మున్సిపల్, పంచాయతీరాజ్, అటవీ శాఖల పనితీరుపై ఆరా తీశారు. ఆయా శాఖల్లో ఆదాయార్జనకు సంబంధించి పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, 'సొంత ఆదాయం పెంచడంపై దృష్టిసారించాలి. ఆదాయ ఆర్జనలో ఉన్న లీకేజీలు గుర్తించి, వాటిని నివారించి ఖజానాకు ఆదాయం పెరిగేలా చూడాలి. ప్రజలకు ఇబ్బంది లేకుండా ఆదాయం పెంచడానికి ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలి. కేంద్రం నుంచి తెచ్చుకోగలిగే ప్రతి పైసాను రాష్ట్రానికి తీసుకురావాలి."' అని స్పష్టం చేశారు.

సీఎం చెప్పారా? అయితే ఏంటి?!

▸▸ దేవదాయశాఖ పోస్టుల భర్తీపై నిర్లక్ష్యం

▸▸ వెంటనే భర్తీ చేయాలని సీఎం ఆదేశం

▸▸ మార్చిలో ఆర్థిక శాఖ అనుమతి కోసం ఫైల్

▸▸ 4 నెలలుగా ఆర్థిక శాఖలోనే ఫైల్ పెండింగ్

▸▸ అయినా పట్టించుకోని ఎండోమెంట్ అధికారులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



రాష్ట్రంలోని దేవదాయ శాఖలో భారీగా పేరుకుపోయిన పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించినా.. అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో దేవదాయశాఖ పాలన పూర్తిగా దెబ్బతింటోంది. ప్రతి విభాగంలోనూ ఇన్‌చార్జిలే చక్రం తిప్పుతున్నారు. ఫలితంగా ఆలయాల ఆస్తులు, భూముల పరిరక్షణ ఇబ్బందిగా మారింది. దేవదాయశాఖలో పోస్టులు ఖాళీగా ఉన్నాయన్న సమస్యను ఆదిలోనే గుర్తించిన సీఎం చంద్రబాబు.. డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, గ్రేడ్-1, గ్రేడ్-3 ఈవో పోస్టులు సహా మొత్తం 300 పోస్టులను భర్తీ చేయాలని ఆదేశించారు. కేవలం నాలుగు నెలల్లోనే ఈ ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. రాష్ట్రంలో ప్రస్తుత ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత దేవదాయ శాఖపై చేపట్టిన తొలి సమీక్షలోనే ముఖ్యమంత్రి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి ఆదేశిస్తే ఫైల్స్ ఆగమేఘాల మీద పరుగులు పెట్టాలి. పనులు క్షణాల్లో పూర్తి కావాలి. కానీ, దేవదాయ శాఖలో దీనికి విరుద్ధంగా జరుగుతోంది. సీఎం ఆదేశించిన ఆరు నెలల తర్వాత ఖాళీలను గుర్తించారు. ముఖ్యమంత్రి గత ఏడాది ఆగస్టు 24న జరిగిన సమీక్షలో ఆదేశాలు జారీ చేశారు. దేవదాయ శాఖ అధికారులు ఈ ఏడాది మార్చి 8న ఫైల్ సిద్ధం చేసి ఆర్థిక శాఖకు పంపించారు. పోస్టుల భర్తీకి అనుమతి కోరుతూ ఆర్థిక శాఖకు చేరిన ఫైల్ ఇప్పటి వరకు ఒక్క అడుగు కూడా ముందుకుపడలేదు. ఆర్థిక శాఖ అధికారులు సదరు ఫైల్‌ను అత్యంత భద్రంగా పక్కన పెట్టారు. ఇది సీఎం ఆదేశాల మేరకు వచ్చిన ఫైల్ అన్న విషయాన్ని దేవదాయ, ఆర్థిక శాఖల అధికారులు మరిచిపోయారు. సీఎం ఆదేశాల మేరకు ఫైలును పంపేశామని భావించిన దేవదాయ శాఖ అధికారులు చేతులు దులుపుకొన్నారు. ఇక, ఆర్థిక శాఖ వర్గాలు కూడా దీనిని పట్టించుకోలేదు. ఇలా రెండు శాఖల మధ్య సమన్వయం లోపం వల్ల ఖాళీల భర్తీ ప్రక్రియ దాదాపు పది నెలలుగా నిలిచిపోయింది. కాగా, పోస్టుల భర్తీ చేయమని ముఖ్యమంత్రి ఆదేశించి మరో 20 రోజుల్లో ఏడాది పూర్తవుతుంది.

ఆర్థిక భారం లేదు!

దేవదాయ శాఖలో పోస్టులు భర్తీ చేయడం వల్ల లేదా కొత్త ఉద్యోగాలు కల్పించడం వల్ల ఆర్థిక శాఖపై ఎలాంటి భారం ఉండదని తెలుస్తోంది. శాఖలో ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర అలవెన్సులు మొత్తం ఆలయాల నుంచి వచ్చే ఆదాయం ద్వారానే ఇస్తారు. ఈ నేపథ్యంలో పోస్టులు భర్తీ చేయడం వల్ల ప్రభుత్వ ఖజానాపై రూ.కోట్లలో భారం పడుతుందన్న బెంగ లేదు.



ఎయిడెడ్ పోస్టుల భర్తీలో అక్రమాలకు చెక్

ఇకపై సీబీటీ ద్వారానే భర్తీ.. ఇంటర్వ్యూలు పూర్తిగా రద్దు

సవరణ నిబంధనలు విడుదల

అమరావతి, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఎయిడెడ్ పాఠశాలల్లోని పోస్టుల భర్తీ ప్రక్రియలో జరుగుతున్న అక్రమాలకు చెక్ పెట్టేలా ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. నాన్ మైనారిటీ ప్రైవేటు విద్యా సంస్థల్లో ఎయిడెడ్ పోస్టుల భర్తీ ఇకపై కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) ఆధారంగా మాత్రమే చేపట్టాలని, ఇంటర్వ్యూలు ఉండవని స్పష్టం చేసింది. ఈ మేరకు నిబంధనలు సవరిస్తూ పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సవరించిన నిబంధనల ప్రకారం వంద మార్కులకు సీబీటీ పరీక్ష జరుగుతుంది. దీనిలో 80 మార్కులకు సీబీటీ, 20 మార్కులకు 'టెట్' వెయిటేజీ ఇస్తారు. ప్రస్తుతం ఎయిడెడ్ విద్యా పాఠశాలల్లో పనిచేస్తున్న వారికి ఏడాదికి అర మార్కు చొప్పున పదేళ్లకు గరిష్ఠంగా 5 మార్కులు కేటాస్తారు. పోస్టుల భర్తీలో ఇంటర్వ్యూలు ఉండవు. బోధనేతర సిబ్బంది నియామకాలకు స్టాఫ్ సెలక్షన్ కమిటీ నిర్వహించే పరీక్ష రాయాల్సి ఉంటుంది. అన్ని ఖాళీలను పత్రికా ప్రకటనల ద్వారా ప్రచారం చేయాలి. అయితే, ఆ జిల్లాలో ఎక్కడా ఎయిడెడ్‌లో మిగులు పోస్టులు లేవని నిర్ధారించాల్సి ఉంటుంది. ఒకవేళ ఎక్కడైనా మిగులు పోస్టులు ఉంటే ఆ ఖాళీల్లో సర్దుబాటు చేస్తారు. పోస్టుల భర్తీకి ఖచ్చితంగా అధీకృత అథారిటీ అనుమతి పొందాలని నిబంధనల్లో పేర్కొన్నారు. డీఎస్సీ తరహాలోనే మెరిట్ కమ్ రోస్టర్ విధానం ఉంటుంది.

స్టాఫ్ సెలక్షన్ కమిటీ

నాన్ మైనారిటీ, మైనారిటీ పాఠశాలల్లో పోస్టుల భర్తీ ప్రక్రియను స్టాఫ్ సెలక్షన్ కమిటీ ఆధ్వర్యంలోనే నిర్వహిస్తారు. ఈ కమిటీలో ఎడ్యుకేషనల్ ఏజెన్సీ అధ్యక్షుడు లేదా నామినీ, విద్యా సంస్థ హెచ్ఎం, డీఈవో ఆమోదించిన ఇద్దరు సబ్జెక్టు నిపుణులు, డీవైఈవో ర్యాంకుకు తక్కువకాని ఒక విద్యాశాఖ అధికారి ఉంటారు. వీరిలో ఒకరు చైర్మన్‌గా వ్యవహరిస్తారు.

అపోహలకు తావు లేదు

▸▸ డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి ప్రకటన

ఇటీవల ముగిసిన మెగా డీఎస్సీ పరీక్షలు పూర్తి పారదర్శకంగా జరిగాయని, ఎలాంటి అపోహలకు తావులేదని డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. డీఎస్సీ అభ్యర్థుల్లో కొందరు తమ రెస్పాన్స్ షీట్లలో మార్కులు తప్పుగా కనిపిస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేస్తున్న నేపథ్యంలో ఆయన ఈ వివరణ ఇచ్చారు. డీఎస్సీ పరీక్షలు కంప్యూటర్ ఆధారంగా(సీబీటీ) జరిగాయని, అందుకే దీనిపై నమూనా పరీక్షల సౌకర్యాన్ని కల్పించి అభ్యర్థులకు అవగాహన కల్పించామన్నారు. సీబీటీ పరీక్షల్లో అభ్యర్థి ఎంపిక చేసిన ఆప్షన్ మాత్రమే నమోదవుతుందన్నారు. సీబీటీపై కొందరికి అవగాహన లేకపోవడం వల్ల సమాధానాలను ఎంపిక చేసిన తర్వాత సేవ్ చేయకపోవడం, ఆప్షన్ మార్చిన తర్వాత మళ్లీ సేవ్ చేయకపోవడం లాంటి పొరపాట్లు చేశారని తెలిపారు. ఈ కారణంగా మార్కులు తక్కువగా చూపిస్తున్నాయని అపోహ పడుతున్నారని వివరించారు. పరీక్ష సమయంలో ప్రతి అభ్యర్థి చర్య 'సెకన్ టు సెకన్' నమోదవుతుందన్నారు. 3.36 లక్షల మంది అభ్యర్థులు 5.77 లక్షల దరఖాస్తులు సమర్పించడం వల్లే 2 షిఫ్టులలో పరీక్షలు నిర్వహించాల్సి వచ్చినట్టు తెలిపారు. మొత్తం 69 రకాల పోస్టులకు పరీక్షలు జరిగాయని పేర్కొన్నారు. వీటిలో 60 రకాల పోస్టులకు ఒకే సెషన్‌లో, 8 రకాల పరీక్షలకు రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించామన్నారు. కొందరు అభ్యర్థులు.. సోషల్ మీడియాలో వ్యాప్తి చేస్తున్న వదంతుల్లో వాస్తవం లేదని వివరించారు.

ఫ్రీహోల్డ్ భూములపై మరో 2 నెలలు నిషేధం

▸▸ పొడిగిస్తూ ప్రత్యేక సీఎస్ ఆదేశాలు

అమరావతి, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లకు ప్రభుత్వం ఎప్పుడెప్పుడు గ్రీన్ సిగ్నల్ ఇస్తుందా అని చిన్నాచితకా రైతులు, సక్రమంగా ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్లు చేసుకున్న వారు ఎదురుచూస్తుంటే.. ప్రభుత్వం మాత్రం వాటి రిజిస్ట్రేషన్లపై నిషేధాన్ని మరో రెండు నెలలు పొడిగించింది. ఏడాది నుంచి విచారణ పేరుతో భూముల రిజిస్ట్రేషన్ జరక్కుండా నిషేధం విధించారు. ఇప్పుడు మళ్లీ 2 నెలలు పొడిగిస్తున్నట్లు స్టాంపులు-రిజిస్ట్రేషన్లు, రెవెన్యూ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి శుక్రవారం ఆదేశాలు జారీచేశారు. దీనిపై రైతులు, ఇతరులు ఆందోళన వ్యక్తంచేస్తుండడంతో.. ఆగస్టు, సెప్టెంబరు నాటికి ఈ సమస్యను కొలిక్కి తెస్తామని, ఆ తర్వాత దసరా నుంచి ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లకు అనుమతిస్తామని రెవెన్యూ శాఖ అధికారులు చెబుతున్నారు. జగన్ ప్రభుత్వం రాజకీయ లబ్ధికోసం, అస్మదీయులకు మేలు చేసేందుకు, సెటిల్‌మెంట్ల కోసం నిషేధిత 22ఏ జాబితాలోని భూములను యథేచ్ఛగా ఫ్రీహోల్డ్ చేసేసింది. ఆ గత ఏడాది ఆ ప్రభుత్వం పోయి చంద్రబాబు ప్రభుత్వం వచ్చింది. గత సర్కారు చేసిన తప్పు సరిదిద్దే పేరిట చిన్నాచితకా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోంది. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఫ్రీహోల్డ్‌పై ఎటూ తేల్చకుండా కాలం గడిపేస్తోంది.

పొడిగింపు ఆదేశాలు చూపిస్తూ దందాలు

అక్రమంగా ఫ్రీహోల్డ్ చేసిన భూముల వివరాలు జిల్లాలవారీగా ప్రభుత్వం వద్ద ఉన్నాయి. ప్రకాశం, రాయలసీమ జిల్లాల్లో ఈ భూములు ఎక్కువగా ఉన్నాయి. మిగతా ప్రాంతాల్లో ఇవి చాలా చాలా తక్కువ అయినప్పటికీ.. సమస్య ఉన్న చోట, లేని చోట కూడా ఇదే నిషేధం కొనసాగిస్తుండడం చిన్న రైతులకు శాపంగా మారింది. అటు ఎప్పటికప్పుడు నిషేధం పొడిగిస్తూ ప్రభుత్వం ఇస్తున్న ఆదేశాలను చూపిస్తూ రాజకీయ నాయకులు ఫ్రీహోల్డ్ భూములను తక్కువ ధరలకే తమ గుప్పిట్లోకి తెచ్చుకుంటున్నారు. దీనిపై ఏకంగా దందాలే నడుపుతున్నారు.

పార్టీ ఏదైనా అర్హులకు న్యాయం జరగాలి: సీఎం

ఇటీవల ఈ అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష చేసి తక్షణమే దీన్ని పరిష్కరించాలని రెవెన్యూ శాఖను ఆదేశించారు. ఫ్రీహోల్డ్‌కు అర్హులైన వారు వైసీపీ కార్యకర్తలైనా, టీడీపీ కార్యకర్తలైనా, ఏ పార్టీ వారైనా అర్హులకు న్యాయం చేయాల్సిందేనని తేల్చిచెప్పారు. నాన్చుడు ధోరణి వద్దని, అసైనీలు భూమిపై పొజిషన్‌లో ఉన్నవి, పక్కా అసైన్‌మెంట్ రికార్డులు కలిగి ఉండి 20 ఏళ్ల గడువు దాటిన వాటిని రాజకీయాలతో సంబంధం లేకుండా ఫ్రీహోల్డ్ చేయాలని స్పష్టంచేశారు. అసైన్‌మెంట్ రికార్డులు లేని భూములు, కలెక్టర్ ఉత్తర్వులు లేనివి, జీవో 596కి విరుద్ధంగా ఉన్నవి, అధిక విస్తీర్ణం క్లెయిమ్ చేసేవి, అసలైన అసైనీలు భూమిపై పొజిషన్‌లో లేనివి, ఇతరులు క్లెయిమ్ చేసే భూములు, అభ్యంతరాలున్న పోరంబోకు భూములు, 20 ఏళ్ల గడువుదాటని అసైన్డ్ భూములకు ఫ్రీహోల్డ్ వద్దని స్పష్టంగా ఆదేశించారు.

నల్లపరెడ్డిపై కేసు పూర్తి వివరాలు ఇవ్వండి

- పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, జూలై 11(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో వైసీపీ నేత నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిపై నమోదైన కేసు పూర్తి వివరాలు తమ ముందు ఉంచాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ప్రసన్నకుమార్‌రెడ్డి వేసిన పిటిషన్‌పై విచారణను ఈ నెల 15కి వాయిదా వేసింది. శుక్రవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చారు. అంతకుముందు పిటిషనర్ తరపున న్యాయవాది సి.సుబోధ్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్‌పై నమోదైన సెక్షన్లన్నీ ఏడేళ్లలోపు శిక్షకు వీలున్నవేనన్నారు. పిటిషన్‌పై అత్యవసరం విచారణ జరపాలని కోరారు. న్యాయమూర్తి స్పందిస్తూ... ఏడేళ్లలోపు శిక్షకు వీలున్న కేసులలో ఆందోళన ఎందుకని ప్రశ్నించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ.. కేసు మొదటిసారి విచారణకు వచ్చిందని, వివరాలు తెప్పించుకొని కోర్టు ముందు ఉంచేందుకు సమయం ఇవ్వాలని కోరారు. ఇరువైపుల వాదనలు విన్న న్యాయమూర్తి తదుపరి విచారణను వాయిదా వేశారు. ప్రసన్నకుమార్‌రెడ్డి తనను అసభ్య పదజాలంతో దూషించారని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే.

ప్రసన్నకుమార్‌రెడ్డిపై మరో ఫిర్యాదు

నూజివీడు, జూలై 11(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిపై వైసీపీ నేత ప్రసన్నకుమార్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై టీడీపీ, జనసేన మహిళా నాయకులు నూజివీడు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ నాయకులు మహిళలను కించపరుస్తూ తరచూ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం సరికాదని, తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇతర ఖైదీలున్న బ్యారక్‌లోకి మార్చండి

- కోర్టులో చెవిరెడ్డి పీఏ బాలాజీ పిటిషన్

విజయవాడ, జూలై 11(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా జైలులో తనను ఒంటరిగా సెల్‌లో ఉంచారని, ఇతర ఖైదీలున్న బ్యారక్‌లోకి మార్చాలని గుంటూరు జిల్లా జైల్లో ఉన్న బాలాజీ యాదవ్ ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పీఏ బాలాజీ యాదవ్‌తోపాటు నవీన్‌కృష్ణను మద్యం కేసులో సిట్ పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. బాలాజీ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని జైలు అధికారులను ఆదేశిస్తూ న్యాయాధికారి పి.భాస్కరరావు విచారణను ఈనెల 14వ తేదీకి వాయిదా వేశారు.

చిత్తూరు ఎస్పీ రౌడీలా వ్యవహరించాడు: అంబటి

- పోలీసు విచారణకు హాజరైన మాజీ మంత్రి

సత్తెనపల్లి, జూలై 11(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆయన సోదరుడు అంబటి మురళి, వైసీపీ నేత లేళ్ల అప్పిరెడ్డిలు శుక్రవారం పోలీసుల విచారణకు హాజరయ్యారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పర్యటన సందర్భంగా జూన్ 18వ తేదీన పల్నాడు జిల్లా సత్తెనపల్లి పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసుకు సంబందించి పట్టణ సీఐ నాగమల్లేశ్వరరావు వారిని విచారించారు. విచారణలో భాగంగా ఎప్పుడు పిలిస్తే అప్పుడు స్టేషన్‌కు రావాలన్నారు. జగన్ పర్యటన సందర్భంగా బారికేడ్లను తొలగించి పోలీసు విధులకు ఆటంకం కలిగించారని కూడా అంబటి సోదరులపై కేసు నమోదైంది. దానిపై కూడా పోలీసులు వారిని విచారించారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ, వైఎస్ జగన్ పర్యటనలో తాము పాల్గొనటం వల్లే పోలీసులు కేసులు పెట్టారన్నారు. జగన్ పర్యటన సందర్భంగా 1300 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసి 113 మంది వైసీపీ శ్రేణులపై కేసులు నమోదు చేశారన్నారు. జగన్ బంగారుపాళ్యం పర్యటనకు వెళితే చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ ఓ రౌడీలా వ్యవహరించాడన్నారు. జిల్లా ఎస్పీలు పోలీసుల్లాగా వ్యవహరించటం లేదని, ఇలానే కొనసాగితే పోలీసులపై ప్రైవేట్ కేసులు నమోదు చేస్తామని రాంబాబు హెచ్చరించారు.

అమలు చేశా.. అంతే

ఎక్సైజ్ పాలసీ నేను రూపొందించలేదు.. నేను వచ్చేసరికే రూపకల్పన చేశారు

- సిట్ విచారణలో రజత్ భార్గవ
- మద్యం స్కామ్‌లో అధికారులు ప్రశ్నలవర్షం
- ఉల్లంఘనలపై రిటైర్డ్ ఐఏఎస్ మౌనం
- పలు ప్రశ్నలకు సమాధానాలు దాటవేత
- రాజ్ కసిరెడ్డి వ్యవహారంలో నిస్సహాయత
- కొన్ని పొరపాట్లు జరగడం వాస్తవమేనని ఒత్తిళ్లకు లొంగాల్సి వచ్చిందని వెల్లడి

అమరావతి, జూలై 11(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ ప్రభుత్వంలో మద్యం పాలసీ రూపకల్పనకు, నాకు ఎలాంటి సంబంధం లేదు. నేను ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శిగా వచ్చే సమయానికే పాలసీ రూపొందించారు. నేను అమలు చేశా.. అంతే' అంటూ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రజత్ భార్గవ సిట్ అధికారులకు చెప్పారు. జగన్ పాలనలో జరిగిన భారీ లిక్కర్ స్కామ్‌లో శుక్రవారం సిట్ అధికారులు ఆయన్ను విచారించారు. మద్యం పాలసీ రూపొందించడం నుంచి మద్యం సరఫరా, కమీషన్ల ఖరారు, వసూలు చేయడం, ఆర్డర్ ఫర్ సేల్ అమలు చేయకపోవడం... ఇలా అడుగడుగునా ఉల్లంఘనలు జరుగుతుంటే ఎందుకు నిలువరించలేదంటూ సిట్ అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. మద్యం మాఫియా విచ్చలవిడిగా అక్రమాలకు పాల్పడుతూ, జనాన్ని దోచుకొంటుంటే ఎందుకు చోద్యం చూశారని ప్రశ్నించగా... ఆయన నీళ్లు నమిలినట్లు తెలిసింది. లిక్కర్ స్కామ్‌లో ప్రధాన నిందితుడైన రాజ్ కసిరెడ్డి(ఏ-1) మొత్తం అబ్కారీ శాఖను శాసిస్తుంటే.. సీనియర్ ఐఏఎస్ అధికారిగా కనీసం అభ్యంతరం చెప్పలేదెందుకన్న ప్రశ్నకు.. మౌనం వహించినట్లు సమాచారం.



లిక్కర్ పాలసీ రూపకల్పన ఎలా జరిగింది? డిస్టిలరీస్ కూడా లేని వారికి మద్యం సరఫరా ఆర్డర్లు ఎలా ఇచ్చారు? ధరల నియంత్రణ లేకపోవడానికి కారణమేంటి? కొత్త మద్యం బ్రాండ్లకు అనుమతి ఇవ్వడంలో నిబంధనల ఉల్లంఘనను ఎందుకు పట్టించుకోలేదు? సత్యప్రసాద్ అనే ఎక్సైజ్ అధికారికి మొత్తం అప్పగించాలని చెప్పిందెవరు? ఏ కొత్త బ్రాండ్ మార్కెట్లోకి వచ్చినా మొదటి నెలలో పదివేల బాక్సులకు మించి ఆర్డర్ ఇవ్వరాదన్న నిబంధనను ఆదాన్‌కు ఎందుకు వర్తింపజేయలేదు? మొదటి నెలలోనే 1.80 లక్షల కేసుల మద్యం ఆర్డర్లు ఇవ్వడం వెనుకగల కారణాలేంటి? రిటైల్ అవుట్‌లెట్ల నుంచి పెట్టాల్సిన ఆర్డర్లు రాజ్ కసిరెడ్డి ఆదేశాలతో సత్య ప్రసాద్ ద్వారా డిపో మేనేజర్లు పెడుతుంటే ఎందుకు మౌనంగా ఉన్నారు? ఎవరి సిఫారసు మేరకు అనూషను ఎంఐఎస్ విభాగంలో నియమించారు? అవుట్ సోర్సింగ్ ఉద్యోగి కోసం స్పెషల్ మెమో ఇవ్వాల్సిన అవసరం ఏమొచ్చింది? ఎవరు ఒత్తిడి చేశారు? అంటూ సిట్ అధికారులు ప్రశ్నల వర్షం కురిపించినట్టు తెలుస్తోంది. అనూష ఆర్డర్ల జాబితా సైఫ్ అహ్మద్‌కు పంపితే రాజ్ కసిరెడ్డికి వివరాలు పంపి ముడుపులు సేకరించిన వైనంపై రజత్ భార్గవను విచారించినట్లు సమాచారం. పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలు దాటవేసినట్టు తెలుస్తోంది. రాజ్ కసిరెడ్డి వ్యవహారంలో నిస్సహాయత వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఆర్డర్ ఫర్ సేల్స్ తీవ్ర ఉల్లంఘన జరుగుతున్నా ఎందుకు పట్టించుకోలేదు? మద్యం ఉత్పత్తి, సరఫరాదారులు ఇచ్చిన ముడుపులు ఎవరెవరికి ఇచ్చారు? ఎవరెవరు ఎంత తీసుకున్నారు? అని సిట్ అధికారులు ప్రశ్నించగా.. తనకు ఏమీ తెలియదని బదులిచ్చారు. విధాన పరమైన నిర్ణయాల్లో కొన్ని పొరపాట్లు జరిగిన మాట వాస్తవమేనని, అప్పట్లో ఒత్తిళ్లకు లొంగాల్సి వచ్చిందని రజత్ భార్గవ చెప్పినట్లు సమాచారం.

భలే 'మందు' చూపు!

(మొదటి పేజీ తరువాయి)

జగన్ తన ఐటీ సలహాదారుగా నియమించుకున్న సంగతి తెలిసిందే. ప్రతి నెలా 60కోట్ల రూపాయలకు తగ్గకుండా మద్యం ఆదాయం వచ్చేలా ఆయన అద్భుతమైన ప్రణాళిక రూపొందించి అమలు చేశారు. అదే సమయంలో తాను ముందు చూపుతో జాగ్రత్త పడ్డాడు. ఎలక్ట్రిక్ వాహనాలకు భవిష్యత్తు ఉందని గమనించి ఆ రంగంలోకి ప్రవేశించారు. ఈవీ ఉత్పత్తి చేసి మార్కెట్లోకి వదిలితే భవిష్యత్తుకు ఢోకా ఉండదని భావించి... తనతోపాటు తన కుటుంబ సభ్యుల పేర్లు కలిసి వచ్చేలా 'డీఆర్‌ఈ మోటార్స్' పేరుతో ఈవీ కమర్షియల్ వాహన ఉత్పత్తికి ఉపక్రమించారు. ప్రతి రోజూ డిస్టిలరీస్ నుంచి సేకరించే ముడుపుల్లో కొంత 'సైడ్' చేశారు. ఆ సొమ్ముతో డీఆర్‌ఈ మోటార్స్‌ను ఏర్పాటు చేసి... వందనా రావత్ అనే మహిళను కీలక స్థానంలో నియమించారు. ఆమె ఎవరో కాదు! జగన్ రాజకీయ వ్యూహకర్త 'ఐప్యాక్'లో కీలక స్థానంలో ఉన్న సత్య అనే వ్యక్తికి సతీమణి! ఆమెకు ఈవీలపై ఉన్న ఆలోచన ద్వారా మార్కెట్లోకి రాబోతున్న తన ఎలక్ట్రిక్ వాహన డిజైన్, అందులో వాడే బ్యాటరీ, వాణిజ్య వాహన సామర్థ్యం, ఇతరత్రా ఆటోమొబైల్‌కు సంబంధించిన వ్యవహారాలపై 'ఆర్ అండ్ డీ' కోసం చాలా ఖర్చు చేశారు. ఈవీ కమర్షియల్ వాహన బ్యాటరీ, డిజైన్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమోదం కూడా తీసేసుకున్నారు. ఇక ఉత్పత్తికి ఉపక్రమించి మార్కెట్లోకి తీసుకొచ్చే సమయంలో... అంతా తలకిందులైంది. జగన్ ప్రభుత్వాన్ని ఏపీ ప్రజలు దించేయడంతో రాజ్ కసిరెడ్డి ప్రణాళికలకు బ్రేకులు పడ్డాయి. మద్యం కుంభకోణంపై కూటమి ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించడంతో ఆయన ఉక్కిరి బిక్కిరి అయ్యారు. ఏప్రిల్ చివరి వారంలో అరెస్టైన రాజ్ కసిరెడ్డి విజయవాడ జైల్లో రిమాండ్ ఖైదీగా కాలం గడుపుతున్నారు.

లిక్కర్ స్కామ్‌లో 32.85 కోట్లు జప్తు

- సిట్‌కు విజయవాడ ఏసీబీ కోర్టు అనుమతి
- కసిరెడ్డి గుప్పిట్లో ఉండే ఆదాన్ ఖాతాలో 30 కోట్లు
- హైదరాబాద్‌లో ఒక బ్యాంకులో సొమ్ము
- లీలా డిస్టిలరీస్ ఖాతాలో 2.85 కోట్లు
- ఇటీవలే 30 కోట్లు అటాచ్.. మొత్తం 62.85 కోట్లు



అమరావతి/విజయవాడ, జూలై 11(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వంలో జరిగిన మూడున్నర వేల కోట్ల మద్యం కుంభకోణంలో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. నిందితులు దోచుకున్న 32.85 కోట్ల రూపాయల సొమ్మును ప్రత్యేక దర్యాప్తు సంస్థ(సిట్) జప్తు చేసింది. ఇందుకు శుక్రవారం విజయవాడ ఏసీబీ కోర్టు అనుమతి ఇచ్చింది. ఈ స్కామ్‌లో కీలక సూత్రధారి రాజ్ కసిరెడ్డి(ఏ-1) గుప్పిట్లో ఉండే ఆదాన్ డిస్టిలరీస్‌కు చెందిన 30 కోట్ల రూపాయలను హైదరాబాద్‌లో మాదాపూర్‌లోని ఒక బ్యాంకులో రెండు ఖాతాల్లో దాచారు. ఈ సొమ్ము మద్యం ముడుపులకు సంబంధించినదిగా ఇదివరకే సిట్ గుర్తించింది. దీన్ని జప్తు చేయడానికి కోర్టులో పిటిషన్ వేసేందుకు కేసు దర్యాప్తు అధికారికి రాష్ట్ర హోంశాఖ అనుమతిచ్చింది. మరోవైపు లీలా డిస్టిలరీస్‌కు చెందిన 2.85 కోట్ల రూపాయల జప్తునకు సిట్ అనుమతి పొందింది. తాజాగా కోర్టు అనుమతి ఇవ్వడంతో లైన్ క్లియరైంది. సిట్ ఇటీవలే లిక్కర్ స్కామ్‌లో నాలుగు సంస్థలకు చెందిన 30 కోట్ల రూపాయలను జప్తు చేసింది. దీంతో ఈ కేసులో మొత్తం రూ.62.85 కోట్లు అటాచ్ చేసింది. రాజ్ కసిరెడ్డి.. ఆదాన్, లీలా డిస్టిలరీస్‌ను గుప్పిట్లో పెట్టుకుని, అనామక డైరెక్టర్లను నియమించుకుని రూ.800 కోట్ల ఆర్డర్లు తెప్పించుకున్నట్లు సిట్ విచారణలో తేలింది. అందులో నుంచి ముడుపుల సొమ్మును ఫోనిక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ బ్యాంకు ఖాతాలోకి ట్రాన్స్‌ఫర్ చేసి తర్వాత తిరిగి పొందినట్లు అధికారులు గుర్తించారు.



16 వరకు మోహిత్‌రెడ్డిపై

తొందరపాటు చర్యలొద్దు

సిట్ అధికారులకు హైకోర్టు ఆదేశం



అమరావతి, జూలై 11(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో నిందితుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి(ఏ39)పై ఈ నెల 16 వరకు తొందరపాటు చర్యలు తీసుకోవద్దని సిట్‌ను హైకోర్టు ఆదేశించింది. ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుమారుడు మోహిత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టు విచారణ జరిపింది. పిటిషనర్ తరపు వాదనలు ముగియడంతో ప్రాసిక్యూషన్ తరపు వాదనల కోసం విచారణను ఈ నెల 16కు వాయిదా వేసింది. అప్పటివరకు పిటిషనర్‌పై ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దంది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చారు. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది సి.నాగేశ్వరరావు వాదనలు వినిపించారు. ఈ కేసులో పిటిషనర్‌ను నిందితుడిగా చేర్చారని, అనంతరం సాక్షిగా విచారణకు హాజరు కావాలని నోటీసులు ఇచ్చారని తెలిపారు. మోహిత్‌రెడ్డి తండ్రి వద్ద పనిచేసిన సెక్యూరిటీ సిబ్బంది ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా పిటిషనర్‌ను నిందితుడిగా చేర్చారని తెలిపారు. పిటిషనర్ తుడా చైర్మన్‌గా ఉండగా మద్యం ముడుపులను హైదరాబాద్ నుంచి ఏపీకి తరలించేందుకు తుడా వాహనాలు వాడారని, ఆ సొమ్మును ఎన్నికల్లో ఖర్చు చేశారనేది ప్రధాన ఆరోపణ అని అన్నారు. ఎన్నికల సమయంలో తుడా వాహనాలు పిటిషనర్ ఆధీనంలో ఉండవన్నారు. ప్రభుత్వ ఉద్యోగిని ఒత్తిడి చేసి పిటిషనర్‌కు వ్యతిరేకంగా వాంగ్మూలం ఇప్పించి ఉండవచ్చని తెలిపారు. వాహనంలో పిటిషనర్ ఉన్నట్లు కానీ, పిటిషనర్ ప్రోద్బలంతోనే డబ్బు తరలించినట్లు కానీ ఎలాంటి ఆధారాలూ లేవన్నారు. కోర్టు షరతులకు కట్టుబడి ఉంటామని, ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ప్రాసిక్యూషన్ వాదనలు వినేందుకు తగినంత సమయం లేకపోవడంతో విచారణ వాయిదా పడింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.